www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
సంపుటి (Volume) : 23
సంచిక (Issue) : 244
మంగళవారం | 2-12-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50
శ్రీ విశ్వావసునామసంవత్సరం, దక్షిణాయనం, హేమంతఋతువు, మార్గశిరమాసం, శుక్లపక్షం, తిథి: ద్వాదశి మ.3.57 తదుపరి త్రయోదశి; నక్షత్రం: అశ్విని రా.8.52 తదుపరి భరణి; వర్జ్యం: సా.5.16-6.42, తె.5.19 మొదలు; దుర్ముహూర్తం: ఉ.8.46-9.30, రా.9.51-10.41; అమృతఘడియలు: మ.2.23-3.50; రాహుకాలం: మ.3.00-4.30; సూర్యోదయం: 6.33; సూర్యాస్తమయం: 5.35
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru
వరంగల్

వివాహ బంధంలోకి సమంత – రాజ్

కోయంబత్తూరులోని ఈశా కేంద్రంలో కుటుంబ సభ్యులు, సన్నిహితుల మధ్య నిరాడంబరంగా జరిగిన వేడుక

యోగా సంప్రదాయ విధానమైన 'భూత శుద్ధి వివాహం'తో ఒక్కటైన జంట

..వివరాలు చిత్రజ్యోతిలో



దర్శకుడు రాజ్ నిడిమోరు, సమంత

పార్లమెంటులో నాటకాలొద్దు

డ్రామాలకు బయట చాలా అవకాశాలున్నాయ్

వాటికి పార్లమెంటును వేదిక చేసుకోవద్దు

అభివృద్ధికి సహకరించండి.. బాధ్యతగా వ్యవహరించండి


నినాదాలపై కాదు.. విధానాలపై దృష్టి పెట్టండి

ప్రతిపక్షాలకు ప్రధాని నరేంద్ర మోదీ సూచన

ఎస్ఐఆర్‌పై రగిలిన పార్లమెంట్‌.. నేటికి వాయిదా

ప్రజా సమస్యలను పట్టించుకోని ప్రధాని..

ఆయన ప్రసంగమే పెద్ద డ్రామా: కాంగ్రెస్





న్యూఢిల్లీ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నాటకాలు వేయడానికి పార్లమెంటు వేదిక కాదని ప్రధాని మోదీ అన్నారు. పార్లమెంటు ఉన్నది ఫలవంతమైన చర్చలతో ప్రజలకు సేవలందించడానికని చెప్పారు. ప్రతిపక్షాలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. విపక్షాలు చట్టసభలను ఎన్నికలకు సన్నద్ధమయ్యే వేదికగా మార్చుకుంటున్నాయని, ఓటముల తర్వాత ఎదురయ్యే అసహనాన్ని తగ్గించుకునే సాధనంగా వాడుకుంటున్నాయని విమర్శించారు. శీతాకాల సమావేశాల ప్రారంభం సందర్భంగా సోమవారం ఆయన పార్లమెంటు వెలుపల విలేకరులతో మాట్లాడారు. ఉభయసభలు రాజకీయ డ్రామాలకు వేదిక కారాదన్నారు. నిర్మాణాత్మక, ఫలప్రదమైన చర్చలకు

మిగతా 2వ పేజీలో...

రాజ్యసభలో 'ధన్‌ఖడ్‌' రగడ

ధన్‌ఖడ్‌ నిష్క్రమణపై ఖర్గే ఆందోళన 2

వీడ్కోలు చెప్పే చాన్స్‌ సభకు ఇవ్వలేదని ఫైర్‌

కరిచేవారంతా పార్లమెంట్‌లో కూర్చొని ఏలుతున్నారు

రేణుకాచౌదరి వ్యాఖ్యలు

పార్లమెంట్‌ ప్రాంగణానికి శునకాన్ని తీసుకొచ్చిన ఎంపీ



మక్తల్‌లో జరిగిన ప్రజాపాలన విజయోత్సవ సభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, హాజరైన ప్రజానీకం

మంత్రులతో పనులు చేయించుకునేటోళ్లను

గెలిపించుకోండి!

కాళ్లలో కట్టెలు పెట్టేటోళ్లను గెలిపిస్తే ఊరి అభివృద్ధి జరగదు

సర్పంచి ఎన్నికలపై రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి పిలుపు

మీ ఆశీర్వాదంతో సంక్షోభంలో ఉన్న రాష్ట్రాన్ని గాడిన పెట్టాను

పిల్లలందరికీ నా మనుమడు తినే సన్నబియ్యమే ఇస్తున్నాం

కొడంగల్‌ ఎత్తిపోతలను కేసులేసి ఏడాదిన్నర ఆపారు

రూ.20 లక్షల పరిహారం ఇస్తే 96% మంది భూములిచ్చారు

దగ్గరుండి ప్రాజెక్టులను పూర్తి చేసుకునే బాధ్యత యువతదే

మక్తల్‌ ప్రజాపాలన విజయోత్సవ సభలో రేవంత్‌రెడ్డి

మేడారం పనుల్లో ఆదివాసీ సంప్రదాయాలకు పెద్దపీట

ఇంజనీర్లు ప్రత్యక్షంగా పర్యవేక్షించాలి.. సమీక్షలో సీఎం

ఎర్త్‌ సైన్సెస్‌ యూనివర్సిటీని నేడు ప్రారంభించనున్న రేవంత్‌

మహబూబ్‌నగర్‌/నారాయణపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్రంలో జరుగుతున్న పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ప్రభుత్వం చేస్తున్న పనుల్లో కాళ్లలో కట్టెలు పెట్టేటోళ్లను గెలిపిస్తే ఊరిలో అభివృద్ధి జరగదని అన్నారు. ఎమ్మెల్యేలు, మంత్రులతో వెంటపడి పనులు చేయించుకునే వారినే గెలిపించుకోవాలని సూచించారు. వనపర్తి, నారాయణపేట జిల్లాల పరిధిలో ఉన్న మక్తల్‌ నియోజకవర్గం ఆత్మకూరు, మక్తల్‌లలో సోమవారం పర్యటించిన ముఖ్యమంత్రి మక్తల్‌-నారాయణపేట- కొడంగల్‌ ఎత్తిపోతలు సహా పలు అభివృద్ధి పథకాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రజాపాలన విజయోత్సవ సభలో సీఎం ప్రసంగించారు. చీకట్లో క్వార్టర్‌, ఆఫ్‌, ఫుల్‌ తీసుకొని ఓటేస్తే

మిగతా 13వ పేజీలో...

తక్కువ వడ్డీతో రుణాలివ్వండి

గతంలో ఇచ్చిన అప్పులను పునర్వ్యవస్థీకరించండి

13 హడ్కో చైర్మన్‌ సంజయ్‌ కులశ్రేష్ఠతో సీఎం

ఫ్యూచర్‌ సిటీలో మరో ఫిల్మ్‌సిటీ!

ఏర్పాటుకు ముందుకొచ్చిన అజయ్‌ దేవ్‌గన్‌

- ఇప్పటికే సల్మాన్‌ఖాన్‌కు అవకాశమిచ్చిన ప్రభుత్వం
- వంతారా అభయారణ్యం ఏర్పాటుకు రిలయన్స్‌ సిద్ధం
- రూ.3 వేల కోట్లతో మూడు స్టార్‌ హోటళ్లను నిర్మించనున్న ఫుడ్‌ లింక్‌ ఎఫ్‌ అండ్‌ బీ హోల్డింగ్స్‌
- తెలంగాణ రైజింగ్‌ సమ్మిట్‌లో కుదరనున్న ఒప్పందాలు



అజయ్‌ దేవ్‌గన్‌



ముఖేశ్‌ అంబానీ

హైదరాబాద్‌, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): బాలీవుడ్‌ నటుడు అజయ్‌ దేవ్‌గన్‌ హైదరాబాద్‌లో ప్రపంచ స్థాయి ఫిల్మ్‌ సిటీని ఏర్పాటు చేయనున్నారు. భారత్‌ ఫ్యూచర్‌ సిటీలోనే దీన్ని ఏర్పాటు చేస్తారు. ఈ నెల 8, 9 తేదీల్లో జరిగే 'తెలంగాణ రైజింగ్‌ గ్లోబల్‌ సమ్మిట్‌' సందర్భంగా ఫిల్మ్‌సిటీకి సంబంధించి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం(ఎంవోయూ) చేసుకుంటారు. ఇప్పటికే, మరో బాలీవుడ్‌ నటుడు సల్మాన్‌ఖాన్‌కు కూడా ఇక్కడే భూమిని కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఫ్యూచర్‌ సిటీలో ఇది రెండో ఫిల్మ్‌ సిటీ. తెలంగాణ రైజింగ్‌ విజన్‌లో భాగంగా 2047 నాటికి రాష్ట్రాన్ని 3 ట్రిలియన్‌ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చే లక్ష్యంతో ప్రభుత్వం వినోదం, పర్యాటక రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో 8, 9 తేదీల్లో భారత్‌ ఫ్యూచర్‌ సిటీలో జరగబోయే తెలంగాణ రైజింగ్‌ గ్లోబల్‌ సమ్మిట్‌కు దేశ విదేశాల నుంచి భారీ స్పందన లభిస్తోందని ప్రభుత్వం తెలిపింది. ఈ సమ్మిట్‌లోనే అజయ్‌ దేవ్‌గన్‌ ప్రపంచ స్థాయి ఫిల్మ్‌ సిటీని ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంటున్నట్లు వెల్లడించింది. రిలయన్స్‌ గ్రూప్‌ కూడా తెలంగాణలో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపుతోందని ప్రభుత్వం తెలిపింది. రిలయన్స్‌కు చెందిన వంతారా యానిమల్‌ రెస్క్యూ అండ్‌ రిహాబిలిటేషన్‌ సెంటర్‌, వైల్డ్‌ లైఫ్‌ కన్జర్వేటరీ, నైట్‌ సఫారీని ఏర్పాటు

మిగతా 13వ పేజీలో...

డిజిటల్‌ అరెస్టు కేసులు సీబీఐకి

దేశవ్యాప్తంగా ఒకేలా విచారణ.. దర్యాప్తు సంస్థను ఆదేశించిన సుప్రీంకోర్టు

ఏఐ టెక్నాలజీని ఎందుకు వాడటం లేదు?.. ఆర్బీఐని ప్రశ్నించిన కోర్టు.. నోటీసు జారీ

సీబీఐకి అనుమతివ్వాలంటూ తమిళనాడు, కర్ణాటక, తెలంగాణలకు సూచన

ఇకపై డీఫాల్ట్‌గా 'సంచార్‌ సాథీ' యాప్‌!.. మొబైల్‌ సంస్థలకు టెలికాం శాఖ ఆదేశం

సైబర్‌ నేరాలు, మొబైల్‌ చోరీల అడ్డుకట్టకు చర్యలు 2

హిల్ట్‌ పాలసీ వద్దు

నిలిపివేతకు ఆదేశించండి 3

గవర్నర్‌కు బీజేపీ నేతల వినతి

హిల్ట్‌, జీహెచ్‌ఎంసీ విస్తరణకు వ్యతిరేకంగా 7న ఇందిరా పార్కు వద్ద ధర్నా: రాంచందర్‌రావు

'హిల్ట్‌'లో సొంత భూములకే వెసులుబాటు

- లీజుకు తీసుకున్న భూములకు అది వర్తించదు
- ప్రభుత్వ భూముల్ని ధారాదత్తం చేసింది బీఆర్‌ఎస్సే 13
- బీజేపీ అప్పుడెందుకు మాట్లాడలేదు?: మంత్రి శ్రీధర్‌బాబు
- రెండు నెలల్లో ఏఐ యూనివర్సిటీ ప్రారంభిస్తామని వెల్లడి



ఇంటింటికి 5 లక్షల బీమా.. ఆడబిడ్డ పుడితే రూ.5 వేలు

ఇల్లు కట్టుకునే వారికి 21 వేలు. పెళ్లికి పుస్తె, మట్టెలు

రంగారెడ్డి జిల్లా కొత్తపేటలో ఓ అభ్యర్థి హామీలు

ఉచిత అంబులెన్స్‌, గ్యాస్‌ సిలిండర్లు.. బాండ్‌పేపర్‌పై 22 హామీలు.. గద్వాల జిల్లా సల్కాపురం అభ్యర్థి

ఆదిలాబాద్‌ జిల్లాలో 22.. నిజామాబాద్‌ జిల్లాలో 10, జనగామ జిల్లాలో 6 చోట్ల ఏకగ్రీవాలు

రెండో విడత నామినేషన్లలో ఏకాదశి జోరు..

నేటితో ముగియనున్న నామినేషన్ల స్వీకరణ 12

రేపటి నుంచి మూడోవిడత నామినేషన్లు షురూ

330 కోట్ల మోసం

4 లక్షల పెట్టుబడికి గుంట భూమి.. నెలకు 16 వేలు వడ్డీ

ఆశ చూపించి బోర్డు తిప్పేసిన 12 వెల్త్‌ క్యాపిటల్‌ సర్వీసెస్‌

నల్లగొండ జిల్లా కేంద్రంలో బాధితుల ఆందోళన 14

రెండు తెలుగు రాష్ట్రాల్లో రూ.330 కోట్లకు పైగా డిపాజిట్లు

సంస్థ లీగల్‌ అడ్వైజర్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు



విశాఖలో గాజు వంతెన ప్రారంభం

దేశంలోనే పొడవైనది.. కైలాసగిరిపై 1020 అడుగుల ఎత్తున..

250 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచినా, ఒకేసారి 100 మంది ఎక్కినా చెక్కుచెదరని దృఢత్వం 14

రైతులను నిందించకండి

- ఢిల్లీ వాయు కాలుష్యంపై సుప్రీంకోర్టు
- పంట వ్యర్థాల దహనాన్ని రాజకీయం చేయొద్దని వ్యాఖ్య

న్యూఢిల్లీ, డిసెంబరు 1: దేశ రాజధాని ఢిల్లీతో పాటు పరిసర ప్రాంతాల్లో వాయు కాలుష్యం పెరిగిపోవడంపై రైతులను నిందించడం సరికాదని, ఈ అంశంపై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. పంట వ్యర్థాల దహనం అంశాన్ని రాజకీయం చేయవద్దని, అహానికి సంబంధించిన విషయంగా చూడొద్దని సూచించింది. కోవిడ్ సమయంలో కూడా పంట వ్యర్థాల దహనం కొనసాగినా నీలాకాశం స్పష్టంగా కనపడిందని, గాలి నాణ్యత పెరిగిందని గుర్తు చేసింది. కాలుష్యానికి గల ప్రధాన కారణాన్ని గుర్తించాలని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించారు. కాలుష్య నివారణకు అధికారులు ఇప్పటివరకు తీసుకున్న చర్యల వివరాలు, గాలి నాణ్యత ఏ మేరకు మెరుగుపడిందనే విషయంపై వారంలోగా నివేదిక సమర్పించాలని ఆదేశించారు. అధికారుల కార్యాచరణ సమర్థంగా లేకపోతే ప్రత్యామ్నాయాలు ఆలోచించాల్సి ఉంటుందని ధర్మాసనం స్పష్టం చేసింది.

మసాలా బాండ్ల కేసులో కేరళ సీఎంకు నోటీసులు

న్యూఢిల్లీ, డిసెంబరు 1: ప్రాజెక్టుల కోసం విదేశాల నుంచి నిధులు సేకరణకు ఉద్దేశించిన 'మసాలా బాండ్లు' విషయంలో నిబంధనల ఉల్లంఘన జరిగిందని పేర్కొంటూ కేరళ సీఎం విజయన్‌కు ఈడీ షోకాజ్ నోటీసులు ఇచ్చింది. రాష్ట్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రి థామస్ ఇస్సాక్, సీఎం ఆఫీస్ చీఫ్ ప్రిన్సిపల్ సెక్రటరీ కె.ఎం.అబ్రహాంలకు కూడా నోటీసులు జారీ చేసినట్టు సోమవారం అధికార వర్గాలు తెలిపాయి. అయితే, విచారణ నిమిత్తం వారు వ్యక్తిగతంగా హాజరుకావాల్సిన పనిలేదని తెలిపాయి. కేరళ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ బోర్డ్ (కేఐఐఎఫ్‌బీ) కోసం 2019లో రూ.2,150 కోట్లను బాండ్ల రూపంలో సేకరించారు. అందులో రూ.466 కోట్ల వినియోగంలో విదేశీ మారక ద్రవ్య నిర్వహణ చట్టం (ఫెమా)లోని నిబంధనల ఉల్లంఘన జరిగిందంటూ ఈడీ నోటీసులు పంపించింది.

బ్రహ్మోస్ శాస్త్రవేత్త నిశాంత్‌పై ఆరోపణల కొట్టివేత!

నాగ్‌పూర్, డిసెంబరు 1: బ్రహ్మోస్ క్షిపణులకు సంబంధించిన కీలక రహస్యాలను పాకిస్థాన్‌కు చేరవేశారన్న కేసులో జైలు శిక్ష అనుభవిస్తున్న శాస్త్రవేత్త నిశాంత్ అగర్వాల్‌పై కీలక ఆరోపణలను కోర్టు కొట్టివేసింది. రహస్యాలను ఆయన పాకిస్థాన్‌కు చేరవేశారనేందుకు తగిన ఆధారాలు లేవని పేర్కొంది. కానీ, బ్రహ్మోస్ క్షిపణి కార్యక్రమానికి సంబంధించిన రహస్య పత్రాలను ఆయన తన వ్యక్తిగత ల్యాప్‌టాప్‌లోకి కాపీ చేసుకున్నారని.. చట్టప్రకారం ఇది నేరం కావడంతో మూడేళ్ల జైలుశిక్ష విధిస్తున్నట్టు ఆదేశాలు జారీ చేసింది. భారత్, రష్యాల ఉమ్మడి ప్రాజెక్టు అయిన 'బ్రహ్మోస్ ఏరోస్పేస్ ప్రైవేట్ లిమిటెడ్ (బీఏపీఎల్)'లో నిశాంత్ అగర్వాల్ పనిచేసేవారు. బ్రహ్మోస్ క్షిపణులకు సంబంధించిన రహస్య సమాచారాన్ని పాకిస్థాన్ గూఢచారులకు చేరవేశారనే ఆరోపణలపై ఆయనను 2018లో మిలటరీ ఇంటెలిజెన్స్(ఎంఐ), యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ (ఏటీఎస్) సంయుక్త ఆపరేషన్‌లో అరెస్టు చేశాయి.

పీఎఫ్ అధిక పెన్షన్ దరఖాస్తుల్లో 99% పరిష్కారం

న్యూఢిల్లీ, డిసెంబరు 1: ఉద్యోగుల పెన్షన్ నిధి-1995 కింద అధిక పింఛను కోసం వచ్చిన దరఖాస్తుల్లో దాదాపు 99% దరఖాస్తులను ఉద్యోగ భవిష్యనిధి సంస్థ (ఈపీఎఫ్‌ఓ) పరిష్కరించిందని కేంద్ర కార్మికశాఖ సహాయ మంత్రి శోభా కరంద్లాజే తెలిపారు. 2022 నవంబరు 4న సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం.. నిర్దేశిత గడువు 2023 జూలై 31 నాటికి 17.49 లక్షల మంది ఖాతాదారులు అధిక పింఛను కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు. వాటిలో గత జనవరి 31 నాటికి 15.24 లక్షల దరఖాస్తులను ఈపీఎఫ్‌ఓ ఆమోదం కోసం సంబంధిత యాజమాన్యాలు పంపాయని ఆమె చెప్పారు. వాటిలో 2025 నవంబరు 24 నాటికి 99% దరఖాస్తులను ఈపీఎఫ్‌ఓ పరిష్కరించిందని లోక్‌సభ ప్రశ్నోత్తరాల్లో సభ్యుల రాత పూర్వక ప్రశ్నకు సమాధానంగా శోభ కరంద్లాజే వెల్లడించారు.

తుపాకీతో బెదిరించి.. నగ్నంగా చిత్రీకరించి

- ముంబైలో మహిళా వ్యాపారవేత్తపై ఫార్మా ఎండీ అకృత్యం

ముంబై, డిసెంబరు 1: దేశ ఆర్థిక రాజధాని ముంబైలో అమానవీయ ఘటన చోటుచేసుకుంది. మహిళా వ్యాపారవేత్తను సమావేశానికి అని పిలిపించిన ఓ ప్రైవేటు కంపెనీ ఎండీ ఆమె పట్ల అతి దారుణంగా ప్రవర్తించాడు. తుపాకీ గురిపెట్టి వివస్త్రను చేసి బెదిరింపులకు పాల్పడ్డాడు. 51 ఏళ్ల మహిళా వ్యాపారవేత్తను ఫ్రాంకో-ఇండియన్ ఫార్మాస్యూటికల్స్ ఎండీ జాయ్ జాన్ పాస్కల్ మీటింగ్ ఉందంటూ తన ఆఫీసుకు పిలిచి, ఆమెను బెదిరించి నగ్నంగా ఉన్న ఆమె ఫొటోలు, వీడియోలు రికార్డు చేశాడు. ఈ విషయం ఎవరికైనా చెబితే ఆ దృశ్యాలను సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తానని బెదిరింపులకు పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ముంబై పోలీసులు జాన్‌తో పాటు మరో ఐదుగురిపై లైంగిక వేధింపుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మరో ఘటనలో, పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో క్యాబ్ కోసం చూస్తున్న ఓ మహిళపై గ్యాంగ్‌రేప్ జరిగింది. నవంబరు 29న జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

బెంగళూరులో అధ్వానంగా ట్రాఫిక్: యూపీ ఎంపీ

బెంగళూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): బెంగళూరులో ట్రాఫిక్ అధ్వానంగా ఉందని ఉత్తరప్రదేశ్‌కు చెందిన సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ రాజీవ్ రాయ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కర్ణాటక సీఎంను ఉద్దేశిస్తూ ఆయన ఎక్స్‌లో సోమవారం ఓ పోస్టు పెట్టారు. 'ఇలా చెప్పడానికి బాధగా ఉంది. మీ వద్ద ట్రాఫిక్ నిర్వహణ అత్యంత అధ్వానంగా ఉంది. బాధ్యత లేని, పనికిరాని పోలీసులు ఉన్నారు' అని తన అసంతృప్తిని వెళ్లగక్కారు. ఓ అధికారిని కలిసేందుకు బెంగళూరుకు ఆదివారం సాయంత్రం వచ్చానని రాజీవ్‌రాయ్ పేర్కొన్నారు. ట్రాఫిక్ విభాగానికి చెందిన నాలుగు ఫోన్ నంబర్లను ఆదివారం సాయంత్రం సంప్రదించానని, ఎవరూ లిఫ్ట్ చేయలేదని, యశ్వంతపుర-మైసూరు రోడ్ల మధ్య రాజ్‌కుమార్ సమాధి ప్రాంతంలో ట్రాఫిక్‌లో తాను ఇరుక్కుపోయానని తనకు ఎదురైన అనుభవాన్ని వివరించారు. పార్లమెంటు సమావేశాలకు వెళ్లాల్సిన తాను ఆదివారం రాత్రి విమానాశ్రయానికి సకాలంలో చేరుకోలేకపోయానన్నారు.

మరింత పెరిగిన విమాన ఇంధనం ధర

- 5.4% పెంచిన కంపెనీలు.. టికెట్ రేట్లు పెరిగే అవకాశం

న్యూఢిల్లీ, డిసెంబరు 1: అంతర్జాతీయ మార్కెట్‌కు అనుగుణంగా దేశీయ ప్రభుత్వ రంగ చమురు కంపెనీలు విమాన ఇంధనం (ఏటీఎఫ్), వాణిజ్య ఎల్పీజీ ధరల్లో మార్పులు చేశాయి. ఈ మేరకు సోమవారం ఏటీఎఫ్ ధర 5.4 శాతం పెరగ్గా.. వాణిజ్య ఎల్పీజీ సిలిండర్ ధర స్వల్పంగా తగ్గింది. ఢిల్లీలో కిలో లీటరు ఏటీఎఫ్ ధర రూ.5,133.75 మేర పెరిగి రూ.99,676.77కు చేరింది. ముంబైలో ధర రూ.93,281.04కు చేరుకుంది. చెన్నై, కోల్‌కతాలో కిలో లీటరు ధరలు వరుసగా రూ.1,03,301.80, రూ.1,02,371.02గా ఉన్నాయి. వరుసగా మూడో నెలలోనూ ఏటీఎఫ్ ధర పెరిగింది. ధర పెరగడం వల్ల విమానయాన కంపెనీలపై ఒత్తిడి పెరగడానికి అవకాశం ఉంటుంది. ఎందుకంటే ఆ కంపెనీల నిర్వహణ వ్యయాల్లో దాదాపు 40 శాతం వాటా ఈ ఇంధనానిదే. విమాన ఇంధనం ధర పెరిగితే టికెట్ల ధరలు కూడా పెరగడానికి అవకాశం ఉంటుంది. ఇక హోటళ్లు, రెస్టారెంట్లు వినియోగించే 19 కిలోల వాణిజ్య ఎల్పీజీ సిలిండర్ ధరను కంపెనీలు రూ.10 మేర తగ్గించాయి. దీంతో ఢిల్లీలో ఈ సిలిండర్ ధర రూ.1,580.50కు చేరుకుంది. ఏప్రిల్ నుంచి ఆరుసార్లు వాణిజ్య ఎల్పీజీ ధర తగ్గడంతో మొత్తంగా ఈ సిలిండర్ రూ.223 మేర చవకగా మారింది.

ప్రాణాలతో ఉండాలంటే దేశం విడిచి వెళ్లండి

- వెనెజువెలా అధ్యక్షుడు మదురోకు ట్రంప్ తుది హెచ్చరిక

వాషింగ్టన్ డీసీ, డిసెంబరు 1: వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోను తక్షణమే దేశం విడిచి వెళ్లాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తుది హెచ్చరిక జారీ చేశారు. దేశం విడిచి వెళ్తే మదురోతో పాటు ఆయన కుటుంబాన్ని, సన్నిహితులను ప్రాణాలతో వదిలేస్తామని ట్రంప్ చెప్పినట్లు మియామి హెరాల్డ్ కథనం ప్రచురించింది. మదురోతో ఇటీవల ఫోన్‌లో మాట్లాడిన ట్రంప్ సంభాషణ సందర్భంగా ఈ హెచ్చరిక జారీ చేసినట్లు కథనంలో ఉంది. అయితే ఈ ప్రతిపాదనకు మదురో ఒప్పుకోలేదని, తనకు, తన పరివారానికి, సన్నిహితులకు క్షమాభిక్ష ప్రసాదించాలని కోరారని కథనం పేర్కొంది.

పార్లమెంటులో నాటకాలొద్దు

(మొదటి పేజీ తరువాయి)

వేదిక కావాలని పేర్కొన్నారు. "డ్రామాలు వేసుకోవడానికి బయట చాలా అవకాశాలు ఉన్నాయి. అలా వేసుకునేవారు ఆ పనిని కొనసాగించండి. కానీ, పార్లమెంటు డ్రామాలకు వేదిక కాదు. ఇది ప్రజాసేవ చేసేందుకు వేదిక" అని మోదీ విపక్షాలపై విరుచుకుపడ్డారు. "నినాదాలు చేసుకోవాలంటే దేశవ్యాప్తంగా చేసుకోండి. కానీ, పార్లమెంటులో మాత్రం విధానాలపై దృష్టి పెట్టండి, నినాదాలపై కాదు" అని ప్రతిపక్షాలకు ప్రధాని హితవు పలికారు. సభ్యులు అవసరమైన చోట నిర్మాణాత్మకమైన, కచ్చితమైన విమర్శలు చేయాలని సూచించారు. ఎన్నికల్లో పరాజయాల వల్ల కలిగిన అసహనాన్ని పార్లమెంటు కార్యకలాపాలపై చూపకూడదని రాజకీయ పార్టీలకు హితవు పలికారు. మోదీ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ తీవ్రంగా స్పందించింది. ఆయన ప్రసంగమే అతిపెద్ద డ్రామా అని ఖర్గే ఎక్స్‌లో పోస్టు చేశారు. ప్రజల సమస్యలను లేవనెత్తడం డ్రామా కాదని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక అన్నారు. సమస్యలపై చర్చకు అనుమతించకపోవడమే డ్రామా అని ఆరోపించారు.

ఉభయసభల్లో గందరగోళం

దేశవ్యాప్తంగా సర్ నిర్వహణపై, ఢిల్లీ పేలుళ్లపై చర్చించాలని శీతాకాల సమావేశాల మొదటి రోజే ప్రతిపక్షాలు పట్టుపట్టాయి. లోక్‌సభ, రాజ్యసభల్లో తీవ్ర గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. విపక్ష సభ్యులు నినాదాలతో హోరెత్తించారు. దీంతో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా సభను మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేశారు. సభ తిరిగి సమావేశమైన తర్వాత కూడా పరిస్థితిలో మార్పు రాలేదు. తీవ్ర గందరగోళం మధ్యనే ఆర్థిక మంత్రి నిర్మల పొగాకు, పొగాకు ఉత్పత్తులు, పాన్ మసాలాపై సుంకాలను పెంచేందుకు సెంట్రల్ ఎక్సైజ్ సవరణ బిల్లు, ఆరోగ్య భద్రత, జాతీయ భద్రతా సెస్ బిల్లులతో పాటు మణిపూర్ జీఎస్టీ సవరణ బిల్లులను ప్రవేశపెట్టారు. మణిపూర్ జీఎస్టీ బిల్లును సభ మూజువాణీ ఓటుతో ఆమోదించింది. జన విశ్వాస్ సవరణ బిల్లు, దివాలా, ఖాయిలా బిల్లులపై సెలెక్ట్ కమిటీ



నివేదికలను కూడా ప్రవేశపెట్టిన తర్వాత సభను మంగళవారానికి వాయిదా వేశారు. ఎస్ఐఆర్‌పై చర్చించాలని కాంగ్రెస్ ప్రవేశపెట్టిన వాయిదా తీర్మానాన్ని స్పీకర్ ఓం బిర్లా తిరస్కరించారు. రాజ్యసభలో కూడా ఎస్ఐఆర్‌పై వాయిదా తీర్మానాన్ని చైర్మన్ రాధాకృష్ణన్ తిరస్కరించడంతో ప్రతిపక్ష సభ్యులు వాకౌట్ చేశారు. ఇదిలా ఉండగా, గత బడ్జెట్‌లో అంచనా వేసినదానికన్నా ఈ ఆర్థిక సంవత్సరం రూ.41వేల అదనపు వ్యయం కానుందని, దీనికి అనుమతించాలని కేంద్రప్రభుత్వం లోక్‌సభను కోరింది. మరోవైపు, పరారీలో ఉన్న 15 మంది ఆర్థిక నేరగాళ్లు ప్రభుత్వ రంగ బ్యాంకులకు రూ.58వేల కోట్లు బాకీ పడ్డారని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి లోక్‌సభకు లిఖిత పూర్వకంగా ఇచ్చిన సమాధానంలో ఈ విషయాన్ని పేర్కొన్నారు. బాకీలు చెల్లించాల్సిన వారిలో విజయ్ మాల్యా, నీరవ్ మోదీలు ఉన్నారని చెప్పారు. వారు 12 బ్యాంకులకు రూ.58,082 కోట్లు చెల్లించాల్సి ఉందని తెలిపారు. వారి నుంచి ఇంతవరకు రూ.19,187 కోట్లు వసూలు చేసినట్టు చెప్పారు.

జీపీఎస్ స్పూఫింగ్ నిజమే

దేశంలోని వివిధ అంతర్జాతీయ విమానాశ్రయాల్లో జీపీఎస్ స్పూఫింగ్ జరిగింది నిజమేనని కేంద్రం అంగీకరించింది. ఢిల్లీ సహా ముంబై, కోల్‌కతా, హైదరాబాద్, అమృత్‌సర్, బెంగళూరు, చెన్నైలోని విమానాశ్రయాల్లో జీపీఎస్ స్పూఫింగ్, జీఎన్ఎస్ఎస్ (గ్లోబల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టం) మార్చేందుకు జోక్యం చేసుకున్న ఘటనలు చోటుచేసుకున్నాయని తెలిపింది.

'అదానీ'లో పెట్టుబడులు ఎల్ఐసీ సొంత నిర్ణయం

న్యూఢిల్లీ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): గౌతమ్ అదానీకి చెందిన అదానీ గ్రూప్ ఆఫ్ కంపెనీల్లో పెట్టుబడులు పెట్టాలని ఎల్ఐసీకి కేంద్ర ఆర్థిక శాఖ ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. ఎల్ఐసీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల నిర్ణయం మేరకు, ఆ సంస్థ సొంతంగానే పెట్టుబడి పెట్టిందని లోక్‌సభలో సోమవారం ఒక ప్రశ్నకు రాతపూర్వకంగా ఇచ్చిన సమాధానంలో ఆమె వెల్లడించారు. రుణాల చెల్లింపులు, అమెరికాలో ప్రభుత్వ విచారణతో తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న అదానీ సంస్థలను కాపాడేందుకు ఆర్థిక శాఖ ఈ ఏడాది మేలో బలవంతంగా ఎల్ఐసీతో దాదాపు రూ.5,000 కోట్లు పెట్టుబడి పెట్టించిందని గత అక్టోబర్‌లో అమెరికాకు చెందిన వాషింగ్టన్ పోస్టు పత్రిక కథనం ప్రచురించటంలో మన దేశంలో ప్రతిపక్షాలు కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించాయి.

రాజ్యసభలో 'ధన్‌ఖడ్' రగడ

న్యూఢిల్లీ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ శీతాకాల సమావేశాల తొలిరోజే రాజ్యసభలో అధికార, విపక్షాల మధ్య మాటల యుద్ధం జరిగింది. సోమవారం సభలో.. రాజ్యసభ చైర్మన్ సీపీ రాధాకృష్ణన్‌ను ఉద్దేశించి స్వాగత ప్రసంగం చేసిన విపక్ష నేత ఖర్గే.. రాజ్యసభ మాజీ చైర్మన్ ధన్‌ఖడ్‌ను ఆకస్మికంగా పంపించేశారంటూ చేసిన వ్యాఖ్యలతో సభలో గందరగోళ పరిస్థితి నెలకొంది. ఆ సమయంలో ప్రధాని మోదీ సభలోనే ఉన్నారు. "మీ(ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్) కంటే ముందు మీ సీట్లో ఉన్న ధన్‌ఖడ్ అనూహ్యంగా, ఎవరూ ఊహించని రీతిలో ఆకస్మికంగా రాజ్యసభ చైర్మన్‌గా నిష్క్రమించడం బాధాకరం. ఇది పార్లమెంటరీ చరిత్రలో ఎన్నడూ జరగనిది. కనీసం.. ఆయనకు వీడ్కోలు పలికే అవకాశం కూడా సభకు రాకపోవడం నన్నెంతో నిరాశకు గురిచేసింది" అని ఖర్గే అన్నారు. ఖర్గే వ్యాఖ్యలపై పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. "మీరు మాజీ చైర్మన్(ధన్‌ఖడ్) గురించి ఉపయోగించిన దారుణమైన పదాలు మరిచిపోయారా? ఎంతటి అభ్యంతరకరంగా, అవమానకరంగా వ్యవహరించారో అందరికీ గుర్తుంది" అని కిరణ్ రిజిజు అన్నారు. కాగా, రాజ్యసభ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌పై మోదీ ప్రశంసల జల్లుకురిపించారు. మరోవైపు, సభ్యులు "నిబంధనలు అనే లక్షణ రేఖకు కట్టుబడి ఉండాలి" అని రాధాకృష్ణన్ సూచించారు.

బేసిక్‌లో డీఏ విలీనం ప్రస్తుతానికి లేదు


న్యూఢిల్లీ, డిసెంబరు 1: ఉద్యోగుల బేసిక్ వేతనంలో డీఏను విలీనం చేసే ఆలోచన ఏదీ ప్రస్తుతానికి లేదని కేంద్రఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌదరి సోమవారం లోక్‌సభలో చెప్పారు. 8వ వేతన సంఘం ఏర్పాటైన దృష్ట్యా డీఏలో కనీసం 50 శాతాన్ని తక్షణమే బేసిక్‌లో కలపాలంటూ ఇటీవల ఉద్యోగ సంఘాలు కేంద్రాన్ని కోరిన నేపథ్యంలో మంత్రి చేసిన ఈ ప్రకటన ప్రాధాన్యతను సంతరించుకొంది. ఒకవేళ బేసిక్‌లో ప్రస్తుతం ఉన్న డీఏను కలిపితే ఉద్యోగుల మూల వేతనం బాగా పెరుగుతుంది.

లోకం తీరు



కరిచేవారంతా పార్లమెంట్‌లో..

కాంగ్రెస్ ఎంపీ రేణుకా చౌదరి తీవ్ర వ్యాఖ్యలు



రేణుకా చౌదరి పార్లమెంట్‌కు తీసుకొచ్చిన కుక్క

న్యూఢిల్లీ, డిసెంబరు 1: పార్లమెంటు సమావేశాల సందర్భంగా సోమవారం అసాధారణ దృశ్యం చోటు చేసుకుంది. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి సోమవారం పార్లమెంటు ప్రాంగణంలోకి శునకాన్ని తీసుకురావడం తీవ్ర వివాదాస్పదం అయింది. పైగా తన చర్యను సమర్థించుకొంటూ రేణుక చేసిన వ్యాఖ్యలు.. దుమారం రేపుతున్నాయి. శునకాన్ని ఎందుకు తీసుకొచ్చారు? అని మీడియా ప్రశ్నించగా.. "తప్పేముంది? ఈ కుక్క ఎవ్వరినీ కరవదు. కరిచేవాళ్లంతా పార్లమెంటు లోపల కూర్చొని ప్రభుత్వాన్ని నడుపుతున్నారు. ఇది మీకు తప్పుగా అనిపించదా?" అని రేణుక తీవ్ర వ్యాఖ్యలు చేశారు. శునకాన్ని పార్లమెంటు ప్రాంగణంలోకి తీసుకురావడం భద్రతా నిబంధనలను ఉల్లంఘించడం కదా? అని ప్రశ్నించినప్పుడు.. "శునకానికి కూడా పాసు ఇవ్వండి. అంతకుమించి ఏం చెప్పగలం?" అని అన్నారు. పార్లమెంటు ప్రాంగణంలోకి ఏ ఎంపీ అయినా కుక్కతో రావొద్దని చట్టాల్లో ఉందా? అని ప్రశ్నించారు. తాను పార్లమెంటుకు వస్తుండగా మార్గమధ్యలో శునకం కనిపించిందని, ఏ వాహనమైనా దానిపైనుంచి వెళ్తుందేమోనని కార్లో తనవెంట పార్లమెంటుకు తీసుకొచ్చానని చెప్పారు. "ఓ జంతువు ప్రాణాలను కాపాడితే అభ్యంతరమేమిటి? దాన్ని నేను పెంచుకుంటాను" అని చెప్పారు. రేణుక చర్యను బీజేపీ తీవ్రంగా ఖండించింది. సహచర ఎంపీలను శునకాలతో పోల్చడం ద్వారా వారిని, పార్లమెంటును, అందులోని సిబ్బందిని ఆమె అవమానించారని విమర్శించింది.

ఎన్నికల కోడ్‌పై చట్టం చేయొద్దు!

- చేస్తే ఈసీ అధికారాలను కుదించినట్లే
- జేపీసీకి లా కమిషన్ స్పష్టీకరణ

న్యూఢిల్లీ, డిసెంబరు 1: ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎలక్షన్ కోడ్)ని చట్టంగా తీసుకురావద్దని లా కమిషన్ సూచించింది. చట్టం చేస్తే కేంద్ర ఎన్నికల కమిషన్(ఈసీ) అధికారాలను కుదించినట్లవుతుందని.. పార్లమెంటరీ సంయుక్త సంఘాని(జేపీసీ)కి స్పష్టంచేసింది. అంతేకాకుండా నిర్దిష్ట గడువులో స్వేచ్ఛాయుత, నిష్పాక్షిక ఎన్నికల నిర్వహణకు అనుకూలంగా ఉండదని పేర్కొంది. జమిలి ఎన్నికలపై ఏర్పాటైన ఈ జేపీసీకి కమిషన్ తన అభిప్రాయాన్ని తాజాగా తెలియజేసింది. 'తక్షణ చర్యలకు ఆస్కారం ఉండడమే ఎంసీసీ సామర్థ్యం. ఉల్లంఘనలపై కొద్ది రోజుల్లో.. ఒక్కోసారి గంటల్లోనే స్పందించాల్సి ఉంటుంది. ఎంసీసీ గనుక చట్టమైతే.. ఉల్లంఘనలపై కోర్టు వివాదాలు పెరుగుతాయి. ప్రతికూల ఫలితాలు ఎదురవుతాయి. ఈసీ అధికారాలను కుదించినట్లవుతుంది' అని స్పష్టంచేసింది. ఎన్నికల నియమావళికి చట్టబద్ధత లేకున్నా.. దాని ప్రాతిపదికన ఈసీ తీసుకున్న నిర్ణయాలను సుప్రీంకోర్టు పలు సందర్భాల్లో సమర్థించింది.

బీఎల్‌వోలను బలిగొంటున్న 'సర్' పనిభారం

- ఒత్తిడితో యూపీ, బెంగాల్‌లో అధికారుల బలవన్మరణాలు

బరేలీ/బిజ్‌నోర్, డిసెంబరు 1: ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) ప్రక్రియ కొనసాగుతున్న రాష్ట్రాల్లో బూత్ స్థాయి అధికారుల(బీఎల్‌వో) వరుస మరణాలు తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. పని ఒత్తిడి, లక్ష్యాలను పూర్తి చేయాలని అధికారుల నుంచి వస్తున్న బెదిరింపులు తట్టుకోలేక ప్రాణాలు కోల్పోతున్నారని మృతుల కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. తాజాగా యూపీలోని బిజ్నార్ జిల్లాకు చెందిన బీఎల్‌వో సర్వేశ్‌సింగ్ ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆత్మహత్యకు ముందు రాసిన సూసైడ్‌నోట్‌లో.. 'బతకాలనుంది కానీ, ఏం చేయను' అంటూ నిస్సహాయతను వ్యక్తం చేశారు. పని ఒత్తిడి వల్ల ప్రశాంతత కోల్పోయానన్నారు. యూపీలో ఇదే విధమైన కారణాలతో ఇప్పటికే ఐదుగురు బీఎల్‌వోలు మరణించినట్టు వెల్లడైంది. బిజ్నార్‌కే చెందిన 56ఏళ్ల శోభన రాణి అనారోగ్యంతో ఉన్నా.. కూతురు పెళ్లి ఏర్పాట్లకు సెలవు కూడా తీసుకోకుండా వరుసగా పని చేసింది. దీంతో ఇటీవల గుండెపోటుకు గురై మరణించిందని కుటుంబసభ్యులు తెలిపారు. ఫతేపూర్‌కు చెందిన సుధీర్ కుమార్(37) తన పెళ్లికి కొద్ది రోజుల ముందు ఆత్మహత్యకు పాల్పడ్డారు. గోండా జిల్లాకు చెందిన టీచర్ విపిన్ యాదవ్(35) నవంబర్ 25న విషం సేవించి మరణించగా, మిగతా ముగ్గురు గుండెపోటు, బ్రెయిన్ హెమరేజ్ వంటి అనారోగ్య సమస్యలతో చనిపోయారు. యూపీ తరహాలోనే, బెంగాల్‌లోనూ.. ఎస్ఐఆర్ సర్వే మొదలైన కొద్ది రోజుల్లోనే నలుగురు బీఎల్‌వోలు మృతి చెందగా.. వీరిలో ఇద్దరు మహిళలు ఆత్మహత్య చేసుకున్నారు.

డిజిటల్ అరెస్టు కేసులు సీబీఐకి..

పాన్ ఇండియా స్థాయిలో ఒకేలా విచారణ.. దర్యాప్తు సంస్థను ఆదేశించిన సుప్రీంకోర్టు

- ఎందుకు ఏఐ టెక్నాలజీని వాడటం లేదు?
- ఆర్బీఐని ప్రశ్నించిన కోర్టు.. నోటీసు జారీ
- సీబీఐని అనుమతించాలంటూ తెలంగాణ తమిళనాడు, బెంగాల్ రాష్ట్రాలకు నిర్దేశం



న్యూఢిల్లీ, డిసెంబరు 1: సైబర్ నేరగాళ్లు డిజిటల్ అరెస్టుల పేరిట చేస్తున్న నగదు మోసాలపై దర్యాప్తును సీబీఐకి అప్పగిస్తూ సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. అన్ని కేసుల్లో పాన్ ఇండియా స్థాయిలో ఒకే తరహా దర్యాప్తు జరపాలని జాతీయ దర్యాప్తు సంస్థకు నిర్దేశించింది. సీబీఐని తమ రాష్ట్రాల్లోకి అనుమతించాలంటూ పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ ప్రభుత్వాలను కోరింది. సైబర్ నేరగాళ్లు ఉపయోగించిన బ్యాంకు ఖాతాలను గుర్తించి, స్తంభింపజేయడానికి ఏఐ సాంకేతికతను లేక మిషన్ లెర్నింగ్ టెక్నాలజీని ఎందుకు ఉపయోగించడం లేదని రిజర్వు బ్యాంక్‌ను సుప్రీంకోర్టు ప్రశ్నించింది. దీనిపై వివరణ ఇవ్వాలంటూ నోటీసు జారీచేసింది. ఇటీవలి కాలంలో దేశవ్యాప్తంగా డిజిటల్ అరెస్టుల వ్యవహారం కలకలం రేపుతోంది. ఈ నేపథ్యంలో డిజిటల్ అరెస్టు వలలో చిక్కి, బాధితులుగా మారిన హరియాణాకు చెందిన వృద్ధ దంపతులు చేసిన ఫిర్యాదును సుమోటోగా సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్య బాగ్చీలతో కూడిన బెంచ్ స్వీకరించింది. ఎక్కువగా సీనియర్ సిటిజన్లపైనే సైబర్ నేరగాళ్లు కన్నేసి, వారు జీవితాంతం కష్టించి కూడబెట్టినదంతా దోచేస్తున్నారని ఈ సందర్భంగా బెంచ్ వ్యాఖ్యానించింది. డిజిటల్ అరెస్టులకు సంబంధించిన వివరాలు ఇవ్వడంతో పాటు, దీనిపై దర్యాప్తులో సీబీఐకి సహకరించాల్సిందిగా ఐటీ సంస్థలను కోర్టు కోరింది. ట్యాక్స్ మినహాయింపులిచ్చే దేశాల్లో నక్కిన సైబర్ నేరగాళ్లను పట్టుకోవడంలో ఇంటర్‌పోల్ సహకారం తీసుకోవాలని సీబీఐకి సూచించింది. ఒక వినియోగదారుడికి ఒకటి కంటే ఎక్కువ సిమ్‌లను సర్వీస్ ప్రొవైడర్లు ఇస్తున్నారా అనేది నివేదించాలని టెలికం విభాగాన్ని ఆదేశించింది. సీబీఐ దర్యాప్తునకు అండగా తమ పరిధిలో సైబర్ క్రైమ్ కో ఆర్డినేషన్ సెంటర్లను ఏర్పాటు చేయాల్సిందిగా రాష్ట్రాలు, యూటీలను కోరింది. ఆన్‌లైన్ మోసాల కట్టడి గురించి కేంద్రం ఏం ఆలోచిస్తుందనేది తెలపాలని సొలిసిటర్ జనరల్‌ను కోరింది. సైబర్ నేరగాళ్లు వాడిన బ్యాంకు ఖాతాలను స్తంభింపజేసే అధికారాన్ని సీబీఐతోపాటు రాష్ట్రాలు, యూటీలు, వాటి పోలీసు ఏజెన్సీలకు కోర్టు ఇచ్చింది.

ఇకపై డీఫాల్ట్‌గా 'సంచార్ సాథీ' యాప్!

మొబైల్ సంస్థలకు టెలికాం శాఖ ఆదేశం

న్యూఢిల్లీ, డిసెంబరు 1: సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేసే దిశగా కేంద్ర టెలికాం మంత్రిత్వ శాఖ మొబైల్ తయారీ సంస్థలు, దిగుమతిదారులకు కీలక ఆదేశాలు జారీచేసింది. కొత్తగా తయారు చేసే, దిగుమతి చేసుకునే స్మార్ట్‌ఫోన్లలో సైబర్ సెక్యూరిటీ కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'సంచార్ సాథీ' యాప్‌ను డీఫాల్ట్‌గా ఇన్‌స్టాల్ చేయాలని సూచించింది. నవంబరు 28న ఈ సూచన చేసిన టెలికాం శాఖ.. దీని కోసం ఆయా సంస్థలకు 90 రోజులు గడువు ఇచ్చినట్టు తెలిసింది. ఈ యాప్‌ను డీఫాల్ట్‌గా ఇస్తే.. ఇతర యాప్‌ల మాదిరిగా దీన్ని డిలీట్ చేయడం కుదరదు. సంచార్ సాథీ యాప్‌ను కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది జనవరిలో ప్రారంభించింది. ఈ యాప్ ఇప్పటివరకు చోరీకి గురైన మొబైళ్లలో 7 లక్షలకుపైగా గుర్తించడంలో సహాయపడింది. ఒక్క అక్టోబరు నెలలోనే దీని ద్వారా 50 వేల ఫోన్లను గుర్తించారు. ఈ యాప్ సాయంతో 37 లక్షల పోగొట్టుకున్న మొబైళ్లను బ్లాక్ చేశారు. సైబర్ ముప్పును ఎదుర్కోవడంలో, ఐఎంఈఐల ట్యాంపరింగ్‌ను నిరోధించడంలో, నకిలీ మొబైల్ కనెక్షన్లను గుర్తించడంలో ఈ యాప్ సహాయపడుతుంది. అయితే, దీనివల్ల వినియోగదారుల ప్రైవసీకి భంగం కలుగుతుందన్న అభిప్రాయాలున్నాయి.

నా సహచరికి భారతీయ మూలాలు

కుమారుడి పేరులో 'శేఖర్': మస్క్



న్యూఢిల్లీ, డిసెంబరు 1: ప్రపంచ కుబేరుడు, టెస్లా సీఈవో ఎలాన్ మస్క్ తన సహచరి శివోన్ జిలిస్ గురించి పలు ఆసక్తికర విషయాలు వెల్లడించారు. ఆయన సహజీవన భాగస్వామి శివోన్‌కు భారతీయ మూలాలు ఉన్నాయని చెప్పి ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచారు. జెరోధా సహ వ్యవస్థాపకుడు నిఖిల్ కామత్ పాడ్‌కాస్ట్ "డబ్ల్యూటీఎఫ్ ఈజ్?"లో తన వ్యక్తిగత జీవితం గురించి మస్క్ మాట్లాడారు. శివోన్ బాల్యం కెనడాలో గడిచిందని, అక్కడే ఆమె పెరిగారని చెప్పారు. తమకు కలిగిన ఓ కుమారుడి పేరులో నోబెల్ అవార్డు గ్రహీత, ప్రముఖ ఆస్ట్రోఫిజిక్స్ శాస్త్రవేత్త సుబ్రహ్మణ్యన్ చంద్రశేఖర్ గౌరవార్థం ఆయన పేరులో శేఖర్‌ను కలిపినట్లు తెలిపారు. శివోన్ గురించి పోడ్‌కాస్ట్‌లో అడిగినప్పుడు మస్క్ స్పందిస్తూ.. "బాల్యంలోనే ఆమెను దత్తతకు ఇచ్చారు. కెనడాలో పెరిగింది. మిగతా వివరాలు పెద్దగా తెలియవు" అని చెప్పారు. అలాగే కష్టపడే భారతీయులు, వారి ప్రతిభతో అమెరికా అత్యంత లాభపడిందని చెప్పారు. ప్రస్తుతం ఆ పరిస్థితి మారుతోందన్నారు.

ఎవరు ఈ శివోన్..?

శివోన్ తల్లి పంజాబ్‌కు చెందిన హిందూ మహిళ. తండ్రి కెనడాకు చెందిన శ్వేతజాతీయుడు. యేల్ యూనివర్సిటీలో ఆర్థ్, ఎకనామిక్స్ ఫిలాసఫీలో శివోన్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. 2017లో మస్క్ సంస్థ న్యూరాలింక్‌లో చేరారు. ప్రస్తుతం ఆ సంస్థ ఆపరేషన్స్, స్పెషల్ ప్రాజెక్ట్స్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. మస్క్ సహచరిగా ఆమెకు కలిగిన నలుగురు సంతానంలో కవలలు స్ట్రైడర్, అజ్యూర్, కుమార్తె ఆర్కాడియా, మరో కుమారుడు సెల్డన్ ఉన్నారు. వీరిలో ఓ కుమారుడి పేరు మధ్యలో శేఖర్ అని కలిపారు.

హసీనా ఆదేశంతోనే 'రైఫిల్స్' తిరుగుబాటు!

- నివేదిక సమర్పించిన విచారణ కమిషన్
- భారత్ పాత్ర కూడా ఉందని ఆరోపణ

ఢాకా, డిసెంబరు 1: పదహారేళ్ల క్రితం జరిగిన బంగ్లాదేశ్ రైఫిల్స్(బీడీఆర్) తిరుగుబాటు వెనుక నాటి ప్రధాన మంత్రి షేక్ హసీనా హస్తం ఉందని విచారణ కమిషన్ ఆరోపించింది. 2009లో హసీనా తిరిగి అధికారం చేపట్టిన కొన్ని వారాలకే బీడీఆర్ తిరుగుబాటు జరిగింది. రెండు రోజులపాటు కొనసాగిన ఆ తిరుగుబాటులో అత్యున్నత సైనిక అధికారులు సహా 74మంది చనిపోయారు. మొహమ్మద్ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం బీడీఆర్ తిరుగుబాటుపైనా ఒక విచారణ కమిషన్‌ను నియమించింది. ఆ కమిషన్ తాజాగా సమర్పించిన నివేదికలోని వివరాలను కమిషన్ చైర్మన్ ఏఎల్ఎం ఫజ్లుర్ రహ్మాన్ ఆదివారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. బంగ్లాదేశ్ సైన్యాన్ని బలహీనపరిచేందుకు జరిగిన ఆ కుట్రలో భారత దేశం పాత్రకూడా ఉందన్నారు. ఆ సమయంలో 921మంది భారతీయులు బంగ్లాదేశ్‌లోకి రాగా, అందులో 67మంది ఎక్కడున్నారో తెలియలేదన్నారు. కాగా, కమిషన్ నివేదికతో 'నిజం' వెలుగులోకి వచ్చిందని యూనస్ అన్నారు.

కొత్త మద్యం దుకాణాలు తొలిరోజే కిటకిట!

- ఉదయమే ప్రత్యేక పూజలతో యజమానుల హడావుడి
- పలుచోట్ల స్థానికుల అభ్యంతరాలు, అద్దెకు షాపులు దొరక్క బ్రేక్



హైదరాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్త మద్యం దుకాణాలు తొలిరోజే కళకళలాడాయి. దుకాణాలు దక్కించుకున్నవారు.. ఉదయమే దుకాణాలను అలంకరించి, పండితులను పిలిపించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించడంతో హడావుడి కనిపించింది. నిర్వాహకులు తమకు కలిసివచ్చే ముహూర్తం చూసుకుని షాపులు తెరిచి, విక్రయాలు మొదలుపెట్టారు. బేవరేజెస్ కార్పొరేషన్ డిపోల నుంచి ఆదివారం అర్ధరాత్రి దాకా ఆయా మద్యం దుకాణాలకు సరుకు సరఫరా కావడంతో తొలి రోజే కొత్తస్టాక్‌తో విక్రయాలు ప్రారంభమయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా 2,620 మద్యం దుకాణాలుండగా.. ఈసారి చాలా మంది కొత్తవారు మద్యం వ్యాపారంలోకి దిగడంతో పూజలు, ముహూర్తాలపై మరింత శ్రద్ధపెట్టినట్లు కనిపించింది. తొలి రోజే దుకాణాలు కిటకిటలాడాయి. ఇక హైదరాబాద్‌తో పాటు పలు జిల్లా కేంద్రా ల్లో ఈసారి చాలా మద్యం దుకాణాల్లో అనుబంధంగా వాకిన్ స్టోర్లను ఏర్పాటు చేశారు. సూపర్ మార్కెట్ల తరహాలో వినియోగదారులు వాటిలోపలికి వెళ్లి నచ్చిన మద్యాన్ని ఎంచుకుని కొనుగోలు చేయవచ్చు. లైసెన్సు ఫీజుకు అదనంగా రూ.5లక్షలు చెల్లించిన మద్యం దుకాణాలకు ఈ అవకాశం ఉంటుంది. నల్గొండలో గతంలో ఒకే వాకిన్ లిక్కర్ మార్ట్ ఉండగా.. సోమవారం కొత్తగా ఐదు ఏర్పాటయ్యాయి. ఈ కొత్త దుకాణాల పాలసీ గడువులో ప్రభుత్వానికి గతంలో కంటే భారీగా ఆదాయం వస్తుందని ఎక్సైజ్‌శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

కొన్నిచోట్ల ఆగిన ప్రారంభం

కొత్త మద్యం దుకాణాలకు పలుచోట్ల స్థానికులు అభ్యంతరం తెలపడంతో ప్రారంభం కాలేదు. దేవాలయాలు, విద్యాసంస్థలు, నివాస ప్రాంతాల్లో దుకాణాలు చేస్తుండటంపై స్థానికుల్లో వ్యతిరేకత వ్యక్తమైంది. మరికొన్ని చోట్ల తగిన షాపులు అద్దెకు దొరక్కపోవడంతోనూ ప్రభావం పడింది. రంగారెడ్డి ఎక్సైజ్ డివిజన్ పరిధిలో దాదాపు 25 దుకాణాలు సోమవారం ప్రారంభం కాలేదు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి జిల్లాలో ఒకటీరెండు చోట్ల ఇలాంటి పరిస్థితి ఏర్పడిందని ఎక్సైజ్‌శాఖ అధికారులు చెబుతున్నారు.

క్లస్టర్ల మ్యాపింగ్!

జీహెచ్‌ఎంసీలో ఇతర కార్పొరేషన్ల విలీనంపై కొనసాగుతున్న కసరత్తు

- జనాభా, ఓటర్ల ఆధారంగా ప్రక్రియ
- రెండు క్లస్టర్లు కలిపితే.. ఒక డివిజన్
- ఒక్కో డివిజన్‌లో 40-50 వేల జనాభా
- 250-300 డివిజన్ల ఏర్పాటుకు యోచన
- ముసాయిదా దస్త్రానికి గవర్నర్ ఆమోదం?
- త్వరలోనే గెజిట్ జారీ చేయనున్న సర్కార్



హైదరాబాద్ సిటీ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఓఆర్ఆర్ లోపల, బయట ఉన్న 20 మునిసిపాలిటీలు, 7 కార్పొరేషన్లను జీహెచ్‌ఎంసీలో విలీనం చేసే ప్రక్రియ వేగం పుంజుకుంటోంది. ఇందులోభాగంగానే శివారు కార్పొరేషన్లు, మునిసిపాలిటీల్లోని ప్రాంతాలను క్లస్టర్లుగా విభజిస్తున్నట్లు తెలిసింది. తద్వారా విలీనం తర్వాత డివిజన్ల పునర్విభజన సులభమవుతుందని అధికారులు భావిస్తున్నారు. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో వారం రోజులుగా సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీజీ), బల్దియా పట్టణ ప్రణాళిక, ఎన్నికల విభాగాలు, ప్రతిపాదిత విలీన కార్పొరేషన్లు, మునిసిపాలిటీల్లోని టౌన్‌ప్లానింగ్ అధికారులు సుదీర్ఘ కసరత్తు చేస్తున్నారు. రోజు వారీ సాధారణ పనులు పక్కనపెట్టి.. ఉదయం నుంచి రాత్రి వరకు విలీన ప్రక్రియపై కుస్తీ పడుతున్నారు. జీహెచ్‌ఎంసీతోపాటు ప్రతిపాదిత విలీన కార్పొరేషన్లు, మునిసిపాలిటీ మ్యాపుల ఆధారంగా క్లస్టర్లను గుర్తిస్తున్నట్టు ఓ అధికారి తెలిపారు. ఒకటి లేదా రెండు క్లస్టర్లను ఒక డివిజన్‌గా ఏర్పాటు చేసే సూచనలున్నాయని చెబుతున్నారు. కార్పొరేషన్లు, మునిసిపాలిటీల భౌగోళిక విస్తీర్ణం ఆధారంగా ప్రస్తుతం క్లస్టర్ల విభజన జరుగుతోంది. ఈ క్రమంలో కొన్ని చోట్ల నిర్ణీత స్థాయిలో జనాభా ఉండడం లేదు. ఇలాంటి క్లస్టర్లను పక్కనున్న మునిసిపాలిటీ లేదా కార్పొరేషన్ పరిధిలోని ప్రాంతాలతో కలిపే అవకాశం ఉంది. 650 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న గ్రేటర్ హైదరాబాద్‌లో ప్రస్తుతం 1.30 కోట్లకుపైగా జనాభా ఉన్నట్లు అంచనాలున్నాయి. ప్రతిపాదిత విలీన మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో 30 నుంచి 40 లక్షల జనాభా ఉంటుందని చెబుతున్నారు. ఈ క్రమంలో 40-50 వేల జనాభాకు ఒక డివిజన్‌ను ఏర్పాటు చేయాలని సూత్రప్రాయంగా భావిస్తున్నారు. ఆయా డివిజన్లకు సహజ సరిహద్దులు కీలకంగా మారనున్నాయని, నదులు, జాతీయ రహదారులు, చెరువులు తదితరాలు హద్దులుగా ఉంటాయని ఓ అధికారి చెప్పారు. డివిజన్ల జనాభాలో 10 శాతం హెచ్చుతగ్గులు ఉంటాయని, 250-300 డివిజన్లు ఏర్పాటు చేసే అవకాశం ఉందని చెబుతున్నారు. ప్రస్తుతం పలు డివిజన్లు రెండు అంతకంటే ఎక్కువ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఉండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నా యి. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఒక్కో డివిజన్.. ఒకే అసెంబ్లీ నియోజకవర్గం, ఒకే జిల్లా పరిధిలో ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం జీహెచ్‌ఎంసీ పరిధిలో 69 లక్షల జనాభా మాత్రమే ఉంది. అప్పటి జనాభాతో పోలిస్తే ఆయా ప్రాంతాల్లో ప్రస్తుతం ఉన్న ఓటర్ల సంఖ్య అధికంగా ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి. శివారు మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలోనూ ఇదే పరిస్థితి ఉంది. ఈ మేరకు అప్పటి జనాభాతో పాటు ప్రస్తుత ఓటర్ల సంఖ్యను పరిగణనలోకి తీసుకుంటూ మధ్యే మార్గంగా డివిజన్లు ఏర్పాటు చేయాలని యోచిస్తున్నట్టు తెలిసింది. బడంగ్‌పేటను మూడు, మీర్‌పేటను రెండు క్లస్టర్లుగా విభజించనున్నట్టు విశ్వసనీయ సమాచారం.

ముసాయిదాపై గవర్నర్ సంతకం!

జీహెచ్‌ఎంసీ విస్తరణ ప్రతిపాదనను ఇప్పటికే మంత్రివర్గం ఆమోదించగా.. ఆ తర్వాత బల్దియా కౌన్సిల్ సైతం అంగీకరించిన విషయం తెలిసిందే. తాజాగా విలీన ప్రక్రియకు సంబంధించిన ముసాయిదా దస్త్రంపై గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సంతకం చేసినట్లు తెలిసింది. అయితే, దీనిపై అధికారికంగా ఎలాంటి ప్రకటన వెలువడలేదు. ఈ మేరకు త్వరలోనే ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసి అభ్యంతరాలు, ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. గెజిట్ విడుదల తర్వాతే విలీన ప్రక్రియ ఎలా ఉంటుంది? పాలనా సౌలభ్యం కోసం ఏం చేయనున్నారు? వంటి అంశాలపై స్పష్టత వస్తుందని పేర్కొన్నాయి.



సీతక్కకు పురస్కారాన్ని అందజేస్తున్న స్పీకర్ ప్రసాద్, గీతారెడ్డి

సీతక్కకు ఈశ్వరీబాయి స్మారక పురస్కారం

- స్పీకర్ ప్రసాద్, గీతారెడ్డి చేతుల మీదుగా అందజేత

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కొన్ని వర్గాలకు అంబేడ్కర్ అంటే ద్వేషమని, అందుకే వారంతా రాజ్యాంగాన్ని నమ్మవద్దంటూ నిరంతరం ప్రచారం చేస్తుంటారని మంత్రి సీతక్క అన్నారు. 'అంబేడ్కర్‌ను స్మరించుకుంటే ఏమొస్తుంది. దేవుడిని తలుచుకోండి.. స్వర్గానికి వెళతారు' అంటూ ఓ సందర్భంలో అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు అణగారిన వర్గాలపట్ల వారి దృక్పథాన్ని తెలియజేస్తున్నాయని విమర్శించారు. అటవీ సంపదను కొల్లగొడుతూ.. అడవి బిడ్డలను ఏం చేస్తున్నారో మనమంతా చూస్తున్నామని కేంద్రాన్ని ఉద్దేశించిఅన్నారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, ఈశ్వరీ బాయి మెమోరియల్ ట్రస్టు సంయుక్త నిర్వహణలో సోమవారం రవీంద్ర భారతిలో ఈశ్వరీబాయి 107వ జయంతి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్, మాజీ మంత్రి గీతారెడ్డి, మంత్రి వివేక్ తదితరులు సీతక్కకు ఈశ్వరీబాయి స్మారక పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఆడబిడ్డలకు విద్యావకాశాలు కల్పించడంలో ఈశ్వరీబాయి పాత్ర శ్లాఘనీయమని స్పీకర్ అన్నారు. తెలంగాణ కోసం ఈశ్వరీబాయి చేసిన కృషిని మంత్రి వివేక్ గుర్తుచేశారు.

మాకిచ్చిన హామీలు అమలు చేయండి

- తెలంగాణ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి

హైదరాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన సంబరాలు డిసెంబరు 9 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో ఎన్నికలకు ముందు ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి ప్రభుత్వాన్ని కోరింది. సోమవారం టీఎన్‌జీవో భవన్‌లో ఐకాస ఛైర్మన్ మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడారు. ఆరు నెలలకు ఒకసారి డీఏ విడుదల చేస్తామని హామీ ఇచ్చినా డీఏలు ఇవ్వడం లేదని, ఉద్యోగుల ఆరోగ్య కార్డులను ఇంత వరకు ఇవ్వలేదని అన్నారు. ప్రజా సంబరాలకు ముందుగా డీఏ విడుదల చేసి ఉద్యోగులను సైతం భాగస్వాములను చేయాలని కోరారు.



ఆపరేషన్ అనంతరం రోగి వెంకన్నతో డాక్టర్ సీతారాం నాయక్ బృందం

ఖమ్మం జిల్లా ఆస్పత్రిలో రోగి గుండెకు పేస్‌మేకర్

- పైసా ఖర్చులేకుండా ఆరోగ్యశ్రీ కింద శస్త్రచికిత్స
- ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి అరుదైన ఘనత

ఖమ్మం కలెక్టరేట్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఖమ్మం జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి (జీజీహెచ్) వైద్యులు అరుదైన ఘనతను సాధించారు. గుండె నెమ్మదించి ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రికి వచ్చిన వ్యక్తి పరిస్థితికి చలించిపోయారు. పైసా ఖర్చులేకుండా ఆరోగ్యశ్రీ కింద అతడి గుండెకు పేస్‌మేకర్ అమర్చారు. తిరుమలాయపాలెం మండలం దమ్మాయిగూడేనికి చెందిన వెంకన్న గత నెల 24వ తేదీన అపస్మారక స్థితిలో ఖమ్మం జిల్లా జనరల్ ఆస్పత్రికి వచ్చాడు. హృద్రోగ నిపుణుడు డాక్టర్ సీతారాం పరీక్షలు నిర్వహించి.. సాధారణంగా నిమిషానికి 72సార్లు కొట్టుకోవాల్సిన గుండె 22సార్లు మాత్రమే కొట్టుకుంటోందని గుర్తించారు. విషయాన్ని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.నరేందర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన మానవతా దృక్పథంతో ఆలోచించి ఆరోగ్యశ్రీలో పేస్‌మేకర్ ఏర్పాటు చేద్దామని నిర్ణయించారు. నాలుగు రోజుల్లో దాన్ని రూ3.50లక్షల ఖర్చుతో హైదరాబాద్ నుంచి తెప్పించారు. నవంబరు 28న డాక్టర్ సీతారాం నాయక్ బృందం నాలుగు గంటల పాటు ఆపరేషన్ నిర్వహించి వెంకన్న గుండెకు పేస్‌మేకర్ అమర్చారు. హైదరాబాద్‌లోని నిమ్స్‌లో మాత్రమే చేసే ఈ అరుదైన ఆపరేషన్ ఖమ్మంలో.. అదీ ప్రభుత్వ ఆస్పత్రిలో విజయవంతంగా నిర్వహించడంతో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నరేందర్, ఆర్‌ఎంవో డాక్టర్ రాంబాబు తదితరులు డాక్టర్ సీతారాం నాయక్‌ను అభినందించారు. ప్రైవేటు ఆస్పత్రిలో కనీసం రూ.5లక్షల నుంచి రూ.6లక్షలు ఖర్చు అవుతుందని, మానవతా దృక్పథంతో ఆలోచించి ఆరోగ్యశ్రీ ద్వారా అత్యంత ఖరీదైన పేస్‌మేకర్‌ను తెప్పించిన సూపరింటెండెంట్‌ను కూడా పలువురు అభినందించారు. వెంకన్న పూర్తిగా కోలుకోవడంతో మంగళవారం అతడిని ఇంటికి పంపించారు. ప్రభుత్వ వైద్యులే తమ కుటుంబ పెద్దను కాపాడారని రోగి వెంకన్న కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

చిన్నారిని చిత్రహింసలు పెట్టిన ఆయా అరెస్ట్

- పోలీసుల అదుపులో స్కూల్ యజమాని
- పూర్ణిమా స్కూల్‌ను సీజ్‌చేసిన విద్యాశాఖ

జీడిమెట్ల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): చిన్నారి దరిత్రిని చిత్రహింసలకు గురిచేసి, హత్యాయత్నానికి యత్నించిన పూర్ణిమా స్కూల్ ఆయా లక్ష్మమ్మను జీడిమెట్ల పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సంఘటన గురించి తెలిసినా నిర్లక్ష్యంగా వ్యవహరించిన పాఠశాల యజమాని జానకీరాంను కూడా అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. కోర్టు ఆదేశాల మేరకు చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు జీడిమెట్ల సీఐ గడ్డం మల్లేశ్ తెలిపారు. మేడ్చల్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల విద్యాశాఖ అధికారి (ఎంఈవో) జెమిని కుమారి సోమవారం పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలకు సెలవు ఇవ్వడంపై ఎంఈవో సీరియస్ అయ్యారు. పాఠశాలకు అనుమతులు ఉన్నప్పటికీ, పిల్లలకు సరిపడా ఉపాధ్యాయులు లేరని, 17 మంది టీచర్లలో ఆరుగురు మాత్రమే అర్హత కలిగి ఉన్నారని ఎంఈవో తెలిపారు. ఉన్నతాధికారుల తదుపరి ఆదేశాలు వచ్చేవరకు పాఠశాలను మూసివేస్తున్నట్లు ప్రకటించారు.

హిల్ట్ పాలసీ నిలిపివేతకు ఆదేశించండి

- గవర్నర్‌కు బీజేపీ నేతల వినతి
- హిల్ట్, జీహెచ్‌ఎంసీ విస్తరణకు వ్యతిరేకంగా 7న ఇందిరా పార్కు వద్ద ధర్నా: రాంచందర్‌రావు



గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు వినతిపత్రం ఇస్తున్న రాంచందర్‌రావు, నాయకులు

హైదరాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన హిల్ట్(హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్‌ఫర్మేషన్) పాలసీని తక్షణం నిలిపివేసేలా ఆదేశాలివ్వాలని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను బీజేపీ కోరింది. ఇందుకు సంబంధించి జారీ చేసిన జీవో 27ను సస్పెండ్ చేసేలా జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేసింది. ఈ అంశంపై రిటైర్డు హైకోర్టు న్యాయమూర్తి ఆధ్వర్యంలో సమగ్ర విచారణకు ఆదేశించాలని అభ్యర్థించింది. రూ.కోట్ల విలువైన పారిశ్రామిక భూములను కొంత మంది అధికార పార్టీ నాయకులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అతి తక్కువ ధరకు కట్టబెట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించింది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు నేతృత్వంలో పార్టీ ప్రతినిధి బృందం సోమవారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించింది. అనంతరం రాంచందర్‌రావు మీడియాతో మాట్లాడారు. "హిల్ట్ పాలసీని బీజేపీ వ్యతిరేకిస్తోంది. రైతులు, కార్మికుల ప్రయోజనాలను దెబ్బతీసేలా ప్రభుత్వం ఈ పాలసీని తీసుకువచ్చింది. రూ.వేల కోట్ల విలువైన పారిశ్రామిక భూములను సబ్ రిజిస్ట్రార్ ధరలో మూడో వంతు ధరకే రియల్ ఎస్టేట్ సంస్థలకు అప్పగించే ప్రయత్నం చేస్తోంది. మరోవైపు, తమ భూములను కూడా మల్టీపర్పస్‌గా మార్చాలని రైతులు ఎన్నో ఏళ్ల నుంచి కోరుతున్నా.. వారి అభ్యర్థనలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. హెచ్‌ఎండీఏ ఇటీవల నిర్వహించిన వేలంలో కోకాపేటలో ఎకరా రూ.151కోట్లు పలికింది. పారిశ్రామిక ప్రాంతాల్లో ప్రస్తుత మార్కెట్ ధర ఎకరా కనీసం రూ.65 కోట్లు ఉంటుంది. ఈ లెక్కన ప్రభుత్వం 9,292 ఎకరాలను విక్రయించడం ద్వారా రూ.6 లక్షల కోట్లకు పైగా ఆదాయం వస్తుంది. ఈ మొత్తంతో ప్రభుత్వ రుణాలు మొత్తం చెల్లించవచ్చు. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు ధరలో 30 శాతం తక్కువకు ఈ పరిశ్రమల భూములను రియల్టర్లకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తోంది. ఈ విషయాన్ని గవర్నర్‌కు వివరించాం. దీనిపై ప్రభుత్వంతో చర్చిస్తానని ఆయన హామీ ఇచ్చారు. హిల్ట్ పాలసీతో పాటు జీహెచ్‌ఎంసీ పరిధి విస్తరణపై ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ 7న ఇందిరాపార్కు వద్ద మహాధర్నా నిర్వహిస్తాం" అని రాంచందర్‌రావు పేర్కొన్నారు. హిల్ట్ పాలసీతో ఖజానాకు ఎలా నష్టం జరుగుతుందో గవర్నర్‌కు వివరించినట్లు బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. జీవో 27ను తాము వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశారు. ఎమ్మెల్సీలు అంజిరెడ్డి, మల్క కొమురయ్య తదితరులు గవర్నర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.



గిరి ప్రదక్షిణలో పాల్గొన్న అయ్యప్ప దీక్షాధారులు

యాద'గిరి'పై మార్మోగిన అయ్యప్ప శరణు ఘోష

- 25 వేల మంది దీక్షాధారుల గిరి ప్రదక్షిణ

యాదగిరిగుట్ట, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): స్వామియే శరణం అయ్యప్ప, నమో నారసింహ అంటూ అయ్యప్ప దీక్షాధారులు యాదగిరిగుట్టలో గిరి ప్రదక్షిణ నిర్వహించారు. ఏకాదశి పర్వదినాన సోమవారం తెల్లవారుజామున 6 గంటలకు కొండకింద వైకుంఠ ద్వారం వద్ద ప్రారంభమైన గిరి ప్రదక్షిణలో సుమారు 25వేల మంది స్వాములు పాల్గొన్నారు. అయ్యప్ప విగ్రహం ఉన్న ప్రత్యేక పల్లకి మోస్తూ కొండచుట్టూ రెండున్నర కిలోమీటర్ల మేర భజనలు, కీర్తనలతో 45నిమిషాల్లో ప్రదక్షిణ పూర్తి చేశారు. కాలినడకన కొండెక్కిన అయ్యప్ప దీక్షాధారులు గర్భాలయంలోని స్వయంభువులను దర్శించుకున్నారు. గిరిప్రదక్షిణలో పాల్గొని నృసింహుడిని దర్శించుకున్న మాలధారులకు ఆలయంలో సుమారు రూ.3లక్షల విలువైన 230 కిలోల లడ్డు ప్రసాదం వితరణ చేశారు.

ఎన్నికల కోడ్ గురించి తెలుసుకోండి

- నిబంధనలు తెలియకుండా రేవంత్‌పై విమర్శలా?: మంత్రి తుమ్మల

ఖమ్మం డిసెంబర్ 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఎన్నికల కోడ్ గురించి తెలుసుకోకుండా కొందరు సీఎం రేవంత్‌రెడ్డిపై అనవసర విమర్శలు చేస్తున్నారని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. పంచాయతీ, మునిసిపల్ ఎన్నికలకు నిబంధనలు ఎలా ఉంటాయో విమర్శకులు తెలుసుకోవాలన్నారు. పంచాయతీ ఎన్నికల కోడ్ గ్రామాలకే పరిమితమన్నారు. రెండేళ్ల ప్రజా పాలన ప్రగతిని ప్రజలకు వివరించేందుకు పట్టణ బాటలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి పర్యటిస్తున్నారని తెలిపారు. ప్రపంచానికే మార్గదర్శకంగా కొత్తగూడెంలోని మన్మోహన్‌సింగ్ ఎర్త్ సైన్స్ వర్సిటీ రూపుదిద్దుకోబోతోందని తెలిపారు. ఈ వర్సిటీని సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం తుమ్మల మీడియాతో మాట్లాడారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా ఖనిజాల గని అని, విద్యార్థులు ఇక్కడి ఖనిజాలపై పరిశోధన చేసి దేశ అభివృద్ధికి ఉపయోగపడేలా ఈ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీని రూపుదిద్దబోతున్నామని వివరించారు. ఖమ్మంలో నిర్మిస్తున్న కేబుల్ బ్రిడ్జిని పర్యాటక వంతెనగా అభివృద్ధి చేయబోతున్నామని తెలిపారు.



నల్లగొండ జిల్లా చండూరులో ఊరి బయట ఏర్పాటుచేసిన దుకాణం

ఊరి బయటే మద్యం దుకాణాలు!

- మధ్యాహ్నం ఒంటి గంట నుంచి మాత్రమే విక్రయాలు
- ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి సూచనలు పాటించిన దుకాణాల నిర్వాహకులు

నల్లగొండ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నల్లగొండ జిల్లా మునుగోడు నియోజకవర్గంలో విచ్చలవిడి మద్యం వినియోగం తగ్గించడమే లక్ష్యంగా ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చేసిన ప్రయత్నానికి మద్యం దుకాణాల నిర్వాహకులు మద్దతు ప్రకటించారు. సోమవారం నుంచి ప్రారంభమైన కొత్త మద్యం దుకాణాలను ఎమ్మెల్యే సూచనల మేరకు నడిపేందుకు సిద్ధమయ్యారు. నియోజకవర్గంలోని రెండు మునిసిపాలిటీలు, ఏడు మండలాల్లో ఉన్న మొత్తం 29 మద్యం దుకాణాలన్నింటినీ గ్రామాల్లో కాకుండా ఊరి బయటే ఏర్పాటు చేశారు. నిబంధనల ప్రకారం దుకాణాలను ఉదయం 10 నుంచి రాత్రి 10 వరకు తెరిచే అవకాశం ఉన్నా.. ఎమ్మెల్యే సూచనల మేరకు మధ్యాహ్నం ఒంటిగంట తర్వాతే తెరుస్తామని, పర్మిట్‌రూములను సాయంత్రం ఆరు తర్వాతే నిర్వహిస్తామని ప్రకటించారు. సోమవారం అదే రీతిలో దుకాణాలను నిర్వహించారు. దుకాణాల వద్ద సిట్టింగులను ఏర్పాటు చేయడం లేదని, బెల్టు దుకాణాలకు కూడా మద్యం సరఫరా చేయబోమని తెలిపారు. తన నియోజకవర్గంలో అన్ని బెల్టు దుకాణాలను బంద్ చేయించిన ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి.. ఇటీవల జరిగిన మద్యం టెండర్లలోనూ కొత్త దుకాణదారులు విచ్చలవిడి మద్యం అమ్మకాలను ప్రోత్సహిస్తే కుదరదని హెచ్చరించారు. అంతేకాక పలు సూచనలు చేశారు.

టీటీడీ పరిధిలోని ఆలయాల్లోనూ రుచికరమైన, నాణ్యమైన అన్నప్రసాదాలు

- అన్యమత ఉద్యోగులు ఉంటే గుర్తించండి
- అధికారులకు టీటీడీ ఈవో ఆదేశం

తిరుమల, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): టీటీడీ పరిధిలోని ఇతర ఆలయాల్లో కూడా తిరుమల తరహాలోనే భక్తులకు రుచికరంగా, నాణ్యమైన అన్నప్రసాదాలను అందించాలని టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ అధికారులను ఆదేశించారు. టీటీడీలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో ఈవో సోమవారం సమీక్ష నిర్వహించారు. అన్నప్రసాదాల తయారీ సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని సూచించారు. టీటీడీలో ఇంకా ఎవరైనా అన్యమతస్తులు ఉంటే వారిని గుర్తించి తదుపరి చర్య కోసం నివేదిక తయారు చేయాలని, వారి ప్రవర్తన శైలి గురించి ఆరా తీయాలని ఆదేశించారు. అమరావతిలోని వెంకటపాలెంలో ఉన్న టీటీడీ శ్రీవారి ఆలయ విస్తరణ పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, 25 ఎకరాల్లో ఇదివరకే ఉన్న ఆలయంతో పాటు ఇకపై నిర్మించనున్న కల్యాణకట్ట, అర్చకులు, సిబ్బంది క్వార్టర్స్ ప్రాకారం, గోపురాలు, పుష్కరిణి, తదితర నిర్మాణాలపై కార్యాచరణ సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో మురళీకృష్ణ, ఎఫ్‌అండ్ సీఏవో బాలాజీ, సీఈ సత్యనారాయణ పాల్గొన్నారు.

వైకుంఠ ద్వార దర్శనం కోసం 24.05 లక్షల రిజిస్ట్రేషన్లు

- నేటి మధ్యాహ్నం ఈ-డిప్ ద్వారా పేర్ల ఎంపిక

తిరుమల, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): తొలి మూడు రోజుల వైకుంఠ ద్వార దర్శనాలకు ఈ-డిప్ ద్వారా 24.05 లక్షల మంది పేర్లు నమోదు చేసుకున్నారు. తిరుమల శ్రీవారి ఆలయంలో ఈ నెల 30 నుంచి జనవరి 8 వరకు పది రోజుల పాటు వైకుంఠద్వార దర్శనాలు జరుగనున్నాయి. గత ఏడాది జరిగిన తొక్కిసలాట నేపథ్యంలో కౌంటర్ల ద్వారా కాకుండా ఆన్‌లైన్‌లో ఈ-డిప్ విధానంలో తొలి మూడు రోజులు అంటే, వైకుంఠ ఏకాదశి, ద్వాదశి, జనవరి 1వ తేదీకి సంబంధించిన టోకెన్లు కేటాయించాలని టీటీడీ నిర్ణయించింది. సోమవారం సాయంత్రం 5 గంటలకు నమోదుకు గడువు ముగిసే సమయానికి 24,05,237 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. టీటీడీ అధికారిక వెబ్‌సైట్ ద్వారా 3,59,833 ట్రాన్సాక్షన్స్ ద్వారా 9,28,608 మంది పేర్లు నమోదు చేసుకున్నారు. మొబైల్ యాప్ ద్వారా 5,37,375 ట్రాన్సాక్షన్స్‌తో 13,29,112 మంది, ప్రభుత్వ వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా 58,495 ట్రాన్సాక్షన్స్ ద్వారా 1,45,517 లక్షల మంది నమోదు చేసుకున్నారు. ఈ మూడు రోజులకు 1.76 లక్షల మందికి మాత్రమే దర్శనం చేసుకునే అవకాశం ఉంటుంది. మంగళవారం డిప్‌లో ఎంపికైన భక్తులకు సెల్‌ఫోన్ నంబరు, ఈ-మెయిల్‌కు సమాచారం పంపనున్నారు.

5న శ్రీవాణి, రూ.300 టికెట్ల విడుదల

జనవరి 2 నుంచి 8 వరకు వైకుంఠద్వార దర్శనాలకు శ్రీవాణి ట్రస్టు టికెట్లను ఈ నెల 5న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లనూ విడుదల చేస్తారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

చలికాలంలో వేడి

దేశచరిత్రలోనే అతి తక్కువకాలం కొనసాగిన శీతాకాల సమావేశాలుగా రికార్డులకెక్కడం మాట అటుంచితే, కనీసం ఈ పదిహేనురోజుల పాటూ అవి సవ్యంగా సాగితే చాలునని సగటు పౌరుడి ఆశ. పార్లమెంట్ సమావేశాలకు ముందు ప్రధాని చేసిన వ్యాఖ్యలు సభ అలా జరిగేందుకు తోడ్పడేట్టు లేదు. బిహార్ ఎన్నికల్లో విపక్షాల ఘోరపరాజయాన్ని గుర్తుచేసి, ఆ అవమానభారంతో, అక్కసుతో సభను అడ్డుకోవద్దని విజ్ఞప్తిచేయడం ద్వారా కాంగ్రెస్‌ను రెచ్చగొట్టారాయన. మంచివాగ్ధాటి ఉన్న మోదీ నోటి నుంచి వెలువడిన టిప్స్ వంటి మాటలు అభిమానులు మెచ్చవచ్చును కానీ, విపక్షాలను మరింత రెచ్చగొట్టడమే అవుతుంది. బిహార్ ఎన్నికల్లో ఎన్డీయే విజయం అద్భుతమైనది. దానిని ప్రజలకు గుర్తుచేసుకోవచ్చు, మహిళా ఓటర్ల భాగస్వామ్యాన్ని ప్రశంసించి, అదే అసలుసిసలు ప్రజాస్వామ్య విజయంగా అభివర్ణించుకోవచ్చు. కానీ, సభలో విపక్షాలు ప్రస్తావించబోయే అంశాలనూ, వాటి వ్యవహారశైలిని డ్రామాగా తీసిపారేసినట్టు కనిపించడం, ప్రతిపక్షాలు ఎలా పని చేయాలో సలహా ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నానంటున్న ప్రధానికి ఏ మాత్రం తగదు. నిస్తేజంగా, దూరదూరంగా ఉన్న విపక్షాన్ని ఏకతాటిమీదకు రప్పించడానికి ఇటువంటి వ్యాఖ్యలు ఉపకరిస్తాయి.

సభలో మంచి చర్చ జరగాలన్న ప్రధాని అభీష్టం నెరవేరాలంటే అడుగులు వేయాల్సింది అధికారపక్షమే. ఎర్రకోట పేలుళ్ళ ఘటన దేశాన్ని భయోత్పాతంలో ముంచేసిన నేపథ్యంలో దేశభద్రత మీద చర్చ జరగాలని విపక్షం కోరడం సహజం. బిహార్ ఎన్నిక రెండోదశ ముందురోజున జరిగిన ఈ ఘటనలో భద్రతాపరమైన లోపాలు అనేకం కనిపిస్తున్నాయి. వేలాది కేజీల పేలుడు పదార్థాన్ని దట్టించిన వాహనం ఎంతోదూరం ప్రయాణించి, అన్ని గంటలు స్వేచ్ఛగా సంచరించడమే కాక, అప్పటికే ఉగ్రమూలాలను ఛేదించినా కూడా ఈ దారుణాన్ని నిఘావర్గాలు నిలువరించలేకపోవడం ఆశ్చర్యం. చర్చ పేరిట విపక్షాలు తనను ఇరకాటంలోకి నెట్టేందుకు ప్రయత్నిస్తాయన్న ఏకైక కారణంతో దేశప్రజలకు తెలియాల్సిన కీలకమైన అంశాలను ప్రభుత్వం గుప్పిట మూసివుంచడం సరికాదు. ప్రజలకు ఈ ఘటనపై వివరణ ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై మిగిలివుంది. ఇక, అత్యంత శక్తిమంతమైన సంస్కరణ అంటూ 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్‌కోడ్స్‌కు కుదించి, దేశం మీదకు వదిలిన నేపథ్యంలో వాటిపై లోతైన చర్చ, విస్తృతమైన అవగాహన అత్యవశ్యం. కార్మికులకు, సంఘాలకు ఈ కోడ్స్ మీద శతకోటి అనుమానాలూ భయాలూ ఉన్నమాట నిజం.

ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (సర్) మీద చర్చ జరిపేందుకు తాము సిద్ధంగా ఉన్నామని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ఓ మాటన్నందుకు సంతోషం. సోమవారం ఉభయ సభల్లోనూ 'సర్' మీద చర్చకు విపక్షాలు అదేపనిగా పట్టు బట్టడం, సభ అనేకసార్లు వాయిదాపడటం చూశాం. తక్షణమే చర్చ సాధ్యం కాదంటున్న ప్రభుత్వం, త్వరితంగా అందుకు సిద్ధపడితే ఈ రచ్చ తగ్గి సభ గాడినపడే అవకాశం ఉంటుంది. తొమ్మిది రాష్ట్రాల్లో, మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లో 'సర్' అనుకున్నంత సవ్యంగా సాగడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఉన్నతాధికారుల ఒత్తిళ్ళను తట్టుకోలేక, గడువును అందుకోలేక ఇప్పటివరకూ పదిహేనుమందికి పైగా బూత్ లెవల్ ఆఫీసర్స్ (బీఎల్‌ఓ)లు ఆత్మహత్య చేసుకున్నారు. విధినిర్వహణలో ఉన్న సిబ్బంది కన్నీటిపర్యంతం అవుతున్న వీడియోలు సామాజిక మాధ్యమాల్లో అనేకం దర్శనమిస్తున్నాయి. విపక్షాలు అదేపనిగా ఈ పరిస్థితిని ప్రశ్నిస్తున్న నేపథ్యంలో, ఎన్నికల సంఘం ఎట్టకేలకు 'సర్' వివిధ దశల గడువును మరోవారం హెచ్చించింది. ఈ అంశం మీద సభలో చర్చను చేపట్టకుండా ఎన్నికల సంఘం పక్షాన అధికారపక్షం వకాల్తాపుచ్చుకున్నదన్న భావన ప్రజలకు కలిగించడం అనవసరం. తాము ప్రస్తావించబోయే ప్రజాసమస్యలను తెరమరుగుచేసేందుకే ఏకంగా పదిగంటలపాటు 'వందేమాతరం' చర్చకు ప్రభుత్వం సిద్ధపడుతోందని కూడా విపక్షాలు అంటున్నాయి. మూడోమారు అధికారంలోకి వచ్చి కూడా తాము ఇప్పటివరకూ ఉద్ధరించిందేమిటో చెప్పుకోవడం కన్నా, అదేపనిగా గతాన్ని తవ్వి పోసి, వర్తమానంలో దేశం ఎదుర్కొంటున్న సమస్యలకూ, బాధలకూ కాంగ్రెస్, నెహ్రూలే కారణమంటూ ఎదురుదాడిచేయడం అధికార పక్షానికి అలవాటుగా మారింది. రాబోయే పదిహేను రోజుల్లో సభ బయటకంటే లోపలే కాలుష్యం అధికమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో, రాజ్యసభాధిపతిగా దర్శనమిస్తున్న కొత్త ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ఎంత ఉదాత్తంగా, ఉన్నతంగా వ్యవహరిస్తారో చూడాలని ప్రజల కోరిక.

చరిత్రను విస్మరించిన 'వందేమాతరం' వివాదం!

భారత స్వాతంత్ర్యోద్యమ చారిత్రక చిహ్నమైన బంకించంద్ర ఛటర్జీ 'వందేమాతరం' గీతం విరచితమై 150 సంవత్సరాలైన సందర్భంగా కొనసాగుతున్న వివాదం నిరర్థకమైనది. చరిత్రను విస్మరించి వ్యాఖ్యలు చేయడం సరికాదు. 1937లో జరిగిన ఎన్నికలలో భారత జాతీయ కాంగ్రెస్ విజయం సాధించి వివిధ రాష్ట్రాలలో ప్రభుత్వాల నేర్పాటు చేసింది. అయితే బెంగాల్‌లో ముస్లిం లీగ్ నాయకుడు ఎ.కె.ఫజ్లుల్ హక్ నేతృత్వంలో సంకీర్ణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ప్రభుత్వంలో చేర్చుకునేందుకు ఫజ్లుల్ హక్ సుముఖత చూపినా అందుకు కాంగ్రెస్ అంగీకరించలేదు. కాంగ్రేసేతర ప్రభుత్వం నెలకొనడంతో బెంగాల్‌లో హిందూ–ముస్లిం వర్గాల మధ్య రాజకీయంగానూ, సామాజికంగానూ విభేదాలు తీవ్రమయ్యాయి. జాతిని దైవిక మాతృమూర్తిగా వ్యక్తీకరించిన వందేమాతరం గీతంలోని హిందూ ప్రతీకవాదం, దుర్గామాత ప్రస్తుతికి వ్యతిరేకంగా ముస్లిం నాయకులు ఆందోళన చేస్తున్న రోజులవి. వందేమాతరంను జాతీయగీతంగా స్వీకరించకూడదనేది ముస్లింల డిమాండ్. దేశవ్యాప్తంగా మత సామరస్యాన్ని దెబ్బతీసే అవకాశమున్నందున ఈ వివాదంలో జోక్యం చేసుకోవడం జాతీయ కాంగ్రెస్ కేంద్ర నాయకత్వానికి అనివార్యమయింది.

కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) రవీంద్రనాథ్ ఠాగూర్‌ను సంప్రదించింది. వందేమాతరం గీతంలోని మొదటి రెండు చరణాలను జాతీయ గీతంగా ఆలపించవచ్చని ఆయన అన్నారు. అయితే కాంగ్రెస్ విశ్వసించే అహింసా సిద్ధాంతం, లౌకికవాద విలువలకు వందేమాతరం గీతం పూర్తిగా విరుద్ధమైనందున National Anthemగా స్వీకరించేందుకు స్వాతంత్ర్య పోరాటంలో ఆ గీతం ఒక విడదీయరాని భాగంగా ఉన్నందున వందేమాతరం National Anthem అయ్యేందుకు అర్హమైనది అని సదాచార హిందువులు, ముఖ్యంగా స్వదేశీ ఉద్యమంలో పాల్గొన్న వారు విశ్వసించారు. బంకించంద్ర గేయంపై తన అభిప్రాయం చెప్పాలని రవీంద్రనాథ్ ఠాగూర్‌ను సుభాష్ చంద్రబోస్ వ్యక్తిగతంగా కోరారు. 'సాహిత్య రచన అయిన 'ఆనందమఠ్' నవలలో వందే మాతరం ఉండడం సముచితమేనని, అయితే దానిని జాతీయ గీతంగా స్వీకరించడం సరికాదని రవీంద్రుడు స్పష్టం చేశారు. "వందేమాతరంలోని ప్రధానభాగం దుర్గామాతను ప్రస్తుతించే స్తోత్రాలు. ఈ విషయమై ఎటువంటి చర్చ అవసరం లేదు. బంకించంద్ర ఛటర్జీ ఆ గీతంలో మాతృభూమిని ఒక హిందూ దేవతగా ఆరాధించాడు. ఎంత దేశభక్తుడయిన ముస్లిం కూడా మాతృభూమిని ఒక హిందూదేవతగా ఆరాధిస్తాడని భావించలేము. ఈ ఏడాది దుర్గాపూజ సందర్భంగా పలు పత్రికల ప్రత్యేక సంచికలు వందేమాతరం చరణాలను ఉటంకించాయి. ఆ గీతాన్ని దుర్గామాత స్తుతిస్తోత్రంగా సదరు పత్రికల సంపాదకులు భావిస్తున్నారనేందుకు అదే నిదర్శనం. 'ఆనందమఠ్' సాహిత్య రచన గనుక అందులో వందేమాతరం గీతం ఉండడం సముచితమే అయినప్పటికీ సకల మతాల ప్రజలకు ప్రాతినిధ్యం వహించే పార్లమెంటు లాంటి ప్రదేశంలో దాన్ని ఆలాపించడం సరికాదు. అందుకు సర్వజనామోదం ఉండదు' అని సుభాష్ బోస్‌కు రాసిన లేఖలో ఠాగూర్ పేర్కొన్నారు. సుభాష్ బోస్ ఈ వివాదంపై బహిరంగంగా ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. వందే మాతరంపై ఆయన మౌనం ఆ గీతం మద్దతుదారులను నిరాశపరిచింది.



> 'వందేమాతరంలోని ప్రధానభాగం దుర్గామాతను ప్రస్తుతించే స్తోత్రాలు. బంకించంద్ర ఛటర్జీ ఆ గీతంలో మాతృభూమిని ఒక హిందూదేవతగా ఆరాధించాడు. ఎంత దేశభక్తుడయిన ముస్లిం కూడా మాతృభూమిని ఒక హిందూదేవతగా ఆరాధిస్తాడని భావించలేం. ఈ ఏడాది దుర్గాపూజ సందర్భంగా పలు పత్రికల ప్రత్యేక సంచికలు వందేమాతరం చరణాలను ఉటంకించాయి. దానిని జాతీయగీతంగా స్వీకరించడం, సకలమతాల ప్రజలకు ప్రాతినిధ్యం వహించే పార్లమెంటు లాంటి ప్రదేశంలో దాన్ని ఆలపించడం సరికాదు' అని సుభాష్ చంద్రబోస్‌కు రాసిన లేఖలో రవీంద్రనాథ్ ఠాగూర్ పేర్కొన్నారు. నేతాజీ సైతం అదేమాటకు కట్టుబడ్డారు.

అది యోగ్యమైనది కాదని కృష్ణ కృపలానీ (రచయిత, స్వాతంత్ర్య సమరయోధుడు, ఠాగూర్ స్వంత మనుమడు) అక్టోబర్ 1937 'విశ్వభారతి న్యూస్'లో రాసిన ఒక వ్యాసంలో వాదించారు. 1896లోనే వందేమాతరం గీతానికి స్వరరచన చేసిన రవీంద్రుడు తన 70వ జన్మదిన వేడుకల సందర్భంగా ఆ గీతంపై ఆలోచనాత్మక అభ్యంతరాలు వ్యక్తం చేశారు. 'వందేమాతరం' బదులుగా 'Vande Vratanam' (వందే వ్రతనం) ను పాటించాలని అంటే మాతృభూమికి, మానవాళికి సేవ చేసే 'ప్రతిజ్ఞ'కు నిబద్ధమవ్వాలని పిలుపునిచ్చారు. వందేమాతరంలో దుర్గామాతను స్తుతించే శ్లోకాలు ఉన్నందున ముస్లింలు ఆ గీతాన్ని జాతీయగీతంగా అంగీకరించేందుకు ఒప్పుకోలేదు. బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా జరుగుతున్న

కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ 1937లో కలకత్తాలో సమావేశమయింది. మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, ఆచార్య జేబీ కృపలానీ మొదలైన వారందరూ ఆ సమావేశంలో పాల్గొన్నారు. వందేమాతరంలోని మొదటి రెండు చరణాలను మాత్రమే కాంగ్రెస్ సమావేశాలలో ఆలాపించాలని ఆ సమావేశంలో నిర్ణయించారు. ఆ గీతంపై ముస్లిం దృక్కోణాన్ని కాంగ్రెస్ అంగీకరించిదని ఆ నిర్ణయం స్పష్టం చేసింది.

కాంగ్రెస్ నిర్ణయం బెంగాల్ హిందువులకు ఆశాభంగం కలిగించిందని శరత్ బోస్ (సుభాష్ అన్నయ్య) అన్నారు. మహారాష్ట్రలో సైతం కాంగ్రెస్ నిర్ణయానికి వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు జరిగాయి. National Anthemను ఎంపిక చేసేందుకు మౌలానా ఆజాద్, నెహ్రూ, సుభాష్, ఆచార్య నరేంద్రదేవ్‌లతో కాంగ్రెస్ ఒక కమిటీని ఏర్పాటు చేసింది. రవీంద్రనాథ్ ఠాగూర్ ఆ కమిటీకి సలహాదారుడు. సుభాష్ బోస్‌కు రవీంద్రుడు రాసిన ఒక వ్యక్తిగత లేఖలో వ్యక్తం చేసిన భావాలను ఉటంకిస్తూ జాతీయగీతంపై ఆయన ఇచ్చిన సలహాపై కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఒక ప్రకటనను విడుదల చేసింది. సీడబ్ల్యూసీ నిర్ణయాన్ని జాతీయవాద పత్రికలు విమర్శించాయి. అయితే సుభాస్ తన నిర్ణయాన్ని మార్చుకోలేదు. కాంగ్రెస్ నుంచి వెలివేత తరువాత కూడా సుభాష్ బోస్ తన తొలి వైఖరికే నిబద్ధమయ్యారు. కాంగ్రెస్ జాతీయ సంస్థ అని, అన్ని మతాల వారి మనోభావాలను అది గౌరవించవలసి ఉన్నదని ఆయన స్పష్టం చేశారు. 1938లో బంకించంద్ర ఛటర్జీ శత జయంత్యుత్సవాల సందర్భంగా వందేమాతరం వివాదాన్ని పునరుద్ధరించేందుకు ప్రయత్నాలు జరిగాయి. ఆ గీతం మొత్తాన్ని జాతీయ గీతంగా ప్రకటించాలనే డిమాండ్ గట్టిగా వచ్చింది. అయితే సుభాష్ బోస్ ఈ డిమాండ్‌కు మద్దతునివ్వలేదు. కాంగ్రెస్ నిర్ణయమే ప్రభావశీలంగా ఉండిపోయింది.

'జన గణ మన' గీతం భారతజాతిని సమ్మిళిత దృక్పథంతో దర్శించింది; ఆసేతు హిమాచలం వర్ధిల్లుతోన్న భౌగోళిక (ప్రాంతాలు, పర్వతాలు, నదులు) బహుళత్వాన్ని సూచిస్తుంది; బహుళ మత సంప్రదాయాలు, సంస్కృతుల మహత్వాన్ని వ్యక్తం చేస్తుంది. భిన్నత్వంలో ఏకత్వాన్ని దర్శిస్తూ జాతీయ సమైక్యతా భావాన్ని ప్రోత్సహించే సామర్థ్యమున్నందునే రవీంద్రుని విరచితమైన 'జన గణ మన'ను 'నేషనల్ ఏంథెమ్'గా కాంగ్రెస్ ఆమోదించింది. ఈ నిర్ణయాన్ని మౌలానా ఆజాద్, ఇతర జాతీయవాద ముస్లింలు బలపరిచారు. బంకించంద్ర ఛటర్జీ వందేమాతరం, రవీంద్రనాథ్ ఠాగూర్ 'జన గణ మన' గీతాల్లో దేన్ని నేషనల్ ఏంథెమ్‌గా స్వీకరించాలనే వివాదం హిందువులు, ముస్లింలకూ సంతృప్తికరంగా, సుహృద్భావంతో పరిష్కృతమయింది. దుర్గామాత ప్రస్తావన లేని, వందేమాతరంలోని మొదటి రెండు చరణాలను సమస్త భారతదేశానికి సమ్మతమైన 'నేషనల్ సాంగ్' రూపంలో అంగీకరించారు. కవిగా, దార్శనికుడుగా రవీంద్రనాథ్ ఠాగూర్‌కు ఉన్న మహోన్నత గౌరవ ప్రతిష్ఠలు, ఆయన తార్కిక, నిష్పాక్షిక వైఖరి అందుకు విశేషంగా దోహదం చేశాయి. సుభాష్ బోస్ 'ఆజాద్ హింద్ ఫౌజ్' (భారత జాతీయ సైన్యం) ఈ రెండింటినీ అదే హోదాలో స్వీకరించింది.

1947లో స్వాతంత్ర్యం సిద్ధించిన తరువాత 'National Anthem' అవసరాన్ని గుర్తించారు. ఐక్యరాజ్యసమితిలో 'జన గణ మన'ను భారతదేశ జాతీయగీతంగా ఆలాపించారు. 1948 ఆగస్టు 25న పార్లమెంటులో నెహ్రూ ఇలా అన్నారు: 'వందేమాతరం, జన గణ మన గీతాలలో దేనిని జాతీయగీతంగా స్వీకరించాలనే విషయమై అనవసర వాద ప్రతివాదాలు జరుగుతుండడం దురదృష్టకర విషయం. వందేమాతరం నిస్సందేహంగా భారతదేశ ఉత్కృష్ట చారిత్రక సంప్రదాయ గీతం. స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో వందేమాతర గీతానికి ఉన్న స్థానం దేనికీ లేదు. దాని చారిత్రక ప్రాధాన్యాన్ని ఎవరూ త్రోసిపుచ్చలేరు. వలసపాలనకు వ్యతిరేకంగా భారత ప్రజలను ఏకం చేయడంలో అది నిర్వర్తించిన పాత్ర అనుపమేయమైనది. అయితే స్వాతంత్ర్య పోరాట పరాకాష్ఠ అయిన స్వతంత్ర భారతదేశ ఆవిర్భావాన్ని, జాతి నిర్మాణంలో తదుపరి దశను ఆ గీతం సూచించదు'. రాజ్యాంగసభలో 'జన గణ మన'ను 'National Anthem'గా నెహ్రూ ప్రకటించడాన్ని అందరూ హర్షామోదాలతో స్వాగతించారు. జన గణ మన గీత చరణాలలోని సమున్నత భావాలను, ఆ గీత స్వర రచనను ప్రశంసిస్తూ, దాన్ని నేషనల్ యాంథెమ్‌గా స్వీకరించినందుకు అభినందిస్తూ భారత ప్రభుత్వానికి సందేశాలు అందాయి. తాము విన్న చాలా జాతీయ గీతాల కంటే జన గణ మన సాహిత్యం, సంగీతం ఉత్కృష్టంగా ఉన్నాయని పలువురు పేర్కొన్నారు. రాజ్యాంగ సభ 1950 జనవరి 24న నేషనల్ ఏంథెమ్‌గా జన గణ మనను అధికారికంగా స్వీకరించింది. ఆ సందర్భంగా రాజ్యాంగసభ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ ఇలా వ్యాఖ్యానించారు: 'జన గణ మన'గా సుప్రసిద్ధమైన సాహిత్య చరణాలు, స్వరరచన భారతదేశ 'National Anthem'. భవిష్యత్తులో సందర్భం వచ్చినప్పుడు దానిలో మార్పులు చేసే అధికారం భారత ప్రభుత్వానికి ఉన్నది. భారత స్వాతంత్ర్య సమరంలో చరిత్రాత్మక పాత్ర వహించిన బంకించంద్ర ఛటర్జీ వందేమాతరం గీతానికి కూడా జన గణ మనతో సమానహోదా ఉంటుంది'. రాజేన్ బాబు ఇంకా ఇలా విశదీకరించారు: 'జన గణ మనకు National Anthemగా రాజ్యాంగ అనుమతి లేదు. ఆ గీతాన్ని అలా గౌరవించడం భారత ప్రజల సమ్మతి ఉన్న ఒక సంప్రదాయం'. ఆ పరిపాటిని భారతదేశం పరిపూర్ణంగా అనుసరిస్తోంది.

▪ సుబ్రత ముఖర్జీ
డిల్లీ విశ్వవిద్యాలయ విశ్రాంత ఆచార్యులు
(ది స్టేట్స్‌మన్)

అతిశయోక్తులు, అవాస్తవాలు

విశాఖపట్టణంలో 15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో గూగుల్ నిర్మిస్తున్న ఒక గిగావాట్ హైపర్ స్కేల్ ఏఐ డేటా సెంటర్, మౌలిక సదుపాయాల ప్రాజెక్టు ఏర్పాటు గురించి నవంబర్ 19న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన గుత్తా రోహిత్ వ్యాసంలో అనేక అతిశయోక్తులు, అవాస్తవాలు ఉన్నాయి. మొదటగా గూగుల్ డేటా సెంటర్ ప్రాజెక్టులో అదానీ, ఎయిర్‌టెల్ కేవలం సహాయకులే (ఎనేబ్లర్లు) కానీ భాగస్వాములు కాదు. డేటా సెంటర్ స్థాపనకు అవసరమైన నిర్మాణాలు, గ్రీన్ ఎనర్జీ, మౌలిక వసతుల కల్పన అదానీ గ్రూప్ ఏర్పాటు చేస్తే, సముద్ర గర్భ కేబుల్స్, అంతర్జాతీయ డేటా ట్రాన్సిట్, అంతర్జాల సదుపాయాలను ఎయిర్‌టెల్ సమకూరుస్తుంది. నిజానికి యూఎస్‌ఏలోని 50 రాష్ట్రాలలో 5,426 డేటా సెంటర్లు, చైనా, యూరోప్, సింగపూర్ తదితర దేశాలలో వందలాది డేటా సెంటర్లు ఉన్నాయి. భారతదేశంలో ప్రభుత్వ డిజిటల్ ఇండియా కార్యక్రమం, డేటా లోకలైజేషన్ విధానాలు, ఇంటర్నెట్ విస్తరణ, స్మార్ట్‌ఫోన్లు, ఈ–కామర్స్, డిజిటల్ సేవల విస్తరణ వల్ల డేటా ఉత్పత్తి పరిమాణం విపరీతంగా పెరిగి డేటా సెంటర్ పరిశ్రమ వేగంగా అభివృద్ధి చెందుతోంది. ప్రపంచ డేటాలో భారత్ 20శాతం ఉత్పత్తి చేస్తున్నా, ప్రపంచ డేటా సెంటర్ సామర్థ్యంలో దాని వాటా కేవలం మూడు శాతం మాత్రమే. మన డేటా వేరే దేశాల్లో ఉండకూడదని ఇటీవల ప్రభుత్వం విధించిన నిబంధన వల్ల మన దేశంలో డేటా సెంటర్ల ఏర్పాటు అనివార్యం అయ్యింది.

గూగుల్ అమెరికా వెలుపల ఇంత భారీ స్థాయి పెట్టుబడులతో భారతదేశంలో తొలి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ హబ్ విశాఖలో ఏర్పాటు చేయడం సామాన్య విషయం కాదు. కేవలం డేటా సెంటర్ ఏర్పాటే కాకుండా సబ్ సీ కేబుల్, కేబుల్ లాండింగ్ స్టేషన్ ఏర్పాట్లపై దృష్టి పెట్టిన గూగుల్, కొత్త గ్లోబల్ సబ్ సీ కేబుల్ వ్యవస్థను విశాఖ డేటా సెంటర్‌తో అనుసంధానించడం ద్వారా విశాఖను గ్లోబల్ కనెక్టివిటీకి గేట్‌వేగా మార్చబోతోంది. ఇందువల్ల ఈ డేటా సెంటర్‌లో ప్రాసెస్ అయిన డేటా మొత్తం సబ్ సీ కేబుల్ ద్వారా నేరుగా సింగపూర్, మలేసియా, ఆస్ట్రేలియాతో సహా మరో 12 దేశాలకు లింక్ అవుతుంది.



> గూగుల్ డేటా సెంటర్‌కు అవసరమయ్యే నీరు, విద్యుత్ సరఫరా చేయడం వల్ల విశాఖ నగరంపై ప్రభావం పడుతుందనేది పూర్తిగా అపోహ. గూగుల్ రాకతో కృత్రిమ మేధ కేంద్రంగా, ఆంధ్రప్రదేశ్‌లో విదేశీ పెట్టుబడులకు ముఖద్వారంగా విశాఖ నిస్సందేహంగా అభివృద్ధి చెందుతుంది.

డేటా సెంటర్లలో విద్యుత్, నీటి వినియోగం అధికంగా ఉంటుందనేది నిజం. అయితే గూగుల్ డేటా సెంటర్‌కు అవసరమయ్యే నీరు, విద్యుత్ సరఫరా చేయడం వల్ల విశాఖ నగరంపై ప్రభావం పడుతుందనేది పూర్తిగా అపోహ. డేటా సెంటర్ కోసం విశాఖపట్టణం మొత్తానికి రోజుకు అవసరమైన నీటిలో 11శాతం కావాలన్న వ్యాసకర్త అభిప్రాయం సత్యదూరం. పోలవరం నుంచి ప్రధాన ఎడమ కాలువ ద్వారా 2027 డిసెంబర్ నాటికి 24 టీఎంసీల నీరు విశాఖకు ఇవ్వాలని ప్రభుత్వ సంకల్పం. ఈ దిశలో పోలవరం పనులు వేగంగా జరుగుతుంటే, ఎడమ ప్రధాన కాలువ పనులు రెండు నెలల్లో పూర్తవుతాయి. కాబట్టి డేటా సెంటర్ నిర్మాణం పూర్తయ్యేనాటికి (2028) పోలవరం నీళ్ల అందుబాటులోకి వస్తాయి. ప్రస్తుతం వినియోగిస్తున్న సంప్రదాయ విధానాల్లో గూగుల్ డేటా సెంటర్ కోసం అత్యధికంగా 0.5 టీఎంసీల నీరు అవసరం అవుతుందని అంచనా. కానీ గూగుల్ ప్రస్తుతం అనుసరిస్తున్న నీటి స్ప్రేయింగ్ విధానాలు కాకుండా అత్యంత సమర్థమైన, ఆధునిక లిక్విడ్ కూలింగ్ సిస్టమ్ వినియోగించడం వల్ల నీటి వినియోగం తగ్గడంతో పాటు విద్యుత్ వినియోగం కూడా 20శాతం తగ్గుతుంది. పోలవరం నుంచి మనం ఇవ్వబోయేది, గూగుల్ వాడుకునేది అర టీఎంసీ కన్నా తక్కువ నీరు మాత్రమే. ఎక్కువ నీరు అవసరమైతే డీశాలినేషన్ విధానం ద్వారా సముద్రపు నీటిని శుద్ధి చేసి వాడుకుంటారని ముఖ్యమంత్రి చంద్రబాబు చెబుతున్నారు. కాబట్టి ఏ విధంగా చూసినా నీటి లభ్యత పెద్ద సమస్య కానేకాదు.

రాష్ట్రంలో 2025 ఏప్రిల్ నాటికి స్థాపిత విద్యుత్ సామర్థ్యం 18,552.9 మె.వా (పునరుత్పాదక విద్యుత్ 9,419 మె.వా, థర్మల్ విద్యుత్ 7,655.50 మె.వా, జల విద్యుత్ 1,672.60 మె.వా) కాగా 2030 నాటికి 31,000 మె.వాట్లకు చేరుతాం. కాబట్టి డేటా సెంటర్‌కు అవసరమైన విద్యుత్ సరఫరా చేయడం సమస్య కాదు. అయితే గూగుల్ "మా డేటా సెంటర్ నిర్వహణకు కావలసిన విద్యుత్ అదానీ నిర్మించబోతున్న సొంత సౌరశక్తి ప్లాంట్ల ద్వారా తయారు చేసి గ్రిడ్‌కు అనుసంధానించుకుని వాడుకుంటాం, మీ విద్యుత్ అవసరం లేదు" అంటోంది. కాబట్టి రాష్ట్రానికి విద్యుత్ భారం దాదాపు ఉండదు.

ఐటీ కంపెనీల కంటే తక్కువ మంది ఉద్యోగులను డేటా సెంటర్లు నియమించుకున్నప్పటికీ సాధారణంగా అధిక వేతనాలు ఇస్తాయి. వర్జీనియా రాష్ట్ర 'జాయింట్ లెజిస్లేటివ్ ఆడిట్, రివ్యూ కమిషన్ రిపోర్ట్' డేటా సెంటర్ పరిశ్రమ వర్జీనియా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వార్షికంగా సుమారు 74,000 ఉద్యోగాలు, 5.5 బిలియన్ డాలర్ల శ్రామిక ఆదాయం, 9.1 బిలియన్ డాలర్ల స్థూల దేశీయ ఉత్పత్తి(జీడీపీ)ని అందిస్తున్నదని తెలియజేసింది. ఈ ఆర్థిక లాభాలలో చాలా భాగం డేటా సెంటర్ల నిరంతర కార్యకలాపాల కంటే ముందే నిర్మాణ దశ నుంచే వస్తాయి. కాబట్టి డేటా సెంటర్ వల్ల కేవలం వందల ఉద్యోగాలు వస్తాయనే వ్యాసకర్త భావన అసంబద్ధం. విశాఖ గూగుల్ హబ్ అత్యాధునిక ఏఐ మౌలిక సదుపాయాలు, డేటా సెంటర్ సామర్థ్యం, భారీ స్థాయి ఇంధన వనరులు, ఫైబర్ ఆప్టిక్ నెట్‌వర్క్‌లను ఒకేచోట సమన్వయపరచి విశాఖను కృత్రిమ మేధ పరివర్తన కేంద్రంగా నిలబెడుతుంది. డేటా సెంటర్లు సాధారణ కంప్యూటింగ్ నుంచి ఏఐ, మెషీన్ లెర్నింగ్ (ఎంఎల్) వైపు మారడం వల్ల ఏఐ పరిశోధనలు, నిర్వహణ, అనుభవం ఉన్న టెక్ నిపుణుల అవసరం చాలా ఎక్కువ. ఏఐ ఇంజినీరింగ్, సైబర్ భద్రత, క్లౌడ్ ఆర్కిటెక్చర్, డేటా మానిటరింగ్, జీపీయూ క్లస్టర్ నిర్వహణ, సబ్ సీ కేబుల్ లాండింగ్ స్టేషన్ కూడా ఉండటం వల్ల కేబుల్ నిర్వహణ కోసం కూడా ఉద్యోగుల అవసరం ఉంటుంది. అలాగే ఏఐ ఆధారిత స్టార్టప్స్, పరిశ్రమలకు విశాఖ కేంద్రంగా మారుతుంది.

పీఐబీ నివేదిక ప్రకారం గూగుల్ డేటా సెంటర్ వల్ల రాష్ట్రానికి అన్ని పన్నులు, ఇతరత్రా కలుపుకుని ఏటా రూ.10,588 కోట్ల ఆదాయం వస్తుంది. అంటే రాష్ట్ర ప్రస్తుత ఆదాయాన్ని అనుసరించి రాష్ట్రానికి గూగుల్ 'ఒక నెల' ఆదాయాన్ని ఇవ్వబోతోంది. గూగుల్ రాకతో కృత్రిమ మేధ కేంద్రంగా, ఆంధ్రప్రదేశ్‌లో విదేశీ పెట్టుబడులకు ముఖద్వారంగా విశాఖ నిస్సందేహంగా అభివృద్ధి చెందుతుంది.

• లింగమనేని శివరామప్రసాద్
సామాజిక విశ్లేషకులు

స్వరాష్ట్రం ముఖ్యం కాదు..!

'రాష్ట్రం తెలిసిన గవర్నర్లు రావాలి' శీర్షికన ఆంధ్రజ్యోతిలో నవంబర్ 25న పాపని నాగరాజు ఒక వ్యాసం రాశారు. రాష్ట్రం ఏర్పడి పదేళ్లు దాటినా తెలంగాణకు చెందినవారు ఒక్కరు కూడా ఈ రాష్ట్రానికి గవర్నర్ కాలేదని విచారం వ్యక్తం చేశారు. భారత రాజ్యాంగంలో కూడా స్వరాష్ట్రానికి చెందిన వారిని గవర్నర్‌గా నియమించాలని ఎక్కడా ప్రస్తావించలేదు. సొంత రాష్ట్రం వారిని కాకుండా ఇతర రాష్ట్రాల వారిని నియమించాలని సర్కారియా కమిషన్ పేర్కొంది. సొంత రాష్ట్రానికి చెందినవారికి స్థానిక రాజకీయ సంబంధాలు లేదా పక్షపాతాలు ఉండవచ్చు. చట్టసభల నిర్ణయాలకు గవర్నర్లు అడ్డంకులు సృష్టించడానికి నాగరాజు చెప్పినట్లు ఇక్కడి సామాజిక, సాంస్కృతిక, చారిత్రక అంశాలు తెలియకపోవడం కాదు. రాజకీయ అంశాలే కారణం. తెలంగాణకు చెందినవారిని గవర్నర్‌గా నియమించినప్పుడే కేంద్ర–రాష్ట్ర సంబంధాల్లో అనవసరమైన ఘర్షణ తగ్గుతుందని నాగరాజు రాశారు. ప్రస్తుతం బీజేపీ కేంద్రంలో అధికారంలో ఉంది. ఆ పార్టీ నియమించిన స్వరాష్ట్రానికి చెందిన వ్యక్తి వారి కనుసన్నల్లోనే పనిచేస్తారు కానీ, కాంగ్రెస్ ప్రభుత్వానికి అనుకూలంగా ఎందుకు పనిచేస్తారు? గవర్నర్‌ను నియమించే ముందు రాష్ట్ర ప్రభుత్వాన్ని సంప్రదించాలి. గవర్నర్లు రాజ్యాంగబద్ధంగా నడుచుకున్నప్పుడే సంక్షోభాలు ఉండవు.

– వంగరి రవిరాజు

గమ్యం చేరని స్వప్నాల గమనం

"జీవితాన్ని సమర్థించే కలలు కనకుండా మానవజాతి జీవించజాలదు".
– జోసెఫ్ కాంబెల్, "Mythes to live by" గ్రంథ రచయిత

గత 25 సంవత్సరాల కాలక్రమంలో ఈ దేశంలో వచ్చిన రాజకీయ, ఆర్థిక, సామాజిక పరిణామాలను పరిశీలిస్తే, వివిధ రంగాల్లో జరిగిన అభివృద్ధిని నిరాకరించలేం. అయితే ఈ అభివృద్ధి, దేశంలోని పేదరికాన్ని నిర్మూలించి, శ్రమదోపిడీని అరికట్టి, కనీసం ఒక సంక్షేమ రాజ్యాన్ని కూడా స్థాపించలేదు. మరోవైపు పోరాడుతున్న సామాజిక పురోగామి శక్తులను అణచివేస్తున్న మతతత్వ ఫాసిస్టు పాలకుల మూలంగా, తిరిగి అవే ప్రశ్నలు మన ఎదుట నిలుస్తున్నాయి. ఈ దేశం ఎక్కడికెడుతున్నది? భారతీయులు కలలుగన్న సమసమాజ స్వేచ్ఛాయుత వ్యవస్థ ఏర్పడిందా? సామాజిక భద్రత, విద్య–వైద్యం అందరికీ అందుబాటులోకి వచ్చే ప్రజాతంత్ర వ్యవస్థ ఇంకా ఎంత దూరంలో ఉన్నది?

ప్రస్తుతం ఈ దేశంలో కొనసాగుతున్న Despotic rule ఏకపక్ష నియంతృత్వ పాలనకు ప్రజలు కూడా కారణం! కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీల వైఫల్యం వల్ల ఓటర్లు బీజేపీ వైపు మొగ్గుతున్నారు. దేశంలోని మెజారిటీ హిందువులు ఐక్యత పేరిట 'హిందుత్వ'ను ఆమోదిస్తున్నారు. సమాంతరంగా కార్పొరేట్ ధనిక వర్గాలకు అనుకూలంగా ఉన్న చట్టాల మూలంగా, పేదరికం– నిరుద్యోగం విస్తరిస్తున్నాయి. 2014 తర్వాత క్రమంగా మూఢనమ్మకాల మతవాద దృక్పథం వ్యాపించి, ఒక కొత్త విశృంఖల మూక, పాలక వర్గానికి వత్తాసుగా ఉంది.

ఈ దేశ సామాజిక వ్యవస్థలో అస్తిత్వ ఉద్యమాల తీరు తెన్నులు పరిశీలిస్తే, కులరహిత ఆదర్శ సమాజానికి చాలా దూరంలో ఉన్నాం. ఏ కులానికి ఆ కులం ఒక అభద్రతా భావంతో తమ ప్రత్యేక ఉనికిని చాటుకుంటూ రాజ్యాధికారంలో తమ భాగాన్ని కోరుకుంటున్నది. ఆధునికంగా సాంకేతిక పారిశ్రామిక అభివృద్ధి ఫలితంగా కులవృత్తులు చెల్లాచెదురైపోయాయి. విద్యావకాశాలు చేజిక్కించుకున్న కులాల్లోని విద్యావంతులు (రిజర్వేషన్ల మూలాన కొందరు) ఆయా కులాల ముద్రలతో మేధావుల, ప్రొఫెసర్ల, ఉపాధ్యాయ, విద్యార్థి తదితర సంఘాలతో సంఘటితమవుతున్నారు. ఈ పరిణామంతో ఆరెస్సెస్ ఆశిస్తున్న 'హిందుత్వ సంఘటిత శక్తి'కి దగ్గరవుతున్నారు.

బీసీలు, దళిత, షెడ్యూల్ తదితర కులాల సంఘాలన్నీ జనాభా దామాషా ప్రకారం ఉద్యోగాలలో, మంత్రివర్గంలో రిజర్వేషన్లు శాశ్వతంగా ఉండాలని కోరుకుంటున్నాయి. దేశంలోని పెట్టుబడిదారీ దళారీ ఆర్థిక వ్యవస్థకు లోబడి ఈ సంఘాలన్నీ తమ ఉద్యమాలను నిర్వహిస్తున్నాయి. ఆర్థికంగా సామాజికంగా తమ కులానికి లేదా మతస్థులకు మేలు జరిగితే చాలుననే మనస్తత్వం (మరోవైపు తరతరాలుగా అగ్ర కులాల ఆధిపత్య చరిత్ర ఉండనే ఉంది)– మౌలికంగా ఈ దేశంలోని రైతాంగాన్ని, శ్రామికులను, చేతివృత్తికారులను, కార్పొరేట్ పెట్టుబడి దళారీ విధానం ఎంతో సజావుగా దోచుకుంటూ సంపన్నులను పెంచి పోషిస్తున్న యదార్థాన్ని విస్మరిస్తున్నారు. తమ మతం–కులం–శాఖ చెక్కుచెదరకుండా ఇలానే నిచ్చెనమెట్ల సామాజిక వ్యవస్థగానే కొనసాగాలనే తిరోగమన సంస్కరణ వాదంతో తృప్తిపడుతున్నారు. సకలజన ఉద్యమాలకు దూరంగా ఉంటున్నారు.

> స్వాతంత్ర్యం పొందిన తర్వాత కొన్ని తరాలు వెనక్కి పోగా, చైనాను మించిపోయిన జనాభాతో ఈ దేశం తను కలలు కంటున్న సమసమాజ, స్వేచ్ఛాయుత గమ్యం వైపు చూస్తున్నది. ఒక తత్వవేత్త చెప్పిన నిజం– "గుడ్డును వెలుపలి నుంచి పగులగొడితే జీవితం అంతం, కానీ లోపలి నుంచి పగిలితే జీవితం ప్రారంభం."



రాజకీయంగా ఇప్పుడు రావలసిన ప్రత్యామ్నాయ ప్రజాశక్తిగా కమ్యూనిస్టు పార్టీలు ఎర్రజెండా–నీలిజెండా మైత్రి కోసం ప్రయత్నిస్తున్నాయి. భవిష్యత్తులో ఐక్య సంఘటనగా ఇదొక ప్రయోగం. అయితే అంబేడ్కర్, ఫూలే అనుయాయులు మార్క్సిస్టు ప్రాపంచిక దృక్పథానికి, సిద్ధాంతాలకు అనుకూలంగా సమన్వయించుకోగలిగితేనే లాల్–నీల్ మైత్రి సుస్థిరం అయ్యే అవకాశాలున్నాయి.

1947లో దేశ విభజన జరిగి, స్వాతంత్ర్యం పొందిన తర్వాత కొన్ని తరాలు వెనక్కి పోగా, చైనాను మించిపోయిన జనాభాతో ఈ దేశం తను కలలు కంటున్న సమసమాజ, స్వేచ్ఛాయుత గమ్యం వైపు చూస్తున్నది. ఒక తత్వవేత్త చెప్పిన నిజం– "గుడ్డును వెలుపలి నుంచి పగులగొడితే జీవితం అంతం, కానీ లోపలి నుంచి పగిలితే జీవితం ప్రారంభం."

వేల సంవత్సరాల పురాతన సంస్కృతి–చరిత్ర ఉన్న భారత్‌లో వివిధ భాషలు, కులాలు, మతాలు అనేక సమస్యల మధ్య సహజీవనం సాగిస్తున్నాయి. మధ్య యుగాల నాటి అంధ విశ్వాసాలు, రాచరికాలను ప్రశ్నిస్తూ ఆయా దశల్లో మేల్కొన్న వారు– 'ఎక్కడికీ గమనం?' అని ప్రశ్నించుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా పారిశ్రామికీకరణ విస్తరించిన దశలో ఆయా దేశకాల పరిస్థితుల్లో ప్రజా విప్లవాలు వచ్చాయి. ఉదాహరణకు– ఫ్రెంచి, రష్యన్, బోల్షివిక్, జనచైనా విప్లవాలు– ఇప్పుడు సాంకేతికంగా డిజిటల్ యుగంతో పాటు కృత్రిమ మేధ (ఏఐ) కార్యకలాపాల తీరుతెన్నులను మార్చేస్తున్నాయి. అయితే ఆయా ఆలోచనలు– పాత సంస్కారాల ఒత్తిడిలో ఉన్న మనుషుల స్వార్థచింతన, అక్రమార్జన హింసా ప్రవృత్తి మారగలదా? ఇది నిరంతరంగా ఎదురుతిరిగే ప్రశ్న!

చారిత్రకంగా– రాజకీయంగా ఈ దేశంలో వచ్చిన పరిణామాలను పరిశీలిస్తే ఆనాటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ఈ దేశ ప్రజలు చేరవలసిన గమ్యం వైపు దిశానిర్దేశం చేసింది. తర్వాత నక్సల్బరీ–శ్రీకాకుళ పోరాటాలు గత 55 సంవత్సరాల కాలంలో రైతాంగ పోరాట స్ఫూర్తితో ప్రారంభమై, క్రమంగా అడవులకే పరిమితమై, కేవలం తుపాకీని మాత్రమే నమ్ముకుని దిశను కోల్పోయింది. ఈ చారిత్రక గుణపాఠాలు ఈ దేశంలో ఏనాటికైనా రానున్న ప్రజా విప్లవానికి సంకేతాలు. ఇక్కడి ప్రజలు, మారుతున్న తమ దేశకాల పరిస్థితుల కనుగుణంగా ప్రజా పోరాటాలతో మమేకమైన విప్లవ శక్తులతో, తమదైన రీతిలో ప్రజా విప్లవాన్ని సాధించగలరనేది ఒక చారిత్రక ఆశావాదం. చివరిగా జార్జి లూకాచే (హంగేరియన్ మార్క్సిస్టు తత్వవేత్త, విమర్శకుడు) ఈ ప్రపంచంలోని మనిషి పట్ల విశ్వాసాన్ని వ్యక్తం చేసిన వ్యాఖ్యలతో ముగిస్తున్నాను.

"మనిషి తన ప్రపంచాన్ని గుర్తించక తప్పదు. ఈ మానవాళిలో ఒకడిగా పాక్షికంగా తాను కూడా ఈ ప్రపంచాన్ని నిర్మించాడు. అందులో భాగంగానే తనదిగా దానిని అనుభవిస్తాడు. ఈ ప్రపంచమనే క్రమాన్ని కొనసాగించడానికి మనిషి తనవంతు ప్రత్యేకతను సంతరింపజేస్తాడు. నష్టం కానటువంటి సృజనాత్మక కళను శాశ్వతం చేస్తాడు. దాని అమేయమైన ప్రాభవం ఒక కళాఖండంగా (గొప్ప రచనగా) పరిఢవిల్లుతూ, మనిషి ప్రపంచ స్వరూపాన్ని తీర్చిదిద్దుతూ ఉంటుంది."

○ నిఖిలేశ్వర్

యాసిడ్ కలకలం

- బీఎస్సీ నర్సింగ్ విద్యార్థినిపై యాసిడ్‌తో దాడి
- కడిపికొండ గ్రామంలో ఘటన
- ఎంజీఎంకు తరలించిన పోలీసులు
- స్వల్పగాయాలతో యువతి క్షేమం




మడికొండ / జఫర్‌గఢ్, డిసెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలో యాసిడ్ కలకలం రేగింది. కాజీపేట మండలం కడిపికొండలో నర్సింగ్ విద్యార్థినిపై గుర్తు తెలియని దుండగులు యాసిడ్ దాడికి పాల్పడిన ఘటన దావానంలా వ్యాపించింది. పోలీసులు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. జనగామ జిల్లా జఫర్‌గఢ్ మండలం వడ్డెగూడెం గ్రామానికి చెందిన తాటికాయల కుమారస్వామి కుమార్తె తాటికాయల సునంద హనుమకొండలో బీఎస్సీ నర్సింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. సోమవారం కళాశాలలో హాల్ టికెట్ తీసుకొని తన అమ్మమ్మ గ్రామమైన ఐనవోలు మండలం వెంకటాపురం గ్రామానికి వెళ్లడానికి సాయంత్రం 6.15కు స్కూటీపై బయలుదేరింది. కడిపికొండ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్దకు రాగానే సుమారు 40 ఏళ్ల వయస్సు కలిగిన గుర్తు తెలియని వ్యక్తి బండిపై వచ్చి

(మిగతా 6లో..)

కార్మికుల హక్కులను హరిస్తున్న
కేంద్ర ప్రభుత్వం
సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ 6

ఏకగ్రీవానికే జై





హనుమకొండ, డిసెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాలోని గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఏకగ్రీవానికి ఓటర్లు మొగ్గు చూపుతున్నారు. ఇందుకు పలు కారణాలు దోహదం చేస్తున్నాయి. మొదటి విడత ఎన్నికల్లో నామినేషన్ల దాఖలు పరిశీలన ప్రక్రియ, చెల్లించిన నామినేషన్ల జాబితా ప్రకటన పూర్తయిన నేపథ్యంలో ఏకగ్రీవాలపై స్పష్టత వచ్చింది.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొత్తం 19 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి. వీటిలో హనుమకొండ జిల్లాలో 2, వరంగల్ జిల్లాలో 5, జనగామ జిల్లాలో 6, మహబూబాబాద్ జిల్లాలో 3, ములుగు జిల్లాలో 2, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 1 జీపీ ఏకగ్రీవం అయ్యాయి.

- ఏకగ్రీవాల వెనక కారణాలు అనేకం
- రెండు జీపీల్లో రూ.8లక్షల చొప్పున నిధుల ఆశ
- మరో రెండింటిలో మంత్రి, మాజీ ఎమ్మెల్యే చొరవ
- మిగతా వాటిల్లో అభివృద్ధి హామీలు, ఐక్యత, ఏకైక అభ్యర్థిత్వం
- ఎస్టీ రిజర్వుడ్ పంచాయతీల్లోనే ఎక్కువ ఏకగ్రీవాలు

ఉమ్మడి జిల్లాలో మొదటి విడతలో 19 పంచాయతీలు

హామీలు, ఐక్యత, నిధులు

ఈ గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం కావడం వెనుక అనేక కారణాలు దోహదం చేశాయి. గ్రామాన్ని అభివృద్ధి చేస్తానని హామీ ఇవ్వడం, పోటీలో నిలబడిన వ్యక్తి పట్ల గౌరవం, అభిమానం ఉండడం, మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు చొరవ తీసుకోవడం, ఒకే సామాజికవర్గానికి చెందిన వారే ఉండడం, ఎస్టీ మహిళకు రిజర్వు అయిన స్థానంలో పంచాయతీలో మొత్తంగా ఆ సామాజికవర్గానికి చెందిన ఒక్క మహిళ ఉండడం, ఎన్నికల పేరుతో గొడవలు వద్దని, కలిసికట్టుగా ఉందామని ఐక్యంగా ఒక నిర్ణయం తీసుకోవడం, ముఖ్యంగా రెండు గ్రామ పంచాయతీలు-రామోజీకుమ్మరిగూడెం, చంద్రుతండా అభ్యర్థులు గ్రామాభివృద్ధికి రూ.8 లక్షల చొప్పున నిధులు ఇస్తామని ముందుకు రావడం తదితర కారణాలవల్ల ఈ పంచాయతీల్లో ఏకగ్రీవానికి దారులు సుగమం అయ్యాయి. ఏకగ్రీవం కోసం ఎక్కడా వేలం పాటలు జరగకపోవడం, ఏకగ్రీవమైన దాదాపు అన్ని పంచాయతీల్లో జనాభా 5వేలలోపే ఉండడం గమనార్హం.

హనుమకొండ జిల్లాలో రెండు..

హనుమకొండ జిల్లాలో 2 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి. ఒకటి శాంతినగర్, రెండోది వీర్లగడ్డతండా. ఎల్కతుర్తి మండలం లోని శాంతినగర్ గ్రామ పంచాయతీ ఏకగ్రీవం కావడానికి ఆ పంచాయతీ పరిధిలో దాదాపు అందరూ ఒకే సామాజికవర్గానికి (కన్వర్టెడ్ క్రిష్టియన్స్) చెందినవారు ఉండడంతో పాటు, ఇక్కడ జనాభా అతితక్కువగా ఉండడం కారణం. గత పంచాయతీ ఎన్నికల్లో కూడా శాంతినగర్ ఏకగ్రీవమైంది. అప్పుడు సర్పంచ్‌గా మహిళా అభ్యర్థి వేలంగిని మేరీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సారి కూడా తిరిగి ఆమే ఎన్నికయ్యారు. అలాగే భీమదేవరపల్లి మండలంలోని వీర్లగడ్డతండా గ్రామ పంచాయతీ ఏకగ్రీవమైంది. ఇక్కడ ఎస్టీ అభ్యర్థి గుగులోతు పూర్ణిమ సర్పంచ్ గ్రామ పంచాయతీని సర్వతోముఖంగా అభివృద్ధి చేస్తానని ఇచ్చిన హామీ మేరకు మిగతా వారు ఎవరూ నామినేషన్లు వేయకపోవడంతో ఆమె ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పూర్ణిమ భర్త భీమదేవరపల్లి మండల కాంగ్రెస్ కార్యదర్శి. అంతేకాకుండా మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవ తీసుకొని గ్రామాభివృద్ధికి ఇచ్చిన హామీ కూడా ఇందుకు కారణమైంది.

ములుగు జిల్లాలో రెండు..

ములుగు జిల్లాలో రెండు గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. గోవిందరావుపేట మండలం కోటగడ్డ ఎస్టీ మహిళకు రిజర్వు అయింది. ఈ పంచాయతీలో ఎస్టీ మహిళ మహిళ బానోతు లిల్లీ ఒక్కరే ఉండడంతో ఒక్క నామినేషనే దాఖలైంది. దీనితో ఆమె ఏకగ్రీవం ఖాయమైంది. అదే మండలంలోని చల్వాయి పంచాయతీ స్థానం ఎస్టీ మహిళకు రిజర్వు కాగా, కాంగ్రెస్ బలపర్చిన మేకల రాధ సర్పంచ్‌గా ఏకగ్రీవమయ్యారు. ఈ పంచాయతీ సర్పంచ్ స్థానానికి ఏడుగురు నామినేషన్లు వేశారు. డీసీసీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ అన్ని పార్టీల నాయకులు, అభ్యర్థులతో మాట్లాడి

(మిగతా 7లో..)

హోరాహోరీగా నామినేషన్లు

- రెండో విడతలో ఆశావహుల దాఖలు
- రాత్రి వరకు కొనసాగిన ప్రక్రియ


పరకాల మండలం నాగారం సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న కట్కూరి స్రవంతి

హనుమకొండ టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లాలోని గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు, వార్డు స్థానాలకు రెండో విడతలో రెండో రోజు సోమవారం నామినేషన్లు స్వీకరించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ స్నేహశబరీష్ తెలిపారు. జిల్లాలోని ధర్మసాగర్, హసన్‌పర్తి, వేలేరు, పరకాల, ఐనవోలు మండలాల్లోని పలు క్లస్టర్లను కలెక్టర్, అదనపు కలెక్టర్, ఎన్నికల అధికారులు సందర్శించి నామినేషన్ల ప్రక్రియను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

మండలాల్లోని మొత్తం గ్రామాల సర్పంచ్‌లు 73 కాగా, 170 దాఖలయ్యాయి. మొత్తం 694 వార్డు స్థానాలకు 341 నామినేషన్లు స్వీకరించినట్లు అధికారులు తెలిపారు. రెండో రోజు ధర్మసాగర్ మండలంలో 19 సర్పంచ్‌ల స్థానాలకు 36 నామినేషన్లు దాఖలయ్యాయి. 186 వార్డు స్థానాలకు 81 నామినేషన్లు దాఖలయ్యాయి. హసన్‌పర్తి మండలంలో 15 సర్పంచ్ స్థానాలకు 39 నామినేషన్లు దాఖలయ్యాయి. 138 వార్డు స్థానాలకు 92 నామినేషన్లు దాఖలయ్యాయి. వేలేరు మండలంలో 12 సర్పంచ్ స్థానాలకు 26 నామినేషన్లు దాఖలయ్యాయి. 106 వార్డు స్థానాలకు 53 నామినేషన్లు దాఖలయ్యాయి. పరకాల మండలంలో 10 సర్పంచ్ స్థానాలకు 24 నిమినేషన్లు దాఖలయ్యాయి. 94 వార్డు స్థానాలకు 39 నామినేషన్లు దాఖలయ్యాయి. ఐనవోలు 17 సర్పంచ్ స్థానాలకు 45 నామినేషన్లు దాఖలయ్యాయి. 170వార్డు స్థానాలకు 76 నామినేషన్లు దాఖలయ్యాయి.

రెండో విడత నామినేషన్ కౌంటర్ — రెండో రోజు 01-12-25

మండలం పేరు	సర్పంచ్ స్థానాలు	దాఖలైన నామినేషన్లు	వార్డు సభ్యులు	దాఖలైన నామినేషన్లు
ధర్మసాగర్	19	36 (21)	186	81 (100)
హసన్‌పర్తి	15	39 (8)	138	92 (103)
ఐనవోలు	17	45 (8)	170	76 (82)
వేలేరు	12	26 (6)	106	53 (59)
పరకాల	10	24 (8)	94	39 (41)

నోట్: (బ్రాకెట్)లో ఇప్పటి వరకు దాఖలైన మొత్తం నామినేషన్ల సంఖ్య

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్


రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ స్నేహ శబరీష్

ధర్మసాగర్ డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశించారు. సోమవారం ధర్మసాగర్‌లోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ఇప్పటి వరకు ఎంత ధాన్యాన్ని కొనుగోలు చేశారని, ఎన్ని లోడ్‌లు మిల్లులకు తరలించారని నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఓపీఎంఎస్ ద్వారా ఎంత మంది రైతుల ఎంట్రీ చేశారని, ఈ సీజన్‌లో ఎంత ధాన్యం కొనుగోలు చేశారని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల కేంద్రంలోని విజయ డెయిరీ పాల శీతల కేంద్రాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో గ్రామీణాభివృద్ధి జిల్లా అధికారి మేన శ్రీను, తహసీల్దార్ సదానందం, ఎంపీడీవో అనిల్ కుమర్, డీపీఎం రాజేంద్రప్రసాద్, ఏపీఎం దేవానంద్ పాల్గొన్నారు.

నామినేషన్ల స్వీకరణ కేంద్రం పరిశీలన

మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని సోమవారం కలెక్టర్ స్నేహ శబరీష్ సందర్శించారు. హెల్ప్‌డెస్క్‌ను పరిశీలించారు. సర్పంచ్, వార్డు సభ్యులకు సంబంధించి ఎన్ని నామినేషన్లు వచ్చాయని రిటర్నింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్, వార్డు సభ్యులు దాఖలు చేసిన నామినేషన్లను వేర్వేరుగా పెట్టాలని సూచించారు. హెల్ప్‌డెస్క్ ద్వారా అభ్యర్థులకు సమాచారాన్ని తెలియజేయాలన్నారు.

అభివృద్ధికి సై


మునిసిపల్ కౌన్సిల్ సమావేశానికి హాజరైన ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు

రూ.130కోట్ల అభివృద్ధి పనులకు ఆమోదం

- 39 ఎజెండా అంశాలకు సమావేశం గ్రీన్ సిగ్నల్
- వ్యతిరేకించిన కొందరు కార్పొరేటర్లు
- చదివి ఆమోదం కోరిన మేయర్ సుధారాణి
- పోలీసులు, అధికారులపై ఎమ్మెల్సీ సారయ్య ఫైర్
- సాఫీగా ముగిసిన గ్రేటర్ మునిసిపల్ కౌన్సిల్ సమావేశం

వరంగల్ కార్పొరేషన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ నగరాభివృద్ధిపై సోమవారం జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయం కౌన్సిల్ హాల్‌లో నిర్వహించిన సాధారణ సర్వసభ్య (కౌన్సిల్) సమావేశం నిరసనలు, ప్రసంగాల నడుమ సాఫీగా సాగింది. ముఖ్యంగా ఈకౌన్సిల్ సమావేశంలో వరంగల్ నగర అభివృద్ధికి రూ.130 కోట్ల అభివృద్ధి పనులకు మెజారిటీ సభ్యులు ఆమోదం తెలిపారు. 39 ఎజెండా అంశాలకు ఎమ్మెల్యేలు, ఎక్స్ అఫీషియో


మాట్లాడుతున్న మేయర్

మెంబర్లు, కార్పొరేటర్లు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అలాగే జనరల్ ఫండ్, అమృత్ 2.0 నిధుల నుంచి అభివృద్ధి పనులకు నిధులు కేటాయించారు. ఈ నిధులతో నీటి సరఫరా, రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం, పారిశుద్ధ్యం, వాహనాల కొనుగోలు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీతాల పెంపు, అన్నపూర్ణ పథకం రుసుము పెంపు, కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపులతో పాటు ఇతర అభివృద్ధి పనులపై ప్రతిపాదనలు, ఆమోదం జరిగింది.

వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్దకు ఉదయం 11.40గంటలకు సర్వసభ్యులు చేరుకున్నారు. కాంగ్రెస్ కార్పొరేటర్లతో పాటు మేయర్ గుండు సుధారాణి కౌన్సిల్ హాల్‌లోకి చేరుకున్నారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, ఎమ్మెల్సీలు బస్వరాజు సారయ్య, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ కౌన్సిల్ సమావేశానికి హాజరయ్యారు. ముందుగా ప్రజాకవి అందెశ్రీకి సభ్యులు ఘన నివాళులర్పించారు. అనంతరం మేయర్ గుండు సుధారాణి ఎజెండా అంశాలను చదువుతుండగానే బీఆర్ఎస్, బీజేపీ కార్పొరేటర్లు అడ్డుపడ్డారు. ఇది ప్రజల ఎజెండా కాదని, పర్సంటేజీల ఎజెండా అని కొందరు నిరసన గళాన్ని వినిపించారు. దీంతో కౌన్సిల్‌హాల్‌లో కొంత స్వల్ప ఘర్షణ వాతావరణం చోటుచేసుకోగా తర్వాత సద్దుమణిగింది. తమ డివిజన్‌కు తక్కువ నిధులు ఇచ్చి కాంగ్రెస్ కార్పొరేటర్లకు పెద్ద మొత్తంలో ఇచ్చారని 59వ డివిజన్ కార్పొరేటర్ గుజ్జుల వసంత మేయర్‌ను కోరగా అన్ని డివిజన్‌లకు సమ న్యాయం చేశామని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి చెప్పారు. ప్రజావాణిలో

(మిగతా 6లో..)

పదేళ్లలో లేని అభివృద్ధి రెండేళ్లలో జరిగింది..

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

వరంగల్ మునిసిపాలిటీ చరిత్రలో ఎన్నడూ లేని అభివృద్ధి రెండేళ్లలో జరిగింది. గత పాలకులు పదేళ్లలో చేయని అభివృద్ధి చేసి చూపించాం. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నగర ప్రజలు ఇబ్బందిపడితే రాష్ట్ర ముఖ్యమంత్రిని రప్పించి రూ.12కోట్ల తక్షణ సహాయం అందించాం. ప్రతీ వరద బాధిత కుటుంబానికి రూ.15వేల చొప్పున ఇస్తున్నాం. గతంలో కాంగ్రెస్ కార్పొరేటర్లను పట్టించుకునేవారు కాదు. కానీ ప్రస్తుతం పార్టీలకతీతంగా అన్ని డివిజన్‌లను అభివృద్ధి చేసేందుకు నిధులు ఇస్తున్నాం.

మేడారం జాతరకు ఏర్పాట్లు చేయండి..

వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

రెండు మాసాల్లో ఆసియాలోనే అతి పెద్ద మేడారం జాతర జరుగనుంది. ప్రధానంగా నగరంతో పాటు ఆరెపల్లి ప్రాంతంలో రోడ్లు చాలా అధ్వాన్నంగా ఉన్నాయి. ప్రత్యేక నిధులు కేటాయించి రోడ్లను అభివృద్ధి చేయాలి. వడ్డెపల్లి చెరువును అభివృద్ధి చేయాలి. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో పెద్దఎత్తున నిధులు విడుదల చేస్తున్నారు. అధికారులకు అప్పగించిన పనులను త్వరగా పూర్తి చేయాలి.

హెచ్ఐవీపై అవగాహన కలిగి ఉండాలి

- జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి డాక్టర్ కె.పట్టాభిరామారావు
- ఎయిడ్స్ డే సందర్భంగా నగరంలో అవగాహన ర్యాలీ


ర్యాలీని ప్రారంభిస్తున్న జడ్జి డాక్టర్ కె.పట్టాభి రామారావు

వరంగల్ మెడికల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజల్లో హెచ్ఐవీపై నిరంతరంగా అవగాహన కలిగిస్తూ అపోహలు తొలగిస్తూ చైతన్యవంతులను చేయాలని హనుమకొండ జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి డాక్టర్ కె.పట్టాభిరామారావు ఉద్బోధించారు. సోమవారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవంలో భాగంగా భద్రకాళి ఆలయ తోరణం నుంచి ఎస్ఆర్ఐ ఆడిటోరియం వరకు ఆరోగ్య శాఖ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు, నర్సింగ్ విద్యార్థులు నిర్వహించిన అవగాహన ర్యాలీని డీఎంహెచ్‌వో డాక్టర్ ఎ.అప్పయ్యతో కలిసి ఆయన జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం కాకతీయ మెడికల్ కాలేజీ ఎస్ఆర్ఐ ఆడిటోరియంలో నిర్వహించిన సమావేశంలో జడ్జి డాక్టర్ కె.పట్టాభిరామారావు మాట్లాడారు. హెచ్ఐవీకి మందు లేదన్నారు. మానసికంగా కుంగుబాటు వల్ల తొందరగా చనిపోయే ఆ దశలో నివారణ మాత్రమే దీనికి మందు అన్నారు. ఇదే లక్ష్యంతో నిశ్శబ్దాన్ని ఛేదిద్దాం.. అనే నినాదంతో ఒక యుద్ధంలా అందరూ శ్రమించామన్నారు. అందువల్లే ఈరోజు గుసగుసలాడే దశ నుంచి ఒకరితో ఒకరు చర్చించుకోవడం, చికిత్సకు ముందుకు రావడం, పాజిటివ్ అయితే చికిత్స తీసుకుంటున్నారని అన్నారు. అందరి కృషివల్ల

(మిగతా 8లో..)

అధ్వానంగా నైపుణ్యాభివృద్ధి

- లోపభూయిష్టంగా పథకాల అమలు
- వరంగల్‌లో పని చేయని కేంద్రాలు
- ఉద్యోగాలు అంతంత మాత్రమే..
- పార్లమెంట్‌లో నిలదీసిన వరంగల్ ఎంపీ కావ్య



హనుమకొండ, డిసెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో నైపుణ్యాభివృద్ధి పథకాలు అత్యంత అధ్వాన్నంగా ఉన్నాయని పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య ధ్వజమెత్తారు. మంజూరైన నైపుణ్యాభివృద్ధి కేంద్రాల్లో ఏ ఒక్కటీ పని చేయడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్లేస్‌మెంట్లు సరిగా లేవన్నారు. సోమవారం నుంచి ప్రారంభమైన పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో పాల్గొన్న కావ్య వరంగల్ జిల్లాలో ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన (పీఎంకేవీవై) కింద జరుగుతున్న పనులపై ప్రశ్నించారు. ప్రధానంగా శిక్షణా కేంద్రాల పనితీరు, మహిళలు, ఎస్సీ వర్గాలకు రిజర్వేషన్లు, పరిశ్రమల అనుసంధానం, ఉద్యోగావకాశాలపై సమగ్ర వివరాలను ఎంపీ కోరారు. ఈ సందర్భంగా డాక్టర్ కావ్య మాట్లాడుతూ.. పీఎంకేవీవై పథకం అమలు ప్రారంభమైననాటి నుంచి వరంగల్‌లో

(మిగతా 6లో..)

కేయూ హాస్టల్స్‌లో నాన్ బోర్డర్లు ఉండొద్దు..
ఉత్తర్వులు జారీ చేసిన రిజిస్ట్రార్ రామచంద్రం 6

మానవాళి మనుగడకు భగవద్గీత
టీటీడీ గీతా జయంతి వేడుకల్లో ప్రముఖులు 6

యమ కిలాడీ.. ఈ నకిలీ డీఎస్పీ..

- అవినీతి చిట్టా తెలుసుకొని ఏసీబీ పేరిట గాలం
- ఎంపీఐ తుమ్మల జైపాల్‌రెడ్డికి బెదిరింపులు
- ఆన్‌లైన్‌లో రూ.9లక్షల96 వేలు వసూలు
- ముఠాను పట్టుకున్న టాస్క్‌ఫోర్స్, మిల్స్‌కాలనీ పోలీసులు
- ప్రధాన నిందితుడిది ఏపీ, మిగతావారిది కర్నాటక
- కమిషనరేట్‌లో వివరాలు వెల్లడించిన సీపీ సన్‌ప్రీత్ సింగ్

7


వివరాలు వెల్లడిస్తున్న సీపీ సన్‌ప్రీత్ సింగ్

అడుప చంద్రమౌళికి డాక్టరేట్



రెడ్డికాలనీ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ రంగశాయిపేటకు చెందిన అడుప చంద్రమౌళి ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగంలో డాక్టరేట్ పొందారు. సత్యభామ యూనివర్సిటీ చెన్నైలో 'ఎన్‌హ్యాన్స్‌డ్ ట్రాకింగ్ ఆఫ్ ద మాక్సిమమ్ పవర్ ఫ్రమ్ రెన్యువబుల్ ఎనర్జీ ఫ్రేమ్ వర్క్స్' అనే అంశంపై థీసిస్ అందజేశారు. సూపర్‌వైజర్ శివ చిదంబరనాథన్ పర్యవేక్షణలో ఈ థీసిస్ సమర్పించగా అడుప చంద్రమౌళికి డాక్టరేట్ ప్రదానం చేసింది. ఆయనకు ఎస్ఆర్ యూనివర్సిటీ యాజమాన్యం అభినందనలు తెలిపింది.

ప్రేమించమని బెదిరించిన వ్యక్తికి మూడేళ్ల జైలు

వరంగల్ లీగల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): బాలికను ప్రేమించమని బెదిరించి, లేదంటే చంపుతానని వేధింపులకు గురిచేసిన వ్యక్తికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ హనుమకొండ జిల్లా సెషన్స్ జడ్జి బి.అపర్ణాదేవి సోమవారం తీర్పు చెప్పారు. బాధితురాలికి రూ.50వేల నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం చదువుతున్న బాలికను కొంత కాలంగా మడికొండకు చెందిన కొత్తపల్లి జగదీష్ ప్రేమించమని వేధిస్తున్నాడు. ఇదిలా ఉండగా 2022 నవంబరు 10న సాయంత్రం 5 గంటలకు మడికొండ చౌరస్తాలో బాధితురాలు బస్సు దిగి నడుచుకుంటూ ఇంటికి వెళ్తుండగా నిందితుడు జగదీష్ ద్విచక్ర వాహనంపై వచ్చి తనను ప్రేమించాలని, లేకుంటే చంపుతానంటూ బెదిరించాడు. ఈక్రమంలో బాధితురాలు భయపడి కేకలు వేయడంతో నిందితుడు పారిపోయాడు. విషయాన్ని బాధితురాలు తమ తల్లిదండ్రులకు తెలుపగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడిపై ఫోక్సో కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసు విచారణలో నేరం రుజువైనందున నిందితుడికి మూడేళ్ల జైలుశిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. కోర్టు పీసీ వి.రాజేష్ సాక్షులను ప్రవేశపెట్టగా, లైజన్ అధికారి కె.పరమేశ్వరి, భరోసా లీగల్ అడ్వయిజర్ సీహెచ్.నీరజ కేసులో సహకరించారు. దర్యాప్తు అధికారులుగా ఎస్సై జి.దివ్య, ప్రస్తుత సీఐ పి.కిషన్ వ్యవహరించారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.రాజమల్లారెడ్డి కేసు వాదించారు.

టీజీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా జగన్‌మోహన్‌రావును ఎన్నుకోవాలి

- జిల్లా అధ్యక్షుడు ఆకవరం శ్రీనివాస్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌కుమార్

హనుమకొండ కలెక్టరేట్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : డిసెంబరు 31వ తేదీన ఖాళీ అవుతున్న టీజీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పదవికి ఎన్నమనేని జగన్‌మోహన్‌రావును ఎన్నుకోవాలని తీర్మానించినట్లు టీజీవో జిల్లా అధ్యక్షుడు ఆకవరం శ్రీనివాస్‌కుమార్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని టీజీవో కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. టీజీవో యూనియన్ ఆధ్వర్యంలో ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి జగన్‌మోహన్‌రావు విశేష కృషి చేస్తున్నారని అన్నారు. ఇలాంటి నాయకుడిని రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యేందుకు ఉద్యోగులందరూ సహకరించాలన్నారు. ఉద్యోగుల పెండింగ్ బిల్లులను వెంటనే ప్రభుత్వం చెల్లించాలని, బకాయి పడిన డీఏలను మంజూరు చేసి పీఆర్సీ ప్రకటించాలన్నారు. శాఖల వారీగా ఉన్న వివిధ ఆర్థికేతర సమస్యలలో ముఖ్యంగా కేడర్ స్ట్రెంత్‌లను సవరించి దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్ సమస్యలు పరిష్కరించాలన్నారు. గెజిటెడ్ అధికారులకు ఇళ్ల స్థలాలను కేటాయించాలన్నారు. సమావేశంలో సహాధ్యక్షులు పి.వెంకటేశ్వర్‌రావు, కార్యదర్శి డాక్టర్ ప్రవీణ్‌కుమార్, కోశాధికారి పి.రాజేష్‌కుమార్, మాధవి, సురేష్‌కుమార్, శ్రీనివాసరావు, డాక్టర్ మహేష్‌కుమార్, మాధవరెడ్డి, వాసం శ్రీనివాస్, రమేష్, సంతోష్, రవీంద్ర, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మానవాళి మనుగడకే భగవద్గీత

- టీటీడీ గీతా జయంతి వేడుకల్లో ప్రముఖులు

హనుమకొండ కల్చరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మార్గశిర శుద్ధ ఏకాదశి సోమవారం గీతా జయంతి వేడుకలను టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలోఘనంగా నిర్వహించారు. టీటీడీ కార్యక్రమ కోఆర్డినేటర్ రామిరెడ్డి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో జరిగిన వేడుకలను తెలంగాణ అర్చక సమాఖ్య అధ్యక్షుడు గంగు ఉపేంద్రశర్మ, వికాస తరంగిణి ఉమ్మడిజిల్లా చైర్‌పర్సన్ డాక్టర్ బచ్చు రాధాకృష్ణలు జ్యోతి వెలిగించి ప్రారంభింపజేశారు. ఆర్యవైశ్య జాతీయ ఫెడరేషన్ నాయకులు గట్టు మహేశ్‌బాబు విశిష్ట అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా గంగు ఉపేంద్రశర్మ మాట్లాడుతూ.. ప్రపంచంలో ఏ గ్రంథానికి లేని ప్రాధాన్యం భగవద్గీతకు ఉందన్నారు. సమస్త మానవాళి మనుగడకు మార్గనిర్దేశనం చేసే ఈ గ్రంథం ఎంతో పవిత్రమని అన్నారు. శ్రీకృష్ణ భగవానుడు 5వేల ఏళ్ల కిందటే ఉపదేశించిన ఈ గ్రంథం ఇతర మతాల వారికి కూడా ఆదర్శంగా ఉండటం విశేషమని అన్నారు. డాక్టర్ బచ్చు రాధాకృష్ణ మాట్లాడుతూ.. విద్యార్థులు బాల్యం నుంచే భగవద్గీత అధ్యయనాలు కంఠస్థం చేస్తే భవిష్యత్ లో సుఖమయ జీవితానికి మార్గం సుగమం అవుతుందన్నారు. వికాస తరంగిణి ఆధ్వర్యంలో వచ్చే గీతా జయంతి వరకు అనేక మంది విద్యార్థులకు ప్రతినిత్యం రెండు చొప్పున శ్లోకాలను కంఠస్థం చేయించే కార్యక్రమాన్ని చిన్నజీయర్ స్వామి ఆదేశాలకు అనుగుణంగా చేయిస్తామని చెప్పారు. గట్టు మహేశ్‌బాబు మాట్లాడుతూ.. టీటీడీ ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. భగవద్గీత ద్వారా ప్రతి మనిషి సన్మార్గంలో నడిచి సుఖసంతోషాలతో జీవితాలను సార్థకం చేసుకోవచ్చన్నారు. ఎలాంటి పరిస్థితుల్లోనైనా తరుణోపాయం తెలియజేసే గ్రంథం ఈ గీత అని తెలిపారు. వరంగల్ ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో టీటీడీ ఆధ్వర్యంలో గీతా జయంతిని పురస్కరించుకొని ఆయా పట్టణాల్లో పాఠశాల, కళాశాల విద్యార్థులకు వేర్వేరుగా గీతా పఠన పోటీలను నిర్వహించామన్నారు. గీతను సమాజానికి పరిచయం చేసేందుకే ఈ కార్యక్రమం టీటీడీ కొన్ని దశాబ్దాలుగా నిర్వహిస్తోందన్నారు.



గీత పఠన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేసిన అతిథులు

వల్సపైడి స్వాగతం పలికిన ఈ కార్యక్రమంలో గీత పోటీలకు న్యాయ నిర్ణేతలుగా డాక్టర్ వేదాంతం శ్రీదేవి, వసుంధర, దయాకర్‌స్వామి, దుర్గ, మచ్చమ్మ తదితరులు వ్యవహరించారు. సీనియర్స్ విభాగంలో ఆర్.మణీంద్ర, శ్రేయాస్, జూనియర్స్ విభాగంలో కె.నిక్షిత, సూర శ్లోక అద్వైతలతోపాటు పూజ్యశ్రీ, కె.అనిక తదితర విద్యార్థులు విజేతలుగా నిలిచి అతిథులు చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు. వికాస తరంగిణి ఉపాధ్యక్షులు దయాకర్‌రెడ్డి, టీటీడీ ఇన్‌చార్జి డాక్టర్ రఘువీర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా నైపుణ్యాభివృద్ధి

(5వ పేజీ తరువాయి)

8 శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేశారన్నారు. కానీ ప్రస్తుతం అమలులో ఉన్న పీఎంకేవీవై-4.0లో ఒక్క కేంద్రం కూడా పని చేయడంలేదన్నారు. యువతకు తక్షణ శిక్షణ కోర్సులే లేకపోవడం వల్ల ఉద్యోగ అవకాశాలు దెబ్బతింటున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలు, ఎస్సీ వర్గాల కోసం పీఎంకేవీవై-4.0లో ప్రత్యేక రిజర్వేషన్లు లేకపోవడం దురదృష్టకరం అన్నారు. గతంలో 4,592 మంది ఎస్సీ అభ్యర్థులు శిక్షణ పొందగా 76 శాతం సర్టిఫికేషన్, 12,461 మంది మహిళలు శిక్షణ తీసుకోగా 80 శాతం సర్టిఫికేషన్ ఉన్నప్పటికీ ప్రస్తుత దశలో ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వకపోవడం అన్యాయమని అన్నారు. బలహీన వర్గాల అభివృద్ధి దిశగా చర్యలు చేపట్టాలని ఎంపీ డిమాండ్ చేశారు. పరిశ్రమలతో ఒప్పందాల ద్వారా 'అంప్రెటిస్‌షిప్ ఆన్ ది జాబ్ ట్రైనింగ్ (ఒజేటీ)'వంటి అవకాశాలు ఉన్నప్పటికీ 2015-2022 మధ్య శిక్షణ పొందిన 15,398 మంది అభ్యర్థుల్లో కేవలం 6,322 మందికి మాత్రమే ఉద్యోగాలు లభించడంతో ప్లేస్‌మెంట్ రేటు 41 శాతానికి పరిమితమైందన్నారు. ఈమేరకు డాక్టర్ కావ్య అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి జయంత్ చౌదరి సమాధానం ఇస్తూ పీఎంకేవీవై-4.0లో రిజర్వేషన్లేమీ లేవని, కానీ కెరీర్ ఆధారిత ఏజెటీపై దృష్టి పెట్టామని తెలిపారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘన లొల్లి

- అభ్యర్థులను గెలిపించాలని హామీలు
- వర్ధన్నపేట ఎమ్మెల్యే ప్రసంగాల వీడియోల వైరల్

ఐనవోలు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, ఆయన అనుచరులు చేస్తున్న ప్రసంగాలపై కలకలం రేగుతోంది. నామినేషన్ల సందర్భంగా ఓటర్లను ప్రలోభాలకు గురిచేసేలా వాగ్దానాలు చేస్తూ ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తున్నప్పటికీ అధికారయంత్రాంగం పట్టించుకోవడం లేదని సోషల్ మీడియాలో వీడియోలు వైరల్‌గా మారాయి. రెండో విడత నామినేషన్లలో భాగంగా సోమవారం పున్నేలు కాంగ్రెస్‌బలపర్చిన అభ్యర్థి కత్తి సుధీర్ నామినేషన్ వేయడానికి ర్యాలీగా ఐనవోలుకు బయలుదేరారు. ఈ సందర్భంగా అంబేద్కర్ సెంటర్‌లో గ్రామస్థులను ఉద్దేశించి ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడారు. సుధీర్‌ను గెలిపిస్తే మరో పది ఇందిరమ్మ ఇళ్లు, పున్నేలు-జోగయ్యపల్లి గ్రామాల మధ్య బీటీ రోడ్డు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. అంతేకాకుండా ఎన్నికల కోడ్ తర్వాత పెంచిన పింఛన్లు ఇస్తామన్నారు. అలాగే కక్కిరాలపల్లిలో కాంగ్రెస్ నాయకుడు సాంబయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే ఊరికి 50 నుంచి 100 ఇళ్లు ఇస్తామని మాట్లాడిన వీడియోను వాట్సాప్ గ్రూపుల్లో వైరల్‌గా మారాయి. దీంతో అధికార పార్టీ నాయకులకు ఎన్నికలకోడ్ వర్తించదా? అంటూ ప్రతిపక్షాల నాయకులు చేసిన విమర్శల వీడియోలు చక్కర్లు కొడుతున్నాయి. కోడ్ అమలులో ఉండగా ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నా ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి.



పున్నేలులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగరాజు

యాసిడ్ కలకలం

(5వ పేజీ తరువాయి)

తనపై ఏదో పోసినట్లు అనిపించిందని యువతి ఫిర్యాదులో పేర్కొన్నది. తన కాలిపై మంటగా అనిపించడంతో బంధువులకు సమాచారం అందించింది. సమాచారం తెలిసిన మడికొండ ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ ఘటనాస్థలానికి చేరుకొని యువతిని హుటాహుటిన ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. కాగా, యువతికి వైద్యులు చికిత్స అందించారు. శరీరంలో 7శాతం కాలిందని పేర్కొన్నారు. యువతి స్వల్ప గాయాలతో బయటపడడంతో కుటుంబసభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. కాగా, గతంలో కిట్స్ కళాశాల విద్యార్థినులపై యాసిడ్ దాడి జరిగి ఒక విద్యార్థిని మృతి చెందిన ఘటన తర్వాత మళ్లీ అదే తరహాలో ఈ సంఘటన జరగడంతో నగరం ఉలిక్కిపడింది.

కేయూ హాస్టల్స్‌లో నాన్ బోర్డర్లు ఉండొద్దు..

- ఉత్తర్వులు జారీ చేసిన రిజిస్ట్రార్ రామచంద్రం

కేయూ క్యాంపస్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కేయూ క్యాంపస్‌లోని అన్ని హాస్టల్స్‌లో నాన్ బోర్డర్లు ఉండొద్దని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. వర్సిటీ క్యాంపస్‌లో విద్యార్థులు, పరిశోధకులకు నూతన ప్రవర్తన మార్గదర్శకాలను విడుదల చేశారు. శాంతి, క్రమశిక్షణ, భద్రతను కాపాడుతూ విద్యా వాతావరణాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. అకడమిక్ బ్లాక్‌లు, కారిడార్‌లతో పాటు ప్రాంగణంలో పుట్టినరోజు వేడుకలు, ఇతర వ్యక్తిగత కార్యక్రమాలను నిషేధించారు. రాత్రి 9గంటల తర్వాత క్యాంపస్‌లోని ఫుట్‌పాత్, బహిరంగ ప్రదేశాల్లో గుమిగూడటం, కూర్చోవడం, తిరగడాన్ని నిషేధించారు. వారం రోజుల్లో నాన్ బోర్డర్లు హాస్టల్స్ నుంచి ఖాళీ చేయాలని స్పష్టం చేశారు. హాస్టల్ బోర్డర్లు ఐడీ కార్డులను కలిగి ఉండాలని పేర్కొన్నారు.

కర్రెగుట్టలకు రోడ్డు

- ప్రారంభమైన నిర్మాణ పనులు

వాజేడు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఆపరేషన్ కగార్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం కర్రెగుట్టలను పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకుంటోంది. మావోయిస్టుల ఉనికి లేకుండా చేసే క్రమంలో మరో అడుగు ముందుకేసింది. ఇప్పటికే ములుగు జిల్లా వాజేడు మండలంలోని మారుమూల అటవీప్రాంతమైన మురుమూరులో సీఆర్పీఎఫ్ బెటాలియన్ బేస్‌క్యాంపును ఏర్పాటు చేసింది. నవంబరు 25న దక్షిణ విభాగ ఐజీ విక్రమ్ దీనిని ప్రారంభించారు. ఈక్రమంలో మురుమూరు బేస్ క్యాంపు నుంచి వెంకటాపురం మండలంలోని పామునూరు గుట్టలకు రహదారి నిర్మాణాన్ని చేపడుతున్నారు. దీనిని తెలంగాణ గ్రేహౌండ్స్ అడిషనల్ ఐజీ అనిల్‌కుమార్ సోమవారం ప్రారంభించారు. సుమారు పది కిలోమీటర్ల మేర రహదారి నిర్మాణాన్ని చేపట్టనున్నారు. నెలరోజుల్లో ఈ రహదారి నిర్మాణాన్ని పూర్తిచేసేలా ఆదేశాలు జారీ చేశారు. మురుమూరు సీఆర్పీఎఫ్ బేస్‌క్యాంపు నుంచి ఎత్తయిన కొండలు, గుట్టలను చదును చేసేందుకు భారీ యంత్రాలను తరలించారు. హైదరాబాద్‌కు చెందిన ఓ ప్రముఖ కంపెనీకి కాంట్రాక్టు పనులను అప్పగించినట్లు సమాచారం. నెలరోజుల్లో పామునూరు గుట్టలకు రహదారి నిర్మాణం పూర్తయిన తర్వాత కర్రెగుట్టలకు మరో 25కిలోమీటర్ల రోడ్డును నిర్మించనున్నట్లు తెలుస్తోంది. ఈక్రమంలో కర్రెగుట్టల వరకు మరో మూడు బేస్‌క్యాంపులను సీఆర్పీఎఫ్ ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా జనవరి 1న మావోయిస్టులంతా లొంగిపోతామని ప్రకటన విడుదలైంది. తాజాగా కర్రెగుట్టలను కేంద్ర ప్రభుత్వం టూరిస్టు హబ్‌గా మార్చేందుకు ప్రయత్నిస్తున్న నేపథ్యంలో సీఆర్పీఎఫ్ బేస్‌క్యాంపుల ఏర్పాటు చర్చనీయాంశమైంది.



రహదారి నిర్మాణ పనులకు పూజలు చేస్తున్న అర్చకులు

కార్మికుల హక్కులను హరిస్తున్న కేంద్ర ప్రభుత్వం

- సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్



మహాసభలో మాట్లాడుతున్న పాలడుగు భాస్కర్

వడ్డెపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికుల హక్కులను హరిస్తుందని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. సోమవారం హనుమకొండ వడ్డెపల్లి ప్రధాన రహదారిలోని పల్లా రవీందర్‌రెడ్డి విద్యుత్ భవన్‌లో సీఐటీయూ హనుమకొండ జిల్లా 2వ మహాసభ ప్రారంభమైంది. ఈసందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ కార్మికుల హక్కులకు గుదిబండగా మారిన లేబర్ కోడ్‌ల రద్దుకు అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. లేబర్ కోడ్‌ల రద్దుకు సీఐటీయూ సమరశీల పోరాటాలు చేస్తుందని స్పష్టం చేశారు. కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాన్ని ఉధృతం చేస్తామని పేర్కొన్నారు. కార్మికులు తమ హక్కుల కోసం పోరాడే హక్కును తొలగించేందుకు లేబర్ కోడ్‌లను కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని విమర్శించారు. ఇది కార్మికుల శ్రమను దోచుకోవడమేనని తెలిపారు. సింగరేణి, ఎల్ఐసీ, గనులు, బీఎస్ఎల్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేటర్ శక్తులకు అప్పగించి ప్రజల సొమ్మును దోచుకుంటున్నారని ఆరోపించారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కార్మిక వ్యతిరేక విధానాలనే అనుసరిస్తోందని విమర్శించారు. ఈ మహాసభలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శులు జె.వెంకటేష్, కాసు మాధవి, కూరపాటి రమేష్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు తేలూరి ఉప్పలయ్య, జిల్లా కార్యదర్శి రాగుల రమేష్, ఆఫీస్ బేరర్లు గాదె ప్రభాకర్‌రెడ్డి, బొట్ల చక్రపాణి, మెట్టు రవి, పుల్లా అశోక్, సంగాల మొగిలి, బొల్లారం సంపత్, కె.ఐలయ్య, రజిత, బి.మహేష్‌లతో పాటు ఉద్యోగులు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అభివృద్ధికి సై..

(5వ పేజీ తరువాయి)

సమస్యలు పరిష్కారం కాకపోవడం వల్ల తన వద్దకు బాధితులు వస్తున్నారని, వాటిని పరిష్కరించాలని అధికారులను హెచ్చరించారు.

ప్రతిపక్షాల నిరసన గళం

డివిజన్‌లలో నెలకొన్నసమస్యలు పాలకవర్గం పట్టించుకోవడం లేదని కొందరు బీజేపీ, బీఆర్ఎస్ కార్పొరేటర్లు ఆరోపించారు. ఈ మేరకు మేయర్ తీరును నిరసిస్తూ నినాదాలు చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తమ డివిజన్‌లలో రోడ్లు, డ్రైనేజీలు పూర్తిగా దెబ్బతిన్నాయని, తమకు ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించాలని డిమాండ్ చేశారు. డివిజన్‌ల అభివృద్ధిపై ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని చెప్పే ప్రయత్నం చేస్తు న్నా తమకు మాట్లాడే అవకాశం కూడా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చే శారు. కాగా, కౌన్సిల్ సమావేశంలో ఎజెండా అంశాలు తమకు నచ్చలేదని బీఆర్ఎస్ కార్పొరేటర్లు సోదా కిరణ్, రంజిత్‌రావులు కౌన్సిల్ నుం చి మధ్యలోనే బయట వెళ్లిపోయారు. అయితే కౌన్సిల్‌లో ప్రవేశ పెట్టిన 39 ఎజెండా అంశాలలో మెజార్టీ సభ్యులు అన్నీ ఆమోదించారు.

ఎమ్మెల్సీ బస్వరాజు ఫైర్..

కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్సీ బస్వరాజు పలువురిపై ఫైర్ అయ్యారు. తొలుత సమావేశానికి వస్తున్న ఆయనను జీడబ్ల్యూఎంసీ ప్రధాన ద్వారం వద్ద పోలీసులు ఆపి వివరాలు అడిగే ప్రయత్నం చేశారు. దీంతో మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్‌రావును పిలిచి సారయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము అధికార పార్టీ ప్రజాప్రతినిధులమని తెలిసి కూడా అడ్డగిస్తారా? అని ప్రశ్నించారు. ఇక కౌన్సిల్ హాల్‌లో సైతం అదే కోపం ప్రదర్శించారు. నగరంలో కమ్యూనిటీ హాళ్లను స్వాధీనం చేసుకునే హక్కు ఎవరిచ్చారని కమిషనర్‌పై మండిపడ్డారు. 3 నెలల కిం దట ఇన్‌చార్జి మంత్రి లేఖ ఇచ్చినా పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తా రు. అలాగే టౌన్ ప్లానింగ్ అధికారుల తీరుపై సారయ్య మండిపడ్డారు. చేతిలో ఉన్న ఎజెండా పత్రాలతో పాటు పాత ఫిర్యాదు కాపీలను చింపి పడేశారు. బల్దియా అధికారులకు ఫోన్లు చేస్తే స్పందించడం లేదని అన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మేయర్, తదితరులు



సీఐపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య

ఎజెండా అంశాలు

అన్నపూర్ణ పథకం రూ.5 భోజనం అందించేందుకు ఒక్కో భోజనానికి రూ.27.63 నుంచి రూ.29.83 పైసలకు పెంపు. అన్నపూర్ణ పథకం భోజనానికి మూడు నెలలకు రూ.1.05కోట్ల నిధుల కేటాయింపు. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు. యూజీడీ ప్రాజె క్ట్ డీపీఆర్ సిద్ధం చేసేందుకు ఎన్‌కే బిల్డ్‌కాన్ సంస్థకు రూ.1.85కోట్లు కేటాయింపు. బాలసముద్రం, పోతననగర్ రెండు సెకండ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ల నుంచి చెత్తను డంపింగ్ యార్డ్‌కు తరలించేందుకు రూ.2.80 కోట్లతో రెండు కాంపాక్టర్ల కొనుగోలు. అమృత్ 2.0 పథకం నుంచి రూ. 3 కోట్ల ప్రోత్సాహక నిధుల నుంచి అభివృద్ధి పనులు. హనుమకొండ జేఎన్ఎస్ చుట్టూ రూ.1కోటి వ్యయంతో ఐమాస్ లైట్ల ఏర్పాటు, నగరంలోని 66 డివిజన్‌లలో ప్రతీ డివిజన్‌లో రూ.1కోటితో నిధులతో అభివృద్ధి పనులు చేపట్టాలని ఇంజనీర్‌లతో ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. నగరంలో ట్రాఫిక్ నిర్వహణ మెరుగుపరిచేందుకు వరంగల్ హెడ్‌పోస్ట్ ఆఫీస్, హనుమకొండ చౌరస్తాతో పాటు ఇతర ప్రభుత్వ ఖాళీ ప్రదేశాల్లో పార్కింగ్ ఏర్పాటు. బల్దియా హార్టికల్చర్ 160మంది సిబ్బందికి రోజుకు రూ.388 నుంచి రూ.651 జీతం దినసరి వేతనం పెంపు. శానిటేషన్‌లో 85 మంది ఔట్‌సోర్సింగ్ జవాన్‌లకు రూ.17,100 నుంచి రూ.19,500 జీతం పెంచేందుకు ఆమోదం. 66 డివిజన్‌లలో 20 డివిజన్‌లకు రూ.కోటి, 46 డివిజన్‌లకు అరకోటికి పైగా అభివృద్ధి పనులకు నిధుల కేటాయింపు. యూఐడీఆర్ పథకంతో రూ.50కోట్లతో అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపారు. మొత్తంగా రూ.130కోట్ల నిధులతో అభివృద్ధిపనులకు ఆమోదం తెలిపారు.

27వ డివిజన్ ప్రజల నిరసన

కౌన్సిల్ సమావేశం జరుగుతున్న సమయంలో గ్రేటర్ వరంగల్ 27వ డివిజన్ అబ్బనికుంటకు చెందిన ప్రజలు పెద్ద ఎత్తున కౌన్సిల్ హాల్ ముందుకు చేరుకుని నిరసన వ్యక్తం చేశారు. తమ కాలనీలో సీసీరోడ్డు పనులు జరుగుతుండగా కొందరు వ్యక్తుల కారణంగా పనులు మధ్యలోనే నిలిచిపోయాయని, వెంటనే పనులను పునరుద్ధరించాలని కోరారు. ఈ మేరకు కమిషనర్‌ను కార్పొరేటర్ చింతాకుల అనిల్‌కుమార్‌తో కలిసి ప్రజలు వినతి పత్రం అందించారు. స్పందించిన కమిషనర్ చహత్ బాజ్‌పాయ్.. రెండు రోజుల్లో ఈఈ, డీఈలను కాలనీకి పంపించి పనులను పరిశీలించిన తర్వాత పునప్రారంభం చేస్తానని హామీ ఇచ్చారు.



కార్పొరేషన్ వద్ద ధర్నా చేస్తున్న కాలనీవాసులు

రేపటి నుంచి గుర్తుంచుకోవాలి..

- తెలుగు అక్షరమాల ప్రకారం వరుస
- ఉపసంహరణల అనంతరం గుర్తుల కేటాయింపు
- ఇద్దరున్న చోట ఉంగరం, కత్తెర, నోటా తప్పనిసరి
- ఈసారి 'నోటా'తో అభ్యర్థుల్లో టెన్షన్

కేసముద్రం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : గ్రామపంచాయతీ ఎన్నికల్లో మొదటి విడత అభ్యర్థులకు గుర్తుల కేటాయింపునకు సమయం ఆసన్నమైంది. పోటీలోంచి వైదొలగాలనుకునే వారు డిసెంబర్ 3న మధ్యాహ్నం 3 గంటలలోపు నామినేషన్ వేసిన సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకోవాల్సి ఉంటుంది. ఆ తర్వాత ఉన్న అభ్యర్థుల నామినేషన్ ప్రతాల్లో రాసిన పేరులోని మొదటి అక్షరాన్ని తీసుకొని రిటర్నింగ్ అధికారి తెలుగు వర్ణమాల ప్రకారం జాబితాను తయారు చేసుకుంటారు. ఒకవేళ ఇంటిపేరును ఆంగ్లంలో, పేరును తెలుగులో రాసినట్లయితే పేరులోని మొదటి అక్షరాన్ని తీసుకుంటారు. అభ్యర్థుల ఇద్దరిపేర్లు ఇంటిపేరుతో సహా ఒకే విధంగా ఉంటే మొదట నామినేషన్ ఎవరు వేస్తారో వారి పేరును ముందు చేరుస్తారు. ఇలా వరుస క్రమంలో చేసిన అనంతరం ఎన్నికల కమిషన్ నిర్ణయించిన గుర్తులను వరుస సంఖ్య ప్రకారం కేటాయిస్తారు.

సర్పంచ్ అభ్యర్థులకు 32 రకాల గుర్తులను కేటాయిస్తూ రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసింది. సర్పంచ్ స్థానానికి ఉంగరం, కత్తెర, బ్యాట్, ఫుట్‌బాల్, లేడీపర్స్, టీవీ రిమోట్, టూత్ పేస్టు, స్పానర్, చెత్తడబ్బా, బ్లాక్‌బోర్డు, బెండకాయ, కొబ్బరితోట, డైమండ్, బకెట్, డోర్ హ్యాండిల్, టీ జల్లెడ, చేతికర్ర, మంచం, పలక, టేబుల్, బ్యాటరీ లైట్, బ్రష్, బ్యాట్స్‌మెన్, మనిషి తెరచాపతో పడవ, బిస్కెట్, వేణువు, చైన్, చెప్పులు, గాలిబుడగ, స్టంప్స్ గుర్తులు ఉన్నాయి. అలాగే వార్డు సభ్యులకు గౌను, గ్యాస్‌స్టౌ, స్టూల్, సిలిండర్, బీరువా, ఈల, కుండ, డిష్ యాంటీనా, గరాట, మూకుడు, ఐస్‌క్రీమ్, గాజుగ్లాసు, పోస్టు డబ్బా, కవర్, హాకీకర్ర, బంతి, నెట్, కటింగ్ ప్లేయర్, బాక్స్, విద్యుత్ స్తంభం, కేటిల్ గుర్తులు ఉన్నాయి. బ్యాలెట్ పేపరులో అభ్యర్థుల పేర్లు ఉండవు, కేవలం గుర్తుల పేర్లు, పక్కన గుర్తులు ఉంటాయి. గులాబీ రంగు బ్యాలెట్ సర్పంచ్‌కు, తెలుపు రంగు బ్యాలెట్ పేపర్ వార్డు సభ్యుని స్థానానికి ఉపయోగిస్తారు. ఈ గుర్తులతోపాటు ఈసారి చివరన 'నోటా'ను జతచేస్తున్నారు. సర్పంచ్ స్థానంలో ఒకవేళ ఇద్దరు అభ్యర్థులుంటే ఉంగరం, కత్తెరతోపాటు నోటాకూడా బ్యాలెట్‌లో ఉండనుంది. దీంతో అతితక్కువ ఓట్లు ఉన్న సర్పంచ్, వార్డు స్థానాల్లో ఈ నోటా ఓట్లు అభ్యర్థుల గెలుపును తారుమారు చేసే అవకాశం ఉంది.



S. No.	Symbols in English and Telugu	Specimen Symbol
1	Ring ఉంగరము	
2	Scissors కత్తెర	
3	Bat బ్యాట్	
4	Football ఫుట్ బాల్	
5	Lady Purse లేడీ పర్సు	
6	T.V. Remote టి.వి. రిమోట్	
7	Tooth Paste టూత్ పేస్టు	
8	Spanner స్పానర్	

ఎన్నికల సంఘం విడుదల చేసిన సర్పంచ్ అభ్యర్థులు గుర్తులు కొన్ని

సర్పంచ్ వేతనం.. నెలకు రూ.6,500 మాత్రమే

పదవి దక్కించుకోవడానికి మాత్రం లక్షల్లో ఖర్చు

వెంకటాపూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సర్పంచ్‌గా పోటీ చేయడానికి, గెలవడానికి పెద్దసంఖ్యలో ఆశావహులు ఉత్సాహపడుతుంటారు. సర్పంచ్ పదవి దక్కించుకోవడానికి రూ.లక్షల్లో ఖర్చు చేస్తుంటారు. వారి ఉత్సాహం గెలుపొందడానికి వారు పెడుతున్న ఖర్చు చూసి ప్రజలు సర్పంచ్‌కు ఎంత వేతనం వస్తుందో, ఆపదవి ద్వారా ఎంత ఆదాయం ఉంటుందో, అందుకే అంతగా ఖర్చు చేస్తున్నారని అనుకుంటారు. రూ.లక్షలు ఖర్చుపెట్టి ఒక్కొక్కరిని బతిమిలాడి సర్పంచ్‌గా గెలిస్తే వారికి నెలకు వచ్చే వేతనం రూ.6,500 మాత్రమే. అది కూడా నెలనెలా రాదు, ఎప్పుడో ప్రభుత్వం గ్రాంటు ఇచ్చినప్పుడు తీసుకోవాలి. 1992కు ముందు సర్పంచ్‌లకు వేతనాలు లేవు, ఆ తర్వాత చిన్న గ్రామపంచాయతీ సర్పంచ్‌లకు రూ.600, మేజర్‌గ్రామపంచాయతీల సర్పంచ్‌లకు రూ. 1000మాత్రమే ఇచ్చేవారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయ్యాక అప్పటి సీఎం కేసీఆర్ 2015 ఏప్రిల్ 1నుంచి సర్పంచ్‌ల వేతనం రూ.5వేలు చేశారు. ఆ తర్వాత 2021లో రూ. 6,500కు పెంచారు. గతంలో గ్రామంలో అభివృద్ధి పనులు చేస్తే ఖర్చులన్నా వెళ్లేవి. 2018 తర్వాత నుంచి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసినా ప్రభుత్వం బిల్లులు చెల్లించకుండా ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉంచడంతో చిల్లిగవ్వ ఆదాయం రాకపోగా పనులు చేయడానికి తెచ్చిన అప్పులకు వడ్డీలు మీదపడుతున్నాయని పలువురు వాపోతున్నారు. మరి ఇంత తక్కువ వేతనం, పనులు చేసిన పైసలు రాకపోయినప్పుడు అంత పోటీ ఎందుకు, అంత ఖర్చు చేస్తారంటే సర్పంచ్ ఆగ్రామానికి ప్రథమ పౌరుడు ఆహోదా, ఆదర్శం, దర్జా దక్కించుకోవడం కోసం ఉన్నది అమ్మి అయినా సరే అప్పులు చేసినా సరే విజయం సాధించాలని ఖర్చు చేస్తున్నారు.



నామినేషన్ వేసి బయటకు వస్తున్న కొంగర మల్లమ్మ

నామినేషన్ వేసిన కొంగర మల్లమ్మ

సంగెం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన కొంగర మల్లమ్మ ఎట్టకేలకు సర్పంచ్ పదవికి నామినేషన్ వేశారు. వరంగల్ జిల్లా సంగెం మండలం ఆశాలపల్లి గ్రామాన్ని స్థానిక ఎన్నికల్లో ఎస్సీ మహిళకు కేటాయించారు. గ్రామంలో 1647 ఓట్లు ఉండగా ఎస్సీ మహిళకు రిజర్వేషన్ కలిపించారు. గ్రామంలో ఒక్క కుటుంబం మాత్రమే ఉన్నట్లు గ్రామస్థులు తెలిపారు. మల్లమ్మ భర్త ఇటీవల చెరువులో పడి మృతి చెందగా మల్లమ్మ ఒక్కరే గ్రామంలో నివసిస్తున్నారు. దీంతో మల్లమ్మ సోమవారం గవిచర్లలోని క్లస్టర్ నామినేషన్ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ తరుపున తన నామినేషన్ వేశారు. మండలంలోని పలు గ్రామాల్లో ఉత్సాహవంతులు పదవులకు పోటీ చేసేందుకు ఉత్సాహంగా నామినేషన్ కేంద్రాలకు మద్దతుదారులతో కలిసి తరలివచ్చారు. దీంతో ఇంతకాలం మల్లమ్మ రిజర్వేషన్ కలిసి రావడంతో ఇక ఈమే సర్పంచ్‌గా ఎన్నిక కాబోతున్నట్లు వాట్సాప్‌లల్లో ప్రచారం జరిగింది.

ఒకే ఊరు.. పంచాయతీలు వేరు..

- మూడు మండలాల పరిధిలో నాలుగు జీపీ కార్యాలయాలు
- గ్రామం మధ్యలో సరిహద్దు లైన్‌గా సీసీ రోడ్డు



ఒకే గ్రామంగా కనిపించే సత్యనారాయణపురం

బయ్యారం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సాధారణంగా ఒక ఊరికి ఒకే పేరు ఉంటుంది.. కానీ ఆ ఊరిలో మాత్రం ఇళ్లు పక్కపక్కనే ఉన్నా రెండు గ్రామాల పరిధిలోకి వస్తాయి.. గ్రామాల పేర్లు, పంచాయతీ కార్యాలయాలు, మండలాలూ వేర్వేరుగా ఉన్నాయి.. ఇవి చూడడానికి ఒకే గ్రామంగా కనిపించినా గ్రామం మధ్య ఉన్న సీసీ రోడ్డు పంచాయతీలకు బోర్డర్ లైన్‌గా ఏర్పాటైంది. అవే జిల్లా పరిధిలోని ఉప్పలపాడు, బోడగుట్టతండా, సత్యనారాయణపురం, సంతులాల్‌పోడుతండా పంచాయతీలు.. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి..

మానుకోట జిల్లాలోని లక్ష్మీనరసింహాపురం గ్రామం చూడడానికి ఒకే గ్రామంగా కనిపిస్తుంది. కానీ ఆ గ్రామం మాత్రం రెండు పంచాయతీలు, మండలాల పరిధిలోకి వస్తుంది. ఒక బజారు మహబూబాబాద్ మండలం బోడగుట్ట తండా పంచాయతీ పరిధిలోకి రాగా.. మరొక బజారు బయ్యారం మండలం ఉప్పలపాడు పంచాయతీ పరిధిలోకి వస్తుంది. బోడగుట్ట తండా జీపీలో 495 ఓట్లు ఉండగా.. ఉప్పలపాడు జీపీలో 2075 ఓట్లు ఉన్నాయి. అదే విధంగా సత్యనారాయణపురం గ్రామంలో కూడా పంచాయతీలు, మండలాలు వేరు. సత్యనా రాయణపురం గ్రామంలోని ఓ బజారు బయ్యారం మండలం సంతులాల్‌పోడుతండా పంచాయతీ పరిధిలోకి రాగా.. మరో బజారు గార్ల మండలం సత్యనారాయణపురం పంచాయతీ పరిధిలోకి వస్తుంది. సంతులాల్‌పోడు తండా జీపీలో 962 ఓట్లు ఉండగా.. సత్యనారా యణపురం జీపీలో 367 ఓట్లు ఉన్నాయి. కాగా, పంచాయతీ ఎన్నికల వేళ ఈ గ్రామాలు చర్చనీయాంశంగా మారాయి. మూడు మండలాలు, నాలుగు పంచాయతీల పరిధిలో గల ఈ రెండు గ్రామాల్లోకి ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారు గ్రామాల గురించి ఆసక్తిగా చర్చించుకుంటున్నారు.

ఎన్నికల్లో జోరుగా 'సోషల్' మెసేజ్‌లు

- వాట్సాప్ గ్రూపుల్లో చక్కర్లు కొడుతున్న పోస్టులు
- అభ్యర్థుల తీరుపై విచిత్ర వీడియోలు



భూపాలపల్లిటౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో సోషల్ మీడియాలో చిత్ర విచిత్రమైన వీడియోలు దర్శనమిస్తున్నాయి. సర్పంచ్ అభ్యర్థుల ఎంపికలో ప్రజలు ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలో తెలిపే వ్యాసాలు కనిపించడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేసే విషయంపై పలు షార్ట్ ఫిలిమ్స్ కూడా వచ్చాయి. వాటిలో సందేశాత్మక చిత్రాలూ ఉంటాయి. సర్పంచ్ అభ్యర్థులు ఏ పార్టీకి చెందిన వారైనా సరే... తమ వ్యక్తిత్వానికి ప్రాధాన్యత ఇవ్వాలనే వ్యాసాలు సోషల్ మీడియాలో దర్శనమిస్తున్నాయి. అలాగే ఎక్కువ ఖర్చు చేసే వారికి ఓటు వేస్తే ఐదేళ్లు వారిని భరించాలని, వారు గ్రామాభివృద్ధికి పెద్దగా పనిచేయరని పేర్కొంటున్నారు. ఓటుకు నోటు తీసుకోవద్దనే మెసేజ్‌లు కూడా చక్కర్లు కొడుతున్నాయి. ఇక పోటీదారుల విషయానికి వస్తే... ఓటర్ల వద్దకు వెళ్లి నేరుగా కాళ్లు మొక్కడమే కాకుండా వారి కడుపులో తలకాయపెట్టి మరీ ఒట్టు వేయించుకోవడం పరిపాటైంది. ఇష్టమొచ్చినట్లు హామీలు ఇస్తూ ఓటర్లను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. దీనిపై ఓటర్లలో మిశ్రమ స్పందన కనిపిస్తోంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో కోతులు, కుక్కల బెడద ప్రధాన సమస్యగా మారుతోంది. దీంతో వాటిని కట్టడి చేయాలన్నదే అభ్యర్థులు ముందు ప్రజలు పెడుతున్న ప్రధాన డిమాండ్.

ఏకగ్రీవానికే జై..

(5వ పేజీ తరువాయి)

మేకల రాధ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేస్తూ మిగతా వారి నామినేషన్లను విత్ డ్రా చేసుకొనేందుకు అంగీకారం తీసుకున్నారు.

జనగామ జిల్లా ఆరు..

జనగామ జిల్లాలో ఆరు గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి. రఘునాథపల్లి మండలంలోని వెల్ది, సోమయ్యకుంటతండా, రామన్నగూడెం, అయ్యవారిగూడెం, స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలోని జిట్టెగూడెం, తరిగొప్పుల మండలంలోని మాన్సింగ్‌తండా గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి. రఘునాథపల్లి మండలం వెల్ది సర్పంచిగా ఏకగ్రీవమైన సింగిరెడ్డి మమత, అమె భర్త శ్రీనివాస్ గతంలో సర్పంచిగా, ఎంపీటీసీగా ఓడిపోయారు. దీంతో ఈసారి తనకు అవకాశం ఇవ్వాలని కోరగా ఎవరూ నామినేషన్ వేయలేదు. సోమయ్యకుంట తండా, అయ్యవారిగూడెంతో ప్రత్యర్థుల మధ్య బంధుత్వాలు ఉండడంతో గ్రామస్థుల చొరవతో ఏకగ్రీవం అయ్యాయి. తరిగొప్పుల మండలం మాన్సింగ్ తండా సర్పంచ్‌గా ఏకగ్రీవమైన కత్తుల కొమురయ్య గ్రామంలో దుర్గమ్మ గుడి నిర్మాణానికి కావాలసిన భూమిని గతంలో దానం ఇచ్చాడు. గుడి నిర్మాణానికి కూడా సహకరిస్తానని గతంలో మాట ఇవ్వడంతో ఎవరూ నామినేషన్ వేయలేదు.

వరంగల్ జిల్లాలో 5..

వరంగల్ జిల్లాల 5 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. వర్ధన్నపేట మండలంలో 2, రాయపర్తి మండలంలో 3 పంచాయతీలు ఏకగ్రీవంగా అయ్యాయి. రాయపర్తి మండలం కిష్టాపురంలో జనరల్‌కు రిజర్వు అయింది. ఇక్కడ భూస్వామి కొండం రంగారెడ్డికి ఊరిలో మంచి పలుకుడి, గౌరవం ఉంది. గతంలో చాలావాటికి దానధర్మాలు చేశారు. పైగా ఈయన ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తమ్ముడి క్లాస్‌మేట్. దీనితో పోటీకి ఎవరూ ముందుకు రాలేదు. రంగారెడ్డి ఒక్కరే నామినేషన్ వేయడంతో ఆయన ఏకగ్రీవం ఖాయమైంది. ఇదే మండలంలోని మురిపిరాల గ్రామ పంచాయతీ కూడా ఏకగ్రీవమైంది. ఈ పంచాయతీ బీసీ జనరల్ అయింది. ఇక్కడి నుంచి సర్పంచ్‌గా ఏకగ్రీవమైన పెదగోని నాగరాజు కారోబార్. ఆయనకు గ్రామంలో మంచి పేరుంది. అన్ని వర్గాలు, పార్టీలతో కలిసి మెలిసి ఉంటాడు. దీనితో ఆయన సర్పంచ్ పదవికి అందరూ ఆమోదం తెలిపారు. దీనితో ఈ పంచాయతీలో నాగరాజు నామినేషన్ ఒక్కటే పడడంతో ఆయన ఏకగ్రీవం ఖాయమైంది. ఇదే మండలంలోని బాలాజీనగర్ గ్రామ పంచాయతీ కూడా ఏకగ్రీవమైంది. ఈ పంచాయతీ ఎస్టీ జనరల్. సర్పంచ్‌గా బానోతు మోహన్‌లాల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈయన మాజీ ఎమ్మెల్యే బానోతు శంకర్‌నాయక్‌కు స్వయాన తమ్ముడు. ఆయన చొరవ, గ్రామాభివృద్ధికి హామీతో మోహన్‌లాల్ ఎన్నికకు మార్గం సుగమం అయింది. వర్ధన్నపేట మండలంలోని రామోజీ కుమ్మరిగూడెం పంచాయతీ కూడా ఏకగ్రీవమైంది. ఇది ఎస్టీ మహిళకు రిజర్వు అయింది. ఇక్కడి నుంచి భూక్య సుశీల ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గ్రామాభివృద్ధికి రూ.8లక్షలు ఇస్తానని ప్రకటించిన మీదట స్థానికులు ఏకగ్రీవానికి ఒకే చేశారు. ఇదే మండలంలోని చంద్రుగొండ గ్రామ పంచాయతీ కూడా ఇదే మాటలో నడిచింది. ఎస్టీ మహిళకు రిజర్వే అయిన ఈ పంచాయతీ నుంచి భూక్య నీల రవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తనను ఏకగ్రీవంగా ఎన్నుకుంటే గ్రామాభివృద్ధికి రూ.8లక్షలు ఇస్తానని మాట ఇచ్చినందుకు స్థానికులు ఒకే చేశారు.

భూపాలపల్లి జిల్లాలో ఒకటి..

భూపాలపల్లి జిల్లాలో ఒకే ఒక గ్రామ పంచాయతీ ఏకగ్రీవమైంది. గోరికొత్తపల్లి మండలం చెంచుపల్లి గ్రామ పంచాయతీ ఎస్టీ జనరల్‌కు రిజర్వు అయింది. ఇక్కడ అంతా ఎస్టీలే. ఒక్క నామినేషనే దాఖలైంది. వీరంతా కలిసి జెల్లా రాంబాబును సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామాన్ని అభివృద్ధి చేస్తానని ఇచ్చిన హామీ మేరకు ఏకగ్రీవమైంది.

మహబూబాబాద్ జిల్లాలో మూడు..

మహబూబాబాద్ జిల్లాలో మూడు గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి. కేసముద్రం మండలంలో రెండు, ఇనుగుర్తిలో ఒక గ్రామపంచాయతీ ఏకగ్రీవం అయినవాటిలో ఉన్నాయి. ఒక్కొక్క నామినేషన్ దాఖలు చేయడం ఈ మూడు జీపీలు ఏకగ్రీవం కానున్నాయి. కేసముద్రం మండలంలో నూతనంగా ఏర్పాటైన చంద్రుతండ ఎస్టీకి రిజర్వు అయింది.

ఈ పంచాయతీలో అత్యల్పంగా 370మంది ఓటర్లే ఉండడం, అంతా ఒక్కచోట చేరి కూర్చొని చర్చించుకొని ఏకగ్రీవానికి నిర్ణయం తీసుకున్నారు. సర్పంచ్‌గా బానోత్ శ్రీను ఎన్నికయ్యారు. కాంగ్రెస్ వ్యక్తికి సర్పంచ్, బీఆర్ఎస్‌కు ఉపసర్పంచ్ పదవిని, నాలుగు చొప్పున ఇరు పార్టీలు వార్డులను నిర్ణయించుకొని అన్ని స్థానాల్లో ఒకటి నామినేషన్‌ను దాఖలు చేశారు. ఇదే మండలంలోని నారాయణపురం ఎస్టీ మహిళకు రిజర్వు అయింది. ధరావత్ యమున ఒకే నామినేషన్ దాఖలు చేశారు. ఈ గ్రామంలోనూ ఇరుపార్టీలు సర్పంచ్, ఉపసర్పంచ్ కేటాయించుకొని ఏకగ్రీవానికి మార్గం సుగమం చేసుకున్నారు. ఇనుగుర్తి మండలం పాతతండ ఎస్టీకి రిజర్వు అయింది. ఇస్లావత్ నరేష్ ఒక్కడే నామినేషన్ వేశాడు. తండాను అభివృద్ధి చేసుకోవాలనే కాంక్షతో తండావాసులు సర్పంచ్‌ను ఏకగ్రీవం చేశారు.

గిరిజనులు లేని ఏజెన్సీ గ్రామం

- ఎస్టీలకే సర్పంచ్, మూడు వార్డులు రిజర్వు
- కోటగడ్డలో విచిత్ర పరిస్థితి



కోటగడ్డ గ్రామపంచాయతీ

సర్పంచ్‌గా ఎన్నిక కానున్న లిల్లీ

గోవిందరావుపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని కోటగడ్డలో విచిత్ర పరిస్థితులు నెలకొన్నాయి. షెడ్యూల్ గ్రామంగా గుర్తించిన ఈ ఊరిలో కేవలం ముగ్గురే గిరిజన ఓటర్లు ఉన్నారు. నిబంధనల ప్రకారంగా ఈ గ్రామ సర్పంచ్, సగం వార్డులను ఎన్నికల కమిషన్ ఎస్టీలకు కేటాయించింది. సర్పంచ్‌కు ఒక నామినేషన్ దాఖలు కాగా మూడువార్డులకు నామినేషన్ పడలేదు. దీంతో క్రితంలాగే ఈసారి కూడా ఆమూడు వార్డులు ఖాళీగా మిగలనున్నాయి. ఆరు వార్డులతో ఉన్న కోటగడ్డ గ్రామంలో పంచాయతీ ఎన్నికలు ప్రత్యేకతను సంతరించుకున్నాయి. గత ఎన్నికల్లో సర్పంచ్ పదవికి గ్రామానికి చెందిన బానోత్ లిల్లీ, కుర్సం రామక్క పోటీపడగా రామక్క విజయం సాధించారు. అయితే ఇటీవల ఆమె బతుకుదెరువు కోసం వేరే ప్రాంతానికి వలస వెళ్లింది. దీంతో ఆమె ఎన్నికల్లో పాల్గొనలేదు. లిల్లీ ఒక్కరే సింగిల్ నామినేషన్ దాఖలు చేశారు. ఆరు వార్డులకుగాను మూడు ఎస్టీలకు, మూడు జనరల్‌కు రిజర్వు చేశారు. జనరల్ వార్డులకు రెండు చొప్పున నామినేషన్లు పడగా ఎస్టీ రిజర్వు వార్డులకు నామినేషన్లు కరువయ్యాయి. దీంతో సింగిల్ నామినేషన్‌తో లిల్లీ సర్పంచ్‌గా ఎన్నిక కానున్నారు. గత ఎన్నికల్లో ఓడినప్పటికీ ఈసారి సర్పంచ్ పీఠాన్ని దక్కించుకున్నారు. అయితే నామినేషన్లు ఏమీ రాకపోవడంతో గతంలోలాగానే ఈసారి కూడా ఆమూడు వార్డులు ప్రజాప్రతినిధులు లేకుండా ఖాళీగా మిగలనున్నాయి.

అభ్యర్థులు పార్టీలకతీతంగా పోటీ చేయాలి

- పాటించకుంటే కుల బహిష్కరణ
- ప్రగతిసింగారంలో ఎస్సీల తీర్మానం



ప్రగతిసింగారంలో తీర్మానం కాపీని చూపుతున్న ఎస్సీ కుల పెద్దలు

శాయంపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రగతి సింగారం గ్రామం సర్పంచ్ పదవి ఎస్సీకి రిజర్వ్ అయింది. ఈ నేపథ్యంలో సోమవారం ఎస్సీ కుల పెద్దలు గ్రామంలో సమావేశం నిర్వహించి తీర్మానం చేశారు. గ్రామంలో సర్పంచ్ అభ్యర్థిగా పోటీచేసే అభ్యర్థి ఎలాంటి రాజకీయ పార్టీ మద్దతు లేకుండా స్వతంత్రంగా పోటీ చేయాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ నిబంధనను తప్పక పాటించాలని, ఉల్లంఘిస్తే కుల బహిష్కరణ చేస్తామని హెచ్చరించారు. పార్టీల పరంగా పోటీపడి అధికంగా ఖర్చులు చేసి, అభ్యర్థుల కుటుంబాలు రోడ్డున పడకూడదనే ఉద్దేశంతోనే ఈ తీర్మానం చేసినట్లు తెలిసింది. ఈ విషయం మండల వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

యమ కిలాడీ.. ఈ నకిలీ డీఎస్పీ..



వివరాలు వెల్లడిస్తున్న సీపీ సన్‌ప్రీత్‌సింగ్

- అవినీతి చిట్టా తెలుసుకొని ఏసీబీ పేరిట గాలం
- ఎంవీఐ తుమ్మల జైపాల్‌రెడ్డికి బెదిరింపులు
- ఆన్‌లైన్‌లో రూ.9లక్షల96 వేలు వసూలు
- ముఠాను పట్టుకున్న టాస్క్‌ఫోర్స్, మిల్స్‌కాలనీ పోలీసులు
- వివరాలు వెల్లడించిన సీపీ సన్‌ప్రీత్ సింగ్

వరంగల్ క్రైం, డిసెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రతీ రోజూ పత్రికల్లో ప్రచురితమయ్యే అవినీతి అధికారుల వివరాలను తెలుసుకొని ఏసీబీ డీఎస్పీ పేరిట ఫోన్‌చేసి లక్షల్లో డబ్బులు వసూలు చేసిన నకిలీ ఏసీబీ డీఎస్పీ ముఠాను టాస్క్‌ఫోర్స్, మిల్స్‌కాలనీ పోలీసులు సంయుక్తంగా అరెస్టు చేసినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. సోమవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో సీపీ వివరాలు వెల్లడించారు. వరంగల్ ఆర్టీవో కార్యాలయంలో ఎంవీఐగా విధులు నిర్వర్తిస్తున్న తుమ్మల జైపాల్‌రెడ్డికి అక్టోబరు నెలలో గుర్తుతెలియని వ్యక్తి ఏసీబీ డీఎస్పీనంటూ ఫోన్ చేసి బెదిరించాడు. దీంతో సుమారు రూ.9.60 లక్షలు దశలవారీగా జైపాల్‌రెడ్డి ముట్టజెప్పాడు. తర్వాత జైపాల్‌రెడ్డి మిల్స్‌కాలనీ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. అనంతరం వివిధ మార్గాలను అన్వేషించి చివరికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పుట్టపర్తి జిల్లాలోని వేలమద్ది గ్రామానికి చెందిన ప్రధాన నిందితుడు రాచంపెల్లి శ్రీనివాస్‌తోపాటు సహకరించిన కర్ణాటక రాష్ట్రంలోని బెంగూళూరుకు చెందిన నవీన్, మంగళ రవీందర్, మురళి, ప్రసన్నలను అక్కడే అదుపులోకి తీసుకోగా, అందే ప్రాంతానికి చెందిన సూర్యప్రకాశ్, తాటిమర్రి వేణు, కొత్తకోట రమణ పరారీలో ఉన్నారు. కాగా, నిందితుల నుంచి 13 సెల్‌ఫోన్‌లతోపాటు రూ.9,700 నగదును స్వాధీనం చేసుకున్నారు.


విచారణలో విస్తుపోయే నిజాలు

ప్రధాన నిందితుడైన రాచంపల్లి శ్రీనివాస్ 7వ తరగతి చదివి ఓ ఎస్సై దగ్గర డ్రైవర్‌గా చేరాడు. పోలీసులతో తిరిగిన నిందితుడు కేసుల గురించి అవగాహన పెంచుకున్నాడు. 2002లో మొదటగా జల్సాల కోసం ద్విచక్రవాహనం చోరీ చేశాడు. అనంతరం రాయలసీమ ప్రాంతంలో దొంగతనాలకు పాల్పడిన నిందితుల ఇంటికి పోలీసుగా వెళ్లి చోరీ చేసిన సొమ్ము ఎక్కడ దాచారని బెదిరించి డబ్బులు, బంగారం లాక్కున్నాడు. ఇలా సుమారుగా 50 ఘటనల్లో పాల్గొనగా పోలీసులు శ్రీనివాస్‌ను అరెస్టు చేసి జైలుకు తరలించారు. జైలులో ఉండగానే ఎస్కార్ట్ పోలీసులను తన వైపు తిప్పుకొని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు నటించి బయటికి వెళ్లి చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడేవాడు. ఇలా ఏకంగా 41 చైన్ స్నాచింగ్‌లకు పాల్పడ్డాడు. సీసీ కెమెరాల్లో నిందితుడు కనిపించడంతో పాటు స్థానికులకు దొరికిన ఘటనలు ఉండడంతో ఉన్నతాధికారులు విచారణ చేసిన కడపలోని ఏడుగురు ఏఆర్ కానిస్టేబుళ్లను శాశ్వతంగా విధుల్లో నుంచి తొలగించారు. 9మందిలో ఒక కానిస్టేబుల్ ఏకంగా నిందితుడితో కలిసి చోరీల్లో పాల్గొన్నాడు. అనంతరం శ్రీనివాస్ మకాంను బెంగూళూరుకు మార్చాడు. అక్కడ న్యూస్ పేపర్‌లో వచ్చే అవినీతి అధికారుల చిట్టా తెలుసుకొని నకిలీ ఏసీబీ డీఎస్పీ అవతారమెత్తాడు. ఏపీ, తెలంగాణలో 19 మంది ప్రభుత్వ ఉద్యోగులను ఫోన్‌లో బెదిరించి సుమారు రూ.50 లక్షలు వసూలు చేశాడు. ఇలా 19 కేసుల్లో పాల్గొనగా, 8 కేసుల్లో అరెస్టు అయ్యాడు. మిగతా 11 కేసుల్లో రెండు ఏపీలో జరగగా, మిగతావి మిల్స్‌కాలనీ, స్టేషన్‌ఘన్‌పూర్ పీఎస్‌లతో పాటు తెలంగాణలోని ఇతర జిల్లాల్లో జరగగా తప్పించుకొని తిరుగుతున్నాడు. అక్రమంగా వసూలు చేసిన డబ్బులతో ప్రధాన నిందితుడు, అతడికి సహకరించే నలుగురు వ్యక్తులు ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు పాల్పడేవారు. అలాగే గోవాలో కాసినో జూదం ఆడేవారు. అంతేకాక గోవా, బెంగుళూరు నగరాల్లో వ్యభిచారానికి సుమారు 82లక్షలు ఖర్చుపెట్టినట్లుగా విచారణలో ఒప్పుకున్నారు.

ప్రతిభ చూపిన పోలీసులకు రివార్డులు

నకిలీ ఏసీబీ ముఠాను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన టాస్క్‌ఫోర్స్ పోలీసులతో పాటు మిల్స్‌కాలనీ పోలీసులను సీపీ సన్‌ప్రీత్‌సింగ్ నగదు రివార్డులను అందజేశారు. మొత్తంగా ఈ కేసులో టాస్క్‌ఫోర్స్ సీఐ పవన్‌కుమార్ కీలకపాత్ర పోషించినట్లుగా విశ్వసనీయమైన సమాచారం.

ఈ సమావేశంలో సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత, వరంగల్ ఏసీపీ శుభం, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్స్ పవన్‌కుమార్, శ్రీధర్, మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ బొల్లం రమేశ్, ఎస్సై మహేశ్ తదితరులు పాల్గొన్నారు.



'గీతామృత సారం' పుస్తకావిష్కరణ



'గీతామృత సారం' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న శఠగోపాచార్యులు

వడ్డేపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ 60వ డివిజన్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం గీతా జయంతిని పురస్కరించుకొని కొత్తపల్లి పుల్లారెడ్డి రూపొందించిన గీతామృత సారం పుస్తకాన్ని ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త శఠగోపాచార్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శఠగోపాచార్యులు మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక వేదికగా విరాజిల్లుతున్న వడ్డేపల్లిలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో పుస్తకాన్ని ఆవిష్కరించడం ఆనందదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు చిర్ర రమపతి రెడ్డితో పాటు భక్తులు, ఆధ్యాత్మిక వేత్తలు, కవులు, పుస్తక ప్రియులు పాల్గొన్నారు.

కోఎడ్ ఇంజరింగ్ కళాశాలలో
ఫ్రెషర్స్‌డే సంబురాలు

కేయూ క్యాంపస్ డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కేయూ క్యాంపస్‌లోని కో ఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ఫ్రెషర్స్‌డే సంబురాలు ఘనంగా జరిగాయి. బీటెక్ రెండో ఏడాది విద్యార్థులు మొదటి ఏడాది విద్యార్థులకు స్వాగత కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ వి.మహేందర్, ఇన్‌చార్జి కె.సుమలత, సూపరింటెండెంట్ బోల్నేపాక ప్రభాకర్‌లు పాల్గొని విద్యార్థులకు దిశ నిర్దేశం చేశారు. తల్లిదండ్రుల కలను నేరవేర్చాలని, ఉన్నత ఉద్యోగాలు సాధించాలని అన్నారు. జీవితంలో ఉన్నతంగా స్థిరపడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు,బోధనేతర సిబ్బంది డాక్టర్ సంగాల ఎప్రామ్‌రాజ్, హరీశ్, లావణ్య, సూర్యకుమారి, గౌతమి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాల పీఆర్వోగా ఆదిరెడ్డి

వరంగల్ ఎడ్యుకేషన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల పీఆర్వోగా ఆదిరెడ్డిని నియమించినట్లు కాలేజ్ ప్రిన్సిపాల్ ఎస్.జ్యోత్స్న తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆదిరెడ్డికి నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

రేపటి నుంచి విద్యుత్ లోకల్ కోర్టులు

రాంనగర్, డిసెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సమస్యలపై ఈ నెల 3 నుంచి హనుమకొండ, కరీంనగర్, పెద్దపల్లి, జనగామ, ఖమ్మం సర్కిళ్ల పరిధిలో లోకల్ కోర్టులు నిర్వహిస్తున్నట్లు విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్ పర్సన్ ఎన్.వి. వేణుగోపాల్ చారి ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులకు విద్యుత్‌శాఖ నుంచి అందించాల్సిన సేవల్లో ఎలాంటి లోపం ఉన్నా.. ఫిర్యాదుచేస్తే లోకల్ కోర్టుల ద్వారా పరిష్కరిస్తామన్నారు. ఈనెల 3న కరీంనగర్ సర్కిల్ పరిధిలోని ఇల్లందకుంట సెక్షన్ కార్యాలయంలో, 4న పెద్దపల్లి సర్కిల్ పరిధిలోని ఎక్లాసపూర్ స్టేషన్‌లో, 9న హనుమకొండ సర్కిల్‌లోని ఐనవోలు సబ్‌స్టేషన్ పరిధిలోని ప్రాంతాల వినియోగదారులకు, 11న జనగామ సర్కిల్ పరిధిలోని నర్మెట్ట సబ్‌స్టేషన్‌లో, 16న ఖమ్మం సర్కిల్‌లోని కొణిజర్ల రైతు వేదికలో, 17న ఖమ్మం సర్కిల్ పరిధిలోని ముదిగొండ సబ్‌స్టేషన్‌లో లోకల్ కోర్టులు నిర్వహిస్తామని, ఆయా సెక్షన్ల పరిధిలోని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పోర్ట్ ఫోలియో జడ్జిని కలిసిన బార్ ప్రతినిధులు

వరంగల్ లీగల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హైకోర్టు జడ్జి, హనుమకొండ జిల్లా పోర్ట్ ఫోలియో జడ్జి జస్టిస్‌విజయసేనారెడ్డిని హనుమకొండ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పులి సత్యనారాయణ ఆధ్వర్యంలో సోమవారం రాష్ట్ర హైకోర్టులో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కోర్టులో నెలకొని ఉన్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. జస్టిస్‌ను కలిసిన వారిలో సంయుక్త కార్యదర్శి అంబేద్కర్, లైబ్రరీ సెక్రటరి కె.వెంకట్, కార్యవర్గ సభ్యులు సునిల్‌కుమార్, నిఖిల్ ఉన్నారు.

ఇంజనీరింగ్ విద్యార్థికి అభినందనలు

కేయూ క్యాంపస్ డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కేయూ కో ఎడ్ ఇంజనీరింగ్ విద్యార్థి పడమటింటి సాయికుందన్‌ను సోమవారం కేయూ వీసీ ప్రొఫెసర్ కె.ప్రతాప్‌రెడ్డి,రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంలు అభినందించారు. సాయికుందన్ నవంబరు 22 నుంచి 28 వరకు గుజరాత్ అహ్మదబాద్‌లోని సర్దార్ వల్లబాయిపటేల్ వర్సిటీలో నిర్వహించిన ఇంటిగ్రేషన్ క్యాంప్‌లోని పాల్గొన్నారు. తెలంగాణ భాష, నృత్యాలను ప్రదర్శించి ప్రతిభచూపారు. సాయికుందన్ బీటెక్ మూడో ఏడాది ఐటీ చదువుతున్నారు. సాయికుందన్‌ను అభినందించిన వారిలో ఎన్ఎస్ఎస్‌కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ, స్టూడెంట్ అఫైర్స్ డీన్ ప్రొఫెసర్ మామిడాల ఇస్తారీ, పీవోలు డాక్టర్ డి.శైలజ, ఎం.సౌజన్యలు పాల్గొన్నారు

బయోటెక్నాలజీ స్టూడెంట్‌కు అభినందనలు

కేయూ బయోటెక్నాలజీ ఎన్ఎస్ఎస్ వలంటీర్ జయశీల రూపాని సోమవారం కేయూ వీసీ ప్రొఫెసర్ కె.ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంలు అభినందించారు. జయశీల నవంబరు 18-27 వరకు హిమచల్‌ప్రదేశ్ ధర్మశాల ఆటల్ బిహారి వాజ్‌పాయి ఇన్స్టిట్యూట్‌లో నిర్వహించిన అడ్వెంచర్ క్యాంప్‌లో పాల్గొన్నారు. నేచురల్ రాక్ క్లైబింగ్, అర్టిఫిషియల్, ట్రెక్కింగ్, క్లింబిగ్, రివర్ క్రాసింగ్‌తదితర పోటీల్లో లతో ప్రతిభ చూపారు.

ఫిబ్రవరిలో రాజనీతిశాస్త్ర సదస్సు

కేయూ క్యాంపస్ డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి 16, 17 తేదీల్లో కేయూ రాజనీతిశాస్త్ర విభాగం నేతృత్వంలో రెండు రోజుల జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు రాజనీతిశాస్త్ర విభాగాధిపతి సంకినేని వెంకట్ సోమవారం తెలిపారు. సదస్సు పోస్టర్‌ను సోమవారం కేయూ పరిపాలన భవనంలో వీసీ ప్రొఫెసర్ కె.ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, విభాగాధిపతి డాక్టర్ సంకినేని వెంకట్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ.. సరళీకరణ అనంతరం భారత దేశంలో జనరంజక విధానాలు అనే అంశంపై సదస్సు జరుగుతుందని తెలిపారు. 1947 తర్వాత దేశంలో మిశ్రమ ఆర్థిక విధానాలు ప్రజలకు సరైన అభివృద్ధిని ఇవ్వలేదన్నారు. ఆయా అంశాలపై రెండురోజుల జాతీయ సదస్సులో కీలక చర్చలు జరుగుతాయని వెల్లడించారు. సదస్సులో వచ్చిన ప్రతిపాదనలతో కేంద్రానికి విధాన రూపకల్పన తయారు చేసేందుకు ఉపకరిస్తోందని అన్నారు. కార్యక్రమంలో డీన్ ప్రొఫెసర్ బి.సురేశ్ లాల్, ఆర్. మల్లికార్జున్‌రెడ్డి, ప్రిన్సిపాల్ తాళ్ళపల్లి మనోహర్, కట్ల రాజేందర్, బీవోఎస్ కృష్ణయ్య, అధ్యాపకులు సత్యనారాయణ, నాగరాజు, లలిత కుమారి, భాగ్యమ్మ, సంజీవ్, లక్ష్మినారాయణ, సోమలింగం, కల్లెపల్లి ప్రశాం త్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలకతీతంగా అభివృద్ధే లక్ష్యం

పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



ముదిరాజ్ వీధిలో అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, కార్పొరేటర్ అభినవ్ భాస్కర్

వడ్డేపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాజకీయాలకతీతంగా అభివృద్ధే తన లక్ష్యమని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. వడ్డేపల్లిని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నిలుపుతామన్నారు. సోమవారం హనుమకొండ 60వ డివిజన్ వడ్డేపల్లిలోని ముదిరాజ్, ముస్లిం, ఎస్‌బీహెచ్ బ్యాంకు కాలనీల్లో రూ.1.65కోట్ల నిధులతో చేపట్టే అభివృద్ధి పనులకు స్థానిక కార్పొరేటర్ దాస్యం అభినవ్ భాస్కర్‌తో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎంను అడిగిన వెంటనే తన నియోజకవర్గానికి ఎక్కువ నిధులు మంజూరు చేశారన్నారు. గత ప్రభుత్వంలో వడ్డేపల్లి ప్రాంతం అన్ని రంగాల్లో వెనుకబడి పోయిందన్నారు. వరంగల్ పశ్చిమ నియోజక వర్గంలోని అన్ని కాలనీల్లో అభివృద్ధి పనులు శర వేగంగా జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఎనుకొంటి నాగరాజు, 60వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎనుకొంటి పున్నం చందర్, కాంగ్రెస్ మహిళా డివిజన్ అధ్యక్షురాలు గన్నెబోయిన శ్వేతా గణేష్ గౌడ్, టీపీసీసీ సోషల్ మీడియా జిల్లా నేత ఎండీ ముస్తాక్ నెహాల్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మేరుగు శివ, జనగాం శ్రీనివాస్ గౌడ్, తాళ్లపెల్లి సుధాకర్, మండల సమ్మయ్య, తాళ్లపెల్లి రవీందర్, తాళ్లపెల్లి విజయ్, ఎండీ అక్మల్, మిడిదొడ్డి శేఖర్, తాళ్లపెల్లి మేరి, బుస్స నవీన్, కమల్, సాదిక్, బీజేపీ నాయకులు రోకుల సతీష్, మట్టిమల్లి రాంరాజ్, నాగపురి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

మత్స్యకారుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం హనుమకొండలోని వడ్డేపల్లిలో ఎమ్మెల్యేను వడ్డేపల్లి మత్స్య పారిశ్రామిక సంఘం చైర్మన్ మట్టెపల్లి నర్సింగం, ఫిషర్‌మెన్ కాంగ్రెస్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మండల సమ్మయ్య, మెపా జిల్లా అధ్యక్షుడు పులి రాజేష్ కలిసి వినతిపత్రం ఇచ్చారు. వడ్డేపల్లి చెరువులో గుర్రపు డెక్క ఆకును తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మత్స్యకారుల కోసం ప్రభుత్వం ప్రత్యేక రాయితీ పథకాలు రూపొందించి అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో వడ్డేపల్లి మత్స్యపారిశ్రామిక సంఘం నాయకులు మట్టెపల్లి కోటేశ్వర్, మట్టెపల్లి శంకర్, నటరాజ్, మట్టెపల్లి సాంబయ్య, కేశబోయిన కోటేశ్వర్‌రావు, సదానందం, సారయ్య, మట్టెపల్లి రాంరాజ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్నేషనల్ రికార్డుల్లో అనితారెడ్డికి స్థానం



బాలసముద్రం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ మనం ఫౌండేషన్ బుక్ ఆఫ్ రికార్డ్‌లో అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్, కేయూ పాలక మండలి సభ్యురాలు డాక్టర్ కె.అనితారెడ్డికి చోటు లభించింది. సామాజిక, దేశభక్తిని పెంపొందించే కార్యక్రమాలు, అవగాహన సదస్సులు నిర్వహించినందుకు మనం ఫౌండేషన్ సర్టిఫికెట్‌ను ప్రదానం చేసింది. మూడు దశాబ్దాలుగా అనాథ పిల్లలు, మానసిక, శారీరక దివ్యాంగులను ఆదరించి సేవలందిస్తున్నందుకు సర్టిఫికెట్‌ను ప్రదానం చేసినట్లు మనం ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ చక్రవర్తి తెలిపారు. తనకు లభించిన గుర్తింపునకు ఇక ముందు కూడా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తానని అనితారెడ్డి తెలిపారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలి

సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత



నాగారంలో నామినేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న డీసీపీ కవిత

హసన్‌పర్తి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలని సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత సూచించారు. మండలాల్లో సర్పంచ్, వార్డు స్థానాలకు రెండో విడత నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ సోమవారం కొనసాగింది. డీసీపీ దార కవిత మండలంలోని సీతంపేట, నాగారం క్లస్టర్ గ్రామ పంచాయతీ కార్యాలయాలను సందర్శించి నామినేషన్ల స్వీకరణ ఏర్పాట్లను పరిశీలించారు. నామినేషన్ కేంద్రాల్లో అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా నామినేషన్ పత్రాలు వేసేందుకు పూర్తి స్థాయిలో పోలీసులు సహకరించాలన్నారు. ఎక్కడా అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా అప్రమత్తంగా ఉండాలని పోలీసు సిబ్బందికి సూచించారు. ఎన్నికల కేంద్రాల వద్ద శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అవసరమైతే అదనపు బలగాలను మోహరిస్తామన్నారు. ఎన్నికలు ముగిసే వరకు గ్రామాల్లో పోలీసు నిఘాను ముమ్మరం చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. హెల్ప్ డెస్క్ ద్వారా అభ్యర్థులకు నామినేషన్లకు సంబంధించిన సమాచారం అందించాలన్నారు. నామినేషన్ల స్వీకరణకు తగిన కౌంటర్లు ఉండాలన్నారు. ఎన్నికల విధులు నిర్వర్తిస్తున్న అధికారులు, పంచాయతీ కార్యదర్శులు గుర్తింపు కార్డులు ధరించాలని సూచించారు. ఆమె వెంట ఆర్వోలు వాసంతి, జె. శ్రీనివాసస్వామి, ఏఆర్వోలు బి.శ్రీధరస్వామి, బి. సాల్మన్‌రెడ్డి, కోటేశ్వర్‌రావు, ఎంపీడీవో సుమనవాణి, ఇన్‌స్పెక్టర్ వట్టి చేరాలు, ఎస్సైలు దేవేందర్, శీలం రవి, సుజిత్‌రెడ్డి, సూరింటెండెంట్ సురేష్, కార్యదర్శులు హరిత, గరిగె ప్రశాంతి, పొడిశెట్టి రజనీ, పోలీసు సిబ్బంది తదితరులున్నారు.

బీఆర్ఎస్ కార్యాలయంలో బతుకమ్మ వేడుకలు

దీక్షా దివస్ సందర్భంగా బతుకమ్మలతో ఆట పాట



బీఆర్ఎస్ కార్యాలయంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

హనుమకొండ టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): దీక్షా దివస్ మూడో రోజు పురస్కరించుకొని హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో బీఆర్ఎస్ మహిళా విభాగం ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ఇమ్మడి లోహిత మాట్లాడుతూ.. ప్రకృతిని కొలిచే బతుకమ్మ పండుగను గత ప్రభుత్వం, కేసీఆర్ నాయకత్వంలో విశేషంగా నిర్వహించి మహిళలకు బతుకమ్మ చీరలు అందించారని అన్నారు. కేసీఆర్ అన్నివర్గాల ప్రజల సంక్షేమం కోసం ఎంతో కృషి చేశారని, రాష్ట్రాన్ని దేశంలోనే మొదటి స్థానంలో నిలిపారని అన్నారు. కాంగ్రెస్‌ప్రభుత్వంలో రాష్ట్రంలో మహిళలపై దాడులు జరుగుతున్నాయని, హత్యలు, అత్యాచారాలు పెరిగిపోతున్నాయని ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పోరాటాలకు సిద్ధం కావాలని ఇమ్మడి లోహిత పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ బీఆర్ఎస్ పార్టీ డివిజన్ కమిటీ మహిళా అధ్యక్షురాలు మూగల విజయ, కమిటీ నాయకులు కొంతం విజయలక్ష్మి, నాయిని సరస్వతి, ఏరుకొండ హైమావతి, జోసెఫ్, పూర్ణిమ, కర్రు రజిత, కుమ్మరి లలిత, శ్వేతారెడ్డి, జన్ను విజయలక్ష్మి, నీరటి పావని, జ్యోతి, దేవమ్మ, సులోచన, రాధా, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ కిష్టయ్యకు ఘన నివాళులు



పోలీస్ కిష్టయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ముదిరాజ్ సంఘ సభ్యులు

హనుమకొండ చౌరస్తా, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మలిదశ ఉద్యమ తొలి అమరుడు పోలీస్ కిష్టయ్య ముదిరాజ్ 16వ సంస్మరణ దినోత్సవాన్ని 8వ డివిజన్‌లోని ఏనుగులగడ్డలో బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పులి విక్రమ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కిష్టయ్య చిత్రపటానికి పూమాలలువేసి ముదిరాజ్ కులస్థులు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘ సభ్యులు పులి విక్రమ్, గందపెల్లి సాంబయ్య, గోనెల సుధాకర్, గోనెల అంజయ్య, గోనెల సాగర్, చింతాకుల ప్రభాకర్, గోనెల విజేందర్, దేవేందర్, వీరప్రసాద్, రవి, రాజేష్, పృథ్వీరాజ్, ప్రతాప్, కిషన్, గౌతమ్, రాజు, గణేష్, సూరి, శివాజీ, జయశంకర్, రాజేందర్, అశోక్, రాజేష్, రాజు, సతీష్, శ్రీకాంత్, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

● సుబేదారి : మలిదశ తెలంగాణ ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన అమరుడు పోలీస్ కిష్టయ్య ముదిరాజ్ 16వ వర్ధంతి కార్యక్రమాన్ని అదాలత్‌సెంటర్‌లో ఘనంగా నిర్వహించారు. సోమవారం అమరవీరుల స్థూపం వద్ద పోలీస్ కిష్టయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ మహాసభ వరంగల్ అర్బన్ అధ్యక్షుడు బయ్య స్వామి మాట్లాడుతూ.. మలిదశ తెలంగాణ ఉద్యమంలో 2009 డిసెంబరు 1వ తేదీన కామారెడ్డి పట్టణం నడిబొడ్డున తుపాకీతో కాల్చుకొని తెలంగాణ కోసం అమరుడయ్యాడని తెలిపారు. పోలీస్ కిష్టయ్య విగ్రహాన్ని ప్రతీ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన అశోక్ ముదిరాజ్, అర్బన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పులి రజనీకాంత్, జిల్లా నాయకులు కేశబోయిన శ్రవణ్ కుమార్, కృష్ణ, బుల్లెట్ వెంకన్న, దువ్వ కనకరాజు, రఘురాం తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ కిష్టయ్యకు ఘన నివాళి

వడ్డేపల్లి : తెలంగాణ మలిదశ ఉద్యమ తొలి అమరుడు పోలీస్ కిష్టయ్య వర్ధంతిని సోమవారం హనుమకొండ 56వ డివిజన్ జవహర్ కాలనీలోని ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (మెపా) కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్, జిల్లా అధ్యక్షుడు పులి రాజేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. జవహర్ కాలనీ నుంచి వడ్డేపల్లి చర్చి, ఎన్జీవోస్ కాలనీ వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు.

కార్యక్రమంలో మెపా నేతలు మట్టెపల్లి కోటేశ్వర్, ఫిషర్‌మెన్ కాంగ్రెస్ స్టేట్ డైరెక్టర్ మండల సమ్మయ్య ముదిరాజ్, చిరబోయిన అంజన్‌రావు, మట్టెపల్లి జగన్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు యూనిఫామ్స్ అందజేస్తున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

సమాజాభివృద్ధికి సహకారం అందించాలి

టీజీఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

రాంనగర్, డిసెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ పౌరులుగా ఎదిగి సమాజాభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం హనుమకొండ హంటర్‌రోడ్డులోని శ్రీ వ్యాస ఆశ్రమంలో సులక్ష్య సేవా సమితి ఆధ్వర్యంలో గిరిజన విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్స్ అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఎండీ మాట్లాడుతూ.. రాబోయేతరానికి భావి భారతపౌరులు విద్యార్థులు అన్నారు. తల్లితండ్రులకు, గురువులకు మీరు ఇచ్చే ఆస్తి గొప్ప వ్యక్తులుగా ఎదగడమే అన్నారు. ఈ కార్యక్రమంలో సులక్ష్య సేవా సమితి నిర్వాహకుడు సంతోష్, శ్రీ వ్యాస ఆవాసం అధ్యక్షురాలు వసుంధర, డాక్టర్ శివసుబ్రహ్మణ్యం, శ్రీనువాస్, హనుమకొండ టౌన్ డీఈ జి. సాంబరెడ్డి, యంఆర్టీ డీఈ అనిల్‌కుమార్, ఏడీఈ ఇంద్రాసేనారెడ్డి, ఏఈ అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాంనగర్, డిసెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా నేడు బాలసముద్రం సబ్‌స్టేషన్ పరిధిలోని బాలసముద్రం, రిలయన్స్ ఏరియా, చిల్డ్రన్ పార్క్ ఏరియాలో ఉదయం 10.30నుంచి 12.30వరకు విద్యుత్‌సరఫరా జరగదని హనుమకొండటౌన్ డీఈ సాంబరెడ్డి తెలిపారు.

ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న టీఎస్‌డబ్ల్యూఆర్ డిగ్రీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు

న్యూశాయంపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ హంటర్‌రోడ్‌లోని టీఎస్‌డబ్ల్యూఆర్ మహిళా కళాశాల వరంగల్ వెస్ట్ ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లకార్డులతో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గోలి శ్రీలత, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.మాలతి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఇనుగాల రాధిక, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన కలిగి ఉండాలి

(5వ పేజీ తరువాయి)

నేటితరం హెచ్ఐవీ బారిన పడకుండా జాగ్రత్తగా ఉంటున్నారని అన్నారు. ఇందుకు కృషి చేసిన ప్రభుత్వం, వైద్య ఆరోగ్యశాఖ, వివిధ స్వచ్ఛంద సంస్థలను అభినందించాలన్నారు. డీఎంహెచ్ఓ అప్పయ్య మాట్లాడుతూ.. హైచ్ఐవీ పాజిటివ్ వ్యక్తుల పట్ల ప్రేమ చూపించాలన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ట్రిపుల్ ఎలిమినేషన్‌లో భాగంగా తల్లి నుంచి బిడ్డకు హెచ్ఐవీ రాకుండా చూడటం, సిఫిలిస్, హెపటైటిస్‌బి వ్యాధులు సంక్రమించకుండా చూడటం లక్ష్యంగా పని చేస్తోందని తెలిపారు. ఎయిడ్స్ నియంత్రణలో భాగంగా అవగాహన కార్యక్రమాలు, టెస్టింగ్, చికిత్స తదితర అంశాల్లో మెరుగ్గా పనిచేసిన జిల్లాకు రాష్ట్రస్థాయిలో మొదటి బహుమతి అందించిందన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ టి.మదన్‌మోహన్‌రావు వార్షిక నివేదిక సమర్పిస్తూ హనుమకొండ జిల్లాలో 5,390 మంది ఏఆర్టీ సెంటర్‌లో నమోదు చేసుకోగా, 4,579 మందికి ప్రతీనెల ఎయిడ్స్ చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే 929 మందికి ప్రతీనెల రూ.2016 చొప్పున ఏఆర్టీ పెన్షన్లు ఇస్తున్నామన్నారు. ప్రతీ నెల సుమారు ఏడు పాజిటివ్‌కేసులు నమోదు అవుతుండగా, అందులో ఒకరు గర్భిణి ఉంటున్నారని వివరించారు. 2024-25లో 38,215 మందికి పరీక్ష నిర్వహించగా 69 పాజిటివ్ కేసులు నమోదయ్యాయని, అలాగే 15,772 మంది గర్భిణులకు పరీక్ష నిర్వహించగా అందులో 13 మందిని హెచ్ఐవీ పాజిటివ్‌గా గుర్తించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంజీఎం సూపరింటెండెంట్ హరిచంద్రారెడ్డి, డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ రమేశ్‌చంద్ర, డాక్టర్ రవి, డాక్టర్ హిమబిందు, డాక్టర్ ప్రదీప్‌రెడ్డి, డాక్టర్ ప్రభుదాస్, ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ప్రోగ్రాం మేనేజర్ సీహెచ్.సుధాకర్, రామకృష్ణ, కమలాకర్, అశోక్‌రెడ్డి, ఎస్.శ్రీనివాస్, చంద్రశేఖర్, ప్రసన్నకుమార్, రవీందర్, డాక్టర్ సుమన్, ఏఎన్ఎంలు, ఆశాలు, ఐసీటీసీ కౌన్సిలర్లు, టెక్నీషియన్లు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, నర్సింగ్, పారా మెడికల్ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా రెండోరోజు నామినేషన్లు

హసన్‌పర్తి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని రెండో విడత రెండోరోజు నామినేషన్ల స్వీకరణ ప్రశాంతంగా కొనసాగింది. మండల పరిధిలోని 15 పంచాయతీలకు 39 మంది అభ్యర్థులు నామినేషన్ వేయగా 138 వార్డు మెంబర్ స్థానాలకు 92 మంది అభ్యర్థులు నామినేషన్ వేసినట్లు ఎన్నికల అధికారి, ఎంపీడీవో సుమనవాణి తెలిపారు. అనంతసాగర్ పంచాయతీ క్లస్టర్ పరిధిలో సోమవారం సర్పంచ్‌లు-13, వార్డు మెంబర్లు-32 స్థానాలకు నామినేషన్ దాఖలైనట్లు క్లస్టర్ రిటర్నింగ్ అధికారి హరిప్రసాద్ తెలిపారు. జయగిరిలో సర్పంచ్-3, వార్డు మెంబర్లు-5, మడిపల్లిలో సర్పంచ్-3, వార్డు మెంబర్లు-17 దాఖలు చేశారు. సీతంపేట పంచాయతీ క్లస్టర్ పరిధిలో సర్పంచ్‌లు-8, వార్డు మెంబర్లు-16 నామినేషన్ దాఖలైనట్లు క్లస్టర్ రిటర్నింగ్ అధికారి జె.శ్రీనివాసస్వామి తెలిపారు. వీరిలో సీతంపేటలో సర్పంచ్‌లు-5, వార్డు మెంబర్లు-10, గుంటూర్‌పల్లిలో సర్పంచ్‌లు-1, వార్డు మెంబర్లు-1, పెంబర్తిలో సర్పంచ్-2, వార్డు మెంబర్లు-4 ఉన్నట్లు తెలిపారు. నాగారం పంచాయతీ క్లస్టర్ పరిధిలో మొత్తం సర్పంచ్‌లు-4, వార్డు మెంబర్లు-7 నామినేషన్లు దాఖలైనట్లు క్లస్టర్ రిటర్నింగ్ అధికారి వాసంతి తెలిపారు. వీటిలో నాగారంలో సర్పంచ్‌లు-0, వార్డు మెంబర్లు-5, సీతానాగారంలో సర్పంచ్-2, వార్డు మెంబర్లు-2, సూదన్‌పల్లిలో సర్పంచ్-2 దాఖలయ్యాయి. సిద్ధాపూర్ క్లస్టర్ పరిధిలో మొత్తం సర్పంచ్‌లు-6, వార్డు మెంబర్లు-18 నామినేషన్లు దాఖలైనట్లు క్లస్టర్ రిటర్నింగ్ అధికారి ఆర్.కాంతారావు తెలిపారు. వీటిలో భైరాన్‌పల్లి సర్పంచ్-4, వార్డు మెంబర్-6, మల్లారెడ్డిపల్లి క్లస్టర్ పరిధిలో మొత్తం సర్పంచ్‌లు-9, వార్డు మెంబర్లు-20 నామినేషన్లు దాఖలైనట్లు క్లస్టర్ రిటర్నింగ్ అధికారి నర్సయ్య తెలిపారు. వీటిలో మల్లారెడ్డిపల్లి సర్పంచ్-4, వార్డు మెంబర్-1, కొత్తపల్లి సర్పంచ్-1, వార్డు మెంబర్-3, అర్వపల్లి సర్పంచ్-4, వార్డు మెంబర్లు-8 నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి
9
నవ్య
డాక్టర్
మంగళవారం • 2 డిసెంబరు 2025

ఫిట్‌నెస్

ఇంటి పనులు, ఆఫీసు పనులతో శరీరం ఎంతో కొంత అలసిపోతోంది కాబట్టి మహిళలు దాన్నే వ్యాయామంగా పరిగణిస్తూ ఉంటారు. కానీ శరీరం దృఢంగా ఉండాలంటే ప్రతి మహిళా తన వయసుకు తగిన వ్యాయామం తప్పనిసరిగా చేస్తూ ఉండాలి.

శరీరం ఇలా దారుఢ్యం

పెరిగి తరిగే హార్మోన్ల ప్రభావాలు, అదుపుతప్పుతున్న ఆహారపుటలవాట్లు, జీవనశైలులు, మారే సీజన్లు మహిళల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తూ ఉంటాయి. కాబట్టి టీనేజీ మొదలు, వృద్ధుల వరకూ ప్రతి మహిళా తమకు తగిన వ్యాయామాన్ని దినచర్యలో భాగం చేసుకోవాలి. అయితే ఏ ప్రాతిపదికన, ఏ అంశాల ఆధారంగా వ్యాయామ నియమాలను పాటించాలంటే...

ఏరోబిక్స్ ఇలా...

కొవ్వును కరిగించడమే ప్రతి వ్యాయామం ఉద్దేశం. ఏరోబిక్స్ సూత్రం కూడా అదే! ఈ వ్యాయామంతో శరీరంలోని ప్రతి కండరం సంకోచ వ్యాకోచాలకు లోనవుతుంది. దాంతో ఎక్కువ శక్తి ఖర్చవుతుంది. పురుషులతో పోలిస్తే మహిళల కీళ్లను పట్టి ఉంచే లిగమెంట్లు సున్నితంగా ఉంటాయి. కాబట్టి వాటి మీద ఎక్కువ ఒత్తిడి పడని టోనింగ్, బిల్డింగ్ వ్యాయామాలు మహిళలకు అనుకూలమైనవి. కొవ్వుని కరిగించి, కండరాల పటుత్వాన్ని పెంచే ఏరోబిక్స్



అనగానే సాధారణంగా మహిళలందరూ జంకుతూ ఉంటారు. జిమ్‌కి వెళ్లి వ్యాయామం చేయడమే తేలిక అనుకుంటూ ఉంటారు. కానీ కీళ్ల సమస్యలు లేని ఏ వయసువాళ్లైనా ఏరోబిక్స్ చేయవచ్చు. వయసులవారీగా ఏరోబిక్ వ్యాయామాల తీవ్రతను ఎంచుకుంటూ ఉండాలి.

టీనేజర్లు అయితే: టీనేజర్లు పవర్ ఏరోబిక్స్ చేయాలి. చమటలు పట్టేలా వేగంగా కదిలే వ్యాయామాలు మేలైనవి. స్కిప్పింగ్, ఎత్తుకు ఎగిరి దూకే వ్యాయామాలు చేయవచ్చు. వెయిట్ లిఫ్టింగ్ కూడా చేయాలి. ట్రెడ్‌మిల్, సైక్లింగ్, క్రాస్ ట్రైనర్‌లు కూడా వాడాలి. అయితే ఖర్చయ్యే క్యాలరీలను మాంసకృత్తులతో భర్తీ చేస్తూ ఉండాలి. ఆహారంలో తేలికగా అరిగే కొవ్వులూ ఉండేలా చూసుకోవాలి. ఏరోబిక్స్‌లో స్టెప్పర్ వాడాలి.

మధ్యవయస్కులైతే: వీళ్లు వెయిట్ బేరింగ్, నాన్ వెయిట్ బేరింగ్ అనే రెండు రకాల పద్ధతులను వ్యాయామంలో అనుసరించాలి. మనం మన కాళ్ల మీద నిలబడి చేసే వ్యాయామాలు 'వెయిట్ బేరింగ్'. అలాకాకుండా కూర్చుని చేసే వ్యాయామాలు 'నాన్ వెయిట్ బేరింగ్'. వీటిలో తమకు తగిన వ్యాయామాలను మహిళలు ఎంచుకోవచ్చు. కూర్చుని చేసే వ్యాయామాలతో ఫిట్‌నెస్ పెంచుకోవాలంటే 'స్టాటిక్ సైక్లింగ్' (కదలకుండా తొక్కే సైకిల్) చేయాలి. ఆర్థ్రయిటిస్ ఉన్న మహిళలు బరువును అదుపులో ఉంచుకోవడానికి ఇదే ఉత్తమమైన వ్యాయామం. ఈ వ్యాయామం వల్ల కీళ్ల మీద బరువు పడదు. సైకిల్ తొక్కుతాం కాబట్టి వ్యాయామమూ అందుతుంది. 30 నుంచి 50 ఏళ్ల వయసు మహిళలు, ఆర్థ్రయిటిస్ లేనివాళ్లైతే స్టాటిక్ సైక్లింగ్‌కు బదులుగా రోడ్డు మీద సైకిల్ తొక్కవచ్చు.

50 ఏళ్లు పైబడితే: వీళ్లకు తేలికపాటి బేసిక్ ఏరోబిక్ వ్యాయామాలు ఉంటాయి. తక్కువ వేగంతో, ఎక్కువ సేపు ఏరోబిక్స్ చేయవచ్చు. ఏరోబిక్స్‌లో స్టెపర్ వాడకూడదు, ఎత్తు ఎగరడం, దూకడం చేయకుండా, చేతులు, కాళ్లను కదిలించేలా ఏరోబిక్స్ చేయాలి. దీంతోపాటు స్టాటిక్ సైక్లింగ్, వాకింగ్ సరిపోతుంది.

పెద్ద వయసు మహిళలకు యోగా

యోగా చేయాలనుకుంటే సులభమైన ఆసనాలు ఎంచుకోవాలి. శరీరాన్ని విపరీతంగా వంచి చేసే యోగాసనాల వల్ల లిగమెంట్లు దెబ్బతింటాయి. కాబట్టి వేరొకరిని అనుకరించకుండా తమకు నప్పే ఆసనాలే వేయాలి. ప్రాణాయామం చేయాలి. కీళ్ల నొప్పులు ఉండేవాళ్లు పద్మాసనంలో కూర్చుని చేసే వ్యాయామాలు మానేయాలి. ఎత్తులు ఎక్కి దిగే వ్యాయామాలు చేయకూడదు. వీళ్లైతే నీళ్లలో నడుం కింది వరకూ మునిగి చేసే వ్యాయామాలు చేయాలి. ఈ వ్యాయామాల వల్ల కీళ్ల మీద బరువు పడకుండా ఉంటుంది.

నెలసరి సమయంలోనూ...

నెలసరి సమయంలో వ్యాయామం చేయకూడదనే నియమమేమీ లేదు. నెలసరి సమస్యలు, ఇతరత్రా ఆరోగ్య సమస్యలేవీ లేకపోతే ఆ సమయంలో కూడా నిస్సందేహంగా వ్యాయామం చేయవచ్చు. రక్తంలో హిమోగ్లోబిన్ తక్కువ ఉన్నవాళ్లు, అనీమియా ఉన్నవాళ్లు ఆ సమస్యల నుంచి కోలుకున్న తర్వాత నెలసరి సమయంలో కూడా వ్యాయామాలు కొనసాగించవచ్చు.

ఆర్థ్రయిటిస్ ఉంటే?

ఆర్థ్రయిటిస్ ఉన్నా వ్యాయామాలు చేయవచ్చు. అయితే బరువులు ఎత్తే వ్యాయామాలు చేయకూడదు. నేల మీద కూర్చుని చేసే వ్యాయామాలు కూడా చేయకూడదు. ట్రెడ్‌మిల్ మీద నడిచేటప్పుడు అనుకూలంగా ఉండే వేగంలోనే నడవాలి. ట్రెడ్‌మిల్ గ్రేడ్ (ఎత్తు పెంచడం) వాడకూడదు. స్టాటిక్ సైక్లింగ్ చేసేటప్పుడు కూడా కీళ్ల మీద ఒత్తిడి పడకుండా చూసుకోవాలి.

లైఫ్ స్టైల్



సోఫాలు, దిండ్లు, పరుపులు ఎంత మెత్తగా ఉంటే అంత మంచివనుకుంటాం. సౌకర్యంగా ఉంటే చాలనుకుని, వాటి వాడకానికి అలవాటు పడిపోతాం. కానీ దైనందిన జీవితంలో ఉపయోగించే ఉపకరణాల విషయంలో కొన్ని నియమాలు పాటించాలి. కీళ్లు, కండరాలు శ్రమకు గురవకుండా ఉండడం కోసం ఎలాంటి ఉపకరణాలను ఎంచుకోవాలో, వాటి ఎంపికలో ఎలాంటి జాగ్రత్తలు పాటించాలో వైద్యులు వివరిస్తున్నారు.

ఉపకరణాలు... ఉపయోగకరంగా...

మనం ప్రతిరోజూ వాడుకునే ఉపకరణాలు నెమ్మదినెమ్మదిగా మన ఆరోగ్యాన్ని కుదేలు చేస్తూ ఉంటాయి. మన ఇళ్లలోని సోఫాలు మెత్తగా, సౌకర్యంగా ఉంటే చాలనుకుంటాం. పరుపులు, దిండ్లు వీలైనంత మందంగా, మెత్తగా ఉండేలా చూసుకుంటాం. కానీ అవి శరీర భంగిమలను పక్కదారి పట్టిస్తున్నాయా? అనే కోణంలో ఆలోచించం. వీటితో పొందే సౌకర్యానికి మించి, వాటి ఎత్తు, వాటిని వాడుకునే సమయంలో కీళ్ల మీద పడే ఒత్తిడుల మీద ప్రధానంగా దృష్టి పెట్టాలి.

సోఫాలు ఎలా ఉండాలంటే...

చాలా మంది నేలకు అంటుకుపోయినట్టుండే సోఫాలను ఇష్టపడుతూ ఉంటారు. కూర్చోగానే అడుగుకి కుంగిపోయే అతి మెత్తని సోఫాలు, లేచి నిలబడడానికి ఇబ్బందిగా ఉండే సోఫాలు ఆరోగ్యకరం కాదు. సోఫాల తయారీలో ఉపయోగించే మెటీరియల్ కంటే సోఫా ఎత్తు, మెత్తదనం మరింత ముఖ్యం. అవసరానికి మించి మెత్తగా ఉండే సోఫా బదులు, కాస్త గట్టిగా ఉండే సోఫాను ఎంచుకోవడం శ్రేయస్కరం. మరీ ముఖ్యంగా...

- సోఫాలో కూర్చున్నప్పుడు పాదాలు నేల మీద ఆనేలా ఉండాలి
- మోకాళ్లు, తుంటి సమాంతరంగా ఉండాలి
- తుంటి కీలు, మోకాళ్లు 90 డిగ్రీల కోణాన్ని మించకూడదు, తగ్గకూడదు
- సోఫా... వెన్నుకూ, తలకూ ఆసరా అందించేలా ఉండాలి
- సోఫా వీపుకు ఆనుకునే భాగం 90% ఎక్కువ కోణంలో వెనక్కి వాలి ఉండాలి.
- ప్రతి మూడేళ్లకూ సోఫా రీఫిల్ చేయాలి లేదా కుషనింగ్ మారుస్తూ ఉండాలి
- ఎక్కువ సమయం పాటు టివి చూడాలనుకుంటే వెనక్కి వాలినట్టుండే రిక్లైనర్స్ వాడుకోవాలి

పరుపు ఇలా...

మెమరీ ఫోమ్ పరుపులు అత్యుత్తమం. పడుకోగానే గుంతలా ఏర్పడే పరుపులు ఆరోగ్యకరం కాదు. పరుపు మరీ గట్టిగా, మరీ మెత్తగా ఉండకూడదు. ఉదయం నిద్ర లేవగానే ఒంటి నొప్పులు వేధిస్తున్నా, తరచూ కండరాలు పట్టేస్తున్నా వాడుకునే పరుపులో లోపం ఉందని గ్రహించాలి. అలాగే మంచం కూడా సరిపడా ఎత్తులో ఉండాలి. ఎత్తు తక్కువ మంచాలు వాడుకున్నప్పుడు మోకాళ్ల మీద ఒత్తిడి పడుతుంది.

- 8 నుంచి 10 అంగుళాల మందం పరుపులు శ్రేయస్కరం
- పడుకోగానే శరీర వెనక భాగమంతా పరుపులో కూరుకుపోయేంత మెత్తగా ఉండకూడదు
- ఆర్థోపెడిక్ మ్యాట్రెస్ అవసరం లేదు కానీ మెమరీ ఫోమ్ పరుపు వాడుకోవాలి
- ఒకే చోట పడుకుంటూ ఉండే ఎంత నాణ్యమైన పరుపైనా గుంతగా మారిపోతుంది. కాబట్టి తరచూ తిప్పుతూ ఉండాలి

దిండ్లు సౌకర్యంగా...

కొందరికి లావుపాటి దిండు లేనిదే నిద్ర పట్టదు. ఇంకొందరికి దిండు వాడే అలవాటే ఉండదు. ఈ రెండు అలవాట్లూ ప్రమాదకరమే! రెండు దిండ్లు కలిపి తల కింద పెట్టుకోవడం మరింత ప్రమాదకరం. కాబట్టి వాడుకునే దిండు మరీ మందంగా లేదా మరీ పలుచగా ఉండకూడదు. అలాగే...

- దిండు మెడ వంపులో ఇమిడిపోయేలా ఉండాలి
- దిండు వల్ల తలకూ, మెడకూ మధ్య దూరం పెరిగేలా ఉండకూడదు
- మెడ వంపు కుదించుకుపోయే దిండును వాడకూడదు
- తరచూ దిండ్లను మారుస్తూ, శరీర భంగిమలను ఇబ్బందికి గురి చేయకూడదు



చేతి కర్ర వాడితే...

- గుండెపోటుకు గురైన వాళ్లు మూడు కాళ్ల చేతి కర్ర వాడుకోవాలి
- కండరాల పటుత్వాన్ని కలిగి ఉండి, గుండె ఆరోగ్యం బాగున్న 70 ఏళ్లు దాటినవారు సాధారణ చేతి కర్ర వాడుకుంటే సరిపోతుంది
- మోకాళ్ల నొప్పులున్నవాళ్లు ఏ మోకాలు నొప్పిగా ఉంటే అటువైపు చేతి కర్ర వాడుకోవాలి
- తుంటి నొప్పి ఉన్నవాళ్లు కుడి తుంటి నొప్పికి, ఎడమ వైపు చేతి కర్ర వాడుకోవాలి. ఎడమ తుంటి నొప్పికి కుడి వైపు చేతి కర్ర వాడుకోవాలి
- మూర్ఛ, పార్కిన్సన్స్ ఉన్నవాళ్లు, వాకర్, మూడు కాళ్ల చేతి కర్ర తప్పనిసరిగా వాడుకోవాలి

నేల మీద కూర్చుంటే...

గంటల తరబడి పూజ గదిలో నేల మీద పద్మాసనం వేసుకుని పూజ చేయడం, ఇండియన్ టాయిలెట్స్ వాడుకోవడం, నేల మీద కూర్చుని పనులు చేసుకోవడం వల్ల మోకాళ్ల మీద అదనపు ఒత్తిడి పడుతుంది. మరీ ముఖ్యంగా భారతీయుల్లో సహజసిద్ధంగా విటమిన్ డి లోపంతో కీళ్ల సమస్యలు చిన్న వయసులోనే మొదలవుతున్నాయి. ఈ సమస్యకు అస్తవ్యస్థ జీవనశైలి తోడైతే సమస్య మరింత తీవ్రమవుతుంది. కాబట్టి ఈ జాగ్రత్తలు పాటించాలి



- పూజ గదిలో ఎత్తుగా ఉండే స్టూలు వాడుకోవాలి
- మోకాళ్లు 90 డిగ్రీలకు మించి వంగకుండా చూసుకోవాలి
- మరీ ముఖ్యంగా మోకాళ్ల నొప్పులున్నవాళ్లు నేల మీద కూర్చోడం మానేయాలి
- ఇండియన్ టాయ్‌లెట్స్ వాడకుండా ఉండడమే ఉత్తమం
- వెస్టర్న్ కమోడ్ కూడా మరీ ఎత్తుగా ఉండకూడదు. తక్కువ ఎత్తులోనూ ఉండకూడదు


చలికాలం నొప్పులు

చలికాలం కండరాలు ఎక్కువగా సంకోచవ్యాకోచాలకు లోనవుతూ ఉంటాయి. ఈ కాలంలో కీళ్లు పట్టుతప్పకుండా నియంత్రించే క్రమంలో కండరాలు బిగుసుకుపోతూ ఉంటాయి. ఇలాంటి సహజసిద్ధ శరీర ప్రొటెక్టివ్ మెకానిజం వల్ల ఈ కాలంలో ప్రత్యేకించి ఉదయం వేళల్లో కండరాలు పట్టుకుపోతూ ఉంటాయి. ఉదయం నిద్రలేవగానే మంచం పైనుంచి కిందకు దిగడంకోసం శరీరాన్ని కదిలించగానే, అప్పటివరకూ విశ్రాంత స్థితిలో ఉన్న కండరాలు అకస్మాత్తుగా చురుగ్గా మారలేక పట్టుకుపోవచ్చు. ఇది ప్రమాదకరం కాదు. అయినప్పటికీ ఈ కాలంలో అవసరానికి మించిన విశ్రాంతి, నిద్ర మానుకోవాలి. వీలైనంత వరకూ శరీరాన్ని చురుగ్గా ఉంచుకోవాలి. క్రమం తప్ప వ్యాయామం చేయాలి. ఒకవేళ కండరాలు పట్టేస్తే, వాటంతట అవి సర్దుకోడానికి కనీసం ఐదు రోజుల సమయం పడుతుంది. ఆ అసౌకర్యాన్ని, నొప్పినీ వదిలించుకోవడం కోసం వైద్యులు సూచించిన మజిల్ రిలాక్సెంట్స్, నొప్పి మందులు వాడుకోవాలి.



డాక్టర్ ప్రవీణ్ మర్రెడ్డి
సీనియర్ కన్సల్టెంట్ ఆర్థోపెడిక్ సర్జన్,
స్టార్ హాస్పిటల్స్
నానక్‌రామ్‌గూడ, హైదరాబాద్

జన్యు వ్యాధి



కొన్ని జన్యుపరమైన వ్యాధులు, వేర్వేరు అవయవాలను కబళిస్తాయి. అలాంటిదే... ఆటోసోమల్ డామినెంట్ పాలీసిస్టిక్ కిడ్నీ డిసీజ్. ప్రధానంగా మూత్రపిండాలు, కాలేయం, పేగులు, గుండె, మెదడు రక్తనాళాలను ప్రభావితం చేసే ఈ ప్రాణాంతక వ్యాధి గురించీ, నివారణ చర్యల గురించీ తెలుసుకుందాం!

మూత్రపిండాల మీద ఓ కన్నేసి...

ప్రతి వెయ్యి మందిలో ఒకరికి ఈ వ్యాధి ఉంటుంది. ఒక తరం నుంచి మరొక తరానికి జన్యుపరంగా సంక్రమిస్తుంది. తల్లితండ్రుల్లో ఒకరికి ఈ వ్యాధి ఉన్నప్పుడు, పిల్లలకు సంక్రమించే అవకాశాలు 50 శాతం మేరకు ఉంటాయి. తరాలు మారేకొద్దీ వ్యాధి తీవ్రత, ఉధృతి మరింత పెరుగుతుంది. కాబట్టి సకాలంలో వ్యాధిని గుర్తించి, నివారణ చర్యలు పాటించాలి. ఈ రుగ్మతను సమూలంగా అరికట్టే వీలు లేకపోయినప్పటికీ, ఉధృతిని అడ్డుకుని మూత్రపిండాలను కాపాడుకోగలిగే వీలుంది. జన్యు చికిత్సలు, ఆర్ఎన్ఎ ఆధారిత చికిత్సలతో మెరుగైన ఫలితాలుంటాయని పరిశోధనల్లో స్పష్టమైంది.

ఆటోసోమల్ డామినెంట్ పాలీసిస్టిక్ కిడ్నీ డిసీజ్‌లో...

- ద్రవంతో నిండిన చిన్నపాటి తిత్తులు క్రమేపీ కిడ్నీల్లోని కణజాలాన్ని ఆక్రమిస్తాయి. దాంతో ఫిల్టర్ల స్థానంలో బెలూన్లను పోలిన తిత్తులు ఏర్పడతాయి
- ఏళ్లు గడిచేకొద్దీ కిడ్నీలు పూర్తిగా వాచిపోయి, వాటి పనితీరు కుంటుపడుతుంది
- సగానికి పైగా రోగులు కిడ్నీ మార్పిడి, డయాలసిస్ దశకు చేరుకుంటారు
- కొందరికి కాలేయ సమస్యలు, మరికొందరికి మెదడు సమస్యలూ తలెత్తుతాయి
- ఎటువంటి ముందస్తు హెచ్చరిక లేకుండా ప్రాణాంతక పరిస్థితి తలెత్తవచ్చు
- గుండె కవాట లోపాలు, మూత్రపిండాల్లో రాళ్లు, హెర్నియా కూడా వేధించవచ్చు

లక్షణాల మీద ఓ కన్నేసి...

ఆటోసోమల్ డామినెంట్ పాలీసిస్టిక్ కిడ్నీ డిసీజ్ వ్యాధిని సకాలంలో గుర్తించాలంటే బయల్పడే లక్షణాలను జాగ్రత్తగా గమనించుకుంటూ ఉండాలి. ఎక్కువ మందికి 30 లేదా 40 ఏళ్ల వయసులో లక్షణాలు బయల్పడడం మొదలుపెడతాయి. అవేంటంటే...

- వెన్ను లేదా డొక్కలో నొప్పి
- కడుపు నిండిన భావన
- మూత్రంలో రక్తం
- తలనొప్పి

ఎడిపికెడి నియంత్రణ ఇలా...

- రక్తపోటును నియంత్రణలో ఉంచుకోవాలి
- వ్యాధి తొలి దశలో రోజుకు 2 నుంచి 3 లీటర్ల నీళ్లు తాగాలి
- కాఫీ తగ్గించాలి. కాఫీ వ్యాధి తీవ్రత పెరుగుతుంది
- ఈస్ట్రోజన్ కలిగిన గర్భనిరోధక మాత్రలు మానేయాలి
- కిడ్నీ పనితీరు మెరుగ్గానే ఉన్నప్పటికీ, తరచూ వైద్యులను కలిసి పరీక్షలు చేయించుకుంటూ ఉండాలి
- కిడ్నీలు 50 శాతం దెబ్బతినేవరకూ ఆగకుండా ప్రారంభంలోనే చికిత్స మొదలుపెడితే, కిడ్నీలు పూర్తిగా విఫలమయ్యే ప్రమాదం తప్పుతుంది

ఇలా అప్రమత్తం

- కుటుంబ చరిత్రలో ఎడిపికెడి ఉంటే, అల్ట్రాసౌండ్, ఎమ్మారై పరీక్షలు చేయించుకోవాలి. ఫలితాల్లో సిస్టులు ఉన్నట్టు తేలితే, వెంటనే చికిత్స మొదలుపెట్టాలి
- టోల్వాప్టాన్ అనే ఔషధంతో వైద్యులు మూత్రపిండాల వైఫల్యాన్ని అరికట్టగలుగుతున్నారు. ధర ఎక్కువే అయినప్పటికీ ఈ ఔషధంతో డయాలసిస్‌ను కొన్నేళ్లపాటు వాయిదా వేయవచ్చు
- ఈ వ్యాధి ఉన్న జంటలు గర్భానికి ముందే ఐవిఎఫ్, ప్రీ ఇంప్లాంటేషన్ జెనెటిక్ డయాగ్నసిస్ ద్వారా అండాలను పరీక్షించుకుని వ్యాధికి ఆస్కారం లేని అండాలతోనే గర్భం దాల్చాలి.



డాక్టర్ శ్రీకాంత్ బత్తిని
సీనియర్ కన్సల్టెంట్ నెఫ్రాలజిస్ట్ అండ్ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్,
కిమ్స్ హాస్పిటల్, గచ్చిబౌలి, హైదరాబాద్

పరిశోధన

సంగీతం సామర్థ్యం



ఢిల్లీకి చెందిన మౌలానా ఆజాద్ మెడికల్ కాలేజ్, లోక్ నాయక్ హాస్పిటల్ చేపట్టిన అధ్యయనంలో, సర్జరీ సమయంలో సంగీతాన్ని వినిపించడం ద్వారా రోగి కోలుకునే వేగం పెరుగుతుందని స్పష్టమైంది. సాధారణ అనస్థీషియా సమయంలో రోగికి సంగీతాన్ని వినిపించడం ద్వారా, ఔషధ అవసరతను గణనీయంగా తగ్గించవచ్చని, అలాగే రోగి కోలుకునే సమయాన్ని కుదించవచ్చనీ ఈ అధ్యయనంలో తేలింది. సర్జరీలో సమయంలో రోగికి అనస్థీషియా ఇవ్వడం సర్వసాధారణం. అయితే ఆధునిక అనస్థీషియాలో రోగికి నొప్పి తెలియకుండా నిద్రమత్తులో ఉంచడం కోసం, ఐదు, నుంచి ఆరు రకాల మిశ్రమ ఔషధాలను ఉపయోగిస్తూ ఉంటారు. మరీముఖ్యంగా గాల్‌బ్లాడర్‌ను తొలగించే ల్యాప్రోస్కోపిక్ సర్జరీలో పొత్తికడుపు గోడల్లోని నాడులను మొద్దుబార్చే ఇంజెక్షన్లను ఇవ్వడం జరుగుతుంది. ఇన్ని జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ సర్జరీ సమయంలో శరీరం స్పందిస్తూ, గుండె వేగం, రక్తపోటు పెరగడం లాంటి మార్పులు చోటుచేసుకుంటూనే ఉంటాయి. ఈ లక్షణాలను అదుపు చేయడానికి సంగీత చికిత్స తోడ్పడుతున్నట్టు వైద్యులు నిర్ధారించారు. ఇందుకోసం పరిశోధకులు 20 నుంచి 45 ఏళ్ల రోగులను రెండు జట్లుగా విభజించి, రెండు జట్లకూ... శస్త్రచికిత్స సమయంలో, వాంతులను నివారించడం కోసం మత్తును అందించడం కోసం ఔషధాలను ఇవ్వడంతో పాటు ఫెంటనిల్ అనే నొప్పిని నివారించే ఔషధం, ప్రొపొఫాల్ అనే హిప్నాటిక్ ఔషధాన్ని కూడా రోగులకు అందించారు. రెండు జట్లలో ఒక జట్టుకు అదనంగా హెడ్‌ఫోన్లతో మురళి లేదా పియానో సంగీతాన్ని వినిపించినప్పుడు, ఈ జట్టుకు తక్కువ మోతాదు ప్రొపొఫోల్, ఫెంటనిల్‌లు అవసరమయ్యాయి. అలాగే వీరిలో సర్జరీ తదనంతరం కోలుకునే వేగం కూడా ఎక్కువగా ఉండడం, ఒత్తిడి హార్మోన్ల మోతాదులు తక్కువగా ఉండడం, సర్జరీ సమయంలో రక్తపోటు అదుపులో ఉండడం లాంటి ప్రయోజనాలను కూడా వైద్యులు గమనించడం జరిగింది.

తెలుసుకుందాం

నిస్సత్తువను తరిమే 'మైటోకాండ్రియా' ఆహారం

కణాల శక్తి భాండాగారాలు 'మైటోకాండ్రియా' అని మనం దరం చదువుకున్నాం. ఈ శక్తి భాండాగారాలు బలహీనపడితే అకారణంగా నిస్సత్తువ వేధిస్తూ ఉంటుంది. ఇలాంటప్పుడు మైటోఖాండ్రియాను బలపరిచే ఆహారాన్ని ఎంచుకోవాలి. అవేంటంటే...

మనం తినే ప్రతి భోజనంలో మైటోకాండ్రియా పదార్థం ఉండేలా చూసుకోవాలి. ఈ కోవకు చెందిన ఆకుకూరలు, కూరగాయలు, మాంసాహారం తప్పనిసరిగా తీసుకోవాలి

ఆకుకూరలు: పాలకూర, ఇతరత్రా ముదురు ఆకుపచ్చ రంగులో ఉండే ఆకుకూరలన్నీ యాంటీఆక్సిడెంట్లతో నిండి ఉంటాయి.

క్రూసిఫెరస్ కూరగాయలు: బ్రొకొలి, కాలిఫ్లవర్


బెర్రీస్: స్ట్రాబెర్రీ, బ్లాక్‌బెర్రీస్, బ్లూ బెర్రీ

రంగుల పండ్లు, కూరగాయలు: బీట్‌రూట్, క్యారట్స్, టమాటా, పర్పుల్ క్యాబేజ్... వీటన్నింట్లో ఫైటోన్యూట్రియంట్లు పుష్కలంగా ఉంటాయి. కాబట్టి ఆహారంలో వీటిని చేర్చుకుంటూ ఉండాలి

నూనెలు: ఆలివ్ నూనె, అవిసెగింజల నూనెల్లో ఆరోగ్యకరమైన కొవ్వులుంటాయి

నట్స్, సీడ్స్: వాల్‌నట్స్, గుమ్మడి విత్తనాల్లో ఆరోగ్యకరమైన కొవ్వులు, పోషకాలు ఉంటాయి

అవకాడో: మోనోశాచురేటెడ్ కొవ్వుల కోసం అవకాడొ తినాలి



చేపలు: చేపల్లో ఒమెగా3 ఫ్యాటీ యాసిడ్లు ఎక్కువ. మరీముఖ్యంగా కొవ్విన చేపల్లో ఈ పోషకాలు మరింత ఎక్కువగా ఉంటాయి

బోన్ బ్రాత్: ఎముకలతో తయారైన బ్రాత్ లోపలి పొరతో పాటు మైటోకాండ్రియాల ఆరోగ్యాన్ని మెరుగు పరుస్తుంది

గ్రీన్ టీ: కణ శక్తి ఉత్పత్తికి తోడ్పడుతుంది

స్పైసెస్: పసుపు, లవంగాలు, దాల్చిన చెక్క, తులసి కణ నష్టాన్ని అరికడతాయి



ఆటా కార్యక్రమంలో జస్టిస్ శ్రీదేవి, ఆటా అధ్యక్షుడు జయంత్ చల్లా, సంస్థ ప్రతినిధులు

జస్టిస్ శ్రీదేవికి ఆటా సన్మానం

» అమెరికాలోని వర్జీనియాలో తెలుగు ప్రవాసులతో భేటీ

(డాలస్ నుంచి ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జువ్వాడి శ్రీదేవిని అమెరికా తెలుగు సంఘం (ఆటా) ఘనంగా సన్మానించింది. అమెరికాలో పర్యటిస్తున్న జస్టిస్ శ్రీదేవి.. వర్జీనియాలో ఆటా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె న్యాయవాదిగా, న్యాయమూర్తిగా తన అనుభవాలను సభికులతో పంచుకున్నారు. కుటుంబ జీవితాన్ని, న్యాయవ్యవస్థలో వృత్తి జీవితాన్ని సమన్వయం చేస్తూ ప్రైవేటు న్యాయవాదిగా, పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా, హైకోర్టు న్యాయమూర్తిగా ఎదిగిన విధానాన్ని వివరించారు. ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో భారత న్యాయవ్యవస్థపై ప్రవాస తెలుగువారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆటా అధ్యక్షుడు జయంత్ చల్లా, ట్రస్టీల బోర్డు సభ్యుడు విష్ణు మాధవరం తదితరులు పాల్గొన్నారు. వచ్చే ఏడాది జూలై 31 నుంచి ఆగస్టు 2 వరకు బాల్టిమోర్‌లో జరిగే ఆటా 19వ కాన్ఫరెన్స్‌తోపాటు భారత్‌లో ఆటా నిర్వహించబోయే సమావేశానికి జస్టిస్ శ్రీదేవిని సంస్థ ప్రతినిధులు ఆహ్వానించారు. అంతకు ముందు ఆమె వాషింగ్టన్ డీసీలోని క్యాపిటల్ హిల్ భవనాన్ని (అమెరికా పార్లమెంటు భవనం) సందర్శించి, అమెరికా పార్లమెంటులో బిల్లుల ఆమోద ప్రక్రియను పరిశీలించారు. 1810 నుంచి 1860 వరకు ఆ దేశ సుప్రీంకోర్టుగా కొనసాగిన భవన సముదాయాన్ని సందర్శించారు. న్యూజెర్సీ పర్యటనలో ప్రఖ్యాత అక్షరధామ్ ఆలయాన్ని కుటుంబసమేతంగా సందర్శించి పూజలు చేశారు.

ఉత్తమ పోలీస్ స్టేషన్‌గా శామీర్‌పేట

» జాతీయస్థాయిలో ఏడో ర్యాంకు.. రాష్ట్రస్థాయిలో మొదటి స్థానం



శామీర్‌పేట పోలీస్ స్టేషన్ ప్రాంగణం

హైదరాబాద్ సిటీ, డిసెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని శామీర్‌పేట పోలీస్ స్టేషన్‌కు అరుదైన గుర్తింపు దక్కింది. దేశంలోని ఉత్తమ పోలీస్ స్టేషన్‌లలో శామిర్‌పేట స్టేషన్‌కు ఏడో ర్యాంకు దక్కింది. రాష్ట్రస్థాయిలో ఈ పోలీస్ స్టేషన్ నంబర్ వన్‌గా నిలిచింది. దేశవ్యాప్తంగా పోలీస్ స్టేషన్‌ల పనితీరు కోసం కేంద్ర హోంశాఖ కీలక అంశాలను పరిగణనలోకి తీసుకొంది. పోలీస్ స్టేషన్ పనితీరు, రికార్డుల నిర్వహణ, బాధితులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించడం, ఫిర్యాదులకు గడువులోపల పరిష్కారాలు చూపడం, స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, గార్డెనింగ్, ఉత్తమ సీసీటీఎన్ఎస్ పని, సిబ్బంది నైపుణ్యాలు వంటి అంశాలు వంటి అంశాలను పరిశీలించి టాప్ టెన్ పోలీస్ స్టేషన్లతో కూడిన జాబితాను ప్రకటించింది. కాగా కేంద్రప్రభుత్వం నుంచి శామీర్‌పేట పోలీస్‌స్టేషన్‌కు ప్రత్యేక గుర్తింపు దక్కడం, రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో నిలవడం గర్వంగా ఉందని మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు ఈ సందర్భంగా శామీర్‌పేట ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌తో పాటు స్టేషన్ సిబ్బందిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

ఈ శీతాకాలం గజగజ

» చలి గుప్పిట దేశంలోని అనేక ప్రాంతాలు
» మధ్య, వాయవ్య భారతం, తెలంగాణ, మహారాష్ట్రల్లో చలి తీవ్రత అధికం
» డిసెంబరులో ఉత్తర కోస్తాలో ఎక్కువ వర్షాలు

విశాఖపట్నం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఈసారి శీతాకాలం గజగజా వణికించనుంది. దేశంలోని అనేక ప్రాంతాలు తీవ్రమైన చలిగాలుల గుప్పెట్లో చిక్కుకోనున్నాయి. మధ్య, వాయవ్య భారతం, పశ్చిమ, తూర్పుభారతంలో కొన్ని రాష్ట్రాలు, దక్షిణాదిలో తెలంగాణ, ఉత్తర కర్ణాటకలో అనేక ప్రాంతాల్లో చలి తీవ్రత ఎక్కువగా ఉండనుంది. డిసెంబరు నుంచి ఫిబ్రవరి వరకు మూడు నెలల శీతాకాలంలో దేశంలో ఉష్ణోగ్రతలు, వర్షపాతంపై సోమవారం భారత వాతావరణ శాఖ (ఐఎండీ) నివేదిక విడుదల చేసింది. ఈ మూడు నెలల్లో వాయవ్య, మధ్య భారతంతోపాటు తూర్పు, పశ్చిమ, దక్షిణ భారతంలోని పలు రాష్ట్రాల్లో పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా నమోదవుతాయని, ఈ ప్రాంతాల్లో చలిగాలులు వీచే రోజులు సగటు కంటే ఎక్కువగా నమోదవుతాయని తెలిపింది. మిగిలిన రాష్ట్రాల్లో సాధారణం లేదా అంతకంటే ఎక్కువగా ఉష్ణోగ్రతలు నమోదవుతాయని పేర్కొంది. ఏపీలో పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం, అంత కంటే ఎక్కువగా నమోదుకానున్నాయని వెల్లడించింది. కాగా.. డిసెంబరులో దక్షిణ భారతంలో సాధారణం లేదా అంతకంటే ఎక్కువ వర్షపాతం నమోదవుతుంది. ఏపీ వరకు చూస్తే ఉత్తర కోస్తాలో సాధారణం కంటే ఎక్కువగా, మిగిలిన ప్రాంతాల్లో సాధారణ వర్షపాతం నమోదవుతుందని పేర్కొంది.

లా నినా ప్రభావంతో చలి గాలులు..

ఈ ఏడాది పుష్కలంగా కురిసిన వర్షాలతో దేశంలో ఇప్పటికే వాతావరణం చల్లబడింది. దీనికి తోడు పసిఫిక్ మహాసముద్రంలో కొనసాగుతున్న లా నినా పరిస్థితుల ప్రభావంతో హిందూమహాసముద్రం మీదుగా చల్లని గాలులు దేశంపైకి వీస్తున్నాయి. వీటి ప్రభావంతో నవంబరులోనే అనేక ప్రాంతాల్లో చలి గాలుల తీవ్రత ఎక్కువైంది. ఈ నేపథ్యంలో శీతాకాలంలో దేశంలో అనేక ప్రాంతాల్లో చలితీవ్రత పెరుగుతుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. శీతలగాలుల తీవ్రత కారణంగా వృద్ధులు, చిన్నపిల్లలు, గుడారాల్లో నివసించే సంచార జాతుల వారు ఇబ్బందులకు గురవుతాయని పేర్కొంది. ఉదయంపూట కురిసే దట్టమైన పొగమంచు రవాణా వ్యవస్థపై ప్రభావం చూపుతుందని హెచ్చరించింది. కొన్ని ప్రాంతాల్లో గాలి నాణ్యత క్షీణించి ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని వెల్లడించింది. వ్యవసాయ, ఉద్యానవన పంటలపై ప్రభావం ఉంటుందని, వ్యవసాయ కూలీలు ఇబ్బందులు ఎదుర్కొంటారని తెలిపింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగాలు తగిన చర్యలు తీసుకోవాలని సూచించింది. శీతాకాలంలో రోజువారీ బులెటిన్లు విడుదల చేస్తామని పేర్కొంది.

ఇక్కడ ఇంటర్ చదవకుంటే ఇంటర్న్‌షిప్ కట్!

విదేశాల్లో వైద్య విద్య చదివిన మెడికోల కష్టాలు

» వైద్య విద్య ప్రవేశాల నిబంధనలనే వారికి కూడా అమలు చేస్తామని చెబుతున్న రాష్ట్ర వైద్య మండలి
» వైద్య మండలి ముందు అలాంటివారి పడిగాపులు
» తొలుత వారి దరఖాస్తులు స్వీకరించేందుకూ నో
» తర్వాత.. 7వ తేదీ వరకూ తీసుకునేందుకు సిద్ధం



హైదరాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆమె పేరు.. బోరుసు ఇందిరా మణిశ్రీ. ఊరు ఖమ్మం. ఒకటి నుంచి పదో తరగతి వరకూ సొంతూరిలో.. ఇంటర్మీడియెట్ విజయవాడలో చదివి, నీట్ రాశారు. రాష్ట్రంలో ఎంబీబీఎస్ సీటు రాకపోవడంతో ఉక్రెయిన్‌లోని ఖార్కివ్ నేషనల్ మెడికల్ యూనివర్సిటీలో ఎంబీబీఎస్ పూర్తి చేశారు. అనంతరం నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్(ఎన్‌బీఈ) నిర్వహించిన ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేట్ ఎగ్జామినేషన్ (ఎఫ్ఎంజీఈ)లో ఉత్తీర్ణత సాధించారు. ఆ తర్వాత ఏడాది పాటు ఇక్కడ ఇంటర్న్‌షిప్ చేయాల్సి ఉంది. కానీ.. అందుకు తెలంగాణలో 9నుంచి 12 వరకు చదివిన వారికే అవకాశం ఇస్తామని రాష్ట్ర వైద్యమండలి స్పష్టం చేసింది. దీంతో ఏం చేయాలో తెలియని పరిస్థితిలో పడ్డారామె. ఖమ్మం జిల్లాకే చెందిన మరో విద్యార్థి అవధూర్తి శరత్ చంద్రదీ కూడా అదే పరిస్థితి. ఒకటి నుంచి పది వరకు తెలంగాణలో, ఇంటర్ విజయవాడలో చదివిన ఆయన.. వైద్యవిద్యను ఫిలిప్పీన్‌లో పూర్తి చేశారు. ఇక్కడ ఇంటర్న్‌షిప్ చేద్దామంటే.. ఇంటర్ ఇక్కడ చదవలేదు కాబట్టి నాన్ లోకల్ అంటున్నారని వాపోయారు. ఇది వారిద్దరి సమస్య మాత్రమే కాదు. ఆంధ్రప్రదేశ్ సరిహద్దు జిల్లాలైన ఖమ్మం, నల్గొండ, మహబూబ్‌నగర్ విద్యార్థుల్లో చాలామంది ఇదే సమస్య ఎదుర్కొంటున్నారు. వైద్యవిద్య ప్రవేశాల కోసం రూపొందించిన నియమ నిబంధనలను వీరి విషయంలోనూ అమలు చేస్తామని తెలంగాణ రాష్ట్ర వైద్య మండలి ప్రకటించడంతో.. ఎఫ్ఎంజీలంతా (ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేట్స్) తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఏడాదిపాటు ఇంటర్న్‌షిప్ చేస్తేనే..

విదేశాల్లో వైద్యవిద్య అభ్యసించిన వారు మన దేశంలో వైద్యం చేయాలంటే ముందుగా ఎఫ్ఎంజీఈ రాయాలి. మొత్తం 300 మార్కులకు పెట్టే ఈ పరీక్షలో కనీసం 150 సాధిస్తేనే ఉత్తీర్ణులైనట్లు ప్రకటిస్తారు. ఎన్‌బీఈ ఏడాదికి రెండుసార్లు ఈ పరీక్ష నిర్వహిస్తుంటుంది. ఈ ఏడాది జూన్‌లో జరిగిన ఈ పరీక్షలో వందకు కేవలం 18.61 శాతం మంది మాత్రమే పాస్ అయ్యారు. ఏటా ఇది 20-25 శాతం మధ్య ఉంటుందని వైద్యవిద్య నిపుణులు చెబుతున్నారు. ఎఫ్ఎంజీఈలో ఉత్తీర్ణత సాధించిన వారు ఏడాది పాటు ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఇంటర్న్‌షిప్ చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం ఎఫ్ఎంజీలు తమ తమ రాష్ట్రాల్లోని వైద్య మండళ్లకు దరఖాస్తు చేసుకోవాలి. అలా వచ్చిన దరఖాస్తుల్ని పరిశీలించి, కౌన్సెలింగ్ నిర్వహించి, మెరిట్ ఆధారంగా ఇంటర్న్‌షిప్ ఇస్తారు. అలా తమకు కేటాయించిన ప్రభుత్వ ఆస్పత్రిలో ఏడాది పాటు ఇంటర్న్‌షిప్ పూర్తి చేస్తేనే వారి వైద్యపట్టాను రిజిస్టర్ చేసుకునే వెసులుబాటు కలుగుతుంది. తెలంగాణవ్యాప్తంగా 34 ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఎఫ్ఎంజీలకు ఇంటర్న్‌షిప్ కేటాయించి.. వారికి నెలకు రూ.5 వేల చొప్పున స్టైపెండ్ ఇస్తున్నారు. అదే.. రాష్ట్రంలో ఎంబీబీఎస్ చేసిన వారికైతే స్టైపెండ్‌గా రూ.29,792 చెల్లిస్తున్నారు. గతంలో ఇది రూ. 25,906గా ఉండేది. రాష్ట్ర సర్కారు 2024 జూన్ 28న స్టైఫండ్‌ను పెంచింది. విదేశాల్లో వైద్య విద్యను అభ్యసించి ఇక్కడ ఇంటర్న్‌గా పనిచేస్తున్నవారికి కూడా తప్పనిసరిగా స్టైపెండ్ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం 2023లో నిర్ణయించి, ఆ మేరకు జీవో జారీ చేసింది. దాంతో నామమాత్రంగా రూ.5 వేలు ఇస్తున్నారని.. తమిళనాడు లాంటి చోట్ల ఎఫ్ఎంజీలకు స్టైపెండ్ చెల్లించట్లేదని అధికారులు చెబుతున్నారు.

దరఖాస్తులు తీసుకోలే..

ఇంటర్న్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఎఫ్ఎంజీలు సోమవారం కోఠిలోని రాష్ట్ర వైద్యమండలి కార్యాలయానికి వచ్చారు. కానీ.. 9 నుంచి 12 వరకు తెలంగాణలో చదివిన విద్యార్థుల దరఖాస్తులనే తీసుకున్నారని.. రాష్ట్రంలో ఇంటర్మీడియెట్ చదవని వారి అప్లికేషన్లను తీసుకోలేదని పలువురు ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేట్స్ ఆందోళన వెలిబుచ్చారు.. తమ దరఖాస్తులను కూడా పరిగణలోకి తీసుకోవాలని వేడుకున్నా.. వైద్యమండలి అధికారులు పట్టించుకోలేదని వాపోయారు. ఈ విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి రాష్ట్ర వైద్యమండలి దృష్టికి తీసుకెళ్లగా.. 7వ తేదీ దాకా ఈ తరహా దరఖాస్తులు తీసుకుంటామని మండలి స్పష్టతనిచ్చింది. ఇటువంటి విద్యార్థుల విషయంలో ప్రభుత్వం వెంటనే స్పష్టతనివ్వాలని వైద్యవిద్య నిపుణులు సూచిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగాలకు ఎటువంటి పద్ధతిని అనుసరిస్తున్నారో (1 నుంచి 7వ తరగతి వరకు రాష్ట్రంలో విద్య) అలాంటి పద్ధతినే ఎఫ్ఎంజీల విషయంలోనూ పాటించాలని వారు పేర్కొంటున్నారు.

లోకల్స్‌కు ఇచ్చాక మిగిలితేనే మాకు ఇస్తారట!

తొమ్మిదో తరగతి నుంచి 12వ తరగతి వరకూ ఇక్కడ చదివిన వారికే ఇంటర్న్‌షిప్ కేటాయింపుల్లో తొలుత ప్రాధాన్యం ఇస్తామని రాష్ట్ర వైద్య మండలి అధికారులు చెబుతున్నారు. అలా చేస్తే మెరిట్‌తో సంబంధం లేకుండా కేటాయింపులన్నీ అటువంటి విద్యార్థులతోనే పూర్తవుతాయి. ఇంటర్ ఇక్కడ చదవని మా పిల్లలకు ఇంటర్న్‌షిప్ దక్కడం కష్టం. ఇది అన్యాయం. వైద్యవిద్య ప్రవేశాలకు సంబంధించిన నిబంధనలను దీంట్లోనూ అమలు చేస్తామనడం దారుణం. దీనిపై ప్రభుత్వం, వైద్య ఆరోగ్యశాఖ దృష్టిసారించి మాకు న్యాయం చేయాలి.

-ఒక బాధిత విద్యార్థి తండ్రి

వైద్యవిద్య ప్రవేశాల నిబంధనల మేరకే..

కిందటి సంవత్సరం రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో 425 ఇంటర్న్‌షిప్ వేకెన్సీలున్నాయి. ఈ ఏడాది ఇంతవరకూ వైద్య విద్య డైరెక్టర్ కార్యాలయం ఇంటర్న్‌షిప్ సంఖ్య వివరాలను రాష్ట్ర వైద్యమండలికి ఇవ్వలేదు. డిసెంబరు 7 తర్వాత కౌన్సిలింగ్ ప్రారంభిస్తాం. వివాదాలు ఏర్పడకూడదనే ఉద్దేశంతోనే.. ఇంటర్న్‌షిప్‌కు కూడా వైద్య విద్య నిబంధనలనే పాటిస్తున్నాం. ఇతర రాష్ట్రాల్లో ఇంటర్ చదివిన వారి దరఖాస్తులను కూడా తీసుకుంటాం. ఆ తర్వాత కౌన్సెలింగ్ నిర్వహించి మెరిట్ ఆధారంగా ఇంటర్న్‌షిప్ ప్లేసులను కేటాయిస్తాం.

- డాక్టర్ గుండగాని శ్రీనివాస్, వైస్ చైర్మన్, రాష్ట్ర వైద్యమండలి

చిత్రజ్యోతి

SINCE 1965

భర్త మహాశయులకు బెల్లా.. బెల్లా!



రవితేజ హీరోగా కిశోర్ తిరుమల దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'. ఆషికా రంగనాథ్, డింపుల్ హయతి హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రాన్ని చెరుకూరి సుధాకర్ నిర్మిస్తున్నారు. ఇంతకు ముందు టైటిల్ గ్లింప్స్ విడుదల చేసిన నిర్మాత తాజాగా 'బెల్లా బెల్లా' పాటను రిలీజ్ చేశారు. 'స్పెయిన్ కే అందాల నిట్ట.. అద్దిన ఓ పూలబుట్టా' అంటూ సురేశ్ గంగుల రాసిన పాటను భీమ్స్ సిసిరోలియో స్వరపరిచారు. నకాశ్ అజీజ్, రోహిణి సోర్రాట్ పాడిన ఈ పాటకు శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీ చేశారు. సంక్రాంతి సందర్భంగా 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' చిత్రం విడుదల కానుంది.

మధ్యతరగతి యువకుడి ప్రేమకథ



సంచలన విజయం సాధించిన 'బేబీ' చిత్రం తర్వాత ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య కలసి నటిస్తున్న చిత్రం 'ఎపిక్ ఫస్ట్ సెమిస్టర్'. '90స్' వెబ్ సిరీస్‌తో అందరినీ ఆకట్టుకున్న ఆదిత్య హాసన్ ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మాతలు. సోమవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో టైటిల్ గ్లింప్స్ లాంచ్ చేశారు. ఈ సందర్భంగా ఆనంద్ దేవరకొండ మాట్లాడుతూ 'తెలుగులో పూర్తి స్థాయిలో రొమాంటిక్ కామెడీ చిత్రాలు రావడం లేదు. ఈ లోటుని మా సినిమా భర్తీ చేస్తుంది. లండన్‌లో జరిగే కథే అయినా ఇది మన ఇంట్లో జరిగే కథలా ఉంటుంది. వైష్ణవి బాగా నటించారు' అని అన్నారు. యువతకు నచ్చే అందమైన ప్రేమ కథ ఇదని హీరోయిన్ వైష్ణవి చెప్పారు. హీరో పాత్రకు చాలా మంది అబ్బాయిలు కనెక్ట్ అవుతారు. ఆదిత్య హాసన్ మనలాంటోడు. మనలో ఒకడిగా కనిపిస్తారు. జీవితంలో మనం దాటి వచ్చిన చిన్న చిన్న అందమైన జ్ఞాపకాలను గుర్తు చేసేలా ఈ సినిమా ఉంటుంది' అని ఆమె చెప్పారు. ఓ మధ్యతరగతి యువకుడి ప్రేమకథ ఇదని దర్శకుడు ఆదిత్య హాసన్ చెప్పారు. నిర్మాత నాగవంశీ మాట్లాడుతూ 'ఉత్తేజకరమైన, భావోద్వేగాలు కలిగిన మృదువైన ప్రేమకథ ఇది. దీనికి కొనసాగింపు ఉంటుంది కనుకే 'ఎపిక్.. ఫస్ట్ సెమిస్టర్' అని పేరు పెట్టాం' అని ఆయన తెలిపారు.

అంచనాలకు మించి ఉంటుంది

నిర్మాతలు రామ్ ఆచంట, గోపీ ఆచంట



నందమూరి బాలకృష్ణ హీరోగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో రూపుదిద్దుకున్న 'అఖండ 2.. తాండవం' చిత్రం ఈ నెల 5న విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్మాతలు రామ్ ఆచంట, గోపీ ఆచంట సోమవారం విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

- బాలయ్యబాబు, బోయపాటి లది బ్లాక్‌బస్టర్ కాంబినేషన్. హ్యాట్రిక్ విజయాల తర్వాత వస్తున్న సినిమా ఇది. బిగ్ స్పాన్ ఉన్న కథ ఇది. బాలయ్యలో ఎనర్జీ ఇంకా పెరిగింది. ఆయనతో కాసేపు మాట్లాడితే ఆ ఎనర్జీ మనకీ వస్తుంది.
- ఈ సినిమాలో కొంత భాగాన్ని కుంభమేళాలో షూట్ చేశాం. అక్కడ షూటింగ్ చేయాలంటే ఎన్నో అనుమతులు కావాలి. అవన్నీ మాకు దొరికాయి. డ్రోన్ పర్మిషన్ కూడా లభించింది. సినిమాలో మీరు చూడబోయే ప్రతి సన్నివేశం ఈ సినిమా కోసం తీసిందే. బోయపాటి అహర్నిశలు కష్టపడి కుంభమేళా సన్నివేశాలను అద్భుతంగా చిత్రీకరించారు.
- ఈ సినిమా మొదలుపెట్టినప్పుడే దేశం మొత్తం విడుదల చేయాలనుకున్నాం. అయితే పాన్ ఇండియా కోసం అంటూ ప్రత్యేకంగా చేసిన మార్పులు ఏమీ లేవు. ఇది పాన్ ఇండియా కంటెంట్. సినిమాలో గూస్ బంప్స్ మూమెంట్స్ చాలా ఉంటాయి. బాలయ్య , బోయపాటిల నుంచి ఏమి ఆశిస్తారో ఆ అంచనాలను మించి సినిమా ఉంటుంది.
- సినిమాలో పతాక సన్నివేశాలను జార్జియాలో చిత్రీకరించాం. నిజానికి కశ్మీర్‌లో చేయాల్సిన సన్నివేశాలు అవి. కానీ అదే సమయంలో పెహల్గాం దాడి జరగడంతో అనుమతులు రాలేదు. మైనస్ డిగ్రీ చలిలో జార్జియాలో షూటింగ్ చేశాం. బాలయ్య అఘోరా గెటప్‌లో అంత చలిలో కూడా అద్భుతంగా చేశారు.
- దక్షిణాదిలో అన్ని భాషల్లో సినిమాను విడుదల చేస్తున్నాం. హిందీలో కూడా విడుదలవుతోంది. బీహార్‌లో అవధి అనే భాషలో కూడా అనువదించి విడుదల చేస్తున్నాం.

భారతీయ ప్రేక్షకుల కోసం సినిమాలు తీస్తాం

● కొరియన్ దర్శకుడు యూ ఇన్ షిక్



ఢిల్లీలోని కొరియన్ రాయబార కార్యాలయం, కొరియన్ ఫిల్మ్ కౌన్సిల్ భాగస్వామ్యంతో హైదరాబాద్‌లోని కొరియన్ కాన్సులేట్ మూడవ కొరియన్ ఫిల్మ్ ఫెస్టివల్‌ను సోమవారం హైదరాబాద్‌లో ప్రారంభించింది. ప్రముఖ కొరియన్ దర్శకుడు, నిర్మాత యూ ఇన్ షిక్ ఈ ఫెస్టివల్‌కు హాజరు కావడం ఈ సారి ప్రత్యేకత. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయన 'ఇక్కడ కొంతమంది ప్రేక్షకుల్ని కలిశాను. నా సినిమాలు, డ్రామాల గురించి వారు వివరంగా మాట్లాడుతుంటే ఆనందం కలిగింది. భవిష్యత్‌లో భారతీయ ప్రేక్షకుల కోసం తప్పకుండా సినిమాలు తీస్తాను' అన్నారు. కొరియన్ గౌరవ కాన్సుల్ జనరల్ చుక్కపల్లి సురేశ్ మాట్లాడుతూ 'సాంస్కృతిక పరంగా మనకు, కొరియాకు మధ్య చాలా సారూప్యత ఉంది. మనలాగే వాళ్లు ఫ్యామిలీ ఓరియెంటెడ్‌గా ఉంటారు. కొరియన్ సినిమాలు, వెబ్ సిరీస్ మనవాళ్లు ఎక్కువ సంఖ్యలో చూస్తున్నారు. కొరియన్ చిత్రాలను హైదరాబాద్‌లో చిత్రీకరించే విధంగా సౌకర్యాలు ఏర్పాటు చేయాలని మా ఆలోచన. ఇండియన్, కొరియన్ కొలాబరేషన్‌లో భవిష్యత్‌లో ప్రాజెక్ట్‌లు రావాలని మా కోరిక' అన్నారు.



పాట పాడుకొన్న ద్రౌపది

రిచర్డ్ రిషి హీరోగా నేతాజీ ప్రొడక్షన్స్, జీఎం ఫిల్మ్ కార్పొరేషన్ సంస్థలు నిర్మిస్తున్న భారీ చిత్రం 'ద్రౌపది 2'. మోహన్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రంలో రక్షణ చంద్రచూడన్ టైటిల్ పాత్ర పోషిస్తున్నారు. ఈ సినిమా నుంచి 'నెలరాజే' అనే పాటను సోమవారం మేకర్స్ విడుదల చేశారు. యువతి కాబోయే వరుడిని మనసులో ఊహించుకుంటూ పాడే ఈ పాటను సామ్రాట్ రాయగా, పద్మలత పాడారు. జిబ్రాన్ స్వరాలు సమకూర్చారు. అన్ని కార్యక్రమాలు త్వరలో పూర్తి చేసి విడుదల తేదీని ప్రకటిస్తామని నిర్మాత సోల చక్రవర్తి చెప్పారు.

వివాహ బంధంలోకి సమంత - రాజ్

● 'భూత శుద్ధి వివాహం'తో ఒక్కటైన జంట



హీరోయిన్ సమంత, దర్శకుడు రాజ్ నిడిమోరు భూత శుద్ధి వివాహ బంధంతో ఒక్కటయ్యారు. కోయంబత్తూరులోని ఈషా ఫౌండేషన్‌లో వున్న లింగ భైరవ ఆలయంలో వీరి వివాహం సోమవారం ఉదయం జరిగింది. కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితులు మాత్రమే ఈ వివాహానికి హాజరయ్యారు. ఆ తర్వాత సమంత, రాజ్ నిడిమోరు తమ ఇన్‌స్టాఖాతాల్లో పెళ్లి ఫోటోలను షేర్ చేసి అధికారికంగా వెల్లడించారు. ఈ పెళ్లిలో సమంత ఎర్రరంగు చీర, జాకెట్ ధరించగా, రాజ్ నిడిమోరు క్రీమ్ గోల్డ్ కలర్ కుర్తాను ధరించారు. నాగచైతన్యతో సమంత వివాహం ఎంత ఆర్భాటంగా జరిగిందో, దానికి భిన్నంగా రాజ్‌తో ఆమె పెళ్లి సింపుల్‌గా జరగడం గమనార్హం. కాగా, హిందీ బుల్లితెర జంట వరుణ్ జైన్, గియో మానిక్‌లది కూడా భూతశుద్ధి వివాహమే. సమంత, రాజ్ నిడిమోరుల పెళ్లి భూతశుద్ధి పద్ధతిలో జరిగిందని ఈషా ఫౌండేషన్ ప్రకటించడంతో ఇప్పుడు ఆ వివాహ పద్ధతి గురించి అన్వేషణ మొదలైంది.

భూత శుద్ధి వివాహం అంటే...

భూత శుద్ధి వివాహం అనేది యోగా సంప్రదాయ విధానంలో వేలాది సంవత్సరాలుగా జరుగుతున్న అత్యంత పవిత్రమైన వివాహ పద్ధతి. ఇందులో పేరుకు తగ్గట్టుగానే ఆలోచనలు, భావోద్వేగాలు, భౌతికతకు అతీతంగా దంపతుల మధ్య లోతైన బంధాన్ని ఏర్పరిచేందుకు రూపొందించిన విశిష్టమైన ప్రక్రియ. లింగ భైరవి ఆలయాల్లో ఎంపిక చేసిన ప్రదేశాల్లో నిర్వహించే ఈ వివాహ క్రతువు వధూవరుల దేహాన్ని శుద్ధి చేస్తుంది. వారి దాంపత్య ప్రయాణంలో సామరస్యం, శ్రేయస్సు, ఆధ్యాత్మికత వెల్లివిరిసేలా దేవీ అనుగ్రహాన్ని ప్రసాదిస్తుందని నమ్ముతారు. సాధారణంగా హిందూ జంటలకు చేసే సంప్రదాయ మంత్రోచ్చారణలతో పాటూ వధూవరుల శరీరం, మనసు, జీవశక్తి స్థాయిలను సమన్వయం చేసే యోగిక క్రతువులతో ఈ వివాహం జరుపుతారు. ఆధ్యాత్మిక గురువు సద్గురు జగ్గీ వాసుదేవ్ నిర్వహించే కార్యక్రమాల్లో తరచూ పాల్గొనేవారు సమంత. ఆ ప్రదేశంతో ఉన్న ప్రత్యేక అనుబంధమే ఆమె ఈ వివాహ ప్రక్రియను ఎన్నుకోవడానికి కారణమని అంటున్నారు.

ఎవరీ రాజ్ నిడిమోరు?

'ఫ్యామిలీ మ్యాన్' సిరీస్‌తో విశేష గుర్తింపు తెచ్చుకున్న రాజ్ నిడిమోరు స్వస్థలం తిరుపతి. ఆయన పూర్తి పేరు రాజేశ్. అమెరికాలో కొన్నాళ్ల సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేశారు. సినిమాలపై ఆసక్తితో తన మిత్రుడు డీకేతో కలసి పని చేయడం మొదలుపెట్టారు. 'రాజ్ అండ్ డీకే'గా వీరిద్దరూ పేరు తెచ్చుకున్నారు. ఈ దర్శక ద్వయం తెరకెక్కించిన తొలి సినిమా 'ఫ్లేవర్స్'. ఆ తర్వాత '99', 'గో గోవా గాన్', 'హ్యాపీ ఎండింగ్' చిత్రాలు చేశారు. 2019లో వీరు రూపొందించిన 'ఫ్యామిలీ మ్యాన్' వెబ్ సిరీస్ తొలి సీజన్ ఈ దర్శకద్వయానికి మంచి బ్రేక్‌నిచ్చింది.

పరిచయం నుంచి పెళ్లి వరకూ...

సమంత, రాజ్ నిడిమోరుకు మొదటిసారి ఓ పెర్ఫ్యూమ్ యాడ్‌లో పరిచయం ఏర్పడినట్లు సమాచారం. సినిమాల పరంగా వీరు తొలిసారి 'ఫ్యామిలీ మ్యాన్ 2' కలసి పనిచేశారు. 2021లో ఇది విడుదలవ్వగా, ఆ తర్వాత 'సిటాడెల్ : హనీ.. బన్నీ'లో కలసి మరోసారి రాజ్ దర్శకత్వంలో సమంత నటించారు. ఆమె సొంతంగా 'ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్' సంస్థను నెలకొల్పిన సంగతి తెలిసిందే. అందులో రాజ్ నిడిమోరు కూడా ఓ భాగస్వామి. ఆమె నిర్మించిన తొలి చిత్రం 'శుభం'కు ఆయన క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా పనిచేశారు. నాగచైతన్యతో విడాకులు తీసుకున్న కొంతకాలానికి సమంత, రాజ్ నిడిమోరు కలసి పబ్లిక్‌లో కనిపించడం మొదలుపెట్టారు. వీరిద్దరూ డేటింగ్‌లో ఉన్నట్లు ప్రచారం జరిగింది. ఆ ఊహాగానాలను మరింత పెంచుతూ ఇద్దరూ కలసి 'శుభం' ప్రమోషన్స్‌లో యాక్టివ్‌గా పాల్గొన్నారు. ఆ తర్వాత ఇద్దరూ కలసి విహార యాత్రలకు, సినిమాలకు వెళ్లడం.. పండగలు సెలబ్రేట్ చేసుకోవడమే కాకుండా అప్పుడు తీసుకున్న ఫొటోలను తమ ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేస్తుండడంతో ఆ ఊహాగానాలకు మరింత బలం చేకూరింది.

ఇద్దరికీ ద్వితీయ వివాహమే..

దర్శకుడు రాజ్ నిడిమోరు 2015లో రచయిత శ్యామాలిని పెళ్లి చేసుకున్నారు. 'ఓంకార', 'రంగ్ దే బసంతి' చిత్రాలకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేశారామె. ఏడేళ్ల వైవాహిక జీవితం గడిపాక 2022లో ఈ జంట విడాకులు తీసుకుంది. మరోవైపు సమంతకు కూడా ఇది రెండో వివాహమే. 2010లో విడుదలైన 'ఏ మాయ చేశావే'లో అక్కినేని నాగచైతన్యతో కలసి నటించారు సమంత. ఆ సినిమా సమయంలోనే వీరిద్దరి పరిచయం ప్రేమగా మారింది. 2017లో వివాహబంధంలోకి అడుగుపెట్టారు. అనుకోని కారణాల వల్ల 2021లో ఇద్దరూ విడాకులు తీసుకున్నారు. 2024లో శోభిత ధూళిపాలను నాగచైతన్య పెళ్ళాడిన సంగతి తెలిసిందే.



మాజీ భార్య శ్యామాలితో...

వైరల్‌గా మారిన రాజ్ మాజీ భార్య పోస్టు

రాజ్ నిడిమోరు మాజీ భార్య శ్యామాలి పెట్టిన పోస్ట్ ఇప్పుడు నెట్టింట వైరల్‌గా మారింది. 'తెగించిన వ్యక్తులు దానికి తగినట్టుగానే వ్యవహరిస్తారు' అని పేర్కొన్నారు. ఆమె వీరిని ఉద్దేశించే ఈ వ్యాఖ్యలు చేసినట్టు అందరూ అనుకుంటున్నారు. మరోవైపు నటి పూనమ్ కౌర్ 'నీకంటూ సొంత జీవితం సృష్టించుకోవడానికి ఓ పచ్చటి కాపురాన్ని కూల్చావు' అని పేర్కొన్నారు.

పీఎస్‌బీల్లో మరో మెగా విలీనం!

12 నుంచి 4కి తగ్గించే యోచన..

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా– కెనరా బ్యాంక్ మెర్జర్?

పెద్ద బ్యాంకుల్లో చిన్న బ్యాంకుల విలీనానికి కసరత్తు

ప్రభుత్వం ముందుకు ప్రతిపాదన

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకుల (పీఎస్‌బీ) స్వరూపం మరింత మారనుంది. విలీనాల ద్వారా వీటి ఆర్థిక పరిస్థితులను మరింత బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా ప్రస్తుతం 12గా ఉన్న పీఎస్‌బీలను 2027 మార్చి నాటికి విలీనాల ద్వారా నాలుగుకు కుదించాలని యోచిస్తోంది. ఇందుకోసం మరో మెగా విలీనాలకు కసరత్తు చేస్తోంది. ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ (ఐఓబీ), సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (సీబీఐ), బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీఓఐ), బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర (బీఓఎం)లను పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ), బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ), ఎస్‌బీఐ వంటి పెద్ద బ్యాంకుల్లో విలీనం చేయాలని యోచిస్తోంది. అంతేకాకుండా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ), కెనరా బ్యాంక్‌లను విలీనం చేయనున్నట్లు తెలుస్తోంది.

ఎందుకంటే?

2047 నాటికి ప్రపంచంలోని టాప్-50 బ్యాంకుల్లో కనీసం రెండు మూడు భారతీయ బ్యాంకులు ఉండాలని ప్రభుత్వం యోచిస్తోంది. చిన్న పీఎస్‌బీలను పెద్ద పీఎస్‌బీల్లో విలీనం చేయడమే ఇందుకు మార్గమని అధికార వర్గాలు భావిస్తున్నాయి. నీతి ఆయోగ్ ఇప్పటికే ఐఓబీ, సీబీఐ వంటి చిన్న పీఎస్‌బీలను ప్రైవేటీకరణ అయినా చేయండి లేదా పెద్ద పీఎస్‌బీల్లోనైనా విలీనం చేయండి అని సిఫారసు చేసింది. విలీనాలైతే ఉద్యోగ సంఘాల నుంచి పెద్దగా వ్యతిరేకత కూడా ఉండకపోవచ్చని అంచనా. దీంతో ప్రభుత్వం కూడా మరో విడత పీఎస్‌బీల విలీనానికే మొగ్గు చూపుతుందని భావిస్తున్నారు.



త్వరలో ప్రతిపాదన

ప్రస్తుతం ఈ విలీన యోచన ఇంకా అధికారుల స్థాయిలోనే ఉంది. త్వరలోనే దీనిపై మరింత కూలంకషంగా చర్చించి ఆ ప్రతిపాదనను కేంద్ర క్యాబినెట్, ప్రధానమంత్రి కార్యాలయాలకు పంపిస్తారని తెలుస్తోంది. అయితే ఈ వార్తలపై మాట్లాడేందుకు బ్యాంకులు, ప్రభుత్వ అధికార వర్గాలు నిరాకరిస్తున్నాయి. మొత్తం మీద త్వరలోనే పీఎస్‌బీల్లో మరో విలీనం చోటు చేసుకునే అవకాశం కనిపిస్తోంది.

ప్రస్తుతానికైతే ఆ ఆలోచనే లేదు

మరోవైపు ప్రభుత్వం ఈ వార్తలను తోసిపుచ్చింది. ప్రస్తుతం తమ వద్ద అలాంటి ప్రతిపాదనే లేదని కేంద్ర ఆర్థిక వ్యవహారాల సహాయ మంత్రి పంకజ్ చౌదరి లోక్‌సభలో ఒక లిఖిత పూర్వక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. పీఎస్‌బీల విలీనాలు గానీ, స్థిరీకరణ గానీ ప్రస్తుతం తమ పరిశీలనలో లేవన్నారు.

నేటి నుంచి బీఓఎం ఓఎఫ్ఎస్

ప్రభుత్వ రంగంలోని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర (బీఓఎం) ఈక్విటీలో ఆరు శాతం వాటాను ప్రభుత్వం విక్రయిస్తోంది. మంగళవారమే ఈ ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ప్రారంభం కానుంది. ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం ఈ అమ్మకం ద్వారా ప్రభుత్వానికి రూ.2,600 కోట్ల వరకు సమకూరే అవకాశం ఉంది. 2026 మార్చిలోగా అన్ని లిస్టెడ్ కంపెనీల్లో పబ్లిక్ వాటా కనీసం 25 శాతం ఉండాలన్న సెబీ ఆదేశాలకు అనుగుణంగా బీఓఎం ఈ ఓఎఫ్ఎస్ జారీ చేస్తోంది.

ఏడాది కనిష్ఠానికి జీఎస్‌టీ వసూళ్లు

నవంబరులో రూ.1.70 లక్షల కోట్లే..

పన్ను రేట్ల తగ్గుదలతో ఆదాయానికి గండి

న్యూఢిల్లీ: నవంబరు నెలలో వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) స్థూల వసూళ్లు ఏడాది కనిష్ఠ స్థాయి రూ.1.70 లక్షల కోట్లకు పరిమితం అయ్యాయి. గత ఏడాది నవంబరులో పరిహార సుంకం ద్వారా సమకూరిన రూ.12,950 కోట్లను మినహాయించగా నమోదైన రూ.1.69 లక్షల కోట్ల ఆదాయంతో పోలిస్తే కేవలం 0.7 శాతం వృద్ధి చెందాయి. సెప్టెంబరు 22 నుంచి కేంద్ర ప్రభుత్వం జీఎస్‌టీ శ్లాబులను హేతుబద్ధీకరించడంతో పాటు 375 వస్తువులపై పన్నును గణనీయంగా తగ్గించడం ఇందుకు కారణమైంది. అయితే, పన్ను రేట్ల తగ్గుదలతో వస్తు వినియోగం భారీగా పుంజుకోవడం వసూళ్లు స్వల్పంగానైనా వృద్ధి చెందాయి. కాగా, ఈ అక్టోబరులో పరిహార సుంకంతో కూడిన జీఎస్‌టీ స్థూల వసూళ్లు రూ.1.96 లక్షల కోట్లుగా ఉన్నాయి.

లాభాల స్వీకరణతో రికార్డు గరిష్ఠాల నుంచి వెనక్కి

సెన్సెక్స్ 65 పాయింట్లు డౌన్

ముంబై: సెప్టెంబరుతో ముగిసిన మూడు నెలల్లో జీడీపీ వృద్ధి రేటు 6 త్రైమాసికాల గరిష్ఠం 8.2 శాతానికి ఎగబాకడంతో స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు సోమవారం ప్రారంభ ట్రేడింగ్‌లో సరికొత్త రికార్డు గరిష్ఠాలకు చేరాయి. ట్రేడింగ్ తొలి గంటలోనే సెన్సెక్స్ 452.35 పాయింట్ల వృద్ధితో 86,159.02 వద్ద, నిఫ్టీ 122.85 పాయింట్ల పెరుగుదలతో 26,325.80 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డులను నమోదు చేశాయి. అయితే, వృద్ధి అంచనాలను మించడంతో ఆర్‌బీఐ కీలక వడ్డీ రేటును మరింత తగ్గించకపోవచ్చన్న ఆందోళనలతో పాటు జీఎస్‌టీ వసూళ్లు అంత ఆశాజనకంగా లేకపోవడంతో మదుపరులు రికార్డు గరిష్ఠాల వద్ద లాభాల స్వీకరణకు పాల్పడ్డారు. దీంతో సెన్సెక్స్ 64.77 పాయింట్ల నష్టంతో 85,641.90 వద్ద ముగిసింది. నిఫ్టీ 27.20 పాయింట్లు కోల్పోయి 26,175.75 వద్ద స్థిరపడింది.

సరికొత్త కనిష్ఠానికి రూపాయి: భారత కరెన్సీ సరికొత్త జీవితకాల కనిష్ఠానికి పతనమైంది. ఫారెక్స్ ట్రేడింగ్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ సోమవారం ఉదయం రూ.89.45 వద్ద ప్రారంభమైంది. ఒక దశలో 34 పైసలు క్షీణించి రూ.89.79 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డు కనిష్ఠాన్ని నమోదు చేసింది. మళ్లీ కాస్త కుదురుకున్నప్పటికీ, 8 పైసల నష్టంతో రూ.89.53 వద్ద ముగిసింది.

భారీగా పెరిగిన పసిడి: బంగారం, వెండి ధరలు మళ్లీ దూసుకెళ్తున్నాయి. ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి(99.9 శాతం స్వచ్ఛత) బంగారం ధర సోమవారం రూ.3,040 పెరిగి రూ.1,33,200కు చేరింది. 99.5 శాతం స్వచ్ఛత లోహం సైతం అదే స్థాయిలో పెరిగి రూ.1,32,600గా నమోదైంది. కిలో వెండి ఏకంగా రూ.5,800 ఎగబాకి రూ.1.77 లక్షలు పలికింది.

హైదరాబాద్‌లో మరో హౌసింగ్ ప్రాజెక్ట్

గోద్రెజ్ ప్రాపర్టీస్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): గోద్రెజ్ ప్రాపర్టీస్ హైదరాబాద్‌లో తన కార్యకలాపాలను విస్తరిస్తోంది. ఇటీవల కోకాపేటలోని నియోపోలిస్ వద్ద హెచ్ఎండీఏ నిర్వహించిన వేలంలో కంపెనీ ఐదు ఎకరాల భూమిని కొనుగోలు చేసింది. ఈ భూమిలో రూ.4,150 కోట్ల ఆదాయానికి అవకాశం ఉన్న ప్రీమియం నివాస గృహ సముదాయాన్ని నిర్మించబోతున్నట్టు రెగ్యులేటరీ సంస్థలకు తెలిపింది. హెచ్ఎండీఏ నుంచి కేటాయింపు ఉత్తర్వులు అందుకున్న తర్వాత ఈ ప్రాజెక్ట్ పనులను చేపట్టనున్నట్లు కంపెనీ పేర్కొంది. గోద్రెజ్ ప్రాపర్టీస్ ఈ ఏడాది ఆగస్టులోనూ హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో 7.825 ఎకరాల భూమిని కొనుగోలు చేసింది.

రూ. 3 లక్షల కోట్లు..

6 నెలల్లో భారత్‌లోకి వచ్చిన ఎఫ్‌డీఐ ఇది

న్యూఢిల్లీ: భారత్‌లోకి వచ్చే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) గాడిన పడుతున్నాయి. ఈ ఏడాది సెప్టెంబరుతో ముగిసిన ఆరు నెలల్లో వివిధ దేశాల నుంచి మన దేశం 3,518 కోట్ల డాలర్ల (సుమారు రూ.3.15 లక్షల కోట్లు) ఎఫ్‌డీఐని ఆకర్షించింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 18 శాతం ఎక్కువ. ఈ ఆరు నెలల్లో అమెరికా నుంచి వచ్చిన ఎఫ్‌డీఐ అయితే రెట్టింపునకుపైగా పెరిగి 662 కోట్ల డాలర్లకు చేరింది. మరోవైపు ఎఫ్‌డీఐలను ఆకర్షించిన రాష్ట్రాల్లో మహారాష్ట్ర 1,057 కోట్ల డాలర్లతో అగ్రస్థానంలో ఉండగా ఆ తర్వాతి స్థానాల్లో కర్ణాటక (940 కోట్ల డాలర్లు), తమిళనాడు (357 కోట్ల డాలర్లు), హరియాణా (322 కోట్ల డాలర్లు), గుజరాత్ (224 కోట్ల డాలర్లు), తెలంగాణ (114 కోట్ల డాలర్లు) ఉన్నాయి.

వాటర్‌టెక్ ప్రత్యేక క్యాంపెయిన్ షురూ



హైదరాబాద్: పాలిమర్ బాత్‌వేర్, ప్లంబింగ్ సొల్యూషన్స్ సంస్థ వాటర్‌టెక్ ఇండియా తొలిసారిగా ప్రత్యేక క్యాంపెయిన్‌ను ప్రారంభించింది. ఇందులో భాగంగా 'కిక్ అవుట్ ది ఆర్డినరీ' పేరుతో దేశవ్యాప్తంగా టీవీ అడ్వర్టైజింగ్ క్యాంపెయిన్‌ను ప్రారంభించినట్లు ప్రకటించింది. ఈ క్యాంపెయిన్‌లో భాగంగా సంస్థ.. ప్రొప్రైటరీ సూపర్‌సీల్ టెక్నాలజీ, పీఓఎం మెటీరియల్‌తో తయారు చేసిన ఉత్పత్తుల గురించి వివరించనుంది. కంపెనీ ఉత్పత్తులు 100 శాతం లీక్ ప్రూఫ్‌తో సహా దీర్ఘకాలం పాటు మన్నికగా ఉంటాయని పేర్కొంది. 9 భారతీయ భాషల్లో ఈ టీవీ క్యాంపెయిన్‌ను రూపొందించినట్లు వాటర్‌టెక్ వెల్లడించింది. ప్రధానంగా దక్షిణ, తూర్పు భారతంలో కార్యకలాపాలు సాగిస్తున్న వాటర్‌టెక్ ఈ మధ్యనే దేశవ్యాప్తంగా తన కార్యకలాపాలు విస్తరించింది. ప్రస్తుతం కంపెనీ పోర్టుఫోలియోలో పాలిమర్ బాత్‌వేర్, పైపులు,ఫిట్టింగ్స్, సీపీ ఫిట్టింగ్స్, శానిటరీ వేర్ ఉత్పత్తులు ఉన్నాయి.


కార్.. టాప్ గేర్

న్యూఢిల్లీ: నవంబరు నెలలో కూడా కార్ల మార్కెట్ జోరును కొనసాగించింది. పండగల సీజన్ అనంతర డిమాండు మార్కెట్‌ను వృద్ధి పథంలో నడిపింది. దేశీయ ఆటోమొబైల్ దిగ్గజాలు మారుతి సుజుకీ, టాటా మోటార్స్, మహీంద్రా అండ్ మహీంద్రా అమ్మకాల్లో బలమైన వృద్ధిని నమోదు చేయడం మార్కెట్‌కు కలిసి వచ్చింది. మారుతి సుజుకీ నాలుగు దశాబ్దాల అత్యుత్తమ అమ్మకాల రికార్డును (ఎగుమతులు సహా) నమోదు చేసింది. గత ఏడాది నవంబరుతో పోల్చితే 26% వృద్ధితో 2,29,021 యూనిట్లు విక్రయించింది. 40 ఏళ్ల కాలంలో నవంబరు నెలలో నమోదైన గరిష్ఠ అమ్మకాలు ఇవే. మరోవైపు 57,436 కార్ల అమ్మకంతో టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ రెండో స్థానంలో నిలిచింది. గత ఏడాది నవంబరులో విక్రయించిన 47,063 యూనిట్లతో పోల్చితే అమ్మకాల్లో 22% వృద్ధి నమోదైంది. మహీంద్రా అమ్మకాలు 22 శాతం, హ్యుండయ్ మోటార్ విక్రయాలు 4 శాతం పెరగగా, టయోటా కిర్లోస్కర్ అమ్మకాలు 28 శాతం, కియా ఇండియా 24 శాతం, రెనో ఇండియా విక్రయాలు 30 శాతం పెరిగాయి. ద్విచక్ర వాహన కంపెనీలైన హీరో మోటో, హోండా మోటార్‌సైకిల్, సుజుకీ మోటార్ సైకిల్ రెండంకెల స్థాయిలో పెరగగా బజాజ్ ఆటో విక్రయాలు స్వల్పంగా తగ్గాయి.

సాయి పేరెంటరల్స్ చేతికి ఆస్ట్రేలియా కంపెనీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే సాయి పేరెంటరల్స్ తన ఉత్పత్తి కార్యకలాపాలను ఆస్ట్రేలియాకు విస్తరిస్తోంది. ఇందుకోసం ఆ దేశానికి చెందిన నోమెడ్ ఫార్మాలో 74.6 వాటాను రూ.125 కోట్లకు కొనుగోలు చేసినట్టు ప్రకటించింది. దాదాపు 6 కోట్ల ఆస్ట్రేలియా డాలర్ల ఆదాయం ఉన్న నోమెడ్ ఫార్మా ఆస్ట్రేలియాలో దాదాపు 451 ప్రైవేట్ లేబుల్ ఓటీసీ ఔషధాలను ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌ల్లోని వివిధ ఫార్మా చెయిన్స్‌కు సరఫరా చేస్తోంది. ఈ కంపెనీ ప్రస్తుతం అడిలైడ్ వద్ద 5.3 కోట్ల ఆస్ట్రేలియా డాలర్లతో ఒక అధునాతన ఉత్పత్తి యూనిట్ ఏర్పాటు చేస్తోంది. ఈ యూనిట్ వచ్చే ఏడాది డిసెంబరు కలా వాణిజ్య స్థాయిలో ఉత్పత్తి ప్రారంభించనుంది. ఈ కొనుగోలుతో ఫార్ములేషన్లు, సీడీఎంఓ మార్కెట్లో తమ స్థానం మరింత పటిష్ఠమవుతుందని సాయి పేరెంటరల్స్ ఎండీ కేకే అనిల్ తెలిపారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



2వ తేదీ			
హైదరాబాద్	640	విజయవాడ	665
వరంగల్	642	గోదావరి	640
చిత్తూరు	663	విశాఖపట్నం	630
		డజను గుడ్లు రూ. 90	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్




హైదరాబాద్	117	విజయవాడ	113
వరంగల్	117	గుంటూరు	118
కరీంనగర్	117	ఒంగోలు	118
మహబూబ్‌నగర్	117	చిత్తూరు	111
కర్నూలు	117	నెల్లూరు	116
విశాఖపట్నం	112	అనంతపురం	116
గోదావరి	113		


స్పోర్ట్స్

బోర్డు అత్యవసర సమావేశం!

బుధవారం సౌతాఫ్రికాతో రెండో వన్డే జరగనుండగా.. అంతకంటే ముందే కోచ్ గంభీర్, చీఫ్ సెలెక్టర్ అగార్కర్ ఇతర అధికారులతో బీసీసీఐ అత్యవసర సమావేశం ఏర్పాటు చేయాలనుకుంటోంది. ఇందులో ముఖ్యంగా రో-కోతో కోచ్ గంభీర్ సంబంధాలతో పాటు వారి భవిష్యత్‌పై చర్చించనున్నట్టు సమాచారం. 2027 వన్డే వరల్డ్‌కప్‌లో ఈ ద్వయం ఆడాలనుకుంటోంది. అలాగే జట్టులో ఇటీవల ఎక్కువగా మార్పులు చేర్పులు జరుగుతుండడంతో ఫలితంపై ప్రభావం పడుతోంది. అందుకే ఆటగాళ్ల ఎంపికలో నిలకడ ఉండేలా చూడాలనుకుంటోంది. టెస్టు సిరీస్‌లో కోచ్ వ్యూహాలు, ఆటగాళ్ల స్థానాల మార్పులు బెడిసికొట్టి చివరికి వైట్‌వాష్ అవ్వాల్సి వచ్చింది. మరో ఎనిమిది నెలల తర్వాత టెస్టు సిరీస్ ఉండడంతో ఇప్పటి నుంచే మరింత స్పష్టత, ముందస్తు ప్రణాళికలపై కోచ్‌తో చర్చించే అవకాశం ఉంది.



ఏదో తేడాగా ఉందే..!





రో-కో X గంభీర్!

క్షీణిస్తున్న సంబంధాలు

న్యూఢిల్లీ: కొన్నేళ్లుగా భారత క్రికెట్‌కు మూల స్తంభాలుగా విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ నిలుస్తూ వచ్చారు. దశాబ్దకాలంగా ఎంతో మంది కోచ్‌లుగా వచ్చినా జట్టు ప్రయాణం సాఫీగానే సాగింది. కానీ ప్రధాన కోచ్‌గా గౌతం గంభీర్ ఆగమనంతో పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. కాస్త దూకుడు స్వభావం కలిగిన గౌతీ తన కోసమే ప్రత్యేకంగా జట్టును రూపొందించుకోవాలనే అభిప్రాయంతో ఉన్నాడు. యువ ఆటగాళ్లు, ఆల్‌రౌండర్ల వైపే అతను ఎక్కువగా మొగ్గు చూపుతుంటాడు. దీనికి చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ కూడా వంత పాడుతుండడంతో ఇప్పుడు టీమిండియాలో కోచ్‌దే హవా. దీంతో వెటరన్ స్టార్లు రోహిత్, విరాట్‌ల పరిస్థితి పొమ్మనలేక పొగబెట్టినట్టయ్యింది. అందుకే గతేడాది టీ20 వరల్డ్‌కప్ గెలిచిన వెంటనే ఈ ఇద్దరు దిగ్గజాలు పొట్టి ఫార్మాట్‌కు వీడ్కోలు పలికారు. టెస్టు కెప్టెన్‌గా రోహిత్ ఉన్నప్పటికీ భవిష్యత్ దృష్ట్యా శుభ్‌మన్ గిల్ వైపు గంభీర్ చూడడంతో కినుక వహించిన రోహిత్ ఆ ఫార్మాట్ నుంచి కూడా వైదొలిగాడు. అభిమానులు ఈ షాక్ నుంచి తేరుకునే లోపే అనూహ్యంగా విరాట్ సైతం గుడ్‌బై చెప్పడంతో జట్టులో అసలేం జరుగుతోందనే సందేహం మొదలైంది. ఇప్పుడు రో-కో కేవలం వన్డేలకు మాత్రమే పరిమితమయ్యారు. మరోవైపు 2027లో జరిగే వన్డే వరల్డ్‌కప్‌లో ఈ ఇద్దరికి చోటు కల్పించేందుకు గంభీర్ అంత ఆసక్తి ప్రదర్శించడం లేదు. వారు ఫామ్‌లో ఉంటేనే పరిశీలిస్తామని గతంలోనే గంభీర్ తేల్చి చెప్పాడు. తాజాగా దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్‌కు జట్టులో చేరిన రో-కో గంభీర్‌తో అంటీ ముట్టనట్టుగానే ఉంటున్నారు. అతడికి సమాధానంగా అన్నట్టు రాంచీలో జరిగిన తొలి వన్డేలో ఈ ద్వయం కసిదీరా చెలరేగి 'ఇదుగో ఇదీ మా సత్తా' అంటూ కోచ్‌కు బ్యాట్‌తో గట్టిగానే బదులిచ్చారు. రాహుల్ ద్రవిడ్ స్థానంలో కోచ్‌గా వచ్చినప్పుడు గంభీర్‌కు ఈ ఇద్దరితో సంబంధాలు మెరుగ్గానే ఉన్నా, ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపించడం లేదు. అటు ముంబైకే చెందిన చీఫ్ సెలెక్టర్ అగార్కర్‌తో రోహిత్‌కు కూడా అంతగా సత్సంబంధాలు లేకపోవడం గమనార్హం.

ఎడమొహం పెడమొహంగా..

టెస్టు ఫార్మాట్‌కు వీడ్కోలు పలికాక రో-కో ఆస్ట్రేలియా టూర్‌లోనే తొలిసారిగా కనిపించారు. అక్కడ జరిగిన మూడు వన్డేల్లో రోహిత్ అదరగొట్టగా.. తొలి రెండు మ్యాచ్‌ల్లో కోహ్లీ సున్నాకే అవుటైనా.. ఆఖరి మ్యాచ్‌లో రాణించాడు. ఇప్పుడు దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్ కోసం జట్టులో చేరిన వీరికి కోచ్‌తో సంభాషణలు వేళ్ల మీద లెక్కపెట్టవచ్చని సమాచారం. ఈ ముగ్గురి చుట్టూ నెలకొన్న ప్రతిష్ఠంభన అటు బీసీసీఐని కూడా ఆందోళనపరుస్తోంది. 'ఆసీస్ టూర్‌లో అగార్కర్-రోహిత్ అసలు మాట్లాడుకోలేదు. అప్పటి నుంచి ఇప్పటి వరకు కూడా కోహ్లీ-గంభీర్ ఒకరికొకరు పెద్దగా మాట్లాడుకున్నది లేదు. అంతేకాకుండా ఈ ఇద్దరి అభిమానులు సోషల్ మీడియాలో గంభీర్‌పై విరుచుకుపడుతున్న తీరు బీసీసీఐని కలవరపెడుతోంది' అని బీసీసీఐకి చెందిన ఓ అధికారి తెలిపాడు. తొలి వన్డేలో గెలిచాక డ్రెస్సింగ్ రూమ్‌లోకి వెళ్లిన కోహ్లీ.. అక్కడే ఉన్న కోచ్‌ను కనీసం చూడకుండానే మరో వైపునకు వెళ్లడం వీడియోలో కనిపించింది.

సంబరాలకు దూరంగా..

తొలి వన్డేలో దక్షిణాఫ్రికాపై స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ శతకంతో చెలరేగిన విషయం తెలిసిందే. అయితే విజయం సాధించాక భారత జట్టు ఆటగాళ్లంతా తమ హోటల్‌కు చేరగా.. అక్కడి సిబ్బంది వీరి కోసం కేక్‌ను సిద్ధం చేశారు. కెప్టెన్ రాహుల్ కట్ చేస్తుండగా పక్క నుంచి విరాట్ వెళ్లడం కనిపించింది. ఆటగాళ్లంతా తమతో జాయిన్ కావాలని కోరినా.. అతను మాత్రం 'వద్దులే.. మీరే ఎంజాయ్ చేయండి' అన్నట్టుగా చేయి ఊపుతూ లిఫ్ట్ వైపు వెళ్లడం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

విరాట్ గురించి ఆలోచన ఎందుకు?


సితాన్షు కోటక్


రాంచీ: స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ వన్డే భవిష్యత్ గురించి ఆలోచనలు అనవసరమని టీమిండియా బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్ తేల్చాడు. 'జట్టులో కోహ్లీ స్థానం గురించి, ఎంతకాలం ఆడతాడనే విషయంపై ఎందుకు ఆలోచిస్తున్నారు? అతడు అద్భుతంగా బ్యాటింగ్ చేస్తున్నాడు. ఈ సమయంలో తన భవిష్యత్ గురించి మాట్లాడుకోవడం అవసరమా? తన ప్రదర్శన, ఫిటెనెస్ మెరుగ్గా ఉన్నంతకాలం జట్టులో ఉంటాడు' అని కోటక్ స్పష్టం చేశాడు. మరోవైపు 37 ఏళ్ల కోహ్లీలో పరుగుల దాహం ఇంకా తీరలేదని దక్షిణాఫ్రికా మాజీ పేసర్ స్టెయిన్ చెప్పాడు. ఆ వయస్సుగల క్రికెటర్లు రిటైర్మెంట్ తీసుకుని హాయిగా ఇంట్లో సేద తీరుతున్నా.. మైదానంలో చిరుతలా పరిగెత్తుతూ, అద్భుత ఫీల్డింగ్‌తో విరాట్ అదరగొడుతున్నాడని కితాబిచ్చాడు.

పికెల్‌బాల్ లీగ్‌లో హైదరాబాద్ బోణీ

న్యూఢిల్లీ: ఇండియన్ పికెల్‌బాల్ లీగ్‌లో హైదరాబాద్ రాయల్స్ జట్టు బోణీ కొట్టింది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ 4-2తో క్యాపిటల్ వారియర్స్ గుర్‌గావ్‌పై గెలిచింది. ఇతర మ్యాచ్‌ల్లో లఖ్‌నవూ లెపార్డ్స్ 4-1తో బెంగళూరు బ్లాస్టర్స్‌పై, చెన్నై సూపర్ వారియర్స్ 5-1తో ముంబై స్మాషర్స్‌పై నెగ్గాయి.

హార్దిక్ ఫిట్

- గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన సీఓఈ
- ముస్తాక్ అలీ టోర్నీలో ఆడనున్న ఆల్‌రౌండర్



న్యూఢిల్లీ: టీమిండియా ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా మళ్లీ మైదానంలోకి అడుగుపెట్టనున్నాడు. ఈ ఏడాది ఆసియా కప్‌లో శ్రీలంకతో మ్యాచ్ సందర్భంగా గాయపడి రెండు నెలలకు పైగా ఆటకు దూరంగా ఉన్న హార్దిక్ ఇప్పుడు పూర్తి ఫిట్‌గా ఉన్నాడు. ఈ మేరకు బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ).. హార్దిక్ ఫిట్‌గా ఉన్నాడని ప్రకటించింది. అతను బౌలింగ్ చేయడానికి కూడా ఓకే చెప్పింది. దీంతో హార్దిక్.. మంగళవారం హైదరాబాద్ వేదికగా పంజాబ్‌తో జరిగే సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 టోర్నీలో బరోడా తరఫున బరిలోకి దిగనున్నాడు. ఈ టోర్నీలో పాండ్యా ఫిటెనెస్, ప్రదర్శనను పరిశీలించిన తర్వాత.. ఓకే అనిపిస్తే అతడిని దక్షిణాఫ్రికాతో టీ20 సిరీస్‌కు కూడా ఎంపిక చేసే అవకాశముంది.

మహిళల హాకీ జట్టు చీఫ్ కోచ్ హరేంద్ర రాజీనామా



న్యూఢిల్లీ: భారత మహిళల హాకీ జట్టు ప్రధాన కోచ్ హరేంద్ర సింగ్ తన పదవికి రాజీనామా చేశాడు. వ్యక్తిగత కారణాలతోనే ఈ నిర్ణయం తీసుకున్నాని, వెంటనే ఇది అమల్లోకి వస్తుందని అతను వెల్లడించాడు. ఇదే విషయాన్ని హాకీ ఇండియా (హెచ్ఐ)కు ఈమెయిల్ ద్వారా తెలిపాడు. గతేడాది ఏప్రిల్‌లో కోచ్‌గా జట్టు బాధ్యతలు స్వీకరించిన హరేంద్ర.. తన హయాంలో గత నవంబరులో జట్టును ఆసియా చాంపియన్స్ ట్రోఫీలో విజేతగా నిలిపాడు. అయితే, ఆ తర్వాత అనూహ్యంగా భారత మహిళల హాకీ జట్టు ప్రదర్శన ఆశించిన మేర లేదు. ఎఫ్ఐహెచ్ ప్రో లీగ్ 2024-25లో 16 మ్యాచ్‌లు ఆడితే రెండింట్లో మాత్రమే గెలిచింది. దీంతో తర్వాతి సీజన్‌కు జట్టు అర్హత సాధించలేకపోయింది. మరోవైపు నెదర్లాండ్స్‌కు చెందిన జోయెర్డ్ మరిజ్నే మరోసారి మహిళల జట్టు చీఫ్ కోచ్‌గా వచ్చే అవకాశముంది. మరిజ్నే ఆధ్వర్యంలోనే మహిళల జట్టు 2021 టోక్యో ఒలింపిక్స్‌లో నాలుగో స్థానంలో నిలిచింది.

అర్జున్‌కు 5.. గుకేష్‌కు 10

ఫిడే ర్యాంకింగ్స్

న్యూఢిల్లీ: ఫిడే చెస్ ర్యాంకింగ్స్‌లో తెలుగు గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఇరిగేసి ఓ ర్యాంక్ మెరుగుపరచుకోగా.. ప్రపంచ చాంపియన్ గుకేష్ ఓ స్థానం కోల్పోయాడు. ఫిడే సోమవారం ప్రకటించిన తాజా ర్యాంకింగ్స్‌లో క్లాసికల్ విభాగంలో అర్జున్ ఆరు నుంచి ఐదో స్థానానికి ఎగబాకాడు. ఇటీవల జరిగిన వరల్డ్‌కప్‌లో అర్జున్ క్వార్టర్స్ దాకా చేరగా.. గుకేష్ మూడో రౌండ్‌లోనే ఓడాడు. దీంతో గుకేష్ 9 నుంచి 10వ ర్యాంక్‌కు పడిపోయాడు. ప్రజ్ఞానంద ఏడో ర్యాంక్‌లో, దిగ్గజ గ్రాండ్‌మాస్టర్ విశ్వనాథన్ ఆనంద్ 13వ, విదిత్ గుజరాతి 29వ స్థానంలో కొనసాగుతున్నారు.



మనమ్మాయిల శుభారంభం

జూనియర్ హాకీ ప్రపంచకప్

శాంటియాగో (చిలీ): జూనియర్ మహిళల హాకీ వరల్డ్‌కప్‌లో భారత జట్టు శుభారంభం చేసింది. సోమవారం జరిగిన తమ తొలి మ్యాచ్‌లో భారత్ 13-0తో నమీబియాపై ఘన విజయం సాధించింది. భారత జట్టులో హీనా బానో, కనికా సివాచ్ హ్యాట్రిక్ గోల్స్‌తో విజృంభించగా.. సాక్షి రాణా రెండు గోల్స్‌తో సత్తా చాటింది. సాక్షి శుక్లా, ఇషిక, మనీషా తలో గోల్ కొట్టారు.



సీఓఈలో చేరిన గిల్

న్యూఢిల్లీ: మెడ నొప్పితో బాధపడుతున్న భారత టెస్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ)లో చేరాడు. పునరావాస శిబిరంలో భాగంగా సోమవారం తను బెంగళూరుకు చేరుకున్నాడు. దక్షిణాఫ్రికాతో ఈనెల 9 నుంచి ఐదు టీ20ల సిరీస్ జరుగనుంది. ప్రస్తుతం వన్డేలకు దూరమైన తను పొట్టి పోరుకల్లా సిద్ధంగా ఉండాలని భావిస్తున్నాడు. ఈనేపథ్యంలో వేగంగా కోలుకుంటున్న గిల్‌కు సీఓఈలో ఫిటెనెస్ టెస్టు నిర్వహించనున్నారు. అన్నీ అనుకూలంగా జరిగితే ఈనెల 6-7వరకల్లా కటక్‌లో టీ20 జట్టుతో పాటు చేరే అవకాశం ఉందని బోర్డు వర్గాలు తెలిపాయి.

తెలుగు లిఫ్టర్లకు పతకాలు


మహేష్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఖేలో ఇండియా యూనివర్సిటీ క్రీడల్లో తెలుగు లిఫ్టర్లు పతకాల మోత మోగించారు. రాజస్థాన్‌లో జరుగుతున్న ఈ పోటీల్లో ఏపీకి చెందిన మహేష్ స్వర్ణ పతకం కొల్లగొట్టాడు. మహేష్ 79 కిలోల విభాగంలో విజేతగా నిలిచాడు. 88 కిలోల కేటగిరీలో తరుణ్ రెండో స్థానంలో నిలిచి రజత పతకం సాధించాడు. 94 కిలోల విభాగంలో కోమల్ శ్రీకాంత్ రెండో స్థానంతో రజతం, అశోక్ మూడో స్థానంతో కాంస్యం దక్కించుకున్నారు. 79 కిలోల విభాగంలో వెంకటకృష్ణ మూడో స్థానంతో కాంస్య పతకం కైవసం చేసుకున్నాడు.

ప్రతీకకు ప్రమోషన్



న్యూఢిల్లీ: వన్డే ప్రపంచకప్ గెలిచిన భారత మహిళల జట్టు సభ్యురాలైన ప్రతీకా రావల్ ప్రతిభకు గుర్తింపుగా ఆమెకు రైల్వే శాఖ పదోన్నతి కల్పించింది. రైల్వేలో సీనియర్ క్లర్క్ ఉద్యోగినిగా ఉన్న ప్రతీకను ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీగా గెజిటెడ్ ఆఫీసర్ పోస్టుకు ప్రమోట్ చేస్తూ నిర్ణయం తీసుకుంది.

చెరువు భూమిలో 8 భారీ టవర్లు

- వివరణ ఇవ్వాలని ప్రభుత్వం, బిల్డర్లకు హైకోర్టు నోటీసులు
- ప్రభుత్వ భూమిని కాపాడాలని కాంగ్రెస్ ఎమ్మెల్యేల పిటిషన్
- హైడ్రా చర్యలు తీసుకోలేదని ఫిర్యాదు

హైదరాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఖాజాగూడ చెరువు ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్) పరిధిలో ఉన్న ప్రభుత్వ భూమిని ఆక్రమించి ఎనిమిది భారీ టవర్లు నిర్మిస్తున్నారన్న ఆరోపణలపై వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వంతో పాటు బిల్డర్లకు సోమవారం హైకోర్టు నోటీసులు జారీ చేసింది. నాలుగు వారాల్లో కౌంటర్‌లు దాఖలుచేయాలని స్పష్టం చేసింది. కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరుతూ నలుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అనిరుధ్‌రెడ్డి (జడ్చర్ల), యెన్నం శ్రీనివాస్‌రెడ్డి (మహబూబ్‌నగర్), మురళీనాయక్ భూక్యా (మహబూబాబాద్), కూచుకుల్ల రాజేశ్‌రెడ్డి (నాగర్‌కర్నూల్)లు ఈ ఏడాది మేనెలలో దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై ఈ ఆదేశాలు ఇచ్చింది.

రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం ఖాజాగూడ గ్రామపరిధిలోని పాత సర్వే నెంబర్లు 119, 122, కొత్త సర్వే నెంబరు 27లోని 27.18 ఎకరాల ప్రభుత్వ భూమిలో బెవర్లీ హిల్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్... డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ కం జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ (డీఏజీపీఏ) పొందిన సోహిని బిల్డర్స్‌తో కలిసి 47 అంతస్తుల చొప్పున 8 భారీ టవర్లు నిర్మిస్తున్నారని పిటిషనర్లు ఆరోపించారు. వివాదంలో ఉన్న ఆ భూమిని రెవెన్యూ అధికారులు ఆ బిల్డర్లకు బదిలీ చేయడం చెల్లదని పేర్కొన్నారు. అధికారులు ప్రయివేటు వ్యక్తులతో కుమ్మక్కయి కబ్జాకు సహకరించారని ఆరోపించారు. దీనిపై హైడ్రాకు ఫిర్యాదు చేసినా లాభం లేకపోవడంతో హైకోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు. హైకోర్టు ఆదేశాల మేరకు సర్వే నెంబర్లు, లొకేషన్ వివరాలతో రెండోసారి ఫిర్యాదు చేసినా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని పేర్కొన్నారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్‌ల ధర్మాసనం విచారణ జరిపింది. కాంగ్రెస్ ఎమ్మెల్యేల తరఫున న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ వాదనలు వినిపించారు. వివాదంలో ఉన్న భూమి విలువ దాదాపు రూ. 8 వేల కోట్లు ఉంటుందని, చాలా వేగంగా నిర్మాణాలు జరుగుతున్నందున అడ్డుకోవాలని విజ్ఞప్తి చేశారు. బెవర్లీ హిల్స్ ఓనర్స్ వెల్ఫేర్ సొసైటీ తరఫు న్యాయవాది వాదిస్తూ.. ప్రభుత్వ అనుమతితోనే భూబదిలీ జరిగిందని, జీహెచ్‌ఎంసీ సహా అన్ని ప్రభుత్వ ఏజెన్సీల అనుమతులు తీసుకునే నిర్మాణాలు చేపట్టారని తెలిపారు. ప్రాజెక్టు ఇప్పటికే పూర్తికావచ్చిందని చెప్పారు. కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించిన ధర్మాసనం విచారణను నాలుగువారాలకు వాయిదా వేసింది.

పత్తి కొనుగోళ్లు ప్రారంభం

హైదరాబాద్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం నుంచి పత్తి కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. సీసీఐ విధించిన కొత్త నిబంధనల కారణంగా జిన్నింగ్ మిల్లర్స్ అసోసియేషన్ గతంలో సమ్మెకు దిగారు. దీంతో పత్తి విక్రయించుకోవడానికి రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొనుగోళ్లు నిలిచిపోవడంతో సమస్యను పరిష్కరించేందుకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. కేంద్ర మంత్రులతో పాటు సీసీఐ సీఎండీతో ఆయన జరిపిన చర్చలు ఎట్టకేలకు ఫలించాయి. సానుకూల స్పందన రావడంతో సీసీఐ నోటిఫై చేసిన 330 మిల్లుల్లో పత్తి కొనుగోళ్లు మొదలయ్యాయి. ఈ నిర్ణయంతో వేలాది మంది రైతులు, జిన్నింగ్ మిల్లుల కార్మికులకు ఉపశమనం లభించిందని తుమ్మల ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు సీసీఐ రాష్ట్రంలో 4.03 లక్షల మెట్రిక్ టన్నుల పత్తిని సేకరించిందని, కొనుగోలు చేసిన పత్తి విలువ రూ. 3,201 కోట్లు ఉంటుందని ఆయన తెలిపారు.

వీరన్న బలవన్మరణానికి రేవంత్‌దే బాధ్యత

- కౌలు రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలన్న కేటీఆర్

హైదరాబాద్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా శంకరగిరి తండాకు చెందిన కౌలు రైతు వీరన్న బలవన్మరణానికి సీఎం రేవంత్ రెడ్డి బాధ్యత వహించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. కౌలు రైతులకూ రూ.15,000 రైతుభరోసా ఇస్తామని సీఎం మోసం చేయడం వల్లే వీరన్నలాంటి రైతులు ప్రాణాలు విడుస్తున్నారని ఎక్స్‌లో ఆయన పోస్ట్‌పెట్టారు. రాష్ట్రంలో 700మందికి పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే, రేవంత్ సర్కారు విజయోత్సవాల పేరిట డ్రామాలాడటం సిగ్గుచేటన్నారు. కౌలు రైతు వీరన్న తీసుకున్న సెల్ఫీ వీడియో చూసైనా రేవంత్‌రెడ్డి కళ్లు తెరవాలని, రెండేళ్ల పాలనలో అన్నదాతలకు చేసిన మోసాలకు ప్రభుత్వం వెంటనే క్షమాపణ చెప్పాలన్నారు. ఆత్మహత్య చేసుకున్న వీరన్న కుటుంబానికి ప్రభుత్వం తక్షణం రూ.25లక్షల పరిహారం అందించి ఆదుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

బీఎస్సీ నర్సింగ్ విద్యార్థినిపై యాసిడ్‌తో దాడి

- కాజీపేట మండలం కడిపికొండ గ్రామంలో ఘటన
- స్వల్పగాయాలతో బయటపడిన యువతి


సునంద

మడికొండ/జఫర్‌గఢ్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ నగరంలో యాసిడ్ కలకలం రేగింది. కాజీపేట మండలం కడిపికొండలో నర్సింగ్ విద్యార్థినిపై గుర్తుతెలియని వ్యక్తి యాసిడ్ దాడికి పాల్పడిన ఘటన జరిగింది. జనగామ జిల్లా జఫర్‌గఢ్ మండలం వడ్డెగూడెం గ్రామానికి చెందిన తాటికాయల కుమారస్వామి కుమార్తె సునంద హనుమకొండలో బీఎస్సీ నర్సింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. సోమవారం కళాశాలలో హాల్‌టికెట్ తీసుకొని తన అమ్మమ్మ గ్రామమైన ఐనవోలు మండలం వెంకటాపురం గ్రామానికి వెళ్లడానికి సాయంత్రం 6.15 గంటలకు స్కూటీపై బయలుదేరింది. కడిపికొండ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్దకు రాగానే సుమారు 40 ఏళ్ల వయస్సు గల గుర్తుతెలియని వ్యక్తి బండిపై వచ్చి తనపై ఏదో పోసినట్లు యువతి తన ఫిర్యాదులో పేర్కొన్నది. తన కాలిపై మంటగా అనిపించడంతో బంధువులకు సమాచారం అందించింది. ఈ సమాచారం తెలిసిన మడికొండ ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ ఘటనా స్థలానికి చేరుకొని యువతిని హుటాహుటిన ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ యువతికి వైద్యులు చికిత్స అందించారు. శరీరంలో 7 శాతం కాలిందని పేర్కొన్నారు. యువతి స్వల్ప గాయాలతో బయట పడడంతో కుటుంబసభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

హెల్త్ వర్సిటీకి వీసీ ఎవరో?

- ఇన్‌చార్జిగా ఐఏఎస్ అధికారి నియామకం?
- యోచనలో ప్రభుత్వం..

హైదరాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయానికి కొత్త ఉప కులపతి(వీసీ)గా ఎవర్ని నియమించాలనే విషయంలో ప్రభుత్వం తర్జనభర్జన పడుతోంది. కొద్ది రోజుల పాటు ఆ బాధ్యతలను ఎవరైనా ఐఏఎస్ అధికారికి అప్పగిస్తే ఎలా ఉంటుందనే విషయంపై కసరత్తు చేస్తోంది. రెగ్యులర్ వీసీ నియామకం జరిగే వరకు ఇన్‌చార్జిగా ఐఏఎస్ అధికారితో నెట్టుకురావాలనుకుంటోంది. కాగా పీజీ పరీక్షల జవాబు పత్రాల్లో అవకతవకలు జరిగి.. రీవాల్యుయేషన్‌లో ఓ విద్యార్థికి మార్కులు కలిపి పాస్ చేయించారన్న ఆరోపణలపై వీసీగా ఉన్న డాక్టర్ నందకుమార్ రెడ్డి రాజీనామా చేశారు. రాష్ట్ర గవర్నర్ ఆయన రాజీనామాను వెంటనే ఆమోదించారు. దాంతో వీసీ పోస్టు ఖాళీ అయింది. ప్రస్తుతం వైద్యవిద్య అండర్ గ్రాడ్యుయేట్, పోస్టు గ్రాడ్యుయేట్‌తో పాటు బీఎస్సీ నర్సింగ్ ప్రవేశాలు జరుగుతున్నాయి. వీటితోపాటు విశ్వవిద్యాలయం పరిధిలో నిత్యం అనేక కోర్సులకు సంబంధించిన పరీక్షలు జరుగుతూనే ఉంటాయి. అడ్మిషన్లు, పరీక్షలపై నిరంతరం పర్యవేక్షించాల్సివుంటుంది. ఈ నేపథ్యంలో కొత్త వీసీగా ఎవర్ని నియమిస్తారన్న దానిపై అందరిలోనూ ఆసక్తి నెలకొంది. మరోవైపు పలువురు ఆశావాహులు అప్పుడే తమ ప్రయత్నాలను మొదలుపెట్టారు. వీసీ పోస్టు కోసం పై స్థాయిలో పైరవీలు ప్రారంభించినట్లు వైద్యవర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఈసారైనా ప్రభుత్వం సిఫారసులను పక్కనపెట్టి, నిబద్ధత, చిత్తశుద్ధి, మంచి ట్రాక్ రికార్డుతో పాటు అవినీతి ఆరోపణలు లేని వారిని వీసీగా నియమించాలని వైద్యవిద్య నిపుణులు సర్కారుకు సూచిస్తున్నారు.

ఇంటింటికి 5 లక్షల బీమా..

ఆడబిడ్డ పుడితే 5వేలు

రంగారెడ్డి జిల్లా కొత్తపేటలో 15 హామీలతో సర్పంచ్ అభ్యర్థి మేనిఫెస్టో

- బీమా హామీకే ఐదేళ్లలో 42.5 లక్షలు
- ఉచిత అంబులెన్స్, గ్యాస్ సిలిండర్లు
- బాండ్‌పేపర్‌పై 22 హామీలు రాసిచ్చిన గద్వాల జిల్లా సల్కాపురం అభ్యర్థి

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

పల్లెపోరులో హామీలు హోరెత్తుతున్నాయి. గెలిపించండి.. పథకాలు పొందండి అంటూ సర్పంచ్ అభ్యర్థులు ప్రకటిస్తున్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోకపోతే గనక దిగిపోతాను అంటూ ప్రతినబూనుతున్నారు. రంగారెడ్డి జిల్లా కేశంపేట మండలం కొత్తపేట గ్రామానికి చెందిన పసుల వనమ్మ నరసింహ యాదవ్ తనను సర్పంచ్‌గా గెలిపిస్తే ప్రతి ఇంటికి రూ.5లక్షల చొప్పున జీవిత బీమా చేస్తానని హామీ ఇచ్చారు. ఆ ఊర్లో 700 గడపలున్నాయి. ప్రతి ఇంటికి ఏడాదికి రూ.1200 ప్రీమియం అవుతుంది. ఈ లెక్కన ఏడాదికి రూ.8.40 లక్షలు.. ఐదేళ్లకు రూ.42.5 లక్షలు అవుతుంది. ఈ ఒక్క హామే కాదు.. మొత్తంగా 15 హామీలతో ఆమె మేనిఫెస్టో రూపొందించి ప్రకటించారు ఆడబిడ్డ పుడితే బంగారు తల్లి పథకం కింద రూ.5వేల ఫిక్స్‌డ్ డిపాజిట్, ఆడబిడ్డ పెళ్లికి పుస్తెమట్టెలు చేయిస్తానని, అబ్బాయి వివాహానికి రూ.5,116 ఇస్తానని మాటిచ్చారు. అలాగే ఊర్లో నెలకోసారి మెడికల్ క్యాంపు నిర్వహణ, శస్త్రచికిత్స అవసరం ఉన్నవారికి రూ.15వేల ఆర్థికసాయం, ఇల్లు కట్టుకునేవారికి స్లాబ్ వేసుకునే సమయంలో రూ. రూ.21వేలు, ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాలు, బ్యాగులు, బూట్ల పంపిణీ. ఉన్నత చదువులకు ఆర్థిక సాయం, గ్రామంలో గ్రంథాలయం ఏర్పాటు, శివరాత్రి, శ్రీరామ నవమి, మొహరం సందర్భంగా ఊర్లో అన్నదానం, రంజాన్‌లో ఇఫ్తార్ విందు ఏర్పాటు. గ్రామ భద్రత కోసం అన్ని వీధుల్లో సీసీ కెమెరాల ఏర్పాటు, దహన సంస్కారాలకు రూ.10వేలు, అంత్యక్రియల కోసం వైకుంఠ రథం వితరణ చేస్తానని ఆమె ప్రకటించారు. గద్వాల జిల్లా గట్టు మండలం సల్కాపురం గ్రామ సర్పంచ్ ఎన్నికలో అభ్యర్థిగా ఆంజనేయులు నామినేషన్ దాఖ లు చేశారు. గ్రామంలో అమలు చేయనున్న 22 హామీలతో మేనిఫెస్టోను వంద రూపాయల బాండ్ పేపర్‌పై రాసిచ్చారు. ఈ హామీలను నెరవేర్చకపోతే పదవి నుంచి తప్పుకొంటానని ప్రకటించారు. గ్రామానికి అంబులెన్స్ సౌకర్యం కల్పించడం, ద్విచక్ర వాహనదారులకు ఉచిత హెల్మెట్, బీసీ స్మశానవాటికకు ఫెన్సింగ్, బోరు వేయించి, మోటారు ఏర్పాటు చేసి తాగు నీటి వసతి కల్పిస్తానని హామీ ఇచ్చారు. వితంతు మహిళలకు ఇంటి నిర్మాణం కోసం రూ. 10 వేల సాయం, ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ, ఊర్లో బీటీరోడ్లు, సీసీ రోడ్ల నిర్మాణం చేపడతానని హామీ ఇచ్చారు.


లట్టుపల్లి సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న కమతం నందిని శ్రీనివాస్ రెడ్డి

అమెరికా నుంచి వచ్చి బరిలోకి

నాగర్‌కర్నూలు జిల్లా బిజినేపల్లి మండలంలోని లట్టుపల్లి గ్రామానికి చెందిన కమతం నందిని శ్రీనివాస్ రెడ్డి ముగ్గురు పిల్లలు అమెరికాలో స్థిరపడ్డారు. ఓ ఆరేళ్లు పిల్లల వద్దే ఉండేందుకు ఆమె ఇటీవల అమెరికా వెళ్లింది. గ్రామాన్ని జనరల్‌కు కేటాయించడం, ముగ్గురు పిల్లల నిబంధన ఎత్తివేయడంతో నందిని హుటాహుటిన అమెరికా నుంచి వచ్చి సర్పంచ్‌గా నామినేషన్ వేశారు.

ఏకగ్రీవాల జోరు

ఏకగ్రీవాలు జోరందుకుంటున్నాయి. వేలంపాట ద్వారానో, ఊర్లో ఆలయాలను నిర్మిస్తామనే హామీతోనో, అభివృద్ధి పనులు పూర్తిచేస్తామనే హామీతోనో, ఒక్కరే నామిషన్ వేయడంతోనో పలుచోట్ల అభ్యర్థులు సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికవుతున్నారు. నిజామాబాద్ జిల్లాలో 10 గ్రామ పంచాయతీలు, కామారెడ్డి జిల్లాలో ఐదు గ్రామపంచాయితీలు ఏకగ్రీవమైతే ఇందులో వర్ని మండలంలోనే ఎనిమిది ఏకగ్రీవం అయ్యాయి. కామారెడ్డి జిల్లా బీబీపేట మండలం శివారురాంరెడ్డిపల్లికి చెందిన ధరణి లక్ష్మి తనను ఎన్నుకొంటే గ్రామంలోని అంతర్గత రహదారులు, మరుగుదొడ్ల నిర్మాణం పూర్తిచేస్తానని హామీ ఇవ్వడంతో ఆమెను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో 22 గ్రామాలు, నిర్మల్ జిల్లాలో ఎనిమిది గ్రామాలు ఏకగ్రీవమయ్యాయి. మెదక్ జిల్లా చిన్న శంకరంపేటలో.. పార్టీలకు అతీతంగా ముదిరాజ్ కులస్థులు ఏకమయ్యారు. తమకు ఎప్పుడూ అవకాశం రాలేదని, ఈసారి అవకాశం ఇవ్వాలంటూ హేమ దుర్గపతి అనే వ్యక్తిని అభ్యర్థిగా నిలబెట్టారు. ఖమ్మం జిల్లాలో వేలంపాట రహితంగా ఆరు గ్రామాలు, జనగామ జిల్లాలో ఆరు, వరంగల్ జిల్లాలో ఐదు, మహబూబాబాద్ జిల్లాలో మూడు, మహబూబ్‌నగర్ జిల్లాలో రెండు, ములుగు జిల్లా, భూపాలపల్లి జిల్లాలో ఒక గ్రామం చొప్పున ఏకగ్రీవమయ్యాయి. నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండలం చిన్న అడిశర్లపల్లి గ్రామంలో అభ్యర్థి వెంకటయ్య రూ.51.3 లక్షలతో ఊర్లో బొడ్రాయి ప్రతిష్ఠతో పాటు శివాలయం నిర్మిస్తానని మాటిచ్చారు. గుర్రంపోడు మండలం ములకలపల్లిలో అభ్యర్థి బొడ్డు లింగస్వామి రామాలయం నిర్మించేందుకు ముందుకురాగా ఆయన్ను ఏకగ్రీవంగా ఎన్నుకొనేందుకు ప్రజలు సిద్ధమయ్యారు.

కోతులు, కుక్కల బెడద తీర్చిన వారికే..

ఆ బెడద ఎంత తీవ్రంగా ఉంటే ఈ డిమాండ్ చేస్తారు చెప్పండి? మంచిర్యాల జిల్లా దండేపల్లి ప్రజలదీ డిమాండ్. సోమవారం ప్లకార్డులు పట్టుకొని మరీ.. కోతులు, కుక్కల బెడద తీర్చిన వారికే ఓటేస్తాం అంటూ నినాదాలు చేశారు. ఊర్లో ఉదయం సాయంత్రం సమయాల్లో కోతులు, కుక్కలు గుంపు గుంపులుగా వచ్చి ప్రజలపై దాడి చేస్తున్నాయి. దాడుల్లో ఇటీవల పలువురు గాయపడ్డారు.

భారీగా నామినేషన్లు

రెండోవిడత సర్పంచ్ ఎన్నికల కోసం నామినేషన్ల రెండోరోజు సోమవారం భారీగా నామినేషన్లు దాఖలయ్యాయి. ఏకాదశి కావడం, మధ్యాహ్నం తర్వాత విశేష ముహూర్తం ఉండటంతో అభ్యర్థులు కేంద్రాలకు పోటెత్తారు. దాదాపు సర్పంచ్ అభ్యర్థుల నుంచి 18వేల వరకు, వార్డు సభ్యుల స్థానాల కోసం 30వేల వరకు నామినేషన్లు దాఖలైనట్లు అంచనా. తొలిరోజు 2975 మంది సర్పంచ్ అభ్యర్థులుగా, 3608 మంది వార్డు సభ్యులుగా నామినేషన్లు దాఖలు చేసినట్లు అంచనా. ఇక తొలి విడత ఎన్నికలు జరిగే గ్రామాల్లో పోలీసులు ప్రత్యేక నిఘాపెట్టారు.



దేవాదాయ శాఖకు దేవుడే దిక్కు..!

- శాఖలో కొరవడిన అజమాయిషీ
- పదోన్నతుల కోసం అధికారులు.. జీతాల కోసం సిబ్బంది ఎదురుచూపులు

హైదరాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): భగవంతుడికి భక్తుడికి మధ్య అనుసంధానంగా పనిచేసే దేవాదాయ శాఖ అంతర్గత సమస్యలతో సతమతమవుతోంది. క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే స్వీపర్, వాచ్‌మెన్ మొదలు డిప్యూటీ కమిషనర్ల(డీసీ) స్థాయి అధికారుల వరకు కష్టాలు తీరడం లేదు. అధికారుల మధ్య సమన్వయ లోపం, కీలక అధికారుల బదిలీల పరంపర, జీతాల చెల్లింపులో జాప్యం, అజమాయిషీ కొరవడటం వంటి సమస్యలు పెద్ద తలనొప్పిగా మారాయి. ఈ శాఖను చక్కదిద్దడానికి ఇక దేవుడే దిక్కా? అన్న చందంగా పరిస్థితి తయారయిందని ఉద్యోగులు వాపోతున్నారు. అసిస్టెంట్ కమిషనర్(ఏసీ) నుంచి డీసీ, డీసీ నుంచి ఆర్‌జేసీ పోస్టులకు ఏళ్లతరబడిగా పదోన్నతులు చేపట్టడం లేదు. దీంతో పదోన్నతుల కోసం అధికారులు కమిషనర్ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. వీరంతా జేఏసీ ఏర్పాటు చేసి పోరాటం చేస్తున్నారు. మరోవైపు ఏళ్ల తరబడి క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న, అర్హులైన అర్చక, ఉద్యోగులు అందరికీ గ్రాంట్ ఇన్ ఎయిడ్(జీఐఏ) వేతనాలు చెల్లించాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో సమస్య పరిష్కారానికి బుధవారం అర్చక, ఉద్యోగులు రాష్ట్రస్థాయి సమావేశం ఏర్పాటుకు నిర్ణయించారు. దేవాదాయ శాఖలో అజమాయిషీ కొరవడటంతోనే సమస్యలు ఎక్కడవేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మిగిలిపోతున్నాయని అధికారులు, సిబ్బంది నిట్టూరుస్తున్నారు. రెండేళ్లకాలంలో ఆరుగురు డైరెక్టర్లను మార్చడం కూడా శాఖ పనితీరుపై ప్రభావం చూపిందనే వాదనలు వినిపిస్తున్నాయి. తరచూ బదిలీలు జరుగుతున్న నేపథ్యంలో పాలసీల అమలు, కిందిస్థాయి ఉద్యోగులపై అజమాయిషీ కరువైంది. ఎవరూ గరిష్ఠంగా ఆరు నెలలకు మించి ఉండటపోవడంతో.. పూర్తిస్థాయి నిర్ణయాలు తీసుకుని అమలు చేసే పరిస్థితి లేకుండా పోయిందనే వాదనలు వినిపిస్తున్నాయి. దీంతో దేవాదాయ శాఖ పరిధిలో 400లకుపైగా ఖాళీలు పేరుకుపోయాయి. కీలకమైన ఈవో స్థాయిలోనే సుమారు 70 వరకు పోస్టులు ఖాళీగా ఉన్నట్లు సమాచారం. కొన్ని చోట్ల ఒక్కో ఈవోకు సుమారు 10 వరకు ఆలయాలకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించడంతో వారు సైతం ఆలయాలపై పర్యవేక్షణ కొనసాగించే పరిస్థితి లేకుండా పోయింది.

ఆడిందే ఆట... పాడిందే పాట...!

సరైన పర్యవేక్షణ లేకపోవడంతో కొందరు అధికారుల పనితీరు ఆడిందే ఆట, పాడిందే పాటగా సాగుతుందనే విమర్శలు ఉన్నాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న ఓ ఈవో బదిలీకి ఆర్డర్ కాపీ సిద్ధమైనా చివరి నిమిషంలో నిలిచిపోయిందని సమాచారం. తప్పనిసరి పరిస్థితుల్లో బదిలీ ఉత్తర్వులు బయటకు వచ్చాయని తెలిసింది. హైదరాబాద్‌లో పదవీ విరమణకు దగ్గరలో ఉన్న ఆలయ అధికారికి ఈవోగా పదోన్నతి వచ్చినా.. ఫైల్ ముందుకు కదపకుండా ఉంచారని, చివరికి అడిగిన మొత్తం ఇచ్చిఫైల్ క్లియర్ చేయించుకున్నారని సమాచారం. శాఖలో రెండో అతిపెద్ద పోస్టు అయిన ఏడీసీ స్థాయి అధికారి ఆదేశాల్ని పాటించకుండా ఈవోలు ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఐఏఎస్ అధికారి కుమార్తె ఆత్మహత్య

- 9 నెలల కిందట మహానందిలో ప్రేమ వివాహం
- ఇటీవల అత్తింటి నుంచి తల్లిదండ్రుల వద్దకు..
- ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య

నంద్యాల/తాడేపల్లి/మంగళగిరి సిటీ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఓ సీనియర్ ఐఏఎస్ అధికారి కుమార్తె ఉరేసుకొని ఆత్మహత్య చేసుకొన్న ఘటన కలకలం రేపింది. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని వారి నివాసంలో ఆదివారం ఉదయం చోటుచేసుకున్న ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఆత్మహత్య చేసుకున్న యువతిది కులాంతర ప్రేమ వివాహం కావడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తమ కుమార్తె ఆత్మహత్యకు భర్త మోసం, అత్తింటి వేధింపులే కారణమని బాధిత తల్లిదండ్రులు చెబుతుండగా.. వారే తన భార్యను హత్య చేశారని, దీనిపై తనకు అనుమానాలున్నాయంటూ యువతి భర్త ఆరోపిస్తున్నాడు. తాడేపల్లి పోలీసులు యువతి తల్లి ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నంద్యాల జిల్లా బేతంచెర్ల మండలం బుగ్గానిపల్లె తండాకు చెందిన చిన్నరాముడు, లక్ష్మీబాయి దంపతులకు ఒక కుమారుడు, కుమార్తె మాధురి సాహితి బాయి (25). ఐఏఎస్ హోదాలో ఉన్న చిన్నరాముడు ప్రస్తుతం రాష్ట్ర ఎస్సీ కమిషన్ కార్యదర్శిగా గుంటూరులో పనిచేస్తూ.. తాడేపల్లిలో నివాసం ఉంటున్నారు. వారి కుమార్తె మాధురి బుగ్గానిపల్లె గ్రామానికి చెందిన బోయ రాజేశ్ నాయుడు అనే వ్యక్తిని ప్రేమించింది. ఈ ఏడాది మార్చి 5న నంద్యాల జిల్లా మహానంది ఆలయంలో వివాహం చేసుకొన్నారు. మాధురి తల్లిదండ్రులు రాజేశ్ తమ కుమార్తెను మోసం చేసి పెళ్లి చేసుకున్నాడని అప్పట్లో పోలీసులకు ఫిర్యాదు చేశారు. మాధురి తన భర్తతో వెళ్తానని చెప్పడంతో పోలీసులు ఆమెను భర్త వెంట పంపించారు. మార్చి 7న యువతి తల్లిదండ్రుల ఆమోదంతో బేతంచెర్ల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో వివాహ రిజిస్ట్రేషన్ కూడా చేయించుకున్నారు. మాధురి మూడు నెలల క్రితం 'మిమ్మల్ని చూడాలని ఉంది. మీతో ఉండాలని ఉంది' అంటూ తల్లిదండ్రులకు మెసేజ్ పంపింది. దీంతో తల్లిదండ్రులు బేతంచెర్ల మండలం సిమెంట్ నగర్‌కు వచ్చారు. ఇరువర్గాలు బేతంచెర్ల పోలీసులను సెప్టెంబరు 3న ఆశ్రయించాయి. పోలీసులు ఇరువర్గాల సమక్షంలో మాధురిని విచారించి ఆమె ఇష్టపూర్వకంగానే తల్లిదండ్రులకు అప్పగించారు. ఈక్రమంలో ఆమె ఆదివారం తాడేపల్లిలోని తన తండ్రి నివాసంలో ఆత్మహత్య చేసుకుంది. కాగా, తమ కుమార్తెను రాజేశ్ నాయుడు ప్రేమ పేరుతో ట్రాప్ చేసి, పెళ్లి చేసుకొని వేధింపులకు గురిచేశాడని, ఆ వేధింపులకు తాళలేకే బలవన్మరణానికి పాల్పడిందని మాధురి తల్లిదండ్రులు లక్ష్మీబాయి, చిన్నరాముడు ఆరోపించారు. తన భార్య మాధురి మృతిపై అనుమానాలు ఉన్నాయంటూ రాజేశ్ నాయుడు సోమవారం నంద్యాల ఎస్పీని ఆశ్రయించారు. తన భార్యను ఆమె తల్లిదండ్రులే హత్య చేశారంటూ ఆరోపించారు.

స్థానిక ఎన్నికల్లో బీసీలకే అధిక సీట్లు

పార్టీ, ప్రభుత్వ పదవుల్లోనూ సామాజిక న్యాయం పాటిస్తున్నాం

- ఖమ్మం నూతన డీసీసీ అధ్యక్షుడి ప్రమాణ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం
- కొత్తగూడెంలో మన్మోహన్‌సింగ్ యూనివర్సిటీ: మంత్రి తుమ్మల
- స్థానిక ఎన్నికల్లో వందకు వందశాతం సీట్లు కాంగ్రెస్సే గెలవాలి: పొంగులేటి


కాంగ్రెస్ ఖమ్మం జిల్లా నూతన అధ్యక్షుడు నూతి సత్యనారాయణను అభినందిస్తున్న మల్లు భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు తదితరులు

ఖమ్మం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పార్టీ పదవులతో పాటు ప్రభుత్వ పదవుల భర్తీలో కూడా సామాజిక న్యాయం పాటిస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎక్కువ శాతం బీసీలకు అవకాశం కలిపిస్తున్నామని చెప్పారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పదేళ్ల కష్టకాలంలో పార్టీ కోసం పనిచేసిన నాయకులు, కార్యకర్తలకు ఇప్పుడు సముచిత న్యాయం కల్పించే బాధ్యత తమదని హామీ ఇచ్చారు. ప్రస్తుత పంచాయతీ ఎన్నికలతోపాటు రాబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ జెండా ఎగుర వేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన నూతి సత్యనారాయణ సోమవారం ఖమ్మంలోని కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిస్తే పంచాయతీలు మరింత అభివృద్ధి సాధిస్తాయని పేర్కొన్నారు. పేదల కోసం రూ.22 వేల కోట్లతో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నామని తెలిపారు. బీఆర్ఎస్ పాలనలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల పేరుతో పేదలను మోసం చేశారని విమర్శించారు. మహిళల ఆత్మగౌరవం పెంపొందించేలా ఇంటివద్దకే వెళ్లి బొట్టుపెట్టి కోటి మంది మహిళలకు చీరలు అందిస్తున్నామని తెలిపారు. రైజింగ్ తెలంగాణ-2047 నినాదంతో ప్రపంచ దేశాలతో పోటీపడే విధంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు వివరించారు.

ఐకమత్యంతో ముందుకెళ్లాలి: తుమ్మల

ఖమ్మం జిల్లా కాంగ్రెస్‌కు ఘనమైన చరిత్ర ఉందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. జలగం వెంగళరావు, బొమ్మకంటి సత్యనారాయణ, శీలం సిద్ధారెడ్డి లాంటి నాయకులు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులుగా పనిచేశారని, వారి స్ఫూర్తితో ముందుకు నడవాలని పార్టీ నేతలు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అక్కడక్కడ సమస్యలున్నా ఐకమత్యంతో ముందుకు సాగాలని కోరారు. ఉమ్మడి ఖమ్మంజిల్లా కోసం కొత్త యూనివర్సిటీని కొత్తగూడెంలో మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ పేరుతో ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు.

స్థానిక ఎన్నికల్లో వందశాతం సీట్లు మనమే గెలవాలి: పొంగులేటి

స్థానిక సంస్థల ఎన్నికల్లో జిల్లాలోని ప్రతి గ్రామంలో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించేందుకు కృషి చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. పార్టీ కార్యకర్తలకు తాము అన్నివిధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు నూటికి నూరుశాతం గెలవాలని అన్నారు. కాంగ్రెస్ జిల్లా నూతన అధ్యక్షుడు నూతి సత్యనారాయణ మాట్లాడుతూ.. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అందరినీ కలుపుకొని పోతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు రాందాస్‌నాయక్, మట్టా రాగమయి, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీలు పోట్ల నాగేశ్వరరావు, బాలసాని లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భట్టిలా కమీషన్లు తీసుకోవడంలో నేను అన్‌ఫిట్

- విద్యుత్ శాఖలోని కీలక పోస్టుల్లో ఆంధ్రా వ్యక్తులు
- వారి కోసం తెలంగాణ ఉద్యోగులను బలి చేస్తున్నారు
- కాంగ్రెస్‌ది ప్రజా పాలన కాదు.. ద్రోహ పాలన: హరీశ్



హైదరాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాదిరిగా బిల్లుల మంజూరుకు 20-30 శాతం కమీషన్లు తీసుకోవడంలో తాను అన్‌ఫిట్ అని బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. రాజకీయాల్లో హరీశ్‌రావు అన్‌ఫిట్ అంటూ భట్టి చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందిస్తూ.. ఆర్థికశాఖ మంత్రిగా పని చేసినప్పుడు కమీషన్లు తీసుకోవడం తనకు రాలేదన్నారు. ప్రస్టేషన్‌లో నోరు జారితే మొదటికే మోసం వస్తుందని, ఇష్టం వచ్చినట్టు మాట్లాడొద్దని భట్టిని హెచ్చరించారు. థర్మల్ విద్యుత్ ప్రాజెక్టు నిర్మాణంలో 50వేల కోట్ల కుంభకోణం ఉందని తాను ఆరోపిస్తే.. దానిపై వివరణ ఇవ్వకుండా తన స్థాయిని దిగజార్చుకొని విమర్శలు చేశారని దుయ్యబట్టారు. తెలంగాణ కోసం నిర్మించిన ప్లాంట్ నుంచి 2400 మెగావాట్ల కరెంటును తీసుకోవాలని, రూ.4.12కు యూనిట్ కరెంట్ ఇస్తామని ప్రభుత్వానికి ఎన్‌టీపీసీ లేఖ రాసిందని తెలిపారు. కానీ.. కమీషన్ల కక్కుర్తితో కాంగ్రెస్ ప్రభుత్వం సొంతంగా థర్మల్ ప్రాజెక్టుల నిర్మాణానికి సిద్ధపడుతోందన్నారు. ఒక వేళ అప్పులు తెచ్చి కొత్త ప్రాజెక్టులు పూర్తిచేసినా.. విద్యుత్‌ప్లాంట్ల ఒప్పందం ప్రకారం 25 ఏళ్లలో రాష్ట్ర ప్రజలపై రూ.82,000కోట్ల అదనపు భారం పడుతుందన్నారు. విద్యుత్‌శాఖలోని కీలక విభాగాల్లో ఆంధ్ర ప్రాంతానికి చెందిన అధికారులను వరుసగా నియమించడం దుర్మార్గమని, రాష్ట్రంలో కాంగ్రెస్ అందిస్తున్నది ప్రజా పాలన కాదని.. తెలంగాణ ద్రోహ పాలన అని విమర్శించారు. ఏపీకి చెందిన రాజశేఖర్‌రెడ్డిని జెన్‌కో ప్రాజెక్టు డైరెక్టర్‌గా, ఉద్యమ సమయంలో తెలంగాణ ఉద్యోగులను అవహేళన చేసిన కుమార్‌రాజాను ఉద్యోగుల డైరెక్టర్‌గా, మధ్యప్రదేశ్‌లో మైనింగ్ ఇంజనీర్‌గా పని చేసిన శివాజీని ఎస్పీడీసీఎల్‌లో ప్రాజెక్టు హెచ్‌ఆర్‌డీ డైరెక్టర్‌గా, ఏపీకి చెందిన నరసింహులును ఎస్పీడీసీఎల్ ఆపరేషనల్ డైరెక్టర్‌గా, వావిలాల అనిలను రెడ్కో సీఎండీగా, ఏసీబీ కేసులో ఉన్న నందకుమార్‌ను చీఫ్ ఎలక్ట్రికల్ ఆఫీసర్‌గా ఎలా నియమించారని ప్రశ్నించారు. ఆంధ్రా వారి కోసం తెలంగాణ ఉద్యోగులను బలి చేస్తున్నారని దుయ్యబట్టారు. గ్రీన్‌ఎనర్జీ పాలసీలో భాగంగా పారిశ్రామికవేత్తలు ఎక్కడి నుంచైనా విద్యుత్‌ను కొనుగోలు చేసి వాడుకునేందుకు దరఖాస్తులు తీసుకున్న ప్రభుత్వం.. అనుమతులు ఇవ్వకుండా ఆలస్యం చేస్తోందని దుయ్యబట్టారు. మెగావాట్‌కు రూ.20లక్షలు, పైనున్న వారికి మరో 10లక్షల చొప్పున చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ లంచం అడుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఆంధ్రా అధికారుల దోపిడీకి ఇదొక నిదర్శమని.. పంచాయతీ ఎన్నికల వేళ సీఎం రేవంత్‌రెడ్డి వరుస పర్యటనలకు వెళ్తూ కోడ్ ఉల్లంఘిస్తుంటే.. రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) నిద్రపోతుందా? అని నిలదీశారు. కొడంగల్ - నారాయణపేట ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేసిన సీఎంపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రపంచంలో అగ్రగామిగా నిలిపేందుకే 'తెలంగాణ రైజింగ్'

- బయటకు రాని కేసీఆర్ బంగారు తెలంగాణ విజన్
- దేశానికి దిక్సూచిగా నిలిపేందుకే 2047- విజన్
- మూడు రీజియన్లుగా రాష్ట్రాభివృద్ధి: మంత్రి పొన్నం

హుస్నాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కల్వకుంట్ల కవిత చెప్పినట్లు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బంగారు తెలంగాణ విజన్ వారి ఇంటి నుంచి బయటకు రాకపోవచ్చునని రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ ఎద్దేవా చేశారు. కానీ ప్రపంచంలోనే రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపేందుకు తమ ప్రభుత్వం అన్ని అంశాల ప్రణాళికలతో తెలంగాణ రైజింగ్ కార్యక్రమం చేపట్టిందన్నారు. గతంలో చంద్రబాబు విజన్-2020 అంటే.. దేశానికి దిక్సూచిలా తెలంగాణను నిలిపేందుకు తమ ప్రభుత్వం 2047 విజన్‌తో ముందుకెళ్తున్నదన్నారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో 3న సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం మంత్రి పొన్నం మాట్లాడుతూ.. అభివృద్ధి కోసం రాష్ట్రాన్ని మూడు ప్రాంతాలు.. కోర్ అర్బన్ రీజియన్, సెమీ అర్బన్ రీజియన్, రూరల్ రీజియన్‌గా విభజించామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల కోడ్‌ను అతిక్రమించకుండానే ఈ నెల 3న పట్టణ ప్రాంతమైన హుస్నాబాద్‌లో సభ నిర్వహిస్తున్నట్లు మంత్రి పొన్నం స్పష్టం చేశారు. విద్యా ఉపాధి, వ్యవసాయ రంగాలకు సీఎం రేవంత్ రెడ్డి ప్రాధాన్యం ఇస్తారన్నారు. గ్రామాల్లో ఎన్నికల కోడ్ ఉండటం వల్ల తాము ఏర్పాట్లు చేయడం లేదని, ప్రజలే స్వచ్ఛందంగా తరలి వస్తున్నారని మంత్రి పొన్నం వివరించారు.

మహిళా సాధికారతకు మరింత ఊతం

- మహిళా సంఘాలకు మరో 448 అద్దె బస్సులు

హైదరాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రాబోయే రోజుల్లో మహిళా స్వయం సహాయక సంఘాలకు మరిన్ని ఆర్టీసీ అద్దె బస్సులు కేటాయించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా 152 ఆర్టీసీ అద్దె బస్సులను మండల మహిళా సమాఖ్యలు నిర్వహిస్తున్నాయి. మరో 448 అద్దె బస్సులను కూడా మహిళా సంఘాలకే అప్పగించే ప్రక్రియ చివరి దశలో ఉంది. ఈ నేపథ్యంలో సెర్ప్ సీఈవో దివ్యా దేవరాజన్ ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డికి లేఖ రాశారు. మండల మహిళా సమాఖ్యలు 448 బస్సుల కొనుగోలు పూర్తిచేసి, వాటిని ఆర్టీసీకి అద్దెకు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలియజేశారు. అవసరమైన అనుమతులు మంజూరైన వెంటనే ఆ బస్సులను ఆర్టీసీకి అప్పగించనున్నట్లు పేర్కొన్నారు. ఒక్కో బస్సు ద్వారా మహిళా సంఘాలకు నెలకు సుమారు రూ.70 వేల వరకు అద్దె ఆదాయం లభిస్తుంది. ప్రస్తుతం నడుస్తున్న 152 బస్సుల నిర్వహణ విజయవంతమైన నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు మిగతా 448 బస్సుల నిర్వహణ బాధ్యతలను కూడా మహిళా సంఘాలకు అప్పగించాలని నిర్ణయించినట్లు మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్ ప్రకటించారు భవిష్యత్తులో ఈ పథకాన్ని మరింత విస్తృతం చేసి, ఎక్కువ సంఖ్యలో మహిళా సంఘాలకు అవకాశం కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

పలు పథకాల అమలు

ఇప్పటి వరకు రాష్ట్రంలో మహిళలు బస్సు టిక్కెట్ చార్జీల రూపంలో రూ. 7,600 కోట్లు ఆదా చేసుకున్నారు. సబ్సిడీపై రూ. 500కు గ్యాస్ సిలెండర్‌తో 45 లక్షల కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయి. మహిళలు సొంతంగా ఆర్టీసీకి బస్సులను అద్దెకు ఇవ్వడంతోపాటు పెట్రోల్ బంకులను నిర్వహించేలా ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోంది. మహిళా స్వయం సహాయక సంఘాలకు రూ. 26 వేల కోట్ల రుణాలను ప్రభుత్వం పంపిణీ చేసింది. కొత్తగా 2,25,110 సంఘాలు రూ.4,825.54 కోట్ల విలువైన వ్యాపారాలను ప్రారంభించాయి. దేశంలోనే తొలిసారిగా మహిళా సంఘాల ద్వారా సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. 32 జిల్లాల్లో 64 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేయనుంది.

మహిళా భద్రతకు 'టీ-సేఫ్' విప్లవాత్మక విధానం

- భవిష్యత్తులో క్యాబ్ అగ్రిగేటర్లతో అనుసంధానం
- 2047కు ముందే లక్ష్యాలను సాధించాలి: డీజీపీ శివధర్‌రెడ్డి

హైదరాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో మహిళల సురక్షిత ప్రయాణానికి ఉద్దేశించిన 'టీ-సేఫ్' వ్యవస్థ దేశంలోనే ఒక విప్లవాత్మక ముందడుగు అని డీజీపీ శివధర్ రెడ్డి పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్‌లో జరిగిన డీజీపీల సదస్సులో 'టీ-సేఫ్ - మహిళల కోసం సురక్షిత ప్రయాణం' అనే అంశంపై ప్రజెంటేషన్ ఇచ్చారు. నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే 2022 ప్రకారం, దేశంలో అత్యధికంగా శ్రామిక మహిళల శాతం తెలంగాణలోనే ఉందని, వారి ప్రయాణాన్ని సురక్షితం చేయాలనే లక్ష్యంతో 2024లో ఈ యాప్‌ను ప్రారంభించినట్లు డీజీపీ తెలిపారు. భవిష్యత్తులో ఉబర్, ఓలా, రాపిడో వంటి అన్ని క్యాబ్ అగ్రిగేటర్లతో టీ-సేఫ్‌ను అనుసంధానం చేయాలని, కృత్రిమ మేధ సాయంతో బలహీన ప్రాంతాలను గుర్తించి ఆటోమేటెడ్ సేఫ్టీ చెక్ కాల్స్‌ను ప్రారంభించాలని డీజీపీ ప్రతిపాదించారు. ఈ రకమైన యాప్‌లను దేశవ్యాప్తంగా అమలు చేసేందుకు ప్రధాని మోదీ ఆసక్తి వ్యక్తం చేస్తున్నట్లు డీజీపీ ఒక ప్రకటనలో తెలిపారు.

తుమ్మిడిహెట్టి బ్యారేజీ డీపీఆర్.. ఆర్‌వీ అసోసియేట్స్‌కు దక్కే చాన్స్

హైదరాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణంతోపాటు గ్రావిటీ కెనాల్, టన్నెల్, సుందిళ్ల లింక్‌కు డీపీఆర్ సిద్ధం చేసే పనులను నిర్మాణ సంస్థ ఆర్వీ అసోసియేట్స్ దక్కించుకునే అవకాశం ఉంది. టెండర్లలో ఈ ఒక్క సంస్థే పాల్గొంది. టెక్నికల్, ఫైనాన్స్ బిడ్‌ల తర్వాత పనులు అప్పగించే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలిసింది. నిర్మాణ సంస్థలు టెండర్లు వేసే గడువు గత నెల 26న ముగిసింది. డీపీఆర్ అంచనా విలువ రూ.9.94 కోట్లుగా ఖరారు చేశారు. డీపీఆర్ తయారీ అనంతరం నిర్మాణ అంచనా వ్యయంపై స్పష్టతరానుంది. రోజుకు ఒక టీఎంసీ చొప్పున 80 రోజుల్లో 80 టీఎంసీలు తరలించేలా 150 మీటర్ల ఎత్తుతో కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీని కట్టాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది.

ఫ్యూచర్ సిటీలో మరో ఫిల్మ్‌సిటీ!

(మొదటిపేజీ తరువాయి)

చేయడానికి ముందుకు వచ్చిందని వివరించింది. ఈ ప్రాజెక్టుతో రాష్ట్ర పర్యాటక రంగం రూపురేఖలు మారతాయని విశ్వాసం వ్యక్తం చేసింది. ఫ్యూచర్ సిటీలో 15,000 ఎకరాలు అడవి కోసం కేటాయించినందున ఇక్కడ వంతారా ఏర్పాటు చేసే అవకాశం ఉందని భావిస్తున్నారు. అక్కడ సాధ్యం కాకపోతే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో వంతారా వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే గుజరాత్‌లో ఏర్పాటు చేసిన వంతారా అభయారణ్యం ప్రపంచవ్యాప్తంగా మంచి పేరు తెచ్చుకుంది. ఇవికాక దేశవ్యాప్తంగా విలాసవంతమైన కేటరింగ్ సర్వీసు అందించే 'ఫుడ్ లింక్ ఎఫ్ అండ్ బీ హోల్డింగ్స్' కంపెనీ రూ.3 వేల కోట్లతో ఫ్యూచర్ సిటీలో మూడు స్టార్ హోటళ్లను నిర్మించేందుకు ఒప్పందం చేసుకోనుందని ప్రభుత్వం తెలిపింది. ఈ ఒప్పందాలపై గ్లోబల్ సదస్సులోనే సంతకాలు జరగనున్నాయి.

మంత్రులతో పనులు చేయించుకునేటోళ్లను

గెలిపించుకోండి!

(మొదటిపేజీ తరువాయి)

కుట్రలు చేసేవారు, తగవులు పెట్టే వాళ్లు వస్తారని హెచ్చరించారు. మంచోడు సర్పంచి అయితే ఊరు బాగుపడుతుందని, కాళ్లలో కట్టెలు పెట్టేటోడు అయితే ఉన్నది గుంజుకుపోతాడని అన్నారు. మంచోడు అనుకొని సద్ది కడితే బొడ్రాయి దగ్గర కూర్చొని తిని, ఇంకేమైనా ఉన్నదా? అనే రకాలు ఉన్నారని, జాగ్రత్తగా ఆలోచించి ఓటేయాలని హెచ్చరించారు. రెండేళ్ల క్రితం పాలమూరు పిలగాడినని, 12 మంది ఎమ్మెల్యేలను గెలిపించి ఆశీర్వదించారని, ఆ బలంతోనే సంక్షోభం నుంచి రాష్ట్రాన్ని సరైన దిశలో పెట్టడానికి కృషి చేస్తున్నానని చెప్పారు. చిట్టెం నర్సిరెడ్డి ప్రారంభించిన నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకానికి 2014లో ఉమ్మడి రాష్ట్రంలో తాను జీఓ 69ను తెస్తే గత ప్రభుత్వం పదేళ్లు పాతాళంలో తొక్కిపెట్టిందన్నారు. 2009లో పాలమూరు ప్రజలు ఆశీర్వదిస్తే గెలిచిన కేసీఆర్ తెలంగాణ వచ్చిన తర్వాత ప్రాజెక్టుల పేరుతో రూ.2 లక్షల కోట్లు ఖర్చు పెట్టాడు గానీ, సంగంబండలో బండ పగులగొట్టడానికి రూ. 12 కోట్లు ఇవ్వలేదని వ్యాఖ్యానించారు. పాలమూరు ప్రాజెక్టులను పట్టించుకోలేదని, జలసాధన సమితి ఏర్పడి ఎన్ని ఉద్యమాలు చేసినా ఈ లిఫ్ట్‌ను పూర్తి చేయలేదని మండిపడ్డారు. ఈ ప్రాంతం బిడ్డ ఇప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్నారని, ఎవరినీ అభ్యర్థించాల్సిన అవసరం లేదని, వడ్డించే వాడు పాలమూరు వాడే అయినందున నిధులకు కొరత లేదని చెప్పారు. తమ ప్రభుత్వం రాగానే రూ.5 వేల కోట్లతో కొడంగల్ ఎత్తిపోతల పనులు ప్రారంభించామని, కుట్రలు చేసి, కేసులు వేసి ఏడాదిన్నర ప్రాజెక్టును ఆపారని విమర్శించారు. రూ.14 లక్షల పరిహారం సరిపోదంటే రూ.20 లక్షల పరిహారం ఇచ్చామని, 96 శాతం మంది రైతులు స్వచ్ఛందంగా భూములు ఇచ్చారని కొనియాడారు. ఉదండాపూర్ ప్రాజెక్టు సహాయ పునరావాసం అక్కడి ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి కోరిన విధంగా అందజేయనున్నట్లు ప్రకటించారు. కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించుకోవడం తన జీవితంలో అత్యంత సంతోషకరమైన సందర్భంగా ముఖ్యమంత్రి అభివర్ణించారు. ప్రాజెక్టును రెండేళ్లలో పూర్తి చేసుకోవాల్సిన బాధ్యత స్థానిక యువతదేనని చెప్పారు. కాంట్రాక్టర్ పూర్తి చేయకపోతే వీపు విమానం మోత మోగుతుందని చెప్పాలన్నారు. మన పనులు ఇప్పుడు పూర్తి చేసుకోకపోతే ఎప్పటికీ చేసుకోలేమని చెప్పారు. తండాలు, గూడేలు, మారుమూల పల్లెల్లో విద్యకూ తమ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ముఖ్యమంత్రి అన్నారు. ప్రతీ నియోజకవర్గానికి యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్లను మంజూరు చేస్తున్నామని తెలిపారు. భూమి అందుబాటులో లేనిచోట 25 ఎకరాలు భూసేకరణ చేసి, శంకుస్థాపనలు చేస్తున్నామని చెప్పారు. ఇతర పార్టీల పట్ల వివక్ష లేకుండా అన్ని నియోజకవర్గాలకు స్కూళ్లను మంజూరు చేస్తున్నామని తెలిపారు. మహబూబ్‌నగర్‌లో ట్రిపుల్ ఐటీ, పాలమూరు వర్సిటీలో ఇంజనీరింగ్, లా కాలేజీ ఏర్పాటు ద్వారా పాలమూరు పిల్లలు సిలికాన్ వ్యాలీని ఏలేలా చేస్తున్నామని చెప్పారు. తాను ముఖ్యమంత్రి అయిన తర్వాత ఆడబిడ్డలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించానని, దీంతో బీఆర్ఎస్ వారు కళ్లలో నిప్పులు పోసుకొని ఆటో వాళ్లను తన మీదకు పంచాయతీకి పంపారని తెలిపారు. పేద మహిళలు కాయకష్టం చేసుకొని కూడబెట్టుకున్నది గుంజుకోవాలని చూస్తే కర్రు కాల్చి వాత పెడతారని, కళ్లలో కారం, మామిడికాయ తొక్కు పెడతారని హెచ్చరించారు. గతంలో రేషన్‌షాపునకు పోయి తెచ్చుకున్న బియ్యాన్ని ఏనాడూ వండుకొని తినలేదని, పశువుల దాణాకో, రూ.11కి కిలో చొప్పున అమ్ముకోవడానికో వాడేవారని చెప్పారు. ఇప్పుడు తన మనవడు తినే క్వాలిటీ సన్నబియ్యం ఊళ్లో ఆడబిడ్డల పిల్లలకు ఇస్తున్నామని తెలిపారు. ఇప్పుడు రాష్ట్రంలో మూడు పూటలా సన్నబియ్యం తింటున్నారని చెప్పారు. మహిళలకు కరెంటు బిల్లు భారం తప్పించానని, నారాయణపేటలో పెట్రోల్ బంకు పెట్టించానని, 1000 బస్సులిచ్చి ఓనర్లను చేశామని ప్రస్తావించారు. మహిళా సంఘాల ఉత్పత్తులను అమ్ముకోవడానికి హైటెక్ సిటీ పక్కన మూడున్నరెకరాల్లో స్టాల్స్ ఏర్పాటు చేశామని తెలిపారు. భవిష్యత్‌లో అమెజాన్‌లో ఆన్‌లైన్‌లో అమ్ముకునేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. వెయ్యి మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్లాంట్లు అప్పగించి మహిళలను అంబానీ, అదానీలతో పోటీ పడేలా చేస్తామని ప్రకటించారు. 35 ఏళ్ల వర్గీకరణ సమస్యను పరిష్కరించి మాల, మాదిగలు కలిసి ఉండేలా చేశామన్నారు. వందేళ్ల నుంచి చేయనిది తాము బీసీల లెక్కలు తీసి 56 శాతం బీసీలు ఉన్నారని గుర్తించామని ముఖ్యమంత్రి ప్రస్తావించారు. రూ.21,653 కోట్లతో రైతు రుణమాఫీ చేశామని, రూ.12 వేల చొప్పున రైతు భరోసా ఇస్తున్నామని గుర్తు చేశారు. గత ప్రభుత్వాలు రూ.8 లక్షల కోట్ల అప్పు చేసిపోతే సంక్షోభంలో రాష్ట్రాన్ని సరైన దిశలోకి నడిపిస్తూ సంక్షేమ పథకాలు కూడా అందిస్తున్నానని చెప్పారు. మంత్రులు వాకిటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, దామోదర రాజనర్సింహ ముఖ్యమంత్రితో పాటు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



మక్తల్- నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, చిత్రంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దామోదర రాజనరసింహ, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి

మేడారం అభివృద్ధి పనుల్లో ఆదివాసీ సంప్రదాయాలకు పెద్దపీట వేయాలి

- ఇంజనీర్లు ప్రత్యక్షంగా పర్యవేక్షించాలి
- ఎలాంటి పొరపాట్లు జరిగినా కఠిన చర్యలు
- మేడారం పనులపై సీఎం రేవంత్ సమీక్ష

హైదరాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మేడారం అభివృద్ధి పనుల్లో ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలకు పెద్ద పీట వేయాలని, నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. అధికారులు, ఇంజనీర్లు క్షేత్రస్థాయిలో ఉండి పనులను ప్రత్యక్షంగా పర్యవేక్షించాలని, ఎలాంటి పొరపాట్లు దొర్లినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మేడారం అభివృద్ధి పనులపై తన నివాసంలో సీఎం సోమవారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. మేడారం గద్దెల వద్ద రాతి పనులు, భక్తుల రాకపోకలకు సంబంధించిన మార్గాలు, వేచి ఉండే ప్రదేశాలు, రహదారులు, విద్యుత్ స్తంభాల ఏర్పాటు.. ఇలా ప్రతి అంశంపై అధికారులకు కీలక సూచనలు చేశారు. గద్దెల సమీపంలో ఉన్న చెట్లను ఎట్టిపరిస్థితుల్లో తొలగించవద్దని ఆదేశించారు. గద్దెల సమీపంలో వరద నిలవకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గద్దెల దగ్గర నలువైపులా ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేయాలని, ఆకర్షణీయంగా కనిపించేలా లైటింగ్ ఉండాలని సూచించారు. పనులు సాగుతున్న తీరుపై ప్రదర్శించిన పవర్ పాయింట్ ప్రజంటేషన్‌ను పరిశీలించిన సీఎం... పలు చోట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. ఆర్అండ్‌బీ, విద్యుత్, దేవాదాయ, అటవీ శాఖలు... సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. నిర్దేశిత సమయంలోనే అభివృద్ధి పనులు పూర్తి కావాలని ఆదేశించారు. సమీక్షలో మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, సీఎస్ రామకృష్ణారావు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

తక్కువ వడ్డీతో రుణాలివ్వండి

- ఫ్యూచర్‌సిటీ, మెట్రో విస్తరణ, ఆర్ఆర్ఆర్‌లకు చేయూతనివ్వండి
- గతంలో ఇచ్చిన అప్పులను పునర్వ్యవస్థీకరించండి
- 10 లక్షల ఇందిరమ్మ ఇళ్లకు త్వరితగతిన రుణాలు ఇవ్వండి
- హడ్కో చైర్మన్ సంజయ్ కులశ్రేష్ఠతో సీఎం రేవంత్

హైదరాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఫ్యూచర్ సిటీ, మెట్రో విస్తరణ, రీజినల్ రింగు రోడ్డు, రేడియల్ రోడ్ల నిర్మాణాలకు తక్కువ వడ్డీతో రుణాలు ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. హడ్కో చైర్మన్ సంజయ్ కులశ్రేష్ఠను కోరారు. సంజయ్ కులశ్రేష్ఠ సోమవారం ముఖ్యమంత్రితో భేటీ అయ్యారు. ఫ్యూచర్ సిటీ నుంచి బెంగళూరు, అమరావతి మీదుగా చెన్నై వరకు గ్రీన్ ఫీల్డ్ రహదారులు, బందరు పోర్టు వరకు నిర్మించనున్న గ్రీన్‌ఫీల్డ్ రహదారి, బుల్లెట్ ట్రెయిన్ ప్రాజెక్టులపై వారి మధ్య చర్చ జరిగింది. గతంలో అధిక వడ్డీ రేటుతో ఇచ్చిన రుణాలను ప్రస్తావిస్తూ.. వాటిని రీస్ట్రక్చర్ చేయాలని (పునర్వ్యవస్థీకరించాలని) సీఎం ఈ సందర్భంగా పేర్కొన్నారు. దీనికి సంజయ్ కులశ్రేష్ఠ సానుకూలంగా స్పందించారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ఇప్పటికే రుణాలు మంజూరు చేశామని గుర్తు చేశారు. మరో 10 లక్షల ఇళ్ల నిర్మాణాలకు కూడా రుణాలు త్వరితగతిన మంజూరు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదించారు. ఈ నెల 8, 9 తేదీల్లో భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న 'భారత్ గ్లోబల్ సమ్మిట్'కు హాజరు కావాలని హడ్కో చైర్మన్‌ను సీఎం ఆహ్వానించారు. ఈ సమావేశంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



సీఎం రేవంత్‌తో కరచాలనం చేస్తున్న హడ్కో చైర్మన్ సంజయ్ కులశ్రేష్ఠ, చిత్రంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

'హిల్ట్'లో సొంత భూములకే వెసులుబాటు

లీజు భూములకు అది వర్తించదు: దుద్దిళ్ల



హైదరాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): హిల్ట్ పాలసీలో భూ వినియోగ మార్పిడి రుసుము అనేది సొంత భూములు ఉన్న పరిశ్రమలకే వర్తిస్తుందని మంత్రి శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. పారిశ్రామిక పార్కులు, ఇతర ప్రాంతాల్లో ప్రభుత్వ భూములను లీజుకు తీసుకుని ఉంటే.. హిల్ట్ పాలసీ వర్తించబోదని తెలిపారు. ఈ విషయం తెలిసీ బీఆర్ఎస్, బీజేపీ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. గాంధీభవన్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో ఔటర్ రింగ్‌రోడ్డు లోపల ఉన్న మూడు ప్రధాన పారిశ్రామిక పార్కుల్లో లీజులో ఉన్న ప్రభుత్వ భూములను అప్పనంగా అప్పగించిందని, బీజేపీ నేతలు అప్పుడెందుకు మాట్లాడలేదని నిలదీశారు. సిరీస్ అనే ఫార్మా కంపెనీకి వంద ఎకరాల భూమిని దారాదత్తం చేసిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేసినా.. బీఆర్ఎస్, బీజేపీ కలిసి అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నాయని ఆరోపించారు. ఢిల్లీ మాదిరిగా హైదరాబాద్ కాలుష్యం బారిన పడకూడదన్న ఉద్దేశంతో ఈ పాలసీని తీసుకొచ్చామన్నారు. దీనికి నాచారం ఇండస్ట్రియల్ అసోసియేషన్ మద్దతు తెలిపిందన్నారు. హిల్ట్ పాలసీకి సంబంధించిన మార్గదర్శకాలు విడుదలైన తర్వాత అభ్యంతరాలుంటే.. తెలియజేయాలని సూచించారు. ఈ పాలసీపై రాహుల్‌కే కాదు.. ఇంకెవరికైనా కేటీఆర్ లేఖలు రాసుకోవచ్చన్నారు. కోడ్ అమలు లేని చోట్ల అభివృద్ధి కార్యక్రమాలు చేపడితే తప్పేంటని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

'కోవాసెంట్'తో 500 మందికి ఉపాధి

ప్రపంచంలోని అత్యుత్తమ వర్సిటీల సహకారంతో మరో రెండు నెలల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యూనివర్సిటీని ప్రారంభించనున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. ఇందులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, ఇంజనీరింగ్ విద్యార్థులకు నైపుణ్య శిక్షణ అందిస్తామని తెలిపారు. కోవాసెంట్ ఏఐ ఇన్నోవేషన్ సెంటర్‌ను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. ప్రస్తుతం 500 మంది ఇంజనీర్లతో ప్రారంభమైన కోవాసెంట్ ఇన్నోవేషన్ సెంటర్... 2028 నాటికి 3,000 మందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తుందని చెప్పారు.18మంది ఉద్యోగులతో ప్రారంభమైన సిగ్నిటీ సాఫ్ట్‌వేర్ కంపెనీ.. కోవాసెంట్‌గా పేరు మార్చుకుని వేల మందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగడం ప్రశంసనీయమన్నారు. ఈ సందర్భంగా టెక్నాలజీ అంటే సిలికాన్ వ్యాలీ, ప్రపంచ ప్రొడక్షన్ సెంటర్ గా చైనాలోని షెంజెన్, క్రమశిక్షణ, సుపరిపాలన కలిగిన దేశంగా సింగపూర్ గురించి చెప్తారని, ఈ మూడు లక్షణాలు కలగలిసిన నగరంగా హైదరాబాద్ రూపొందుతోందని తెలిపారు. కోవాసెంట్ చైర్మన్ సుబ్రమణ్యం, ప్రభుత్వ ఐటీ సలహాదారు సాయికృష్ణ, యూకే డిప్యూటీ హైకమిషనర్ గ్యారెత్ వయన్ ఓవేన్, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

కళాశాల నుంచి విశ్వవిద్యాలయంగా

దేశంలోనే తొలి ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీగా అభివృద్ధి చెందిన కొత్తగూడెం మైనింగ్ కాలేజీ

- రూ.వెయ్యి కోట్లతో సదుపాయాలకు ప్రణాళికలు
- నేడు రేవంత్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం



ఎర్త్ సైన్స్ వర్సిటీ నూతన భవనాల నమూనా

కొత్తగూడెం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు మైనింగ్ కాలేజీగా ప్రారంభమైన ఆ విద్యా సంస్థ కేవలం సింగరేణికి సంబంధించిన కోర్సులను మాత్రమే బోధించింది. ఆ తర్వాత కాకతీయ వర్సిటీకి అనుబంధంగాఇంజనీరింగ్ కళాశాలగా రూపాంతరం చెందింది. కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చాక సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో.. నేడు దేశంలోనే తొలి ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీగా అవతరించబోతోంది. అరుదైన ఖనిజాలకు నెలవైన కొత్తగూడెంలో ఏర్పాటు చేసిన ఈ విశ్వవిద్యాలయాన్ని మంగళవారం సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు.

1976 నుంచి ప్రస్థానం..

తొలినాళ్లలో 1976లో ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో కొత్తగూడెం స్కూల్ ఆఫ్ మైన్స్ పేరుతో కేవలం మైనింగ్ ఇంజనీరింగ్‌తో ఈ విద్యా సంస్థ ప్రారంభమైంది. అదే ఏడాది ఆరు సూత్రాల పథకం నిబంధనల ప్రకారం ఓయూ సొంత నిధులతో స్వతంత్ర యూనిట్‌గా ఎంఎస్సీ జియాలజీ కోర్సును అందించింది. అప్పటి నుంచి కొత్తగూడెం స్కూల్ ఆఫ్ మైన్స్‌లో బీఈ మైనింగ్ ఇంజనీరింగ్, ఎంఎస్సీ జియాలజీ సబ్జెక్టులు కొనసాగాయి. 1993లో ఆ కళాశాలను కాకతీయ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకువచ్చిన అనంతరం 1994లో సీఎస్సీ, ఈఈఈ గ్రూపులను ప్రవేశపెట్టారు. 2011లో ఈసీఈ, ఐటీ గ్రూపులను చేర్చారు. ప్రస్తుతం యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలగా ఉన్న ఈ విద్యా సంస్థను పూర్తిస్థాయి విశ్వవిద్యాలయంగా మార్చారు. సుమారు 300 ఎకరాల్లో డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశారు. విశ్వ విద్యాలయ నిర్మాణానికి సుమారు రూ.వెయ్యి కోట్లతో ప్రతిపాదనలు రూపొందించారు. అందులో తరగతి గదులు, హాస్టల్ భవనాలు, గ్రంథాలయం, సమావేశ మందిరం ఆట స్థలాలు, రీసెర్చ్ సెంటర్ లాంటి నిర్మాణాలకు రూ.500కోట్లు వరకు ఉండగా.. మరో రూ.500 కోట్లతో ప్రింటింగ్ మెషీన్లు, ఇంటర్‌నెట్, కంప్యూటర్లు, ఏసీలు, విద్యార్థుల ప్రయోగాలకు సంబంధించిన ల్యాబ్‌లను ఏర్పాటు చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశారు.

అన్ని కోర్సులు ఉండేలా..

దేశంలోని పేరొందిన యూనివర్సిటీల్లో భూగోళ శాస్త్రానికి సంబంధించి ఒకటి రెండు కోర్సులు మాత్రమే కొనసాగుతున్నాయి. ఐఐటీ, ఎన్ఐటీ, బనారస్ హిందూ యూనివర్సిటీ, ముంబై, ఉస్మానియా యూనివర్సిటీల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. కాగా ఆయా కోర్సులు చదివిన వారికి దేశ విదేశాల్లో డిమాండ్‌తో పాటు ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయి. దీంతో సాధారణ కోర్సులకు భిన్నంగా ఎర్త్ సైన్స్ వర్సిటీ ఆలోచన పుట్టింది. ఈ వర్సిటీలో 2025-26 విద్యాసంవత్సరం నుంచి ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ కోర్సులతోపాటు, బీఎస్సీ, ఎంఎస్సీ జియాలజీ కోర్సులను ప్రారంభించారు. వాటికి సంబంధించి దోస్త్ ద్వారా అడ్మిషన్లు జరిగాయి.

అరుదైన ఖనిజాల నేల..

కొత్తగూడెం జిల్లా అరుదైన ఖనిజాలకు కేంద్రంగా ఉంది. కొత్తగూడెం, ఇల్లెందు, మణుగూరు ప్రాంతాల్లో బొగ్గు నిక్షేపాలున్నాయి. రామవరం, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి, సుజాతనగర్, కొత్తగూడెం మండలాల్లో రత్నాల రాళ్లను మెరుగుపరిచేందుకు ఉపయోగించే గార్నెట్ దొరుకుతోంది. ఇల్లెందు మండలంలోని జాస్తుపల్లిలో ప్రొటెరోజోయిక్ అవక్షేపాలతో ఉన్న మార్బుల్.. భద్రాచలం, దుమ్ముగూడెం మండలాల్లో గ్లాస్ ఫౌండ్రీ, ఇనుము, ఉక్కు, సిరామిక్, ఎలక్ట్రికల్ అబ్రాసివ్ పెయింట్స్, ఎలక్ట్రానిక్స్‌లో ఉపయోగించే క్వార్ట్ లభిస్తోంది. అగ్నిపర్వత శిలల్లో కనిపించే ఫెల్డ్‌స్పార్.. అశ్వారావుపేటలో ఉంది.

నేడు ప్రారంభోత్సవం..

ప్రజాపాలనకు రెండేళ్లు పూర్తయిన సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం ఈ యూనివర్సిటీని ప్రారంభించనున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు కొత్తగూడెం రానున్న ఆయన.. కళాశాలలోని శిలాఫలకాన్ని ప్రారంభించిన అనంతరం బహిరంగ సభలో పాల్గొంటారు. ఈ సందర్భంగా ప్రముఖ ఆర్కిటెక్ట్‌లతో రూపొందించిన యూనివర్సిటీ నిర్మాణ నమూనాను ఆయన చేతుల మీదుగా ఆవిష్కరిస్తారు. సీఎం పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను సోమవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పర్యవేక్షించారు. కలెక్టర్ జితేష్ విపాటిల్, ఇతర అధికారులతో చర్చించి, లోటుపాట్లు లేకుండా చూడాలని సూచనలు చేశారు.

నేడు టీపీసీసీ విస్తృత సమావేశానికి సీఎం రేవంత్



ఎంసీహెచ్‌ఆర్‌డీ గ్రౌండ్‌లో ఫుట్‌బాల్ ప్రాక్టీస్ చేస్తున్న సీఎం రేవంత్

హైదరాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ విస్తృత సమావేశం గాంధీభవన్‌లో మంగళవారం జరగనుంది. టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అధ్యక్షతన ఉదయం 10 గంటలకు ప్రారంభం కానున్న ఈ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, మంత్రులు, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. అయితే కొత్తగా జిల్లా, పట్టణ కాంగ్రెస్ కమిటీలకు అధ్యక్షులుగా ఎన్నికైన వారు, ఇప్పటివరకు ఆ పదవుల్లో కొనసాగిన వారూ ఈ భేటీలో పాల్గొంటున్నారు. కొత్తగా జిల్లా, పట్టణ కాంగ్రెస్ కమిటీలకు అధ్యక్షులైన వారికి సీఎం రేవంత్ సమక్షంలో మహేశ్‌గౌడ్ నియామక పత్రాలు అందజేయనున్నారు. అలాగే ఇప్పటిదాకా ఆ పదవుల్లో కొనసాగిన వారిని సన్మానించనున్నారు. పంచాయతీలు సహా స్థానిక ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, రెండేళ్ల ప్రజాపాలనా విజయోత్సవాల నిర్వహణపై సీఎం రేవంత్, మీనాక్షి, మహేశ్‌గౌడ్‌లు దిశానిర్దేశం చేయనున్నారు.

రెండో రోజు సీఎం ఫుట్‌బాల్ ప్రాక్టీస్..

సీఎం రేవంత్ వరుసగా రెండోరోజు మైదానంలో చెమటోడ్చారు. ఈనెల 13న ఎల్బీ స్టేడియంలో నిర్వహించనున్న ప్రత్యేక మ్యాచ్‌లో మెస్సీ జట్టుతో సీఎం జట్టు తలపడనుంది. దీని కోసం ముఖ్యమంత్రి ఇప్పటి నుంచే ప్రాక్టీస్ కూడా ప్రారంభించారు. మర్రి చెన్నారెడ్డి మానవవనరుల కేంద్రంలోని ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో ఆదివారం దాదాపు గంట పాటు ఫుట్‌బాల్ ప్రాక్టీస్ చేసిన ఆయన.. సోమవారం సాయంత్రం సైతం తన ప్రాక్టీస్ కొనసాగించారు. కాగా, మెస్సీతో మ్యాచ్ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం విజన్-2047 క్రీడా విధానాన్ని ఆవిష్కరించనుంది.

పట్టుచీరల ప్రామాణికతకు మూడు సూత్రాలు!

» రూ. 100 చెల్లిస్తే పట్టు నాణ్యత ధ్రువీకరణ

» గువాహటిలో పరీక్షా కేంద్రం ఏర్పాటు

(గువాహటి నుంచి ఆంధ్రజ్యోతి ప్రతినిధి):


పట్టు నాణ్యతను పరిశీలిస్తున్న దృశ్యం

వేల రూపాయల ఖరీదు పెట్టి పట్టు చీరలు కొంటాం. అయితే వినియోగదారులు ఆశించే నాణ్యత చాలా ముఖ్యం. నకిలీ పట్టును అసలు పట్టుగా నమ్మించి మోసం చేసే ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో, వాటి ప్రామాణికతను పరీక్షించేందుకు ఇప్పుడు ప్రత్యేక పరీక్షా కేంద్రం ఏర్పాటైంది. ఈశాన్య రాష్ట్రాల చేతి వృత్తుల, చేనేత అభివృద్ధి కేంద్రం.. టెక్స్‌టైల్ టెక్నాలజీలో డిగ్రీ చేసిన అభ్యర్థుల సహకారంతో అసోం రాజధాని గువాహటిలో దీనిని ఏర్పాటు చేసింది. ఈ కేంద్రంలో కేవలం రూ.100 చెల్లించి, కొనుగోలు చేసిన పట్టుచీర అసలైనదా, కాదా అని సులభంగా తెలుసుకోవచ్చు. 2023లో దీన్ని ఏర్పాటు చేయగా ఇప్పటిదాకా 30 లక్షలు చీరలకు నాణ్యత సర్టిఫికెట్లు జారీ చేసినట్లు నిర్వాహకులు చెప్పారు. చీరల పరీక్ష కోసం మూడు రకాల పద్ధతులు పాటిస్తున్నారు. అందులో ఒకటి బర్నింగ్ టెస్ట్. ఈ పద్ధతి లో చీరలోని చిన్న దారాన్ని నిప్పు మీద కాల్చితే వెంట్రుకలు కాల్చినప్పుడు వచ్చే వాసనవస్తే అసలైన పట్టు అని గుర్తిస్తారు. రెండోది సల్ఫ్యూరిక్ ఆమ్లంలో ముంచి పరీక్ష చేస్తారు. ఈ ఆమ్లంలో పట్టు త్వరగా కరిగిపోతుంది. మూడో విధానంలో చీరను మైక్రోస్కోప్ కింద చూసినప్పుడు చీరలో దారాల అల్లికలు ఒకే మందంతో, సమాంతరంగా.. నునుపుగా కనిపిస్తాయి. ఈ చౌకైన పరీక్షా విధానం ద్వారా పట్టు వ్యాపారంలో పారదర్శకత పెరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

నిథమ్ డైరెక్టర్ నియామకంపై స్టే

హైదరాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (నిథమ్) డైరెక్టర్‌గా ప్రొఫెసర్ వీ వెంకటరమణ నియామకంపై హైకోర్టు సోమవారం స్టే ఇచ్చింది. వివరణ ఇవ్వాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది. ఆయనను నియమిస్తూ ఈ ఏడాది జూలై 15న జారీచేసిన జీవో 206 చెల్లదని పేర్కొంటూ సెంటర్ ఫర్ బెటర్ గవర్నెన్స్ సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ నగేశ్ భీమపాక ధర్మాసనం ఈ ఆదేశాలు ఇచ్చింది. పర్యాటకం, ఆతిథ్యం, రవాణా రంగాల్లో ఏ మాత్రం అనుభవం లేని వ్యక్తిని డైరెక్టర్‌గా నియమించడం చెల్లదని ఆ పిటిషన్‌లో పేర్కొన్నారు. వాదనలు విన్న ధర్మాసనం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసి తదుపరి విచారణను ఈనెల 22కు వాయిదా వేసింది.

ఐఏఎస్‌ల పోస్టులు ఐపీఎస్‌లకు ఎలా ఇస్తారు?

హైకోర్టులో పిటిషన్ దాఖలు.. ప్రభుత్వానికి నోటీసులు జారీ


ఐఏఎస్ అధికారుల కోసం ఉద్దేశించిన పోస్టుల్లో ఐపీఎస్ అధికారులను నియమిస్తుండాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. తార్నాకకు చెందిన శ్రీకాంత్ అనే వ్యక్తి ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. ఐపీఎస్ స్టీఫెన్ రవీంద్రను పౌరసరఫరాల శాఖ కమిషనర్ కం ఎక్స్‌అఫీషియో ప్రిన్సిపల్ సెక్రటరీగా, ఐపీఎస్ శిఖాగోయెల్‌ను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కం ఎక్స్‌అఫీషియో ప్రిన్సిపల్ సెక్రటరీగా, ఐపీఎస్ సీవీ ఆనంద్‌ను హోంశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా నియమిస్తూ ప్రభుత్వం జీవోలు జారీచేసింది. ఈ జీవోలను కొట్టివేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై సోమవారం జస్టిస్ సూరేపల్లి నంద ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదిస్తూ.. ఐఏఎస్‌ల పోస్టుల్లో ఐపీఎస్‌లను నియమిస్తూ సాధారణ పరిపాలన శాఖ జారీచేసిన జీవో 1342కు రాజ్యాంగబద్ధత లేదని పేర్కొన్నారు. ఇది అఖిల భారత సర్వీసు రూల్స్‌కు, కేంద్ర చట్టాలకు, రాష్ట్ర పరిపాలన నియమాలకు విరుద్ధమని తెలిపారు.ప్రభుత్వ న్యాయవాది వాదిస్తూ కౌంటర్ దాఖలు చేయడానికి సమయం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. వాదనలు విన్న ధర్మాసనం ప్రభుత్వానికి నోటీసులు జారీచేస్తూ విచారణను ఈ నెల పదో తేదీకి వాయిదావేసింది.


94 సివిల్ జడ్జి పోస్టుల భర్తీకి నోటిఫికేషన్


తెలంగాణ రాష్ట్ర జ్యుడీషియల్ సర్వీసుల్లో భాగమైన 94 జూనియర్ సివిల్ జడ్జి పోస్టుల భర్తీకి హైకోర్టు రిజిస్ట్రార్ సోమవారం నోటిఫికేషన్ జారీ చేశారు. ఇందులో 66 పోస్టులను నేరుగా భర్తీ చేయనుండగా, 28 పోస్టులను ఇప్పటికే సర్వీసులో ఉన్న ఉద్యోగులకు కేటాయించారు. ఈనెల 8 నుంచి ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం కానుండగా ఈ నెల 29 చివరితేదీ. ఆ రోజు రాత్రి 11. 59 గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తులను కేవలం హైకోర్టు వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో మాత్రమే చేసుకోవాల్సి ఉంటుంది. కంప్యూటర్ ఆధారిత స్క్రీనింగ్ పరీక్షను వచ్చే ఏడాది ఫిబ్రవరిలో నిర్వహించనున్నారు. న్యాయాధికారుల పదవులకు పోటీ పడేవారికి న్యాయవాదిగా కనీస ప్రాక్టీసు ఉండాలన్న సుప్రీంకోర్టు తీర్పు మేరకు ఈసారి మూడేళ్ల అనుభవం తప్పనిసరి చేశారు. ఈ నెల 1వ తేదీ నాటికి కనీసం మూడేళ్లపాటు అటు హైకోర్టులో గానీ ఇటు దిగువ కోర్టుల్లో గానీ ప్రాక్టీస్ చేసిన న్యాయవాదులు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.

కురుకురే ఆశ చూపి బాలికపై హత్యాచారం

దండేపల్లి డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అభం శుభం తెలియని ఏడేళ్ల చిన్నారిని కురుకురే ఆశ చూపి వరుసకు పెద్దనాన్న అయ్యే వ్యక్తితో పాటు మరొకరు అత్యాచారం చేసి ఆపై హత్యకు పాల్పడ్డారు. మంచిర్యాల జిల్లాలో సంచలనం సృష్టించిన ఈ హత్య కేసును పోలీసులు చేధించారు. ఇద్దరు నిందితులను సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు మంచిర్యాల డీసీపీ భాస్కర్ విలేకరులకు వివరాలు వెల్లడించారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఏడేళ్ల బాలిక నవంబరు 24న రాత్రి తోటి పిల్లలతో ఇంటి ముందు ఆడుకుంటోంది. బాలికకు వరుసకు పెద్దనాన్న అయిన బాపుతో పాటు సతీశ్ అనే మరొకరు చిన్నారికి కురుకురే కొనిస్తామని ఆశ చూపారు. సమీపంలోని పత్తిచేనులోకి తీసుకెళ్లి అత్యాచారానికి ఒడిగట్టారు. ఆపై గొంతునొక్కి హత్యచేసి వందమీటర్ల దూరంలో ఉన్న బావిలో పడేశారు. రెండు రోజుల తర్వాత బాలిక శవం కనిపించింది. నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు..పోక్సో కేసు నమోదు చేశారు.


తమిళినియన్


సులగ్న


ఆయుష్‌కుమార్

జాతీయ స్కేటింగ్‌లో 'నారాయణ'కు బంగారు పతకం

» నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ సింధూర నారాయణ

హైదరాబాద్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): సీబీఎస్ఈ నిర్వహించిన 6వ జాతీయ ఫెడరేషన్ కప్ పోటీల్లో తమ విద్యార్థులు అద్భుత విజయాలు సాధించారని నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ పి.సింధూర నారాయణ తెలిపారు. జాతీయ స్కేటింగ్ చాంపియన్‌షిప్ పోటీలో తమిళనాడులోని మదురై నారాయణ పాఠశాలకు చెందిన ఎం.తమిళినియన్ అండర్-11 విభాగంలో బంగారు పతకం సాధించారని అన్నారు. కూడో చాంపియన్‌షిప్‌లో ఒడిసా రాష్ట్రం కటక్‌లోని నారాయణ పాఠశాల విద్యార్థి ఆయుష్ కుమార్ లేంకా అండర్-12లో, సులగ్న లేంకా అండర్-15 బాలికల విభాగంలో వెండి పతకాలు సాధించారని ఆమె సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేవలం చదువు వరకే పరిమితం కాకుండా విద్యార్థులకు ఆసక్తి ఉన్న రంగాల్లోనూ ప్రోత్సహిస్తున్నామని ఈ సందర్భంగా డైరెక్టర్ తెలిపారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు సింధూర నారాయణ అభినందనలు తెలిపారు.

రూ.4లక్షల పెట్టుబడికి గుంట భూమి.. నెలకు 16 వేల వడ్డీ!

» అధిక రాబడుల ఆశ చూపించి బోర్డు తిప్పేసిన 12 వెల్త్ క్యాపిటల్ సర్వీసెస్

» నల్లగొండలో బాధితుల ఆందోళన


నల్లగొండ జిల్లా కేంద్రంలో ఆందోళనకు దిగిన బాధితులు

నల్లగొండ క్రైం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రియల్ ఎస్టేట్ వెంచర్‌లో పెట్టుబడులు పెడితే భారీగా సొమ్ము తిరిగొస్తుందని మభ్యపెట్టిన మరో సంస్థ బోర్డు తిప్పేసింది. ఒకసారి రూ.4 లక్షలు పెట్టుబడి పెడితే.. ఒక గుంట భూమి, 25 నెలల పాటు నెలకు రూ.16 వేల వడ్డీ, ఆ గడువు ముగియగానే రూ.8 లక్షలు నగదు ఇస్తామని ఘరానా మోసానికి పాల్పడింది. కానీ కొంత మందికే వడ్డీ చెల్లించడం, రిజిస్ట్రేషన్ చేసిన భూమి ఏదీ చూపకపోవడంతో.. మోసపోయామని గుర్తించిన బాధితులు సోమవారం నల్లగొండ జిల్లా కేంద్రంలో ఆందోళనకు దిగారు. గతంలో ఇదే సంస్థపై సైబరాబాద్ పరిధిలోని ఆర్థిక నేరాల విభాగం (ఈవోడబ్ల్యూ)లో కేసు నమోదవడం గమనార్హం.

రూ.330కోట్లకు పైగా వసూళ్లు?

రెండేళ్ల క్రితం హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో 12 వెల్త్ క్యాపిటల్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ పేరిట సంస్థ ఏర్పాటైంది. అధిక వడ్డీ, ప్రతిఫలం ఆశచూపడంతో సాధారణ వ్యక్తులతోపాటు కొందరు ఉద్యోగులు, అధికారులు కూడా ఇందులో పెట్టుబడులు పెట్టినట్టు సమాచారం. ఇరు తెలుగు రాష్ట్రాల్లో సుమారు రూ.330 కోట్ల వరకు ఈ సంస్థ సేకరించినట్టు బాధితులు చెబుతున్నారు. సంగారెడ్డి జిల్లా ఆందోల్ మండలం రాంసాగర్‌పల్లిలో ఉన్న భూములకు బై నంబర్లు వేసి వంద రూపాయల బాండ్ పేపరుపై గుంట భూమి చొప్పున రిజిస్ట్రేషన్ చేస్తున్నట్టుగా ఒప్పంద పత్రాలు (అగ్రిమెంట్) ఇచ్చారని, కానీ అవి నకిలీవని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సంస్థ ఏజెంట్లు ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 300మందికిపైగా ఈ స్కీమ్‌లో చేర్పించారు. అందులో కొందరికే వడ్డీ చెల్లించడం, రిజిస్ట్రేషన్ చేసిన గుంట భూమిని చూపించకపోవటంతో జిల్లాలోని బాధితులు ఈ సంస్థకు లీగల్ అడ్వైజర్‌గా పనిచేస్తున్న రాపోలు ప్రకాశ్ ఇంటివద్ద సోమవారం ఆందోళనకు దిగారు. పోలీసులు అక్కడికి చేరుకుని, ప్రకాశ్‌ను టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. దీనితో బాధితులు పోలీస్‌స్టేషన్ వద్దకు వెళ్లి తమకు న్యాయం చేయాలంటూ సాయంత్రం వరకు నిరసన తెలిపారు. తమకు న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌కు ఫిర్యాదు చేశారు.

రిజిస్ట్రేషన్లలో 'స్లాట్ల' దందా!

హైదరాబాద్ పరిధిలోని కార్యాలయాల్లో వినియోగదారులకు లభించని స్లాట్లు

» కృత్రిమ కొరత సృష్టిస్తున్న డాక్యుమెంట్ రైటర్లు

» ఒక్కో స్లాట్‌ను రూ.5- 10వేలకు అమ్ముతున్న వైనం

» 6 వేలకుపైగా ఐడీలను బ్లాక్ చేసిన ఉన్నతాధికారులు

» యూజర్ ఐడీకి ఆధార్ నంబరును జోడిస్తే ఈ ఇబ్బంది తప్పుతుందంటున్న ఉద్యోగ సంఘాలు



హైదరాబాద్ సిటీ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆస్తులు, డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియను సులభతరం చేయడానికి ప్రవేశపెట్టిన స్లాట్ల విధానాన్ని కొందరు డాక్యుమెంట్ రైటర్లు, దళారులు దుర్వినియోగం చేస్తున్నారు. ముందే స్లాట్లు బుక్ చేసుకుని కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. అత్యవసరంగా రిజిస్ట్రేషన్ కోసం వచ్చినవారి నుంచి రూ.5 వేల నుంచి రూ.10వేల వరకు వసూలు చేస్తూ, ఆ స్లాట్లలో రిజిస్ట్రేషన్ అయ్యేందుకు సహకరిస్తున్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఈ దందా ఎక్కువగా జరుగుతోందని.. నెలకు సుమారు రూ.6 కోట్ల వరకు దండుకుంటున్నారని అంచనా. సంగారెడ్డి, వికారాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాలోని కొన్ని రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనూ ఇలాంటి దందా సాగుతోంది. ఆయా జిల్లాల్లో రోజూ 40కంటే ఎక్కువ డాక్యుమెంట్లు వచ్చే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో ఈ వ్యవహారం ఎక్కువగా జరుగుతోందని ఫిర్యాదులు రావడంతో రిజిస్ట్రేషన్ల శాఖ ఉన్నతాధికారులు దీనిపై దృష్టిసారించారు. నవంబరులో 6 వేలకుపైగా కంప్యూటర్/లాగిన్ ఐడీలను అక్రమాలకోసం వాడుతున్నట్టు గుర్తించి, బ్లాక్ చేశారు. ఈ దందా సాగిస్తున్న దళారులు మరో ఐదారు వేలమంది ఉండవచ్చని ఆ శాఖ వర్గాలు చెబుతున్నాయి.

ముఖ్యమైన రోజులను గుర్తించి మరీ..

రిజిస్ట్రేషన్ కోసం సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులకు వెళ్లేవారికి స్లాట్ బుకింగ్ విధానం ఎంతో సౌకర్యవంతంగా మారింది. డాక్యుమెంట్ రైటర్ల అవసరం లేకుండా, వివరాలన్నీ ఆన్‌లైన్‌లో పొందుపరిచి రిజిస్ట్రేషన్ చేయించుకోవడానికి, డాక్యుమెంట్‌ను పొందడానికి వీలు లభించింది. కానీ దీనిని కొందరు డాక్యుమెంట్ రైటర్లు, దళారులు దందాకు మార్గంగా మలచుకున్నారు. ఎక్కువగా రిజిస్ట్రేషన్లు జరిగే కార్యాలయాలు, డిమాండ్ ఉండే సీజన్, మంచి రోజులు.. చూసుకుని ఒక్కో లాగిన్ ఐడీ నుంచి 10వరకు స్లాట్లను బుక్ చేస్తున్నారు. చిన్నపాటి (ఒకట్రెండు గజాల) స్థిరాస్తి వివరాలను పొందుపరిచి, తక్కువ స్టాంపు డ్యూటీ (రూ.500-2,000)చెల్లించి స్లాట్లను బుక్ చేస్తున్నారు. ఆయా రోజుల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలనుకునే వారు స్లాట్లు దొరక్క డాక్యుమెంట్ రైటర్లు, దళారులను ఆశ్రయిస్తున్నారు. వారు తమ స్లాట్‌ను రద్దు చేసుకుని.. డిమాండ్‌ను బట్టి, ఎక్కువ సొమ్ము ముట్టజెప్పిన వారికి ఇచ్చేలా చేస్తున్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో మొత్తం 45సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసులు ఉండగా.. అందులో కుత్బుల్లాపూర్, ఉప్పల్, మహేశ్వరం, ఎల్బీనగర్, సరూర్‌నగర్, హయత్‌నగర్, గండిపేట్, శేరిలింగంపల్లి, పటాన్‌చెరు, శంషాబాద్ తదితర 20 చోట్ల స్లాట్ల బ్లాక్ దందా నడుస్తోందని అధికారులు గుర్తించారు. ఒకే కంప్యూటర్ ఐడీ, ఒకే ఫోన్ నంబరుతో ఎక్కువ స్లాట్లు బుక్ చేస్తున్నవారిని గుర్తించి బ్లాక్ చేస్తున్నారు. కానీ వేర్వేరు కంప్యూటర్లు, ఫోన్ నంబర్లతో స్లాట్లు బుక్ చేస్తున్న వారిని అడ్డుకోలేని పరిస్థితి ఏర్పడింది.

ఈ మార్పులు చేస్తే పరిష్కారం

స్లాట్ల దందాకు పాల్పడుతున్న దళారులను గుర్తించి, చర్యలు చేపట్టాలని ఉద్యోగ సంఘాలు కోరుతున్నాయి. రిజిస్ట్రేషన్లు అత్యవసరమైన వారికి కొంత ఫీజుతో తత్కాల్ తరహాలో కొన్ని స్లాట్లను కేటాయించడం.. స్లాట్ బుకింగ్ లేకుండా నేరుగా వాకిన్ విధానంలో (సాయంత్రం 5గంటల తర్వాత)అనుమతించే డాక్యుమెంట్ల సంఖ్యను ఐదు నుంచి 10కి పెంచడం.. యూజర్ ఐడీలకు ఆధార్‌ను లింక్ చేయడం వంటి చర్యలతో స్లాట్ల దందాను అరికట్టవచ్చని సూచిస్తున్నారు.

పార్లమెంట్‌లో తెలంగాణ

పీఎంకేవీవైలో రిజర్వేషన్లేమీ లేవు

» తెలంగాణకు రూ.52 వేల కోట్ల ముద్ర రుణాలు

» పార్లమెంట్‌లో ప్రశ్నోత్తరాలకు కేంద్రం సమాధానాలు

» రామగుండం ఎయిర్‌పోర్టుకు సహకరించండి: వంశీకృష్ణ

న్యూఢిల్లీ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన (పీఎంకేవీవై)-4.0లో రిజర్వేషన్లేవీ లేవని కేంద్ర నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత సహాయ మంత్రి జయంత్ చౌదరి స్పష్టం చేశారు. అటువంటి ప్రతిపాదన కూడా కేంద్రం వద్ద లేదన్నారు. సోమవారం లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీ కడియం కావ్య ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. మహిళలు, ఎస్సీ వర్గాలకు పీఎంకేవీవై-4.0లో ప్రత్యేక రిజర్వేషన్లు లేకపోవడం దురదృష్టకరమని, బలహీన వర్గాల అభివృద్ధి దిశగా చర్యలు చేపట్టాలని కావ్య కోరారు. పరిశ్రమలతో ఒప్పందాల ద్వారా అప్రెంటిస్‌షిప్, ఆన్ ది జాబ్ ట్రైనింగ్(ఓజేటీ) వంటి అవకాశాలు సృష్టించినా ఆ దిశగా కేంద్రం చర్యలు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 2015-2022 మధ్య 15,398 శిక్షణ పొందితే కేవలం 6,322 మందికి మాత్రమే.. అంటే 41 శాతం మందికే ఉద్యోగావకాశాలు దక్కాయని గుర్తు చేశారు. ప్రధానమంత్రి ముద్ర యోజన కింద ఏపీలో 72 లక్షలకు పైగా ఖాతాలకు రూ.88 వేల కోట్లకు పైగా రుణాలను పంపిణీ చేసినట్లు కేంద్రం తెలిపింది. అలాగే తెలంగాణలో 43 లక్షలకు పైగా ఖాతాలకు రూ.52,577 కోట్లు మంజూరు చేసినట్లు వెల్లడించింది. ఇక 2020 ఏప్రిల్ నుంచి ఈ ఏడాది అక్టోబరు వరకు దేశవ్యాప్తంగా 30.91 కోట్ల ఖాతాలకు రూ.24.22 లక్షల కోట్ల రుణాలు పంపిణీ చేసినట్లు వివరించింది. లోక్‌సభలో టీడీపీ ఎంపీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు అడిగిన ఒక ప్రశ్నకు కేంద్ర మంత్రి పంకజ్ చౌదరి సమాధానమిచ్చారు. రామగుండంలో విమానాశ్రయ ఏర్పాటుకు సహకరించాలని పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడుని కాంగ్రెస్ ఎంపీ వంశీకృష్ణ కోరారు. ఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. విమానాశ్రయ ఏర్పాటుకు సహకరిస్తానని కేంద్రమంత్రి హామీనిచ్చారని తెలిపారు. ఈనెల 3 లేదా 4వ తేదీల్లో ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా బృందం రామగుండంలో పర్యటిస్తుందన్నారు. అంతర్గాం మండలంలో విమానాశ్రయ ప్రతిపాదిత ప్రాంతాన్ని సందర్శించి ల్యాండ్ సర్వే చేయనున్నట్టు వెల్లడించారు.

పార్లమెంట్ సమావేశాలు పొడిగించాలి: చామల

పార్లమెంట్ శీతాకాల సమావేశాలు పొడిగించాలని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలు పార్లమెంట్ దృష్టికి రాకుండా ఎన్డీయే కుట్ర చేస్తోందని, అందుకే కేవలం 15 రోజుల్లో సమావేశాలు ముగించాలని చూస్తోందని ఆరోపించారు. పార్లమెంట్ ఆవరణలో మీడియాతో ఆయన మాట్లాడారు. మొక్కుబడిగా తమకు నచ్చిన బిల్లులు పెట్టేసి సభలను ముగించాలని మోదీ చూస్తున్నారని మండిపడ్డారు.

8-9శాతం వృద్ధి రేటుతో వికసిత్ భారత్ లక్ష్యం సాకారం

» పీవీ, మన్మోహన్‌సింగ్ తెచ్చినట్టుగా ఆర్థిక సంస్కరణలు తేవాలి

» ప్రణాళిక సంఘం మాజీ డిప్యూటీ చైర్మన్ మాంటెక్‌సింగ్ అహ్లూవాలియా



హైదరాబాద్ సిటీ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): దేశ మాజీ ప్రధానులు పీవీ నర్సింహారావు, మన్మోహన్‌సింగ్‌లు తీసుకువచ్చిన మాదిరిగా ఆర్థిక సంస్కరణలు తేవాలని చాలా మంది కోరుకుంటున్నారని ప్రణాళిక సంఘం మాజీ డిప్యూటీ చైర్మన్ మాంటెక్‌సింగ్ అహ్లూవాలియా పేర్కొన్నారు. అప్పుడున్న పరిస్థితులను బట్టి పీవీ, మన్మోహన్‌సింగ్‌లు సాహసోపేత నిర్ణయాలు తీసుకున్నారన్నారు. 1991వరకు అనేక అంశాల్లో ప్రపంచంతో సంబంధాలు నెరపకుండా దూరంగా ఉన్న భారత్‌లో అవకాశాలకు ఒక్కసారిగా ద్వారాలు తెరిచారని గుర్తు చేశారు. అయితే ఇప్పుడలాంటి క్లిష్ట పరిస్థితులేమీలేకున్నా ప్రధానంగా రెండు సవాళ్లు కనిపిస్తున్నాయన్నారు. వాటిలో ఒకటి మన వృద్ధిని అడ్డుకుంటున్న దేశీయ పరిస్థితులయితే.. మార్పులను మారిన ప్రపంచంతో ఎలా అనుసంధానించాలనేది రెండోది అని చెప్పారు. సోమవారం హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ ఎకనమిక్ అండ్ సోషల్ స్టడీస్ (సెస్)లో నిర్వహించిన 4వ బీపీఆర్ విఠల్ మెమోరియల్ లెక్చర్‌లో మాంటెక్‌సింగ్ అహ్లూవాలియా కీలకోపన్యాసం చేశారు. 'అత్యంత వేగంగా మారుతున్న ప్రపంచంలో విధానాల రూపకల్పనలో ఎదురయ్యే సవాళ్లు' అనే అంశంపై ఆయన ఢిల్లీ నుంచి వెబినార్‌లో మాట్లాడారు. 20 ఏళ్లలో చేసిన సంస్కరణ ఫలితంగానే ఇప్పుడు 6.5% వృద్ధిని సాధించగలిగామని, ఇప్పుడు ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ఒకటిగా నిలిచిందన్నారు. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యం చేరేందుకు 6.5% వృద్ధి రేటు సరిపోదని, కనీసం 8-9 శాతం వృద్ధి రేటు ఉంటేనే ఆ లక్ష్యం సాకారం అవుతుందన్నారు. ఇందుకు ప్రభుత్వ ప్రయత్నాలు అధికం కావాల్సి ఉంటుందని చెప్పారు. ప్రపంచం అత్యంత వేగంగా మారుతోందని, మారుతున్న అంశాలను నిశితంగా గమనిస్తూ విధానాలను రూపొందించుకోవాల్సి ఉంటుందని తెలిపారు. భౌగోళిక, రాజకీయ పరిస్థితులు, అంతర్జాతీయ వాణిజ్యం, వాతావరణ మార్పులు గణనీయమైన మార్పులకు కారణమవుతున్నాయని చెప్పారు. విద్య, ఆరోగ్య రంగాలతోపాటు పరిశోధనలు, రక్షణ రంగాలపై చేసే వ్యయం పెంచాల్సి ఉందని అహ్లూవాలియా అన్నారు. ఆర్థిక లోటు తగ్గించడంలో ప్రస్తుత కేంద్ర ప్రభుత్వ చర్యలు ప్రశంసనీయమని చెప్పారు. తెలంగాణలో హైదరాబాద్, కర్ణాటకలో బెంగళూరు అభివృద్ధి చెందినట్లుగా ఈ రాష్ట్రాల్లోని ఇతర ప్రాంతాల్లో అభివృద్ధి లేదన్నది వాస్తవమేనన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఆర్బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు మాట్లాడుతూ.. విధాన పరమైన నిర్ణయాలను తీసుకోవడం గతంలోకన్నా ఇప్పుడు సంక్లిష్టంగా మారిందని చెప్పారు. బీపీఆర్ విఠల్ ఇంటలెక్చువల్ బ్యూరోక్రాట్ అని, ఏడుగురు ముఖ్యమంత్రులతో కలిసి పనిచేయడంతోపాటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆర్థిక శాఖ కార్యదర్శిగా పనిచేశారన్నారు. కార్యక్రమంలో ఇటీవల పద్మశ్రీ అందుకున్న సెస్ మాజీ చైర్‌పర్సన్ ప్రొఫెసర్ కెఎల్ కృష్ణను సత్కరించారు.

ఒకింత కష్టంగానే క్యాట్

» మూడు విభాగాల్లో కలిపి 68 ప్రశ్నలు

» డీఐఎల్ఆర్ విభాగంలో ట్రికీగా ప్రశ్నలు

» ఎంసీక్యూ - టిటాకు సమ ప్రాధాన్యం!

ఆశ్చర్యాలు ఏమీ లేనప్పటికీ ఈ ఏడాది క్యాట్ ఒకింత కష్టంగానే ఉందని విద్యార్థులు, నిపుణులు అభిప్రాయపడుతున్నారు. గత రెండుమూడేళ్లుగా క్యాట్‌లో ప్రశ్నల కాఠిన్య స్థాయిని క్రమంగా పెంచుతున్నారు. అదే సరళి ఈ ఏడాది క్యాట్‌లోనూ కనిపించింది. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు మూడు సెషన్లుగా ఈ పరీక్ష జరిగింది. ఐఐఎంలు సహా ప్రఖ్యాత బిజినెస్ స్కూళ్లలో ప్రవేశానికి తొలి ప్రాతిపదికగా మాత్రమే క్యాట్ (కామన్ అడ్మిషన్ టెస్ట్) ర్యాంక్‌ను పరిగణిస్తారు. ఈ పరీక్షలో మూడు విభాగాలు - వరుసగా వెర్బల్ ఎబిలిటీ అండ్ రీడింగ్ కాంప్రహెన్షన్ (వీఏఆర్‌సీ), డేటా ఇంట్రప్రెటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్(డీఐఎల్ఆర్), క్వాంటిటేటివ్ ఎబిలిటీ(క్యూఏ) ఉంటాయి. వీఏఆర్‌సీలో 24, మిగిలిన రెండింటి నుంచి 22 చొప్పున మొత్తం 68 ప్రశ్నలు ఈసారి అడిగారు.

డీఐఎల్ఆర్ విభాగంలో ట్రికీగా ప్రశ్నలు

ఈ ఏడాది క్యాట్‌లో పేరాగ్రాఫ్ జంబుల్ ప్రశ్నలు కూడా ఇచ్చారు. మల్టీపుల్ ఛాయిస్(ఎంసీక్యూ)తో పాటు జవాబును నేరుగా టైప్ చేయాల్సిన (టిటా) ప్రశ్నలకు ఈసారి సమ ప్రాధాన్యం లభించింది. డీఐఎల్ఆర్‌లో అడిగిన ప్రశ్నలు ట్రికీ(యుక్తి)గా ఉండటంతో అభ్యర్థులకు ఈ విభాగం కష్టంగా మారిందని కెరీర్‌లాంచర్ కోఫౌండర్ గౌతమ్‌పురి అభిప్రాయపడ్డారు. విధానంలో మార్పులు లేనప్పటికీ డీఐఎల్ఆర్‌లో అడిగిన ప్రశ్నల కారణంగానే అలా అనిపిస్తోందని టైమ్ సీనియర్ కోర్స్ డైరెక్టర్ రామ్‌నాథ్ కనకదండి తెలిపారు. మూడో సెషన్‌లో క్వాంటిటేటివ్ ఎబిలిటీ కష్టంగా అనిపించిందని విద్యార్థులు తెలిపారు. మొదటి సెషన్‌లో అడిగిన ప్రశ్నల తీరు గత ఏడాదితో పోల్చుకుంటే కష్టంగానే ఉందని అంటున్నారు. క్వాంటిటేటివ్ ఎబిలిటీలో మెజారిటీ ప్రశ్నలు అర్థమెటిక్, ఆల్జీబ్రా నుంచే అడిగారు. రీడింగ్ కాంప్రహెన్షన్ కింద ఎలక్ట్రానిక్ మ్యూజిక్, లా అండ్ మెంటల్ హెల్త్, నాయిస్ అండ్ సోషల్ ఆర్డర్, ఇన్‌కమ్ ఇనీక్వాలిటీ అండ్ ఎకనామిక్ గ్రోత్‌పై పేరాగ్రాఫ్స్ ఇచ్చారు. రెండో సెషన్‌లో కాఠిన్య స్థాయి దాదాపు మొదటి సెషన్ స్థాయిలోనే ఉంది. 2022, 2023ల్లో మాదిరిగా కష్టంగా ఉందని మరికొందరు అభిప్రాయపడ్డారు. డీఐఎల్ఆర్ విభాగం కష్టంగా ఉండగా, వీఏఆర్‌సీ, క్యూఏ మోడరేట్‌గా ఉన్నాయి. డీఐఎల్ఆర్‌లో మల్టీపుల్ ఛాయిస్, టిటా ప్రశ్నలు 11 చొప్పున అడిగారు. వీఏఆర్‌సీలో 10 నుంచి 12.. అంటే సగం వరకు ప్రశ్నలకు జవాబులు సులువుగానే గుర్తించవచ్చు. క్వాంటిటేటివ్ ఎబిలిటీలో ఆరేడు ప్రశ్నలకు జవాబులు కరెక్ట్‌గా గుర్తిస్తే 90 పర్సంటైల్, అదే 10-11 సరిగా గుర్తిస్తే 99 పర్సంటైల్ వస్తుందని అభ్యర్థులు చెబుతున్నారు. మూడో సెషన్ సైతం మొదటి రెండింటి మాదిరిగానే ఉందన్నది సమాచారం. అయితే, మూడోది కష్టంగా ఉందని కొద్దిమంది విద్యార్థులుతెలిపారు. క్వాంటిటేటివ్ ఎబిలిటీ విభాగం అందుకు కారణమని చెబుతున్నారు. ఈ సెషన్‌లో డీఐఎల్ఆర్ సులువుగా ఉంది. అర్థమెటిక్‌లో 8-9 ప్రశ్నలు అడిగారు. రీడింగ్ కాంప్రహెన్సన్‌లో నాలుగింటికి రెండు కష్టంగా ఉన్నాయని కొందరు తెలిపారు.


విశాఖపట్నం కైలాసగిరిపై గాజువంతెనను ప్రారంభిస్తున్న ఎంపీ భరత్ తదితరులు

విశాఖలో అతి పొడవైన గాజువంతెన

» సముద్ర మట్టానికి 1,020 అడుగుల ఎత్తున ఏర్పాటు

విశాఖపట్నం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో ప్రముఖ పర్యాటక కేంద్రమైన కైలాసగిరిపై సముద్రానికి అభిముఖంగా నిర్మించిన గ్లాస్ బ్రిడ్జి (గాజు వంతెన)ని సోమవారం ప్రారంభించారు. ఇది దేశంలోనే అతి పొడవైన గ్లాస్ బ్రిడ్జి అని విశాఖ ఎంపీ శ్రీభరత్, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్ పేర్కొన్నారు. వీఎంఆర్‌డీఏ స్థలం సమకూర్చగా 'శ్రీసాయిమోక్ష షిప్పింగ్ అండ్ లాజిస్టిక్స్, భారత్ మాత వెంచర్స్, ఆర్‌జే అడ్వెంచర్స్' సంయుక్తంగా రూ.7 కోట్ల వ్యయంతో దీనిని నిర్మించాయి. ఈ గ్లాస్ బ్రిడ్జి పొడవు 55 మీటర్లు. ఇందులో 20 మీటర్లు భూమి మీద, మిగిలిన 35 మీటర్లు గాలిలో ఉండేలా నిర్మించారు. వెడల్పు మూడు మీటర్లు. సముద్ర మట్టానికి 1,020 అడుగున ఎత్తున ఏర్పాటు చేశారు. ఒకేసారి వంద మీద బ్రిడ్జి మీదకు వచ్చినా చెక్కుచెదరనంత బలంగా నిర్మించారు. అయితే భద్రతా కారణాల రీత్యా విడతకు 40 మందిని మాత్రమే అనుమతించాలని నిర్ణయించారు. పర్యాటకులను బృందాల వారీగా గాజు వంతెన మీదకు పంపుతారు. ఒక్కో బృందం 5-7 నిమిషాలపాటు సందర్శించేందుకు అనుమతిస్తారు. గంటకు 250 కి.మీ.ల వేగంతో ఈదురు గాలులు వీచినా చెక్కు చెదరని విధంగా గ్లాస్ బ్రిడ్జిని రూపొందించారు. జర్మనీ నుంచి దిగుమతి చేసుకున్న 40 ఎం.ఎం. మందం కలిగిన గ్లాస్‌తో తయారు చేశారు. పర్యాటకుల భద్రత కోసం బ్రిడ్జికి రెండు వైపులా 1.5 మీటర్ల ఎత్తున స్టెయిన్‌లెస్ స్టీల్ రెయిలింగ్ పెట్టారు.

మద్యం కేసులోనూ చంద్రబాబుకు విముక్తి

జగన్ హయాంలో పెట్టిన కేసు కొట్టివేత



విజయవాడ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జగన్ హయాంలో మోపిన మరో కేసులో సీఎం చంద్రబాబుకు విముక్తి లభించింది. ఆయన 2014-19 వరకు సీఎంగా ఉన్నప్పుడు అమలు చేసిన మద్యం విధానంలో అవినీతి జరిగిందంటూ వైసీపీ ప్రభుత్వంలో ఆయనపై నమోదు చేసిన కేసును విజయవాడ ఏసీబీ కోర్టు కొట్టివేసింది. సోమవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీచేసింది. 2023లో స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో ఆయన్ను అరెస్టు చేసి జైలుకు పంపిన తర్వాత.. అప్పటి సర్కారు ఆయనపై వరుసగా కేసులు నమోదు చేసిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా.. మద్యం విధానంలో అవినీతి జరిగిందంటూ అప్పటి రాష్ట్ర బేవరేజస్ కార్పొరేషన్ ఎండీ డి.వాసుదేవరెడ్డి ఇచ్చిన ఫిర్యాదుపై సీఐడీ గుంటూరు ప్రాంతీయ కార్యాలయంలో చంద్రబాబుపై కేసు నమోదు చేశారు. ఆయన రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో ఉన్నప్పుడు దీనిపై పీటీ వారెంట్ దాఖలు చేశారు. ఈ కేసులో ఫిర్యాదుదారుగా ఉన్న వాసుదేవరెడ్డి 15 రోజుల కిందట కేసును ఉపసంహరించుకుంటున్నట్లు కోర్టులో మెమో దాఖలు చేశారు. ప్రస్తుతం ఆ కార్పొరేషన్ ఎండీగా ఉన్న సీహెచ్ శ్రీధర్ కూడా కేసు ఉపసంహరణకు ఎలాంటి అభ్యంతరమూ లేదని అఫిడవిట్ వేశారు. దీంతో ఈ కేసును కొట్టివేస్తూ ఏసీబీ కోర్టు న్యాయాధికారి పి.భాస్కరరావు ఉత్తర్వులు వెలువరించారు. 2014-19 మధ్య అమలు చేసిన మద్యం పాలసీలో అక్రమాలు జరిగాయని వాసుదేవరెడ్డి ఇచ్చిన ఫిర్యాదుపై 2023 అక్టోబరు 30న సీఐడీ అధికారులు కేసు నమోదు చేశారు. డిస్టిలరీలకు అర్హత లేకపోయినా లైసెన్సులు ఇవ్వడం, కొంతమంది సరఫరాదారులకు ప్రయోజనాలు కల్పించారని.. మద్యం తయారీ కంపెనీలకు అనుమతుల విషయంలో చంద్రబాబు అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణలతో అవినీతి నిరోధక చట్టం కింద, పలు ఐపీసీ సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఈ కేసులో ఏ-1గా అప్పటి ఎక్సైజ్ కమిషనర్ శ్రీనివాస శ్రీనరేశ్, ఏ-2గా అప్పటి ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర, ఏ-3గా చంద్రబాబు పేర్లను చేర్చారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.